పరిణతవాణి

(రెండవ సంపుటి)

(65 ఏళ్ళకు పైబడిన తెలుగు భాషా సాహిత్యరంగ
ప్రముఖుల ఆత్మకథా ప్రసంగ వ్యాసాలు)

ఆంధ్ర సారస్వత పరిషత్తు
తిలక్‌రోడ్, హైదరాబాదు-500 001.

పరిణతవాణి

(రెండవ సంపుటి)

(65 ఏళ్ళకు పైబడిన తెలుగు భాషా సాహిత్యరంగ ప్రముఖుల ఆత్మకథా ప్రసంగ వ్యాసాలు)

ప్రధాన సంపాదకులు

జ్ఞానపీఠ పురస్కార గ్రహీత, పద్మభూషణ్

ఆచార్య సి. నారాయణ రెడ్డి

అధ్యక్షులు, ఆంధ్ర సారస్వత పరిషత్తు

సంపాదకులు

ఆచార్య ఎల్లూరి శివారెడ్డి

కార్యదర్శి, ఆంధ్ర సారస్వత పరిషత్తు

ఆంధ్ర సారస్వత పరిషత్తు

తిలక్‌రోడ్, హైదరాబాదు–500 001.

PARINATAVANI
(VOLUME - II)

(A collection of autobiographical speeches
of eminent Telugu Literary Persons)

ప్రథమ ముద్రణ : **ఫిబ్రవరి - 2000**

ప్రతులు : **1000**

మూల్యం : **రూ. 45/-**

ప్రతులకు :

ఆంధ్ర సారస్వత పరిషత్తు

తిలక్ రోడ్, హైదరాబాదు - 500 001.

అక్షర కూర్పు & ముద్రణ :

జి.పి.ఆర్. గ్రాఫిక్స్

రెడ్ హిల్స్, హైదరాబాద్ - 4.

ఫోన్ : **6505681**

ప్రవేశిక

జ్ఞానపీఠ పురస్కార గ్రహీత, పద్మభూషణ్
ఆచార్య సి. నారాయణ రెడ్డి
అధ్యక్షులు
ఆంధ్ర సారస్వత పరిషత్తు

ఆంధ్ర సారస్వత పరిషత్తు నిర్వహిస్తున్న అనేక కార్యక్రమాల్లో 'పరిణత వాణి' ప్రసంగ పరంపర ఎందరో సహృదయుల ప్రశంసలు అందుకున్నది. ఆంధ్రదేశంలోని ప్రముఖులను ఆహ్వానించి వారి జీవిత విశేషాలు, సాహిత్యవేత్తలతో వారికి ఉన్న పరిచయం, ఉద్యమాలతో వారికి గల సంబంధం, సాహిత్య సాంస్కృతిక భాషా రంగాల్లో వారు చేసిన కృషిని గురించి ప్రసంగించమని కోరాం. మొదట డెబ్బై యేళ్లకు పై బడ్డ ప్రముఖులచేత ప్రసంగాలు ఇప్పించాం. తరువాత అరవై అయిదేళ్లు పైబడ్డ వారిని ఆహ్వానించాం. ఈ ప్రసంగాలను ఆడియో టేపుల్లో రికార్డు చేయించాం.

ఆడియో టేపుల్లోని విషయాన్ని ఎత్తి రాయించి ఈ ప్రసంగ వ్యాసాలుగా రూపొందించాం. కొందరు వక్తలు వ్యాసాలు సమర్పించారు. సుదీర్ఘంగా ఉన్న వ్యాసాలను క్లుప్తీకరించాం. విషయ ప్రధాన దృష్టితో ఈ ప్రసంగ వ్యాసాలను సంపుటీకరిస్తున్నాం. అందుచేత ఈ ప్రసంగ వ్యాసాలు విస్తృతిలో కొన్ని చిన్నవిగా, మరికొన్ని పెద్దవిగా రూపొందాయి.

పరిషత్తు కార్యవర్గంవారు, కార్యకర్తలు, ఈ ప్రసంగ పరంపరకు విచ్చేసిన సదస్యులు, సాహిత్యవేత్తలు వీటిని పుస్తక రూపంలో తీసుకురావలసిందని సూచించారు. వారి సూచన ప్రకారం అయిదు ప్రసంగాలతో మొదటి సంపుటిని వెలువరించాం. మరో ఏడు వ్యాసాలతో ప్రస్తుతం రెండవ సంపుటిని వెలువరిస్తున్నాం. ఈ పరిణత ప్రముఖుల ఆశయాలు ఆదర్శ కరదీపికలుగా నేటి తరాన్ని ఉద్దీపింప చేస్తాయని ఆశిస్తున్నాను.

డా॥ సి. నారాయణ రెడ్డి

ముందుమాట

'పరిణతవాణి' అన్నది ఒక విశిష్టమైన ప్రసంగ పరంపర. ఆంధ్ర సారస్వత పరిషత్తు అధ్యక్షులు ఆచార్య సి. నారాయణ రెడ్డి గారు ఈ ప్రసంగ పరంపర స్వరూప శిల్పి. పరిణతవాణి కార్యక్రమంలో పరిషత్తు వేదిక నుంచి సాహిత్య సాంస్కృతిక రంగాలకు చెందిన తెలుగు ప్రముఖులు వారి అనుభవాలను, ప్రముఖులతో వారికి గల పరిచయాలను, వారు చేసిన కృషిని గురించి ఆత్మ కథాకథన రూపంలో ఎన్నో విశేషాలు వివరించారు. అందులో కొన్ని మనకు తెలిసిన విషయాలు కాకపోవచ్చు. ఈ తరం వారికి వారి అనుభవాలు జ్ఞాపకాలు, ఎంతైనా అవసరం. భారత స్వాతంత్ర్య స్వర్ణోత్సవాల సందర్భంలో ఈ తెలుగు ప్రముఖుల అనుభవాలను, జ్ఞాపకాలను మొదటి సంపుటిగా పుస్తక రూపంలో తీసుకురావడానికి కారణం మా అధ్యక్షుల వారి సంకల్ప బలం. ఇప్పటికి ఇరవై ఏడు ప్రసంగాలు జరిగాయి. అందులో అయిదింటిని ప్రచురించాం. మరో ఏడు వ్యాసాలతో ఈ రెండవ సంపుటిని వెలువరిస్తున్నాం.

ఈ ప్రముఖులు ప్రసంగిస్తున్నప్పుడు రికార్డు చేయించిన ప్రసంగాలను, వ్యాసరూపంగా ఇచ్చిన ప్రసంగాలను సంగ్రహించి ఇందులో ప్రచురించాం. సాధ్యమైనంత వరకు విషయ ప్రాధాన్యాన్ని దృష్టిలో పెట్టుకోవడం జరిగింది. చాలావరకు వారి స్వచ్ఛందమైన అభిప్రాయాలను గౌరవిస్తూ వాటిని ప్రచురించాం. అభిప్రాయ భేదాలు ఉన్నచోట ఆ అభిప్రాయాలు ఆ ప్రముఖులు వెలువరించినవని, ఆంధ్రసారస్వత పరిషత్తు కేవలం వాటిని ప్రచురించిందని గమనించవలసిందిగా మా విజ్ఞప్తి.

ఆంధ్ర సారస్వత పరిషత్తు కార్యక్రమాల్ని తీర్చి దిద్దుతూ, ఎన్నో కార్యక్రమాలను, సదస్సులను నిర్వహింపజేస్తూ మా అధ్యక్షులు **ఆచార్య సి. నారాయణ రెడ్డి గారు** కార్యక్రమాల్లో చైతన్యం తీసుకువచ్చారు. ఈ సంపుటులను ప్రచురించడంలో వారి ప్రోత్సాహం ఎంతైనా ఉంది. వారికి నా కృతజ్ఞతలు. నాతో సహకరిస్తున్న కార్యవర్గ సభ్యులకు కృతజ్ఞతలు. ఈ సంపుటిని తీర్చి దిద్దడంలో **శ్రీ గోవిందరాజు రామకృష్ణారావు గారు, శ్రీ యం. వరహరిగారు, డా॥ డి. చంద్రశేఖర రెడ్డి గారు, డా॥ బి. జయరాములుగారు** ఎంతగానో సహకరించారు. వారికి నా కృతజ్ఞతలు.

ఆచార్య ఎల్లూరి శివారెడ్డి
కార్యదర్శి,
ఆంధ్ర సారస్వత పరిషత్తు

ప్రసంగ వ్యాస సూచిక

డా॥ బోయి భీమన్న

(23-2-1995)

నేను హైదరాబాదు వచ్చిన తొలి రోజుల్లో అంటే 1958లో 'బోయి భీమన్న కావ్యసుమాలు' అనే నా గ్రంథావిష్కరణ సభకు విశ్వనాథ సత్యనారాయణగారు అధ్యక్షతవహించారు. అందులోని మొట్టమొదటి పద్యం చదివారు.

నీరు గట్టి మళ్ళు గట్టి నారుగట్టి
కంచెలును గట్టి నన్ను పోషించరెవరు
అడవి మొక్కను నేను విశ్వావకాశ
వీధులందు ఇష్టమొచ్చినట్లు విరియు చుంటి

విశ్వనాథ సత్యనారాయణ గారికి నామీద మంచి ఇంప్రెషన్ పుట్టించిన సభ అది.

ఇది మొదట ఎందుకని చెప్పానంటే నిజంగా నాకు ఎవరూ కవిత్వం అంటే ఏమిటోచెప్పలేదు. నేను నాలుగయిదు తరగతుల్లో ఉన్నప్పుడు మాకజిన్ బ్రదరు బర్మానుండి భారత భాగవత రామాయణాలు, భక్తవిజయం అనే పుస్తకము తెచ్చి ఇంట్లో పడేశాడు. అప్పుడప్పుడు తిరగేసేవాడ్ని. నేను ఆరోక్లాసులోనికి వచ్చేటప్పటికి ఈ పద్యమెలారాస్తారని ఒక్కొక్క వృత్తమే తీసుకోవడం, నాలుగు పాదాలకీ అక్షరాలు లెక్క బెట్టి ప్రతిపాదంలోనూ రెండో అక్షరం ఒకటిగానే ఉన్నదని కనుక్కొని నాకునేను ఆపద్యాల సంగతి రిసెర్చి చేసి తెలుసు కున్నాను. ఆవిధంగా తెలుసుకొని నేను పద్యాలు రాయడం ప్రారంభిస్తే మా తెలుగు మాస్టారు 'ఒరేయ్ గణాలు తెలుసుకోకుండా పద్యాలు రాస్తే గండాలు వస్తయ్‌రా' అని నన్ను డిస్కరేజ్ చేసేవారు. ఇంకా మన భీమన్న కవిత్వం గవండ్ల గంగమ్మ కవిత్వం అని ఆక్షేపించేవారు. మాస్కూలు ప్రక్కనే కల్లు దుకాణం ఉండేది. ఆ కల్లు అమ్మే మనిషిపేరు గవండ్ల గంగమ్మ .

నాకు లక్షణాలు కూడా రాకముందే మానాన్న తెల్లవారుజామున లేచి పాడుకునే పద్యాలు కంఠస్థం వచ్చేవి. నాకు మొట్టమొదటగా కంఠస్థమయిన పద్యం 'మందారమకరంద మాధుర్యమునదేలు మధుపంబు వోవునే మదనములకు' అనే సీసపద్యం. మాఊళ్ళో అప్పన్న సీతారామయ్య గారని పెద్ద భూస్వామి. మానాన్న ఆయన దగ్గర ఉండేవారు. వాళ్ళిద్దరూ రాత్రిపూట పొలం కాపలాకు వెళ్ళినప్పుడు ఆయన ఈ పద్యాలు పాడుతూ ఉంటే మానాన్న నేర్చుకుని ఇంటి దగ్గర పాడుకుంటూ ఉండేవాడు. మానాన్న మొదటి నుంచీ పిచ్చివాడులాగా తిరుగుతూ ఉంటే జంగం వెంకన్న అని ఒకాయన నేను పిచ్చికుదురుస్తానని తన దగ్గర ఉంచుకుని అద్వైత వేదాంత తత్వాన్ని ఉపదేశించాడు. అది బాగా పట్టుబడిన మానాన్న అప్పటి నుండి ఆ శుద్ధ నిర్గుణ వేదాంత తత్వార్థ కందాలు, దరువులు, ఈ భాగవత పద్యాలు కేవలం ఇంట్లోపాడుకుంటూ ఉండేవారు. నేనింకా అక్షరాలు గుణింతాలు నేర్చుకోకముందే ఇవన్నీ నాకు కంఠస్థమై ఆవిధంగా నాకు వేదాంతం పుట్టుకతోనే వచ్చిందన్నమాట. అద్వైతవేదాంతం ఎప్పుడయితే పట్టుబడిందో ఆ వేదాంతాన్నే పద్యాలుగా, గేయాలుగా అల్లి పశువుల్ని కాస్తూ ఉన్నప్పుడు ఆగేయాలతోనే వాటిని మళ్ళవేస్తూ ఇలా గడిచింది నా చిన్నతనం. అందువల్ల నాకెవరు నేర్పలేదు. అలా చిన్నతనంలోనే మానాన్నగారివల్ల ఈకవిత్వం పట్టుబడింది. మాయిల్లు విడిగా చుట్టూ చెట్లూ పొదలతో అడివిలో ఉన్నట్లు ఉండేది. అందువల్ల ఆ ప్రకృతి సౌందర్యం, తొలినాటి భారత, భాగవతాల ప్రభావం నన్ను క్లాసికల్ ధోరణిలో పెట్టింది. మావూళ్ళో థర్డ్ ఫారం దాకా ఉండేది. అది పూర్తయింతర్వాత టీచర్స్ట్రయినింగులో చేర్చమన్నారు. మానాన్న చిన్నపిల్లవాడు లే అని హైస్కూల్లో చేర్చారు. మా హైస్కూల్లో నేను ఫష్టున పాసయ్యాను. మార్కులు బాగావచ్చాయి. ఆర్థిక పరిస్థితి బాగా లేకపోవడంతో ఉద్యోగం కోసం అప్లై చేయమన్నారు. చేశాను కాని ఎవరూ పట్టించుకోలేదు. కాలేజీలోచేరాను.

ఫోర్తుఫారంలో తిలకంపెట్టే వాణ్ణి, క్రాపు ఉండేది, శిలాయి బొట్టని నల్లబొట్టు ఉండేది. బిళ్ల గోచిపెట్టి పంచెకట్టే వాణ్ణి. ఇలా ఉండేదినావేషం. ఫోర్తుఫారంలో మాకు అనువాదం, సైన్సు తిమ్మరాజు శేషగిరిరావు గారనే మాష్టారు చెప్పేవారు. ఆయనొక రోజు మా పరీక్ష పేపర్లు పట్టుకొని వచ్చి లేచి నిలబడరా అన్నారు.

సందేహిస్తూ నిలబడితే బెంచీ ఎక్కమన్నారు. ఎక్కింతర్వాత 'అందరూవాణ్ణి చూడండిరా అసలైన బ్రాహ్మడంటే వాడూ' అన్నారు. అనువాదంలో నాకు నూటికి నూరు మార్కులు వచ్చాయి. విచిత్రమేమంటే చివరికి నేను ఈ అనువాదశాఖ డైరెక్టరు కావడం. మాస్కూల్లో చిల్లర యోగానందయ్యగారని తెలుగు మాస్టారుండేవారు. ఆయన యోగానంద రామాయణం రాశారు. ఆయన నాపద్యాలు దిద్దేవారు. పాకెట్ మనీతో సంతలో పుస్తకాలు కొనే వాణ్ణి. నేను కొన్న మొదటి పుస్తకం 'అమరకోశం'. తరువాత పుస్తకం ఎనిమిదణాలు పెట్టి కొన్నది వావిళ్ల వాళ్లు టీకాతాత్పర్యాలతో అచ్చు వేసిన 'మనుచరిత్ర'. ఇంటికి తీసుకుని వచ్చి మనుచరిత్ర పద్యాలు కంఠస్థంచేయడం మొదలు పెట్టి మొదటి నాలుగు పద్యాలు కంఠస్థం చేసి తరువాత మానేశాను. ఇలా చాలా పుస్తకాలు కొనుక్కున్నాను. నాకు భాగవతం ఇష్టమైన పుస్తకం. భారతంలో నన్నయ రచనమాత్రమే నాకు నచ్చుతుంది. ఎనిమిదో తరగతిలోనే మా టీచర్లనూ వారినీ జమ చేసి ఎండాకాలపు సెలవుల్లో భాగవతం పురాణంచెప్పాను. భాగవతంలోని పద్యాలంటే ఎంతో ఇష్టం. అందమయిన పదాలను నోట్ చేసుకునేవాణ్ణి. 'అమ్మలగన్నయమ్మ, ముగురమ్మల మూలపుటమ్మ' పద్యంలో 'సురారులమ్మ కడుపారడిపెట్టెడియమ్మ' అన్నమాట నాకునచ్చలేదు. 'సురారులయమ్మ అశ్రువుల తుడిచెడియమ్మ' అని దిద్దుకున్నాను. ఎంత పెద్దకవులయినా మనుషులేకదా. తప్పులుండవచ్చు. పొరపాట్లు జరగవచ్చు.

కాకినాడలోఇంటర్మీడియట్ లోచేరింతర్వాత చూశాను కవులెవరో. దేవుల పల్లి కృష్ణశాస్త్రిగారు, శ్రీరంగం నారాయణ బాబు గారు, అడవి బాపిరాజుగారు, శివశంకరశాస్త్రి గారు మొదలైన వాళ్లనంతా. కవి అంటే ఎట్లా ఉండాలి వేషంలో - అంటే కృష్ణశాస్త్రి గారిలాగా ఉండాలని చెప్పేవాణ్ణి. కాకినాడకాలేజీలో గోపరాజు రామచంద్రరావుగారు (గోరా) బోటనీ లో ట్యూటర్‌గా ఉండేవారు. ఆయన నాస్తికవాదాన్ని గురించే ఎప్పుడూ బోధిస్తుండేవారు. ఆయనకి నేను దొరికాను. ఆయన జాతీయోద్యమంలో పనిచేస్తూ రాత్రి వేళల్లో చుట్టు పక్కల గ్రామాలకు వెళ్ళి మాలపల్లెల్లో వాటిల్లో ఉపన్యాసాలిస్తుండేవాడు. ఆయనతో వెళ్ళే వాణ్ణి. ఇది నాకు నచ్చిన విషయం. గోరాగారితో ఉండడం వల్ల బ్రహ్మ సమాజికులయిన కృష్ణశాస్త్రిగారితోనూ, వెంకటరత్నం నాయుడుగారితోనూ విరోధం వచ్చింది. సరే.

బి.ఎ. పూర్తయింది. మద్రాసువెళ్లాను. పిఠాపురం యువరాజుగారిప్రతికలోక్లార్కుగా చేరాను. ప్రతికలకోసం వచ్చే ఉత్తరాలు చదివి పట్టిక తయారు చేయడం మాత్రమే నాపని. మొదటి రోజు పోయి కూర్చున్నాను. కాసేపు చూసాను. ఏంచేయాలో తోచలేదు. ఉత్తరాల్ని పక్కన పడేసి సగంలో ఆపిన పద్యాన్ని పూర్తిజేసే ప్రయత్నంలోఉన్నాను. మేనేజరు ఇది చూసి తాపీ ధర్మారావుగారికి ఫిర్యాదు చేశాడు. ఆయన వచ్చి ఓహో నీవు కవిత్వం రాస్తావా అని అడిగారు. నేను రాసేదే కవిత్వమన్నాను. వచనం రాయగలవా అనిఅడిగి రాస్తానంటే ఒకవిషయం ఇచ్చి రేపటికి రాసుకురా అన్నారు. మరుసటిరోజు రాగానే రాశారా అనిఅడిగి కాగితాలు తీసుకొని లోపలకు వెళ్లారు. అరగంట తర్వాత మళ్లా బయటికి వచ్చి నువ్వు ఈ ఫిష్ మార్కెట్ లో ఉండలేవులే అని తనగదిలోకి తీసికెళ్లి తన టేబుల్ ముందుకుర్చీ వేయించారు. తర్వాత ఒక కాలం మెయింటెయిన్ చేస్తావా అని అడిగారు. చేస్తానన్నాను. ఏంచేయగలవు అన్నారు. ఉత్తరాలు రాయగలను అన్నాను. రాయి అన్నారు. రాశాను. పల్లెటూరి లేఖలు అని శీర్షిక పెట్టారు. 'జానపదుడు' పేరుతోవేశారు. తరువాత నేనక్కడ మానేసి 'ప్రజామిత్ర'లో చేరినపుడు సంపాదకులు ఆంధ్ర శేషగిరిరావు 'జానపదుని జాబులు' అనిపేరు మార్చి ఆశీర్షికను కొంతకాలం సాగించారు. 'జానపదునిజాబులు' అనేపేరుతో నమ్మాళ్వారు ఆరణాల సీరీస్‌లో ప్రచురించాడు. తరువాత అందరూ సమ్మెచేస్తే తాపీ ధర్మారావుగారు బతిమాలినా వినకుండా నేనూ వచ్చేశాను.

ముమ్మిడివరంలో టీచరుగా నాకు ఫస్ట్ పోస్టింగ్. అక్కడ మెజారిటీ విద్యార్థులు హరిజనులు. టీచర్లలో ఎక్కువమంది బ్రాహ్మణులు. హెడ్‌మాస్టర్ మాత్రము కాపు. విభీషణరావు గారని చాలా మంచివాడు. నేనక్కడ చేరిన కొత్తలోనే 'నవజీవన' పత్రికలో నాపద్యాలుపడ్డాయి. నాదగ్గర ఆ పత్రిక చూశారు విభీషణరావు గారు. అందరు టీచర్లనీ సమావేశపరచి ఆ పద్యాలు చదువమన్నారు. 'మాలలు రాజు లౌదురుసుమా' అన్న శీర్షికతో వచ్చాయి ఆ పద్యాలు. చదివాను. చదివితే ఒక బ్రాహ్మణటీచరు-తిలకమర్తి గవర్రాజు గారని-అలాకాదు పద్యాలు చదవడం అని తీసుకొని గొంతెత్తి పాడాడు. అంత సంగీతం, అంతగొంతు, అంత మాధుర్యం ఎక్కడయినా ఉంటుందని నేననుకోలేదు. అంతబాగా పాడారు. ఆయన వద్ద తరువాత కొన్ని రాగాలు కూడా నేర్చుకున్నాను.

బి.ఇడి చదువుతున్నప్పుడు రాజమండ్రిలో కుసుమ ధర్మన్నగారి పత్రిక 'జయభేరి'ని ఒక సంవత్సరం నడిపించాను. అందులో 'పిపాసి' అనే కలం పేరుతోకథలు రాసేవాణ్ణి. అప్పుడు రాజమండ్రిలో కొంతమంది పెద్దలు ఆ కథలురాసేవాణ్ణి పట్టుకొని కొట్టి గోదావరిలో వేయమన్నారు. నేను దొరకలేదను కోండి. తరువాత ఆ కథలేమయ్యాయో. రాజమండ్రి పురపాలక సంఘాధ్యక్షులు అప్పుడు క్రొవ్విడి లింగరాజుగారు. కోనసీమలో కళావెంకట్రావు గారు రాజులాంటి వారు. పళ్లంరాజుగారని మరొకరుండేవారు. వీరు ముఖ్యమయిన కాంగ్రెస్ నాయకులు. వెంకట్రావు గారు నాకు రాజకీయ గురువులాంటివారు. నేనెపుడూ కాంగ్రెసు అభిమానిని. వాలంటీరుగా చేసేవాణ్ణి. ఒకసారి లింగరాజుగారునన్ను పిలిచి మద్రాసులో 'ఆంధ్రప్రభ' పెడుతున్నారు, నన్ను సంపాదకుడిగా ఉండ మన్నారు. కాని నేను అంగీకరించలేదు. సబ్ ఎడిటరుగా నిన్ను తీసుకొమ్మని ఉత్తరం రాశాను. వెళ్ళి చేరు అన్నారు. నేనలాగే వెళ్లాను. కాని నేను వెళ్ళేటప్పటికి కొంచెం ఆలస్యమయింది. నాకోసం చూసి చూసి వాళ్లు నాస్థానంలో శ్రీశ్రీ ని తీసుకున్నారు. నేనక్కడ బి.ఎస్. మూర్తి గారింట్లో ఉండేవాణ్ణి. ఆయనకు మాలపల్లి సినిమా తీసిన గూడవల్లి రామబ్రహ్మంగారికి మంచి స్నేహం. రామబ్రహ్మం గారి పత్రిక 'ప్రజామిత్ర' లో ఆయన నాకు ఉద్యోగం ఇప్పించారు.

ఇక నా జీవితానుభావాలు :

అతి పేదరికంలో, దుర్భరదారిద్ర్యంతో పుట్టి నేను ఈ స్థితికి చేరుకున్నాను. చదువే నిషేధింపబడిన జాతిలో పుట్టి చదువుకొని అగ్రశ్రేణికి రావడం. అంటరాని తనంలో పుట్టి అంటవచ్చు అనే స్థితికి చేరుకోవడం. ఈ విధంగా అనేక రకాలుగా నాకొక విశిష్టత ఉన్నది అని అనుకుంటున్నాను. వడ్డించిన విస్తరి కల వాళ్లవలె కాక విస్తరాకును పుట్టించుకోవడం, స్వయంగా సంపాదించుకోవడం. నాజీవితంలో ఎన్నో విశేషాలున్నాయి. ఒకసారి మద్రాసులో ఉన్నప్పుడు భార్యాపిల్లలతో బీచ్ నుండి వస్తూ ట్రాం ఎక్కాం. ట్రాం బయల్దేరు తున్నప్పుడు ఒక ముసలాయన శాస్త్రి గారు మనవడి సహాయంతో ట్రాం ఎక్కి అదికదుల్తూ ఉంటే పడకుండా పైన రింగు పట్టుకొని ఊగుతున్నాడు. నేను లేని ఆయన్ను కూర్చోమన్నాను.

కూర్చున్నాడు. ఎవరునాయనా? అనిఅడిగాడు. మీరు నాకు తెలుసునండీ, నేను మీకు తెలియదు అన్నాను. ఇంకా ఊరుకోకుండా పద్యాలు రాస్తాను అని కూడా చెప్పాను. పద్యాలు రాసేవాళ్లు నాకు తెలియని వారెవరు? అన్నాడు. మీకు తెలియదులెండి నా పేరు భీమన్న అన్నాను. ఒక పద్యం వినిపించమన్నాడు. 'కృష్ణాన్వేషణ' అని అప్పుడొక ఖండిక రాసి ఉన్నాను. అందులోని పద్యం చదివాను.

మరిచితివేమొ గోపసుకుమారుని మారుని కన్నతండ్రి నీ
విరులకు మోహపున్‌పదను వెట్టిన ప్రేయసునీ ప్రియాళికిన్
వరమురళీరవాను నటనమ్ములు నేర్పిన విశ్వసాధకున్
మరచితివేమొ గోపవిభు మావిభు గోవిభు గోపికావిభున్

ఇది విని ఆయన ఆశ్చర్యపోయారు.

విని ఇంతగా పద్యం రాసేవాళ్ళు నాకు తెలియకుండా ఉండడమేమిటి? మీ ఇంటి పేరేమిటి అని అడిగారు బోయి ,భీమన్న అని చెప్పాను. ఇంకా మేం హరిజనులమని చెప్పాను. నన్ను, మా అవిడనూ పిల్లల్నీ చూసి మీరు హరిజనుల్లాగా లేరే అన్నారు. అప్పుడు నాకు కొంచెం కోపంవచ్చింది. మీరెప్పుడు హరిజనుల్ని చూసి ఉండరులెండి. హరిజనులంటే మాలాగే ఉంటారు. మేం మాలలం. పొలాల్లో ఎండలో పనిచేసి ఇలా ఉన్నాం కాని, గుడిసెల్లో కూర్చుని పనిచేసుకునేవాళ్ళు మావాళ్ళు మాదిగలున్నారు. రాజమండ్రి బ్రిడ్జి ప్రక్కన వారిని చూడాలి. అచ్చమయిన ఆర్యతేజస్సు వారిలోనే ఉంది అన్నాను. ఆయన మాట్లాడకుండా తరువాతి స్టేజీలో దిగి పోయారు. అంతటితో అయిపోయిందనుకున్నాను. మరుసటిరోజు ఆంధ్రప్రభ ఆఫీసుకు వచ్చారు. ఆయన పెద్దవాడు కాబట్టి నార్ల ఆయన్ను ఆఫీసులోఅందరి దగ్గరకూ తీసుకు వచ్చి పరిచయం చేశాడు. నాదగ్గరకు వచ్చినప్పుడు నార్ల ఏదోచెప్పబోయే లోగానే నాముఖం చూసి గిరుక్కున ముఖం తిప్పుకొని వెళ్లి పోయాడాయన. ఆయన మహామహోపాధ్యాయ, కవిసార్వభౌమ శ్రీపాద కృష్ణమూర్తిశాస్త్రిగారు. అంతా నాచుట్టు చేరి ఏమిటి ఆయనట్లా నీదగ్గరకు వచ్చేటప్పటికి అలాచేశారేమిటి అనిఅడిగారు. నేను జరిగిన కథ చెప్పాను. ఆయన చాలా గొప్పవాడు కాబట్టి నాకిది గుర్తుంది. ఒక హరిజనుడుగా పుట్టినందుకు

చాలారకమయిన బాధలు పడవలసి వచ్చింది. ఈ రకమయిన బాధలు పడినటు వంటి అంబేద్కరు సమాజం మీద రాజకీయంగా, సాంఘికంగా తిరగబడ్డాడు. రాజకీయంగా నేను మొదటి నుండి అవకాశాలున్నప్పటికీ నేను ఆవిధంగా చేయలేదు. ఒక బ్రాహ్మడు కులం పేరుతో నన్ను అవమానిస్తే మరొక బ్రాహ్మడు ఆదరించి అభిమానించి ఎంతో మేలుచేశాడు. ఇప్పుడు కులం పేరుతో ఒక బ్రాహ్మణకులాన్ని నేను ప్రేమించనా? ద్వేషించనా? ఒక రెడ్డి గారు అపకారం చేస్తే పదిమంది రెడ్లు నాకుపకారం చేసేవారు. మా ఊర్లో కాపు లెక్కువ. ఒకకాపు నన్ను గుర్రబ్బండి ఎక్కించుకోకపోతే మరోకాపు తన అరుగు మీద కుర్చీవేసి నన్ను కూర్చోపెట్టుకొని కబుర్లు చేప్పేవాడు. అందుకని ఏ ఊర్లోనయినా అందరూ కలిసి ఉండక తప్పదు కాబట్టి అన్ని కులాలకూ పరస్పర సంబంధాలు తప్పవు. తిరుగుబాటు చెయ్యడం కుదరదు. సమైక్యమేమంచిదన్న భావం నాకు చిన్నప్పటినుంచీ ఉంది. అందువల్ల అంటరానితనం వల్ల వచ్చిన కష్టాలు నాలో బిట్టర్ నెస్‌ను కలిగించలేదు.

ప్రభుత్వఅనువాద శాఖ డైరెక్టరుగాఉన్నప్పుడు ఒకసారి 'స్వతంత్ర' పత్రిక సంపాదకుడు గోరా శాస్త్రి నుండి ఫోను వచ్చింది. మిమ్మల్ని వెంటనే కౌగిలించు కోవాలనుంది ఎలా అని అడిగారు. మా ఆఫీసుకు వచ్చేయండి, అయినా మీ కింత ప్రేమ ఎలా పుట్టుకొచ్చింది అనిఅడిగాను. మీ 'రాగవాసిష్ఠం' చదివాను, పీఠికంతా చదివాను. మీరు హిందూమతాన్నిబాగా తిట్టారు కాని,మీ తిట్లలో ఎక్కడా బిట్టర్‌నెస్ కనిపించలేదు. ఎందుకూ? అనిఅడిగారు. బిట్టర్ నెస్ ఎందుకు? బిట్టర్ నెస్ వల్ల హృదయంగాయపడుతుంది. ఎంతయినా తిట్టవచ్చు కాని హృదయాన్ని గాయపరచకూడదు. ఈ హిందూ సంస్కృతికి సాహిత్యానికి, సంస్కారానికి అంతటికీ మూలకర్త వేదవ్యాసుడు అని రాయడానికి మూలకర్త ఈ పెద్ద మాదిగవాడే కదా అని రాశాను. నిజమేకదా! ఎవరు కాదంటారు. అవధానిగారే కాదనలేదు. అంతా నిజమే అన్నారు. కాని ఈ శ్మశానాన్ని ఎందుకు తవ్వుతారు అన్నారు. దానికి సమాధానంగా 'వారసత్వపు హక్కులు' అని కవితరాశాను. ఆ కవిత చివరి లైనులో చెప్పాను. 'ఇది శ్మశానమని తెలుసు,

తవ్వడం వ్యర్థమనీ తెలుసు. ఆ సమాజంలో పాతి పెట్టబడిన వాళ్లు నా పూర్వీకులు, నాకు దొరుకుతున్నవి వాళ్ల ఎముకలు, వాళ్ల చితాభస్మం. అయినప్పటికీ వాటిని వెలికితీసి ప్రపంచానికి చూపి ఇదిగో ఇది మాతాతగారిది అని చెప్పి అవతల పారేస్తాను. తలెత్తుకు తిరుగుతాను'. అని చెప్పాను. అందుకని బిట్టర్‌నెస్‌లేదు. కలగడానికి చాలా అవకాశాలున్నాయి. కవిని కాక పోతే కలిగిఉండేదేమో. రాజకీయంగా ఒక విప్లవకారుడిగా మరిఏమైపోయేవాడినో.తెలిసేది కాదు.

పిఠాపురం మహారాజావారి షష్టిపూర్తి జరిగింది పిఠాపురంలో. ఆ సభాకార్య క్రమం రాస్తున్న తారకంగారు బ్రహ్మ సమాజీయుడు, చాల పెద్దవాడు. ఆయన ద్వారా నాకు ఆ సభలో పద్యాలు చదివే అవకాశం లభించింది. సభాధ్యక్షుడెవరో చాలా పెద్దవాడు. రాజమన్నారు గారోఏమో. ఆయన వచ్చి కూర్చున్నాడు. ప్రోగ్రాం కాగితం తీసుకున్నాడు. పద్యాలు బోయిభీమన్న అన్నాడు. లేచి వెళ్లాను. ఎన్ని పద్యాలు అని అడిగారు రాజావారు. అయిదు అన్నాను. ఒకటి చదువు అన్నారు. అరచాలు అంతే చదువుతాను అన్నాను. అరపద్యం చదివేటప్పటికి చప్పట్లు మోగిపోయాయి. రిపీట్ అని అరిచారు జనం. మళ్ళీ చదివాను. పద్యమంతా చదివాను. రెండో పద్యం మూడో పద్యం అలా అయిదు పద్యాలూ చదివాను. రెండుసార్లు చదివాను. మహారాజావారు లేచి స్వీకరించబోతే నేను వారికి అందజేస్తూ వారి పాదాలమీద ఉంచి వచ్చేశాను. దానితో ఆయన మూవ్ అయిపోయారు. మూవ్ అయిపోయి కన్నీరు కారుస్తూ 'నేను ఆ పద్యాల వల్ల చాలా మూవ్ అయిపోయాను. నేనిక్కడ కూర్చోలేను. తక్కువ కార్యక్రమంతో నడిపించేయండి' అనిలేచి లోపలికి వెళ్ళిపోయారు.

సరిగ్గా ఇదే పద్ధతి అంబేద్కర్‌గారు ఆంధ్రటూర్ వచ్చినప్పుడు చేశాను. ఆయన వైస్రాయ్ కౌన్సిల్‌లో మెంబరుగా ఉన్నప్పుడు ఆంధ్రటూర్‌కు తీసుకువచ్చారు. రామచంద్రపురం సభలో ఆయన్ను మొదటి సారి చూశాను. మరుసటిరోజు కాకినాడలో సభ. ఆరోజు రామచంద్రపురంలోనే ఉండి ఇంగ్లీషులో పద్యాలు రాసి అచ్చువేయించి ఫ్రేముకట్టి తీసుకొని కాకినాడ వెళ్లాను. కాకినాడ సభకు పాము రామమూర్తి అని పి.ఆర్. కాలేజీలో టీచరు, పెద్ద హరిజన నాయకుడు అధ్యక్షుడు. సభ పి.ఆర్. కాలేజీలో జరిగింది. పద్యాలు చదవమని నాపేరు చదివారు.

నేను వెనుకనుండి వేదిక మీదికి వస్తున్నాను. కాంగ్రెసువాదిని-ఖద్దరు లాల్చీ, ఖద్దరు పంచ, ప్రకాశం పంతులుగారిలా శాలువాతో నా వేషం చూసి ' హూఈజ్ హీ' అని మూడుసార్లడిగారు అంబేద్కర్. 'హీ ఈజ్ అవర్‌మాన్' అని రామమూర్తిగారు మూడు సార్లు సమాధానం చెప్పారు. నన్ను బ్రాహ్మడనుకున్నాడో ఏమో వన్‌మినిట్ అన్నాడు. హాఫ్ మినిట్ అన్నాను. పిఠాపురం సభలో లాగానే, ఒక పద్యం చదివాను. రెండో పద్యం చదివాను. తలెత్తి చూశాడు. మూడో పద్యం చదివాను. నావైపే చూశాడు. ఫ్రేము కట్టిన పద్యాలు అందించి దిగిపోయాను. నెలరోజులతర్వాత నాకొకపత్రిక అందింది. పీపుల్స్ హెరాల్డ్-అంబేద్కర్ కలకత్తానుండి నడిపే పత్రిక. అందులో మొదట్లోనే నా పద్యాలు వేసి కింద ఈ సంచికకు ఆ పద్యాలే సంపాదకీయం అని రాశారు. అప్పుడు రాజోలులో టీచరుగా పనిచేస్తున్నాను.

నామొదటి నాటకం 'పాలేరు'. ఈ నాటకం చదివి రాజోలు దగ్గర్లో మోరి అనే ఊళ్లో హరిజన కుర్రాళ్లంతా కలిసి నాటకం వెయ్యాలని చెప్పి నా దగ్గరకు వచ్చారు. అయితే ఆనాటకంలో రైతులు, కూలీలు మాట్లాడే మాటలు చాలా బూతులుంటాయి. ఊళ్ళోవాళ్లు మాట్లాడే పద్ధతి. అది సహజమే. కాని రంగస్థలం మీద కొంపమునిగిపోయే బూతులుంటే ఎట్లా. అందుకని అటువంటి మాటలు తొలగించి మళ్ళీ తిరగరాయాల్సి వచ్చింది. అందులో పాత్రలు ధరించే వారంతా హరిజనులే. ఒక్కడైరెక్టరు మాత్రమే సవర్ణుడు. ఒక హరిజనుడు రాసిన నాటకాన్ని హరిజనులు ఊరు మధ్యలో ప్రదర్శిస్తారా? ఎంత ధైర్యం? చూస్తామని చెప్పి సవర్ణులైన యువకులంతా సిద్ధ పడ్డారు. నాటకానికి నన్ను పిలిచారు. నేను భయపడ్డాను. అయితే మేమూ సిద్ధంగానే ఉన్నామని చెప్పి తీసుకెళ్లారు. టికెట్ల నాటకం. చుట్టూ కర్రలు పట్టుకొని కొందరు నిలబడ్డారు. వచ్చిన వాళ్ళు జేబుల్లో రాళ్లు. మావైపు చంపటం పెద్ద విషయంకాదు. కైజార్లుంటాయి. నాటకమే మవుతుందోనని భయం వేసింది. పాలేరు వెంకన్న పాత్ర వేసిన యువకుడు రంగస్థలంమీదికి వస్తూనే భయంతో డైలాగులు మర్చిపోయి పారిపోయాడు. మళ్లా అతన్ని పట్టుకొని కాఫీ తాగించి ధైర్యంచెప్పి రంగస్థలం మీదికి తోశారు. అతను నాటకమంతా అద్భుతంగా నటించాడు. వాళ్లు తెచ్చిన రాళ్ళు తెచ్చినవి తెచ్చినట్లే

అక్కడ పడవేసి వెళ్లారు. మరోపదిహేనురోజుల్లో ఏదో పండుగరాబోతూంది. ఆ పండుగకు ఆనాటకాన్ని ఆ సమాజం వాళ్లుఅక్కడే ప్రదర్శించాలని జనంకోరారు. అది పాలేరు నాటకం మొదటి ప్రదర్శన. తర్వాత అక్కడ ఒక లోకల్ సంఘటనను తీసుకొని 'కష్టజీవి' అనే నాటకం రాస్తే ఆ చుట్టుప్రక్కల రెండు మూడు జిల్లాల్లోని కమ్యూనిష్టులంతా వచ్చారు నాటకం చూడడానికి. ఇది 1942 నాటిమాట. రాసిన వాణ్ణి, వేసిన వాళ్లని అరెస్టుచేయమని పోలీసులకు ఉత్తర్వులు. పట్టుకున్నారు, తరువాత ఏదోవిధంగా బయటపడ్డాం. దాన్నే 'ధన్యజీవి' అనిపేరు మార్చి చాలా చోట్ల ప్రదర్శించారు. కాంగ్రెసు ప్రభుత్వం వచ్చిన తర్వాత-ఇందులో సమ్మె అని వస్తుంది-దాన్ని సత్యాగ్రహంగా మార్చి 'కూలిరాజు' అని పేరు పెట్టి ప్రదర్శించాము. దీనికి సినిమా సంగీత దర్శకుడు రాజుగారు మంచి సంగీతం సమకూర్చారు. రాజమన్నారు దానికి అధ్యక్షత వహించి మాట్లాడుతూ కాంగ్రెసు వారికి తెలివి ఉంటే ఆ నాటకాన్ని ప్రతి ఊళ్ళోనూ ప్రదర్శింపజేస్తే కమ్యూనిస్టులనే వాళ్లు లేకుండా పోతారన్నారు.

నాకు 1946లోనే కాంగ్రెసు టికెట్టు రావలసింది. కొంతమంది వల్లరాలేదు. 1952 లో రాజోలు నియోజకవర్గానికి వారు టికెట్టు ఇచ్చారు. కమ్యూనిస్టుల మీద జరిపిన హింసవల్ల కాంగ్రెసు అంటే కొంత వ్యతిరేకత ఆ గ్రామాల్లో ఏర్పడి ఉంది. ప్రచారానికి వెళుతుంటే ప్రక్క ప్రతి గ్రామంలోనూ పాలేరు నాటకం వేస్తూ ఉండేవారు. వేస్తున్నవారు కమ్యూనిస్టులు. ఇంతమంచినాటకం రాసిన బోయిభీమన్న కాంగ్రెసువాళ్లకు అమ్ముడుపోయాడు - అని ప్రచారం. షేమ్, షేమ్, షేమ్. అట్లా నా పాలేరు నాటకమే నన్నోడించింది. నేనొక్కణ్ణేమిటి? కోస్తా అంతా ఇంతే. కళా వెంకట్రావు ఓడిపోయాడు. మద్రాసులో టంగుటూరి ప్రకాశం గార్ని ఓడించారు. అట్లా ఓడిపోయింతర్వాత హరిజను డెవరున్నారు. అంటే గెలిచిన సంజీవయ్య ఒకడు కనిపించాడు. ఆయనకు మంత్రి పదవి ఇచ్చారు. అప్పుడు నా 'మధుబాల'అచ్చులో ఉంది. అది ఆయనకు అంకితం ఇచ్చాను. నాకెందుకు ప్రకాశం పంతులుగారికివ్వగూడదా అన్నారాయన. ప్రకాశంపంతులుగారికీ, పట్టాభి సీతారామయ్య గారికీ అంకితం ఇచ్చేవాళ్ళు చాలామంది ఉన్నారు. మన కెవళ్లిస్తారు. నేనేదో రాశాను మీకిస్తాను అన్నాను. సరే అని ఒప్పుకున్నాడు. తిరుమల

రామచంద్రగారి ఇంట్లోనే పై డాబామీద అంకితోత్సవం పెట్టాం. చాలా బాగా జరిగింది. ఒక చక్కని పెళ్ళిలా జరిగింది.

1953 లో గుంటూరుజిల్లా చెరుకుపల్లిలో పాలేరు నాటకం వందసార్లు వేశామని సభ పెట్టి సంజీవయ్యగారిని పిలిచి నాకు గండ పెండేరం తొడిగారు. పదివేల మంది జనం డప్పులు, చిందులు, కర్రసాము. ఈ విధంగా పట్ట పగటి దివిటీలు పెట్టి బ్రహ్మరథం పట్టి ఊరేగించారు. కొన్నాళ్ళు ఆగండపెండేరం వేసుకొని తిరిగా. అప్పుడు ఆంధ్రప్రభలో పని చేస్తున్నా. కొన్నాళ్ళ తర్వాత తీసివేశా.

హరిజన సేవా సంఘ సభలు నెల్లూరులో జరిగాయి. హైదరాబాదు నుండి నేనూ సంజీవయ్యగారు కారులో బయల్దేరాం. బెజవాడలో భోంచేశాం. అక్కడ నంబూరి శ్రీనివాసరావు గారని ఒక ఎమ్మెల్యే మాకారు ఎక్కారు. ఇక నెల్లూరు వేళ్ళే సరికి వాళ్లిద్దరూ 'పాండవోద్యోగ విజయాలు' నాటకమంతా వేశారు. సంజీవయ్యగారు చక్కగా పాడతారు. ఇద్దరూ పోటీ పడ్డట్లు ఎన్నెన్నిరాగాలు పలికించారో! నెల్లూరు సభకు ప్రారంభకులు ముఖ్యమంత్రి సంజీవరెడ్డి గారు. సభాధ్యక్షులు మాట్లాడారు. హరిజనులు వెలివేయబడడానికేవో రెండు కారణాలు చెప్పారు. వాటిలో ఒకటి చచ్చిన గొడ్లమాంసం తినడం. నాకు మనసులో కష్టం వేసింది. మరుసటిరోజు కవి సమ్మేళనం. అక్కడ చెప్పవచ్చులే జవాబు అనుకున్నాను. మరుసటి రోజు కవిత్వం చదవలేదు. ఉపన్యాసం చెప్పాను. హరిజనులు వెలి కావడానికి కారణాలను గురించి ఒక అరగంటసేపు మాట్లాడాను. కాని సంజీవయ్యగారూ, పూర్ణయ్యగారు, ఆఉపన్యాసాన్ని రాయాలనీ అచ్చు వేస్తే అందరికీ అందుబాటులో ఉంటుందని ఒక వారంరోజుల పాటు వెంటబడ్డారు. తర్వాత అందరూ మర్చిపోయారు. నేను రాశాను. సాక పేములుగారని ఐ.ఎ.ఎస్ ఆఫీసరు. ఆయన అచ్చువేస్తానన్నాడు. దాన్ని నా రాగవాసిష్ఠానికి పీఠికగా కూర్చాను. అచ్చు వేసేముందు నార్లకిస్తే పది రోజులు ఉంచుకొని తిరిగి ఇస్తూ అచ్చయిం తర్వాత ఒక కాపీ ఇవ్వండన్నాడు. ఆయన సీరియల్‌గా వేస్తాడేమోనని నా ఆశ. నాకీ కాంప్రమైజింగ్ ఆటిట్యూడ్ పనికి రాదండి. మీ లాంటి వాళ్లు రాసేది నరికినట్లుండాలి అన్నాడు. ఎవర్ని నరకడం? కొంత ఆలస్యమైనా మనుషులు మారాలి. కలిసి బతకాలి కాని ఒకర్నొకరు నరుక్కుంటే! సాధ్యమేనా ఇది! అందుకే

నాలో బిట్టర్‌నెస్ లేదు. నేనెప్పుడూ సామరస్యాన్నే కోరుకున్నాను. అగ్రకులాల వారిని ఎంత తిట్టినా వాడు మావాడు అనే ఉంటుందన్నమాట. మా వేదవ్యాసుడు సృష్టించిన జాతి ఇది. మా వాల్మీకి పెంచిన సంస్కారం ఇది - అనేది నాకుండడం వల్ల వాళ్లను మార్చడానికే చెప్తున్నాను తప్ప వాళ్ళను పరాయి వాళ్లుగా చేసుకొనడానికి, పగవాళ్లనుగా చేసుకోమని మాత్రం నాసాహిత్యాన్ని నేనుపయోగించలేదు - ఇంతవరకూ.

ఇక నాకు ఎంత చీకటి ఎన్ని దీపాలు అన్నప్పుడు నేను పుట్టిన చీకటి సూర్యుడు చంద్రుడు నక్షత్రాలూ గ్రహాలూ ఇవన్నీ ఆగిపోతే ఎలాఉంటుందో ఆ రకమయిన గాఢాంధకారంలో పుట్టాను నేను. అడుగు ముందుకు వేయాలి కదా ! ఎటు? ఎక్కడికి? ఒక దీపం కనిపిస్తుంది. అటుగా నడుస్తాను. ఆ దీపం ఆరిపోవచ్చు, దాటిపోవచ్చు. ఇంకో దీపం. ఇలా ఎన్ని దీపాలు నామార్గానికి దారి చూపాయో ఇప్పుడు నిలబడి ఆలోచించుకుంటే చాలా అద్భుతమనిస్తుంది. అంత చీకట్లో పుట్టిన నేను ఇంతదూరం రావడానికి ఎన్ని దీపాలు! మొదట మావూరి కాపులు. వారికి పట్టింపులు ఎక్కువ. కఠినంగా ఉంటారు. వారిలోనలుగురయిదుగురునన్ను ఆత్మీయంగా చేరదీశారు. అక్కడినుండి చిన్నచిన్న దీపాల దగ్గరి నుండి కాలేజీకి వేళ్ళేటప్పటికి పెద్దదీపాలు కళావెంకట్రావు, ముళ్ళపూడి పళ్లంరాజు, అయ్యదేవర కాళేశ్వర్రావు, మంగిపూడి వెంకటశర్మ. నిజంగా మంగిపూడి వెంకటశర్మ ఇచ్చినంతవెలుగు ఇప్పటివరకూ ఎవ్వరూ ఇవ్వలేదనినేననుకుంటున్నాను - ఈ అన్‌టచబిలిటీ గురించి. ఆయన ఇప్పటికీ సూర్యుడులాగే ప్రకాశిస్తూ ఉంటాడు. అక్కడి నుంచీ మద్రాసు వరకూ వెళితే నార్ల వెంకటేశ్వరరావు, తాపీ ధర్మారావు, నిడదవోలు వెంకటరావు వీళ్లంతా. అక్కడినుంచి హైదరాబాదుకు వస్తే కప్పగంతుల లక్ష్మణశాస్త్రి, సి.నారాయణ రెడ్డి, జె. బాపురెడ్డి ఇంకా చాలమంది. ఈ విధంగా ఒక్కొక్కవెలుగూ ఒక్కొక్క వెలుగూ వస్తూఉంటే నేను ఒక్కొక్క మెట్టు ఎక్కుతూ వచ్చానన్నమాట.

మాతండ్రిగారికి సంబంధించి ఒక విషయం చెప్పాలి. అప్పుడు మద్రాసులో ఆంధ్రప్రభలో పనిచేస్తున్నాను. నాకు ఆరోజు ఆఫ్. ఇంట్లోనే ఉన్నాను. ఆఫీసునుండి ఒక టెలిగ్రాం తెచ్చి యిచ్చారు. తెరిచే ఉంది. చూసి పక్కన పడేశాను.

మరుసటిరోజు ఆఫీసుకు వెళ్లాను. నన్ను చూసి ఆఫీసులోని వాళ్లంతా వింతమనిషిని, రాక్షసుణ్ణి చూసినట్టు చూశారు. నీవు ఊరికి పోయి ఉంటావనుకున్నామే. పోలేదా! ఆఫీసుకు ఎందుకు వచ్చావు? ఇప్పటికల్లా మీ ఊళ్లో ఉండి ఉంటావనుకు న్నాము - అని రకరకాలుగా అన్నారు. ఇంతకీ టెలిగ్రాం మానాన్న చనిపోయినట్లుంది. అందరూ చూసిందే. అందుకే అట్లా అనుకున్నారు. నేను చెప్పాను. మా తమ్ముడికి ముందే చెప్పాను-నేనురానని. అక్కడికి వచ్చిపోవడం ఖర్చుతో కూడుకున్నపని భరించలేను. ఆడబ్బు పంపిస్తాను. నీవే అంత్యక్రియలు చేయమని. మా అమ్మ చనిపోయినప్పుడు కూడా నేను వెళ్లలేదు. మా అమ్మకూ దినం చేయలేదు నేను. మాసికాలు పెట్టలేదు. మా నాన్న కూ దినం చేయలేదు. ఎందుకంటే నాకు పునర్జన్మ మీద నమ్మకం లేదు. చనిపోతే అంతే. నాకు మొట్ట మొదటి నుంచీ అద్వైతం నేర్పిందేమిటంటే, అద్వైతం నుంచి నేనెక్కడ డిఫర్ అయ్యానంటే మోక్షం పొందడానికి సాధనకావాలి. అంటే యోగం. జీవ బ్రహ్మైక్యానికి కొంచెం సాధన కావాలి. నేను డిఫరయిందేమిటంటే అదేమీ అక్కరలేదు. జ్ఞానం కావాలి. అక్కర్లేదు; భక్తి కావాలి - అక్కర్లేదు. మరింకేదో పుణ్యమో ఏదో చేసుకోవాలి - అక్కర్లేదు. ఏమీ అక్కర్లేదు. దోమను చంపితే ఏమవుతుంది? నల్లి చస్తే ఏమవుతుంది? ఎన్నిదోమలకు పునర్జన్మఉంటుంది. అలాగే దోమ చచ్చినా అంతే దొరచచ్చినా అంతే. ఆ మోక్షం కోసం ప్రయత్నమేమీ అక్కరలేదు. నీవు ప్రయత్నం చేసుకుంటావు, కృషిచేసుకుంటావు. పని చేసుకుంటావు-అంతే. ఒక రిక్షావాడుంటాడు. ఏముంది-పని చేసుకుంటాడు, పిల్లల్ని పోషించుకుంటాడు, చచ్చిపోతాడు-అంతే. అతని కెంత మోక్షం ఉందో రోజూ రుద్రాక్ష మాలలు పెట్టుకొని జపం చేసుకుని పూజలు చేసుకునే వాడికి కూడా అంతే మోక్షం ఉంది. ఎలాగంటే సముద్రంలో అలల్లాగానే. అల ఎక్కడినుంచి వచ్చింది? సముద్రం నుంచే. జీవుడెక్కడి నుండి వచ్చాడు? పరమాత్మనుండే. అంటే ఒక అలలేచింది. ఆ అల పెద్దది కావచ్చు. చిన్నది కావచ్చు. ఆ అల గొప్పపదవి లోఉన్నవాడుకావచ్చు, లేదా ప్యూనో, రోడ్లు ఊడ్చేవాడోకావచ్చు. అది చిన్న అల కావచ్చు పెద్ద అలకావచ్చు. ఎక్కడ పడిపోయింది? మళ్లాసముద్రంలోనే పడిపోయింది. నీటినుంచి వచ్చింది. నీరైపోయింది మళ్లీ. అలాగే జీవి - ఆత్మ పరమాత్మనుండి పుట్టింది. మళ్ళా పరమాత్మలో కలిసిపోతుంది. దీనికేం ప్రయత్నం అవసరంలేదు. నేచురల్ ప్రాసెస్

అది. అందువల్ల నువ్వు ఫాదర్ని చూసినా, మదర్ని చూసినా, బ్రదర్నిచూసినా బ్రతికున్నప్పుడు చూడాలి. చచ్చిపోయిం తర్వాత చూసినా లాభంలేదు, చూడకపోయినా లాభంలేదు. అందుకే మానాన్నకీ, అమ్మకీ దినాలు చేయలేదు నేను. అదే చెప్పాను మావాళ్లకు. తర్వాత మా తమ్ముడు ఒక పెద్ద ఉత్తరం రాశాడు నాకు, అందులో ఉన్న విషయమేమిటంటే మానాన్న సోమవారం నాడు మా వాళ్లను పిలిచి చెప్పాడట - శుక్రవారం రాత్రి ఒక శబ్దం వస్తుంది. తరువాత దుర్వాసన కొడుతుంది. తర్వాత మళ్లా ఒక శబ్దం అవుతుంది. తర్వాత సువాసన కొడుతుంది. అప్పుడు మీరు తలుపు తీయండి - అని చెప్పాడట. అయితే నాదొక చిన్నకోరిక ఉంది అది తీరదు అన్నాడట. మా తమ్ముడు ఇవ్వాళ సోమవారమే కదా! శుక్రవారం ఇంకా చాలాదూరముంది కదా - చెప్పండి అన్నాడట. అప్పుడాయన అన్నయ్యను చూడాలని ఉంది అన్నాడట. మా తమ్ముడు వైరిస్తా రేపు వచ్చేస్తాడు - అన్నాడట. ఆయన నేను అపస్మారకంలోకి వెళ్తున్నాను, నాకు వాణ్ణి చూడాలని ఉందికాని వాడు నన్ను చూడడంకాదు. అపస్మారకంలోకి పోయింతర్వాత వాడు నన్ను చూసేమిటి. చూడక ఏమిటి ! అన్నాడట. అని అపస్మారకంలోకి వెళ్లిపోయాడు. అంతకుముందు ఆర్నెల్లనుండీ అపస్మారకంలోనే ఉన్నాడు. అప్పుడు ఆ సోమవారం నాడు మేలుకొని ఆ విషయం చెప్పి మళ్లా అపస్మారకంలోకి వెళ్ళాడు. అట్లాగే జరిగిందట. అప్పటికే ఆయన శిష్యులు చాలమంది వచ్చి ఉన్నారు. పొద్దున శవానికి మా సిస్టరు స్నానం చేయిస్తూఉంటే వేళ్లు బ్రహ్మరంధ్రం లోకి వెళ్లాయట. కేకపెట్టి ఇక్కడ రంధ్రం ఉంది అని చెప్తే అంతా వచ్చి చూశారట. అంటే ఆ రెండు శబ్దాలు మొదటిది అనాత్మపగిలిపోవడం. రెండోది కుండలిని ఛేదించుకొని మోక్షం పొందడం - అని వాళ్ళ పద్ధతిలో చెప్పుకున్నారు.

నాకు పద్మశ్రీ వచ్చినపుడు ఒక పద్యంలో చెప్పుకున్నాను.

"పాలేరుగ పుట్టితి, 'మా
మా'లకు ఋషి వారసత్వమందించితివా, శ్రీలలితను సేవించితి,
పాలించితి వాక్య జగము పద్మశ్రీనై"

'మామాలకు, అంటే మాదిగల్ని, మాలల్ని ఇద్దర్నీ కలుపుదామని.

మాతంగుడు ధర్మవ్యాధుడు ఇద్దరూ వియ్యంకులు. మాతంగుడు ఫస్ట్ అన్‌టచబుల్. దిఫస్ట్ హరిజన్ ఈజ్ ధర్మవ్యాధ. ఆ ధర్మ వ్యాధుడి కూతుర్ని మాతంగుడి కొడుక్కు చేసుకున్నాడు. వీళ్లేమోమాంసాహారులు. అతనేమో శాకాహారి. ఈ మాంసాహారుల ఇంటి పిల్ల శాకాహారుల కోడలవడం వల్ల వచ్చిన గోలను వరాహపురాణంలో చాల విపులంగా చాల అందంగా వర్ణించారు. వాల్మీకి వ్యాసుడు వీళ్లంతా హరిజనులని నేనెందుకంటున్నానంటే ఆ ధర్మవ్యాధుడు ఏదోఒక జంతువు ను వేటాడి బ్రహ్మార్పణ చేసి, కొంత ఇతరులకు పంచి, కొంత అమ్మి, కొంత తిని జీవించేవాడు. చివరకు హరిని గురించి తపస్సు చేసి హరి ప్రత్యక్షమయితే అతను కోరిన వరమేమిటంటే నాకు, నా సంతానానికీ, నావంశానికి పరంపరగా విజ్ఞానం, కళాత్మకం, ఆధ్యాత్మికం ఈ మూడింటితో కలిసినటువంటి కవిత్వాన్ని ఇమ్మన్నాడు. 'ఇచ్చాను. ఓ మహాకవీంద్రా' అన్నాడు విష్ణువు, మహాకవీంద్రా అని మొట్ట మొదట అనిపించుకున్నవాడు ధర్మవ్యాధుడు. ఆకాలానికి లిపిలేదు, కవిత్వం లేదు. ఏమీ లేని కాలానికి వాడా కోరిక కోరాడు. మాతంగుడు, ధర్మ వ్యాధుల సంబంధం వల్ల ఈ దేశంలోని వంశాలన్నీ పుట్టుకొచ్చాయని నేననుకుంటూ అదేవారసత్వంలో అది కృత యుగంలో జరిగింది. త్రేతాయుగంలో వాల్మీకి బోయ, ద్వాపర యుగంలో వ్యాసుడు బోయ, కలియుగంలో భీమన్న బోయ - అని, రాయడానికి ఇది కారణం. ఈ వాల్మీకి ఈవేదవ్యాసుడు, ఈ హనుమంతుడు వీళ్లందరూ హరిజనులు, వీళ్లకు ధర్మవ్యాధుడు కోరిన వరమే ఒక వరంగా వస్తూ ఉన్నది. వీళ్లందరూ హరిజనులు కాబట్టి మీరీనాడు హరిజనులు, అంటరానివారు, నిమ్నజాతివారు, దళితులు అని పిలుస్తూన్న వాళ్లందరూ ఆనాటి వేద ఋషులు, ఉపనిషదృషులు, కావ్యఋషులు. మరి ఆ ఋషి వంశం వాళ్లం, మరి మీ రెందుకిలా చేస్తున్నారు - అని నా ప్రశ్న సవర్ణులకి. అది ఫలించుకుంటూ వస్తున్నది. తొలగిపోతున్నది. అందువల్ల నేను భగవద్గీతకు భాష్యం రాయవలసి వచ్చింది. భగవద్గీతకు భాష్యం రాసిన వాళ్లందరూ సన్యాసులు - సంసారంతో సంబంధం లేనివాళ్ళు, జీవితంతో సంబంధం లేని వాళ్లు. కవిత్వమంటే జీవితం-సన్యాసం కాదు. అది వేదాంతం. భగవద్గీతలో ఉన్నది జీవితం. వేదాంతం కాదు. నేను రాశాను. ఈ వేద వ్యాసుడికి ఇంత వేదాంతం పిచ్చి ఏమిటి ? ఉపనిషత్తులు రాశాడు కదా! బ్రహ్మ సూత్రాలు రాశాడు కదా!

మళ్ళీ భగవద్గీత రాయటానికేమిటి ? అంత పిచ్చా? అంత కండూతి ఏమిటి అని అడిగా. అందుకని 'తస్మాత్ ఉత్తిష్ఠ కౌంతేయ యుద్ధాయకృతనిశ్చయః' అని చెప్పడానికి భగవద్గీత రాశాడు. అది యుద్ధగీత. అది సమరగీత, అహింసకు స్థానం లేదందులో. ఆ తక్కినవన్నీ ఎవరో శ్లోకంగా రాసి అందులో పెట్టారు పిచ్చివాళ్లు. నీ శత్రువులను చంపు, క్షమించకు. వాళ్లని నీవు చంపక పోతే వాళ్లు నిన్ను చంపుతారు. ఇది జీవితం. ఆ జీవితం ఎలా ఉంటుందో చెప్పడానికి భగవద్గీత రాశాడాయన. కవిత్వమంటే జీవితం. జీవితంలోఉండే అందాలు ఆనందాలు, సుఖదుఃఖాలు సంతోషాలు - ఇది కవిత్వం-సన్యాసం కాదు, వేదాంతం కాదు. ఈ సుఖదుఃఖాలకు అండర్ కరెంటుగా వేదాంతం ఉండొచ్చు. ఒక పర్మనెంటు సూత్రంగా ఉండవచ్చే తప్ప అదే ముఖ్యం కాదు. అందుకనే ఈ గోవ్యాఘ్ర సంవాదం, అలాంటి కవితలు రాసి జాతిని నాశనం చేశారు అని ఎక్కడోరాశాను. గోవుకీ పులికీ సంవాదం జరిగి, గోవునేమో పులి విడిచి పెట్టి దాని దూడకు పాలిచ్చేటట్లు చేసి మళ్లీ తిరిగి వచ్చింతర్వాత 'అయ్యో ఇంత నమ్మకస్తురాలైన గోవును నేను తిన'నని చెప్పి విడిచిపెట్టేసిందనే కథ ఉందే-అంతకంటే హిపోక్రసీ ఏమీ ఉండదు. ఆ కథ రాసినవాడు కవికాదు, మోసగాడు అని నా ఉద్దేశం. ఎక్కడైనా ప్రపంచంలో గోవుకిన్నీ పెద్దపులికిన్నీ స్నేహం కుదురుతుందా ? కుదురుతుంది అని నీ వెందుకు చెప్తున్నావు. నక్క ద్రాక్ష పళ్ళు కథ చెప్ప వచ్చు.మనకందలేదనుకోవచ్చు. ఇది అలాకాదే! రెండు మతాలున్నపుడు ఒక మతం ఇంకో మతానికి పూర్తిగా వ్యతిరేకమయినప్పుడు ఆ రెండు మతాలకు సామరస్యం కలిగించాలని, జాతీయ సమైక్యమని ఎన్ని సంవత్సరాలు ఎన్ని కోట్లు తినేస్తూ అరిచినా అవి కలవ్వు. ఎలాకలుస్తాయి? నాప్రవక్తే ప్రవక్త - మరొకడుకాడు. నాగ్రంథమే పవిత్ర గ్రంథం మరొక గ్రంథం కాదు. నాదేవుడే దేవుడు - మరొక దేవుడు కాడు. ఎలా? మరిమాకోదేవుడున్నాడు కదా! వాణ్ణేం చేద్దాం ? తీసిపారేయ్. మాదేవుణ్ణే కొలువు. రెడు మతాల మధ్య సామరస్యం కావాలంటే ఆ రెండు మతాల దేవుళ్లు, గ్రంథాలు వాటి పట్ల అవగాహన, ఒడంబడిక చేసుకొని కలిసి బ్రతికే ప్రయత్నం చేయాలి.

ఏకుల మంచునున్న వివరంబుల కూడిన కుంటి ప్రశ్నలన్
వ్యాకుల పెట్ట బోకుడది వ్యర్థము, లోకపు మంచి చెడ్డలం

దూకియు మున్గ కుండ యిటు దూరములంబడి వచ్చినాడయీ
యాకృతి నేమి గల్గు హృదయాకృతి జూసి సమాదరింపరే.

అలాగే మాకోనసీమ. దాని గురించి చాలాచెప్పాలనుకున్నాను.
పొలముల నీటి బోదెలను బొబ్బరి తోటల మోట బోదెలన్
నిలిచి నవాంకు రమ్ములకు నీరము కట్టెడు వీగు వేళ నీ
చెలువము సస్యదేవతకు చిన్నెలు వన్నెలు తెచ్చు నన్నపూ
ర్ణలు పదివేలు నీ వడువునన్ శ్రమి యింతురు తెల్గు పల్లెలన్
సరస్వతిని ఆరాధిస్తూ
ఇలపయినీవు పట్టి పలికింపగ లేనిది పూచి పుల్లయున్
కలుగదు నీయను గ్రహము గాదె పికాళికి గాయనత్వమున్
తులసికి పావనత్వమును తోటకు రమ్యనవోదయత్వమున్
పలుకుదునేమొ మీటు మొకనాటికి నేటికి కాక పోయినన్

కృష్ణశాస్త్రి గారినీ అదీ చూసి నిజమయిన కవులను చూశానని సంతోషపడిన రోజుల్లో గోరాగారితో తిరుగుతూ బ్రహ్మ సమాజానికి వ్యతిరేకమయి పోయి వాళ్ళందరూ నన్ను ఒక నాస్తికుడుగా చూస్తున్న సమయంలో రాసిన పద్యమది. అప్పుడు నా అంతట నేను ఈ కవుల్ని వదిలేసి ఏవో పద్యాలు రాసుకుంటూ ఉంటే అప్పుడు నన్ను ఎంకరేజ్ చేసింది 'కృష్ణా పత్రిక'. అపుడు కృష్ణా పత్రికలో రజనీకాంతరావు, నళినికాంతరావు మాక్లాసుమేట్సు, జూనియర్స్ ఇంకా ఒకరిద్దరి పద్యాలు పోటాపోటీగా వేసేవాళ్ళు. భారతజాతి, భారతమాత, దాని దాస్యము వీటిని వ్యంగ్యీకరించి రాస్తూ ఉంటే ఒక పంజరంలో చిలుకను ఊహించి వర్ణిస్తూ కృష్ణాపత్రికలో నా పద్యాలు పడ్డాయి. చివరి దేమిటంటే -

ఎప్పుడీ పంజరము తెగిత్రుప్పువడునొ
ఎన్నడాకాశ వీధులనెగిరిపోదు
నో, మదిచ్చ కొలంది నవోత్సవమున
నెన్నినాళ్లు యీ దాస్యమింకెన్ని నాళ్లు

- అని రాస్తే దాన్ని తీసుకెళ్ళి, చూడండి . ఈ బ్రహ్మసమాజదాస్యం నుండి ఎప్పుడు విముక్తి అని వ్రాస్తున్నాడీయన' అని ఫిర్యాదు చేశారు, ద్వేషం కలిగించారు.

అపుడు రాసుకున్నది 'పలుకుదునేమొ మీటుమొకనాటికి నేటికి కాకపోయినన్' అని సరస్వతిని. సరస్వతి అంటే నాలో ఉన్న ఒక ఎస్ప్రేషన్ ని రూపుదిద్దుకోవడం. అందుకే ఏకేశ్వరభావం కంటే బహూదేవతాభావం మోర్ సైంటిఫిక్ అని నాఉద్దేశం. విగ్రహారాధన అనేది సైంటిఫిక్. మనుషుల ఆకాంక్ష లెన్ని విధాలో అన్ని విధాలుగా భగవంతుడు కనిపిస్తాడు విగ్రహారాధన అంటే. ఏకేశ్వరో పాసన అనేది మనకెందుకూ పనికిరాని ఆలోచన. దేవుడొక్కడే కాదు మొత్తానికి. మతానికోదేవుడు. ఏకేశ్వరో పాసన అనేది అబద్ధం. ఆదేవుడు డ్రగ్ లాంటివాడు. ఈ మతాలు చెప్పేదేవుడు అనేమాటను నిషేధించి నట్లయితే మనుషులంతా ఒక్కటే అవుతారు.

ఆంగికం భువనంయస్య వాచికం సర్వవాఙ్మయం
ఆహార్యం చంద్రతారాది తం వందే సాత్వికం శివం

అది ఒక పరమాత్మయొక్కవిశ్వరూపం. దీన్ని నేను, అకాండ తాండవం, అని చెప్పి ఒక గ్రంథం రాశాను

పయనమై నీ మార్గమందే పడుచులేచుచు వచ్చు చుంటిని
పువ్వుదొరికిన నీగురించే ముల్లు విరిగిన నీ గురించే
ఎవరు నా కెదురేగుదెంచిన నీవెయని పూజింతు దేవా!
ఎవరు నీ కెదురేగు దెంచిన నేనెయని కరుణింపుమా
అమృతమూర్తీ నీ విధమ్మున ఆడుచుంటిని పాడుచుంటిని
దారిలో నీ హృదయబిందువు చేరులోపల స్వేచ్ఛగా
గానమాపకు గజ్జ విప్పకు కాంతి తీయకు బాటపాడవున
ఆటగా ఒక పాటగా నాబాట నీతో చేరి పోనీ

శివుని యొక్క కదలికే ఆ సృష్టి. ఆభంగిమలే ఆ జీవరాసులు అనే భావంతో రాసిందిది. నా ప్రతికావ్యానికి ప్రతి రచనకు ఒక ప్రేరణ శక్తి ఉంటుంది. ఏదో ఒక ప్రేరణను ఆధారంగా చేసుకొని ఒక కవిత ఒక కావ్యమో పుడుతుందన్నమాట. అకారణంగా పుట్టిన కవిత లేవీ నాదగ్గరలేవు. ప్రతి దానికి ఒక కారణమున్నది. వాటిని గురించి చెప్తే బాగా ఉంటుంది. వీలయితే మరెప్పుడయినా చెప్తాను.

మహీధర రామమోహనరావు

(09-04-95)

నా సాహితీ జీవితం :

నా పదకొండో ఏటథర్డ్‌ఫారం (ఇప్పుడు ఎనిమిదోతరగతి) ప్యాసయి సహాయనిరాకరణోద్యమంలో చేరాను. నాస్కూలు చదువు అంతే. 12వ ఏటా గురుముఖత : సంస్కృతం ప్రారంభించాను. కావ్యనాటకాలంకారాలూ, కౌముదీ 18 ఏళ్ళకి పూర్తి అయ్యాయి. తరువాత హిందీ, తెలుగు, ఇంగ్లీషు, బెంగాలీ భాషలు నేర్చుకున్నాను. ఏది చదివినా తలస్పర్శిగా చదివినాను అనలేను కాని చాల ఏకాగ్రతతో చదివాను. మంచి జ్ఞాపకశక్తి, చూపిస్తే అల్లుకుపోగల ప్రజ్ఞా వుంది. చదువులో బాగానే రాణించాను. 1936లో ఆంధ్రవిశ్వవిద్యాలయం వారి ఉభయ భాషా ప్రవీణ పాసయ్యాను. 1952 లో వారిదే మెట్రిక్‌పాసయ్యాను.

పదిమంది ముందు నిలబడాలంటే సంకోచం. కనుక ఉపన్యాసకుడిని కాలేకపోయాను. ఏ సంఘంలోను సభ్యుడిగా చేరడానికీ, వుండడానికీ చాల అయిష్టం. నేను కమ్యూనిష్టును . కాని కమ్యూనిష్టు పార్టీ సభ్యుడిని కాదు. అభ్యుదయాత్మకంగా నేనురాస్తానని అంటారు. కాని అరసం సభ్యుడిని కాను. కనుక సాహితీ ప్రపంచంలో నాకు గణనలేదు. పోనిద్దాం అనుకుంటున్నాను.

ఒక్క విషయం చెప్పకపోతే రచయితనుగా మీకు అర్థంకాను. అనుక్షణం నా చుట్టూ జరిగే ప్రతి చర్యనూ, వినబడే ప్రతిమాటనూ మూడో వానిలాగ ప్రేక్షకుడు శ్రోతలాగగనునించడం, చారిత్రక దృష్టి ఉంది. సామాజికదృష్టి లోంచి వివేచించడం నాకో అలవాటు. అదో సహజ లక్షణం అయింది. రచనా వ్యాసంగంలో అదినాకు చాల తోడ్పడింది.

కారణం చెప్పలేను, గ్రంధరచయితగా కావాలనే ఆలోచన నాకు 12వ ఏటనే కలిగింది. అప్పటినుంచీ ఏదో రాస్తూనే వున్నాను. పార్టీ అలవెన్సుతో జర్న లిస్టుగా బతికాను. నారచనలనుంచి నాకు రోజుకూలీకిట్టిందా అంటే సందేహమే.

పాతికేళ్లవయస్సులో **1934**లో మార్క్సు రచన' కేపిటల్ !' నా ప్రపంచ దృక్పధాన్నే నీరు కార్చివేసింది. జీవితంలో అంతవరకు చదివినదంతా నిరుపయోగం అనిపించింది. రాసిందంతా చెత్త అనిపించింది. అంతవరకూ అర్థం కాకుండా మొండిపడి మిగిలిపోయిన ఘటనలకు, అలోచనలకు విశ్వాసాలకు ఒక సమన్వయం మార్గాన్ని చూపింది. మార్క్సిస్టు మేథడాలజీ. నిత్య జీవితంలో ఎదురయ్యే ఘటనలకు అర్థ పరికల్పనకై నేను పది పన్నెండేళ్ళు నిరంతరం పరిశ్రమించాను. ఇప్పటికీ చేస్తూనే వున్నాను. "అసందిగ్ధమైన చారిత్రక అవగాహన..... సమాజ సమస్యలను చారిత్రక దృష్టితో చూడగల ప్రజ్ఞ" అంటూ సుప్రసిద్ధ విమర్శకుడు రాచమల్లు రామచంద్రా రెడ్డి (రా.రా) నారచనలలో చూసినది. ఆ పరిశ్రమనే.

ఇతర భాషలనుంచి మంచి సాహిత్యాన్ని అనువదించి పాఠకులకిద్దామని, వాటి అనుభవంతోవచ్చేతరం మంచి రచనలు చేయగల్గుతారు అనుకొన్నాను. ఓమారు శ్రీశ్రీకి ఇదే సమాధానం ఇచ్చాను. అయితే పదేళ్ళ తరువాత **1948** లో నాకు నేనే నవలా రచనకు పూనుకున్నాను.

1948 జనవరిలో ప్రకాశం పంతులుగారు కమ్యూనిస్టు కార్యకలాపాల్ని నిషేధిస్తూ ఆర్డినెన్సు ప్రకటించారు. ఆ సందర్భంగా నన్నదివరకెరిగిన పోలీసు ఆఫీసరు ఒకరు ఓప్రశ్న వేశారు "కాంగ్రెసూ, కమ్యూనిస్టుపార్టీ ఒకే లక్ష్యంతో పనిచేస్తూన్నాయి కదా, ఈ ఆర్డినెన్స్ ఎందుకొచ్చింది?" అది ప్రశ్న. దానికి సమాధానమే నా "రథచక్రాలు" నవల.

ఏఉద్యమంలోనైనా విభిన్న తరగతుల ప్రజలు తమ తమ కోరికలతో పాల్గొంటారు. కొంత దూరం వెళ్లేక తమ కోరికలు నెరవేరిన తరుగతి పక్కకు దిగబడుతుంది. మిగతా తరగతులు ముందుకుసాగుతాయి. అంటూ కమ్యూనిస్టు లీగ్ సమావేశంలో "పర్మెనెంట్ రివెల్యూషన్ "భావాన్ని వివరిస్తూ చెప్పాడు. ఇక్కడనే జరిగింది.

ఆర్డినెన్సు నాటికి చల్లపల్లి రాజా కాంగ్రెస్‌లో చేరారు. ఆయన ఆక్రమించిన గాజుల్లంక భూములు స్వాధీనానికై రైతాంగం పోరాడుతుంది. వారికి కమ్యూనిస్టులది నాయకత్వం ఆపోరాటంలో పోలీసుకాల్పులకు వియ్యమ్మ చచ్చిపోయింది. జనప

విత్తనాల సమస్య మీద రాష్ట్రమంతా గగ్గోలుగా ఉంది. దీనికి కమ్యూనిష్టులదే నాయకత్వం. ఈ నేపథ్యంలో 'రథ చక్రాలు' నవల వచ్చింది.

నేనింతవరకు 13 నవలలు రాశాను. తెలంగాణా రైతాంగం తిరుగు బాటును చిత్రించిన ఓనమాలు, మృత్యువు నీడల్లో తప్ప నేను ముందుగా అనుకుని రాసిన నవలలు ఏరెండూ లేవు. నామిత్రులు మాజీ శాసనసభ్యులు కాట్రగడ్డ వెంకటనారాయణరావు గారు 'రథచక్రాలు' నవల ప్రింటింగ్‌కు పెట్టుబడి ఇచ్చి ఉండకపోతే ఆనవలా వచ్చేదికాదు.

స్వతంత్ర నవలలు రాయగల వారు తెలుగులో లేరనే భ్రమ 1950 ప్రాంతాలలో ప్రచురణకర్తలలోనూ, పాఠకులలోనూ కూడా చాలా బలంగా వుండేది. అది అనువాదాలయుగం ప్రచురణకర్తలు పోటీలు పడి ఒకే మాత్రుకకు రెండేసి అనువాదాలు తెచ్చేవారు. ఆరోజుల్లో నా 'రథ చక్రాలు' ఏడాదిలో రెండోముద్రణకి వచ్చి, నాకు ధైర్యమూ, ప్రోత్సాహమూ ఇచ్చింది. అలాగనినేను సరదాకో ఊసుబోకకో డబ్బుకో నవల రాయలేదు. జీవితంలోఎదురైన ఏదో ఒక సమస్య స్వభావాన్ని చిత్రంచడానికేదేనినైనా రాశాను. దేనిని రాసినా వాస్తవికతనుగాని, అనుభవ జ్ఞానాన్ని గాని వక్రీకరించడానికి ప్రయత్నించలేదు. అందుచేతనే భవిష్యత్తులో ఎప్పుడో కథను సాగించాల్సిన అవసరం ఏర్పడినా, రెండు భాగాలూ అతి సహజంగానే ఒక దానికొకటి చక్కగా అతుక్కున్నాయి. 'రథచక్రాలు' రాసిన 20 ఏళ్లకి తల పెట్టిన ఈ దారి ఎక్కడికి? ఇందుకు చక్కని సాక్ష్యం.

1960 ప్రాంతాలలో నేనోమారు మావూరు ముంగండ వెళ్లాను. అప్పుడు పూర్వపరిచయం ఉన్న మిత్రుల్ని కలుసుకునేందుకు పల్లెలకు వెళ్లాను. ఆ ప్రదేశాలు, ఆ జనం, వారిజీవన పద్ధతులూ, వృత్తులూ అన్నీ మారిపోయాయి. ప్రభుత్వం ఇస్తున్న సౌకర్యాలను, సౌలభ్యాలను వుపయోగించుకుని, కుర్రకారు చాలా మంది ఏవేవో వృత్తి పనులను నేర్చుకుంటున్నారు. చదువుకుంటున్నారు. కొత్త పనులకు ఎగబడుతున్నారు. పల్లెజనం మధ్యతరగతుల స్థాయికి ఎదుగుతున్నారు. ఈ మార్పులను సర్వేచేయించి సందేశము పత్రికలో వేయించడానికి పార్టీ నాయకత్వం అభ్యంతరం చెప్పింది. తాముప్రజాశత్రువుగా భావిస్తున్న జాతీయ కాంగ్రేసు

ప్రభుత్వం ప్రజోపయోగంగా కార్యక్రమాలు చేస్తుందని పీడిత ప్రజల జీవితాలలో మంచి మార్పులను తెస్తోందని సిద్ధాంత పత్రికలోనే రాస్తే దేశరాజకీయాలమీద తమ అంచనాలు తప్పు అని ఒప్పుకోవడమే కదా? అయితే అసలు అభ్యంతరం ఎక్కడుందో పదేళ్ళ తరువాత గాని నాకు అర్థంకాలేదు. 1969 అక్టోబరు 13న కేరళ రెవిన్యూ మినిస్టరు గౌరి కేరళ అసెంబ్లీలో అప్పుడు ఇ.ఎం.ఎస్ నాయకత్వాన ఉభయకమ్యూనిస్ట్ పార్టీల సంయుక్త ప్రభుత్వం అధికారంలో వుంది-చర్చకు సమాధానం ఇస్తూ, భూసంస్కరణల బిల్లును రూపొందించి రెండేళ్లయినా తమపార్టీ అధికారంలో ఉన్నప్పుడు చర్చకు పెట్టాలని తాత్సారం చేశానని సమాధానం ఇచ్చారు. అంటే బిల్లును శాసనం చేసిన ప్రతిష్టలో సి.పి.ఐకి వాటాఇవ్వకుండేందుకు అసలు ప్రజోపయోగ కార్యక్రమాన్నే వెనక్కి నెట్టేసిందన్న మాట. అది చదివినప్పుడు వీళ్ళా కమ్యూనిస్టు సోదరులు? నాఒళ్ళు రగిలి పోయింది. ఆక్షణం లో ఈదారి ఎక్కడికి? అనే ప్రశ్న మనస్సులో మెదిలింది. అసలు కమ్యూనిస్టు ఉద్యమమే తప్పుదారిన పడిందనిపించింది. పార్టీ ప్రథమ దినాలను చిత్రించిన రథచక్రాలు సీక్వెల్ ఈ దారి ఎక్కడికి రాశాను. చిత్రంగా ఇది బయటకు రావడానికి కూడా మిత్రులు కాట్రగడ్డ నారాయణరావు గారే సాహసించారు.

కొల్లాయి గట్టితేనేమి? నవలను దేశసామాజిక పరిణామాలనువిప్పడంలో మార్క్సిస్టు మెథ డాలజీ అవసరాన్ని కమ్యూనిస్టు కేడరుకు అర్థం అయ్యేలా చెప్పడం కోసం వుద్దేశించాను. ఆనవలకు 1968 లో ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి అవార్డునిచ్చింది. అంతకన్నా విలువైనకితాబు నిచ్చారు నరిసింహశాస్త్రిగారు. "కమ్యూనిస్టువై పోయేవుగాని ఈనవలకు ఆంధ్రదేశం బ్రహ్మరథం పట్టేదోయ్" అన్నారు. కమ్యూనిస్టునయ్యాను కనుకనే బ్రహ్మరథం పట్టాలనిపించే నవలను రాశానండి" అన్నాను నేను. రాచమల్లు రామచంద్రారెడ్డి ఆనవలను రాజకీయంగా విశ్లేశిస్తూ, సంవేదన పత్రికలో ఒక సుదీర్ఘ వ్యాసం రాశారు. హైదరాబాదు రేడియో స్టేషన్ దానిని ఇంచు మించు 45 రోజులపాటు దినదినమూ చదివి ప్రసారం చేశారు. విజయవాడ రేడియోస్టేషను ఆ నవలను నాటకకరించి ప్రసారం చేశారు. కొన్ని పత్రికలు ప్రత్యేక వ్యాసాలు వేశాయి. ఈ నవలను రాసినప్పుడు దానికి తరువాయిగా నవలను కొనసాగించాలనే ఆలోచన లేదు నాకు. 15 ఏళ్ల దాకా నాకటువంటి ఆలోచనేలేదు.

1980 దశకం ప్రారంభంలో "మనకు తెలియని మనచరిత్ర" సమాచార సేకరణ కోసం నలుగురు - ముగ్గురు స్త్రీవాద రచయిత్రులు నావద్దకు వచ్చారు. వారు తమ ప్రశ్నలలో కమ్యూనిస్టు ఉద్యమం గురించి కొన్ని ఆరోపణలు చేశారు. స్త్రీలలో చైతన్యం కలిగించడానికి కమ్యూనిస్టులు చేసిందేమీలేదు. పైగా తెలంగాణా పోరాటం మధ్యలో ఆపేసి, ఆపోరాటాలలో పాల్గొన్న స్త్రీలను వెనక్కిపంపేసి, వారివూరు పేరులేకుండా చేశారనేది వారి ఆలోచన.

బ్రహ్మసమాజం తెచ్చిన సంస్కరణ భావాలతో ప్రభావితులమై, జాతీయోద్యమం కలిగించిన స్ఫూర్తితో, 1934-35 ల నాటికేచాలమందిమి కమ్యూనిస్టు ఉద్యమంలోకి వచ్చాం. విరేశలింగం మొదలైన వారి రచనలతో ప్రభావితులమై స్త్రీల విముక్తి గురించి అలోచించాం. వారి చదువుల గురించి పట్టించుకున్నాం. బాల్యవివాహనిరోధానికి కృషి చేశను. కమ్యూనిస్టు తత్వశాస్త్రం ఏ ఒక్క స్త్రీలను గురించో, పీడిత, తాడిత అధోజగన్నివాసులను గురించో మాత్రమే గాక సమాజస్థితి గతుల గురించి, వాటి పరిణామ క్రమం గురించి చెప్పింది. ఆ పరిణామక్రమగతిని ఎరిగినపరిజ్ఞానంతో, చరిత్రదృష్టిని మరిచి పోకుండా పని చేస్తే సమాజ పరిణామక్రమాన్నిత్వరిత పరచగలమంది. దానిని అందుకుని పని చేశాం. దాని ఫలితంగా 1935-50 లమధ్య 15 ఏళ్లలో ఆంధ్రదేశాన్ని సామాజికంగా, సాంస్కృతికంగా వెనుకకు తిరిగి చూస్తే గుర్తించ లేనంతగా మార్చివేశాం. ఒక్క విషయం గుర్తు చేస్తాను. మీలో 50-60 ఏళ్ళకు పైబడిన వారు నా మాటకు సాక్ష్యం చెప్పగలరు. 1940నాటికి ఆంధ్రగ్రామాలలో లెట్రిన్ సౌకర్యాలు లేవు. దీనివలన ప్రజలు ముఖ్యంగా స్త్రీలు చాల బాధలకు, రోగాలకు, కష్టాలకు దౌర్జన్యాలకు కూడా గురిఅయ్యేవారు. వారి సౌకర్యంకోసం తడకతోనైనా, గ్రామసీమలలో మరుగు దొడ్లుకట్టించమని గ్రామాలలో ప్రచారం చేశాం. గ్రామస్థులనే రంగంలోకితెచ్చేం. సంఘాలు పెట్టించాం. ఆఅపరాధానికి తిట్లు, దెబ్బలు, పోలీసుకేసులు, జైళ్ళు ఎదుర్కొన్నాం.

స్త్రీల చదువులకోసం, వారి ఉద్యోగాలకోసం, ఉద్యోగస్థులకు ఎదురవుతున్న ఇబ్బందులకోసం మాశక్తియుక్తులు ఉపయోగించాం. వాసమూర్తి ఆరోజుల్లో మాకు తోడుగా వుండేవాడు. స్త్రీల సమస్యలను సూటిగా కళ్ళముందు పెడుతూ నవలలు,

కథలు రాశాడు ఈనాడు స్త్రీలలో ఆంధ్రమహిళాలోకంలో వచ్చిన చైతన్యదీప్తికి పూర్వరంగంఇది. ఈ పూర్వ రంగాన్ని సంసిద్ధంచేయడంలో మేము - కమ్యూనిష్టులం నిర్వహించిన పాత్రను చెప్పాలనిపించింది. ఆ చరిత్రకాలం 1935-45 పదేళ్ళు. దానిని కొల్లాయిగట్టితేనేమి? లోతదనంతరంగాథగా ఎత్తుకున్నాను. 1983లో కొంత భాగం 'దేశం కోసం' పేరుతోనూ, 1993లో చివరి భాగాన్ని "జ్వాలాతోరణం" పేరుతోనూ రాసి ప్రకటించాను' అది నవలారూపం ఇచ్చిన వాస్తవ చరిత్ర అనడానికి ఒక్కసాక్ష్యం చూపుతా. ఈ నవలలు చదివిన వై.బలరామమూర్తి మొదలైన మిత్రులు వీనిలో కనబడేది నీ ఆత్మకథే, కటుంబగాథే కదా అన్నారు. ఈ నవలల్లో చిత్రించినది ఆనాటి కమ్యూనిష్టువుద్యమాన్ని, దానిలోనేనో పాత్రధారిని, అన్నదమ్ములు - వాళ్లభార్యలు, చెల్లెళ్ళు వాళ్ళ భర్తలు మా తల్లిదండ్రులు, నన్ను పెంచిన పెత్తల్లి అందరూ - ఎందరో దానిదో రూపంలో ఎంతో కొంత పాత్రవహించినవలల రూపం తీసుకున్ననాటి ఉద్యనుచరిత్రలో, ఆ పాత్రలలో మేమూ కనిపిస్తున్నాం కాని అవివట్టి పోలికలు మాత్రమే. "ప్రత్యక్షరం నిజమనుకొంటే, అది భ్రమేకాదు. ఆ ఉద్యమాలకూ, ఆ సాహిత్య ప్రకియకు కూడా అపకారం" చేస్తామన్నాను. ఆ మూడు నవలలూ దేనికదే రాసినా, మొత్తంమీద అవి 1920-45ల నడుమను ఆంధ్ర ప్రజల సామాజిక, సాంస్కృతిక, ఆర్థిక, రాజకీయ పరిణామాలను చిత్రిస్తున్న నవలాత్రయం. రాచమల్లు రామచంద్రారెడ్డి 'కొల్లాయికట్టితే నేమి? కిచ్చినంత ప్రశస్తినీ, సామాజిక ప్రాముఖ్యతను ఇస్తూ, జ్వాలా తోరణం నవలనుగురించి త్రిపురనేని మధుసూధనరావు గారు ఓ బృహద్వ్యాసం 'ఉదయం' ప్రతికలో రాశారు.

విమర్శకుల ప్రశంసలు పొందటం, జనాదరణపొందడం గర్వ కారణమే. సంతోషకరమే. నా మొట్టమొదటి నవల రథచక్రాలతోనే అది అనుభవం అయింది. ఆ నవలలో దేశ రాజకీయ జీవితంలో వచ్చిన మార్పుల్ని చిత్రించాను. నిజమే అయితే ఆమార్పు జనజీవితంలో అంతర్భాగంగా చూశాను. జనం ఆమార్పుల మధ్య బతుకుతారు. అదంతా వారి కష్ట సుఖాలలో భాగం. కమ్యూనిష్టు ఉద్యమం పిడుగులా ఆకాశంలోంచి జనారణ్యం మధ్యపడలేదు. అది జన జీవితంలో అవసరమైనదిగా అతి సహజంగా వారి సంస్కారంలో వస్తున్న పరిణామంగా

సమాజంలో ప్రవేశించింది. అవసరమైన పరిణామంగా పుట్టి పెరిగిందనే చిత్రించాను. పాఠకులు మెచ్చారు. తమ వాస్తవిక జీవిత ప్రతిబింబాన్ని దానిలో చూసుకున్నారు.

నా నవలలన్నీ ఆదారిలోనే నడిచాయి. రథచక్రాలకు వచ్చిన ఆదరణకు కారణమేమిటో అర్థంఅయి నేనా పద్ధతిని అనుసరించలేదు. మార్క్సిస్టు మెధడాల జీనివర్తింపచేస్తు నిత్యజీవిత ఘట్టాలనూ, సమస్యలనూ అర్థం చేసుకునేందుకు నిరంతరాయంగా సాగించిన ఆలోచనలూ, కృషి నన్నా మార్గంలోనే ఆలోచించేట్లు చేశాయి. అదేవిధంగా రాశాను.

రాజకీయ బాదితులకు భూములిచ్చి ఆదుకునేందుకు కాంగ్రేసు ప్రభుత్వాలు పూనుకున్నాయి. వారిని ఆదుకోవడం అవసరం అనే లక్ష్యం మంచిదే. కాని, ఆప్రయత్నం ప్రారంభం లోనే సమాజంలో అల్లకల్లోలం తెచ్చిపెట్టి అప్రతిష్ఠ పాలయింది. 1956 లో ఆ సమస్యను చిత్రిస్తూ 'ఎవరికోసం?' నవలరాశాను. రా. రా. రచయిత్రి శ్రీదేవి దీనిని చాలా ప్రశంసించారు.

1966-67 ఎన్నికల అనంతరం ఆంధ్రప్రభుత్వం రిట్రెంచి మెంటు ప్రకటించింది. ఆర్థికంగానేకాదు రాజకీయంగా కూడా అది సమాజాన్ని ఎటువేపు నెట్టిందో చూపుతూ 'అగ్నిగుండం' రాశాను.

నా రెండవకొడుక్కు వధువును వెతికే ప్రయత్నంలో సమాజంలో చదువులూ,ఉద్యోగాలూ, అంతవరకూ తల్లిదండ్రుల చాటునే వున్న ఆడపిల్లల మనస్తత్వాలు, ఆలోచనలు, తెగింపులతో వచ్చిన మార్పులు అర్థమైనాయి. అదినాస్వయం వరణం" నవలకు వస్తువు.

1955-60ల మధ్య ఒక మూసలో నవలలూ, కథలూ వచ్చేవి. యువతీ యువకులు ప్రేమించి పెళ్లి చేసుకుంటారు. కొన్నాళ్ళు గడిచాక మగాడికి ఏవో కారణాలతో తిక్కరేగి భార్యను కొట్టి ఇంట్లోంచి తరిమేస్తాడు. మరి కొన్నాళ్ళకు వదిలేసిన పెళ్ళానికి కబురు చేస్తాడు. ఆమె కుక్కపిల్లలా తోకాడిస్తూవచ్చి, పతిని ఆదుకొని భారతనారీ ధర్మరక్షణ చేస్తుంది. భార్యా భర్తలలో ఎవరుగాని రెండో వారిని పొమ్మన్నాక, మంగళ సూత్రం బలంతో వారిని అంగీకరించకూడదు అనేది నా ఆలోచన. ఆదృష్టితో రాసింది "కత్తులవంతెన" నవల.

1946-48లలో సాగిన తెలంగాణా రైతు పోరాటాల కాలంలో తెలంగాణా నుంచి వచ్చిన ఒక ముసలాయన కొన్నాళ్ళు ప్రజాశక్తి నగరులో ఉన్నారు. ఆయన వితంతు కోడల్ని స్థానిక ముస్లింజాగీర్దారు తమ్ముడు ఛోటే జాన్ అనే అతను చేరదీసి తమ భూముల్ని లాగేసాడట. వాటిని ఇప్పించాలని కమ్యూనిష్టు నాయకున్ని కోరడానికి వచ్చాడు. తన గోడుతో పాటు అయన ఎన్నెన్నో కథలు, ఆచారాలు, వాటితో వస్తున్న కొత్త ఇబ్బందులు చెప్పేవాడు.

నిజాం పాలననూ, అధికార దౌర్జన్యాలను ఎదిరించాలన్న స్టేట్‌కాంగ్రెస్, ప్రజల వెనుక బాటు తనాన్ని వెట్టి చాకిరీతో మొదలు పెట్టి సంఘంలో సాగుతున్న అనేక సాంఘిక దురాచారాలను ప్రజల చేత వ్యతిరేకింప చేస్తున్న కమ్యూనిస్టు వుద్యమానికే అనేక రూపాలలోఘర్షణలు సాగేవి. ఆకథలను పోరాటదినాలలోనేగాక, 1952 తార్వాత విశాలాంధ్ర విలేకరిగా హైదారాబాద్ అసెంబ్లీకి వచ్చినప్పుడు కాంగ్రెసు నాయకులు మందుముల వారి నుంచి, వల్లూరి బసవరాజుగారి నుంచీ వినే అవకాశం కలిగించుకున్నాను. వి.కె.ధగే అనే అడ్వకేటు ఎంతో సమాచారం ఇచ్చారు. పి.డి.ఎఫ్., ఎం.ఎల్.ఏలు సరేసరి. వాటిని ఉపయోగించుకొని 'ఓనమాలు', మృత్యువు నీడల్లో, శుభలేఖ నవలలు వ్రాశాను.

ఈ విధంగా నానవలలన్నీ ఏదో లక్ష్యంతో రాసినవే. వాటిలో వాస్తవ జీవిత చిత్రణలున్నాయి. సమాజం మారుతుంది అనుక్షణం. దానికి సర్దుకుంటూ ముందడుగు వేస్తున్నాం-అనే వాస్తవాన్ని చిత్రించడానికి టిపికల్ అనుభవాలను జనరలైజ్ చేయడం, జనరల్ వాస్తవాలను టిపికలైజ్ చేయడం ద్వారా అవాస్తవికకథను వాస్తవికంగా తోపింపచేయగలిగాను. విమర్శలకూ, వెక్కిరింతలకూ "నాకళ్ళతో చూసిందే రాశానన్రోయ్"అని మొరపెట్టుకొనే అవసరం కలగనీయరాదని నాపట్టుదల.

ఎంత జాగ్రత్త తీసుకున్నా ప్రమాదాలు దొర్లకపోలేదు. నాకు తెలిసినంత వరకు 'రథచక్రాలు'లో ఒకచోట కత్తులవంతెనలో రెండుచోట్ల ప్రమాదాలు దొర్లాయి. 'రథచక్రాల'లోని తప్పును ఈ 40ఏళ్ళలో ఎవ్వరూ చూపలేదు. కాని కత్తుల వంతెనలోవి చూశారు అనాడే.

'కత్తుల వంతెన' లో ఒకచోట మహిళా సంక్షేమశాఖ ఉద్యోగిని నైతిక ప్రవర్తనపై అనుమానం కలిగించే విధంగా ఓఘట్టం వుంది. దానిని ఆచంట జానకిరామ్ గారు ఆక్షేపించారు. "మహిళల అభివృద్ధిని కోరి ప్రభుత్వం ఆశాఖను ప్రారంభించింది. వేలాదిమంది దానిలో పనిచేస్తున్నారు. అందులో కొందరు వుద్యోగినులు ఆ మార్గం తొక్కుతూండవచ్చు. స్త్రీలు అపమార్గం పట్టడానికి సాయంగా ప్రభుత్వం ఆశాఖను ప్రారంభించలేదు. "అన్నది ఆయన ఆక్షేపణ. నా పొరపాటుకు సిగ్గుపడ్డాను. దానిని దిద్దుకొనేందుకు రాసిందే 'ఇక ఈ కథ అంతే' అన్నచిన్న నవల. కొడవటిగంటి ఆ నవల ముగింపునూ ముందుమాటనూ చాల మెచ్చుకున్నారు.

అలాగే కత్తుల వంతెన ముగింపు ఘట్టం "ఇదినేను కంటితో చూసినదే రాశానర్రోయ్" అని చెప్పదగిందే. దానిని చిత్రించిన తీరు సినమాటిక్‌గా వుందనీ అంటే వాస్తవంగా కనబడ్డంలేదని నా మిత్రులు నీలం రాజశేఖరరెడ్డి అన్నారు. రాసేటప్పుడు నాకూ అనిపించింది. వ్యవధి లేకపోయింది. 'విశాలాంధ్ర నవలలపోటికి పంపడానికి దానిని రాస్తున్నా. గడువు కొద్ది గంటలుంది. ఏంచెయ్యలేక పంపేశాను. అయితే అదినాకో గుణపాఠం. మనస్సుని ఒప్పించలేని నవలని బయటకు పోనివ్వకూడదు అనుకున్నా. కొద్దికాలంలోనే అటువంటి ఘట్టం వచ్చింది. నేను నిలబడ్డా.

ఈ దారి ఎక్కడికి నవలగురించిపైన చెప్పేను. ఆ నవలలో చివరిభాగంలో రెండు కమ్యూనిస్టు పార్టీలలో ఒకదానికి చెందిన అతడు తన భూమిని హరిజన వాడలోని వారి ఇళ్ళ స్థలాలకి ఇచ్చేస్తూన్నానన్నాడు. వెంటనే రెండో పార్టీవారు తమ చెప్పు చేతలలో వున్న హరిజనపేట లోని వారిచేత ఆ భూమిని ఆక్రమింప చేశారు. ఇప్పుడు భూమిదాత ఏం చెయ్యాలి? అతని ముందు మూడుదారులు తోచాయి.

ఒకటి ఇవ్వదలచింది హరిజన పేటలోవారికే. ఆక్రమించినది హరిజన పేటలోని వారే. ఆఅన్యాయ కార్యాన్ని సహించి ఊరుకోవడం. దీనివలన తానుగా అన్యాయానికి తల ఒగ్గడం, తన గ్రూపు హేళనకు గురి అవడం జరుగుతుంది.

రెండవ పద్ధతి తనపార్టీ అనువర్తనులైన హరిజనులనేపంపి, అభూమినితామే ఆక్రమించేటట్లు ప్రోత్సహించడం. దీనివలన తాను సాయం చేయబోయిన హరిజనులే కొట్టుకొని, కక్షలురేపటం జరుగుతుంది.

ఈ రెండూమంచిదికాదు. మూడోది కేసు పోలీసుల చేతికి అప్పచెప్పడం. అప్పుడు వారు ఇద్దరినీ చితకబాది, ఒకటి రెండు ఎన్‌కౌంటర్లతోఅణచివేస్తారు. కనక అదీవద్దు. మరి ఈ సమస్యను పరిష్కరించడం ఎలాగ?

మిత్రులందర్ని అడిగేను. మార్క్‌ట్వేన్‌లా మిలియన్ డాలర్ ప్రశ్నను సృష్టించుకున్నానన్నారు శ్రీ పాద లక్ష్మీనరసింహంగారు. ఏమన్నాతప్పదుగదా. పరిష్కారమార్గం కోసం ఆరు నెలలు ఒకే ఆలోచన. చివరకది ఆఫీసులో ఓ జోక్ అయింది. 'నవల ఆలోచనలోమనవాడు ఆఫీసుమాట మరచిపోయేడు'. అని తాపీ మోహనరావు వేళాకోళం చేసేవాడు.

చివరికి నాకేతోచింది. ఓ రోజున రాసినంత వరకు మరోమారు చదువుకుంటూంటే జాన్ పాత్ర స్వభావ చిత్రణం నుంచి మార్గం కనబడింది. 'రథచక్రాల నుంచీఆపాత్రను అతిశయోక్తులూ, అసందర్భకల్పనలూచేయ కుండ నేనెరిగిన ఇద్దరు, ముగ్గురు వ్యక్తుల స్వభావ లక్షణాలు కలగలపి రాస్తున్న పాత్రఅది, అతి సహజంగా సాగినది. ఆపాత్ర చిత్రణ ఇప్పుడు నన్ను బయట పడేసింది.

స్వతంత్ర నవలలు ఈ పదమూడేకాదు. ఇంచుమించు ఏభయికిపైగానే చిన్న, పెద్ద పుస్తకాలు అనువదించేను. కొన్ని వందలు దైనందిన సమస్యలపై విమర్శ వ్యాసాలు రాశాను. వందల పుస్తకాలకు సమీక్షలు, సమీక్షావ్యాసాలు రాశాను. కనీసం నా అనువాదాల గురించి యైనా నాలుగు మాటలు చెప్పక పోతే సాహిత్య, రచనా వ్యాసంగ కథనం పూర్తికాదు.

మా అన్నదమ్ముల్లో మొదటి ముగ్గురికీ ఆంధ్ర ప్రజలకేదోచేసి ఒరగ బెట్టాలన్న యావ బలంగా వుండేది. ఎంతో అన్వేషణ, అధ్యయనం తర్వాత మార్క్సిజాన్ని తెలుగు వాళ్లకి చెప్పాలనిపించింది. అందుకై మార్క్సిస్టు సాహిత్యం అనువదించవూనుకున్నాం. వాని ప్రచురణకు 'విశ్వసాహిత్యమాల' నెలకొల్పాం. ముద్రణకి అవంతీ ప్రెస్ పెట్టాం. పుస్తకాలు అమ్మడానికి సైకిళ్ళు వేసుకొని , ఆంధ్రప్రదేశ్ అన్ని జిల్లాలూచుట్టివచ్చాం.

అనువాదానికి మేము అనుసరించిన పద్ధతి ముక్కకి ముక్కకాకుండా, వాక్యతాత్పర్యంకాకుండా చాల అర్ధవంతంగా, మూలాన్ని అనుసరించేది. ఆపద్ధతి పాఠకుల్ని' ఆకట్టుకుంది.

అనువాదాలు ఇంచు మించు నాలుగు దశలుగా సాగాయి. 1936-46 ప్రథమ దశ. కమ్యూనిస్టు కార్యకర్తలకే సిద్ధాంత పరిచయం చేయడానికి అవసరమైన పుస్తకాలు ఆ కాలంలో చేశాం. 46-56 మధ్య పదేళ్ళుపార్టీ నిత్యజీవితంలో అవసరమయ్యే కరపత్రాలు వగైరా అనువాదం. 1956 నుంచి 80 వరకు నా స్వతంత్ర నవలా వ్యామోహంతోఅనువాదాల ప్రసక్తి పెట్టుకోలేదు. '68-69 లలో నామిత్రులు కంభంపాటి సత్యనారాయణ సీనియర్ గారి పరిశోధన గ్రంథం 2 సంపుటాలనూ ఆంధ్రుల సంస్కృతి - చరిత్ర పేరున అనువదింప బూను కున్నాను. దానిని ఒక నవల మాదిరిగా చదువుకోగలుగునట్లు రాయాలని నా ప్రతిజ్ఞ. అలా రాయాలంటే మూలగ్రంథాన్ని సంక్షిప్తం చేయాలి. అది పరిశోధన గ్రంథం కదా! ఒక ఆలోచనను ధృవీకరించడానికి అనేక గ్రంథాలనుంచి, శాసనాలనుంచీ కొటేషన్లు ఇస్తారు. వానిని తగ్గించవచ్చు. ఆపద్ధతిలో ముఖ్యవిషయాలు జారవిడుస్తానని రచయిత భయం. 200 పుటల వరకూ చాల శ్రద్ధగా కనిపెట్టి చివరకు అనువాదంలో సిద్ధహస్తుడివి. కానీ-అనేశారు. చరిత్ర గ్రంథాన్ని నవలలాగ చదివింప జేస్తానన్న ప్రతిజ్ఞను మిత్రుడు కె.వి. రమణారెడ్డి అధిక్షేపించారు. కాని, విమర్శకులు పాఠకులు, పత్రికలు దానిని మెచ్చాయి. ఇప్పుడు బజారులో వున్నది నాలుగో ముద్రణం అనుకుంటాను.

తరువాత అమెరికన్ ఆంథ్రోపాలజిస్టు లూయీహెన్రీ మోర్గన్ Ancient Society ని అనువదించాను. దాని ఆధారంగా ఫ్రెడరిక్ ఏంగిల్స్ రాసిన Congin of family ని 1955లోనే అనువదించాను. ఆ రెంటినీ రచయిత కాదలచిన వారు చదవడం అవసరమని నా అభిప్రాయం.

ఈ విధంగా 20వ శతాబ్దపు ఆంధ్రదేశచరిత్రను, సమాజాన్ని అర్థం చేసుకొనేందుకు వివరించేందుకు అర్థమయ్యేలా రాసేందుకు ఒక అర్ధశతాబ్దకాలం నిర్విరామంగా కృషిచేశానని చెప్పడానికి గర్విస్తున్నాను.

డాక్టర్ నండూరి రామకృష్ణమాచార్యులు

(19-5-1995)

కవులకంటె తుహినకర్పూర నిభకీర్తి
తెచ్చిరెవరు నీకు తెలుగు తల్లి
సాహితీ తరంగ సంగీత రసధుని
దేశభాషలందు తెలుగు లెస్స

అని నేను నా జీవితాన్ని సుమారు 60 సంవత్సరాల కింద తెలుగు తల్లికి అంకితం చేస్తూ చెప్పాను.

తరపి వెన్నెల ఆణిముత్యాల జిలుగు
పులుగు జవ్వాజి ఆమని పూలవలపు
మురళిరవళులు కస్తూరి పరిమళములు
కలసిఏర్పడెసుమ్ము మా తెలుగుబాస

నాకు పట్టినటువంటి గొప్ప అదృష్టమేమిటంటే గొప్ప గురువుల దగ్గర చదువుకున్నాను. విశ్వనాథ సత్యనారాయణగారికి నేను ప్రత్యక్ష శిష్యుణ్ణి. పింగళి లక్ష్మీకాంతంగారికి ప్రత్యక్ష శిష్యుణ్ణి. నేను ఒక కథ 'అన్నదమ్ములు' అని రాశాను. 18, 20 పంక్తులు దాటదు. ఆ కథ చూసి విశ్వనాథ సత్యనారాయణ గారు "రే ఆచార్లూ! నువ్వు నా శిష్యుడివి, చాలా గర్వపడుతున్నాను. నీకు మూడు రూపాయలిస్తున్నాను, ఇవి జ్ఞానపీఠ అవార్డు డబ్బులు" అని అన్నాడాయన. మరి దీనికి సాక్ష్యమెక్కడా లేదు. మరి ఆయన పులకించి చెప్పాడు కాబట్టి ఈ సంగతి చెప్తున్నాను.

మా మేనమామ ఆత్మకూరి గోవిందాచార్యులు ఆరుసార్లు జైలుకు వెళ్లారు. ఆస్తినంతా పోగొట్టుకున్నాడు. గాంధీగారి శిష్యుడు. ఆయనకు పిల్లల్లేరు. ఆయన చెల్లెల కొడుకును నేను. మన భారతదేశంలో రాముడు దేవుడయ్యాడు ఎందుచేత?

త్యాగంచేత. అందువల్ల త్యాగానికి ఒక అద్భుతమైన శక్తి ఉంది. ఎక్కడయినా ఉంది, మనదేశంలో కాస్త ఎక్కువ ఉంది. ఆయన 'సత్యాగ్రహి' అని ఒక పత్రిక నడిపేవాడు. దానికి ఒక ప్రెస్సు ఉండేది. ఆ ప్రెస్సును అమ్మేశాడు. తర్వాత మా కారు అమ్మేయడానికి ఆ ఊళ్లో ఎవరు కొంటారు చెప్పండి ? అందుచేత ప్రయాగ నుంచి ఒక వ్యక్తిని తీసుకు వచ్చి వందరూపాయలకి అమ్మేశారు. నేనల నడిచి వెళుతుంటే త్రోవలో ఎవరైనా ఆన్ను ఆపి నాయనా అని పలిచి చాల మర్యాదచేసి ఎక్కించుకొని మా ఇంటి దగ్గర దించేవాళ్లు. నేనో పద్యం రాశాను. నేనేదో దివ్యాంశ సంభూతుణ్ణి కాబట్టి వీళ్లంతానాకు మర్యాద చేస్తున్నారని నేననుకున్నాను గాని అదంతా మా మేన మామగారి త్యాగం ఫలితమని అనాడు నాకు తెలియదు. ఇప్పుడేదో చాలా పద్యాలు రాస్తున్నాం. ఈ పద్యాలు కాలస్రవంతికి ఆగి ఎన్ని నిలుస్తాయి అన్న అనుమానం నాకుంది. అప్పుడిటువంటి అనుమానాలేవీ ఉండేవికావు. మహా అజ్ఞానంతో విజృంభించి రాసేశాను. ఆయన చెల్లెలు కొడుకయినటువంటి నన్ను పెంచాడు. పిన తల్లి కొడుకయినటువంటి ఎన్వీయల్ నరసింహాచార్యుల్ని పెంచాను. నరసింహాచార్యులు గొప్ప నటుడు. అక్కడ గాంధీ స్కూలని ఉండేది. ఆ స్కూలు వార్షికోత్సవానికి అతను వచ్చి హరిశ్చంద్ర కాటికాపరి వేస్తే బాగుండును అని అనుకున్నారు. కరపత్రాలు వేసేశారు కూడాను. ఈ మధ్య జరిగిందేమిటంటే ఎన్వీయర్ ఊళ్లో లేడప్పుడు. ఆర్నెల్లయింది. ఎక్కడికెళ్లాడో తెలియదు తర్వాత వచ్చాడనుకొండి. ఆ రోజు వార్షికోత్సవానికి సరోజినీనాయుడు వచ్చింది.

ఆమె ఉదయాన్నే వెళ్లిపోతూంది. నేను సరోజినీ దేవిని ఆపి "Sarojini Devi is a great poetess. the roses in my garden .... to speak to you" అనేటప్పటికి మా మేనమామ 'ఒరే! నీతోటి ఆ గులాబీలన్నీ మాట్లాడాయా! అన్నీ అబద్ధాలు, ఇష్టం వచ్చినట్టు మాట్లాడుచున్నావు' అని తిట్టారు. తర్వాత 'గోదావరికి కలికికుల్కుల నాట్యవిన్యాసములు నేర్పె నన్నయ కవి' అని అంటే 'గోదావరికి నన్నయ నేర్పడమేమిటి? గోదావరి నేర్పిందనాలి కాని, అనిచెప్పి ఆయనంటే గోదావరి నాతో చెప్పిందన్నాను. 'దీన్ని నేను చెప్తుంటే నేను అబద్ధాలని అనుకోలేదు కాని వినే వాళ్ళకు మాత్రం పచ్చి అబద్ధాలుగానే అనిపించాయి. సరోజినీదేవి ఏమందంటే I am coming to speak to your roses" అంది. ఆవిడ వెళ్లిపోతూ ఒక్కమాటంది.

'Your newphew this Ramakrishnamurthy will become agreat oet. Your consin NVL will become a great actor' అని తర్వాత ఒక మాటంది, ఆవిడే మందంటే 'ఎవరైతే సత్యం చేస్తే అది ప్రజలు కల్పనాకథ అనుకుంటారో వాడుకవి, ఎవరైతే అబద్ధమాడితే అది నిజమనుకుంటారోవాడు నటుడు. అందుకని నేనిప్పుడు వరసపెట్టి చెప్పే వాటిలో చాలామందికి అవి నిజాలు కవనిపిస్తుంది. నాకప్పుడప్పుడనిపిస్తుంది.

నవ్వుటాలకొరకు నగ్నసత్యముచెప్పి
వెక్కిరింప వెఱ్ఱి వేడ్కనాకు
నవ్వువెనుక దాగు నా వేడి కన్నీరు
రమ్యహాసలోల రామకృష్ణ'

అసలు కవిత్వమెందుకు? 'కావ్యాలాపాంశ్చవర్జయేత్'. వట్టి చేతగాని వాక్శూరుడే శూరుడు, కర్మయోగి కాడు తెలుగు వరుడు, కత్తిరింపవలెను కవులనాల్కలు పట్టి, కవితవద్దు పగటికలలు వద్దు అని అనేవారు లేకపోలేదు. దీనికి నా సమానమేమంటే

కర్మవీరుడెవరు కవిమానససుతుండె
కత్తి కన్న వాడి కలది కలము
మెదడు లేక చేయి కదలునా ఇసుమంత
తలపు పనులకెల్ల తల్లి చూడు.'

ఈ ఆలోచన అనేటటువంటిది అన్ని కార్యాలకు మాతృక. అంచేత ఈ తలపు చాలా ముఖ్యమయినటువంటిది. కవిత్వానికి ఒక అవసరం ఉంది అని చెప్పాను. అరవిందయోగి అంటాడు 'ప్రకృతిలో పరిణామం ఉంటుంది. అవశ్యభవితవ్యం మానవుడెదుగుతాడు. వానరుడి నుంచి నరుడు పుట్టాడట. వానరుడి నుండి నరుడెట్లాగయితే పుట్టాడో, పరిణామం ఆగిపోవాలా నరుడితోటి, నరుడు అధినరుడవ్వాలి. ఈ పరిణామ క్రమం ఆగకూడదు. అది నరుడు తెలిసి చేయాలి. ఈ పరిణామ క్రమ వికాసానికి నరుడు దోహదం కల్పించాలి. ఆ విధంగా దోహదం ఏది కల్పిస్తుందంటే కవిత్వం కల్పిస్తుంది. అంచేత ఈ కవిత్వమనేటటు వంటిది చాలా అవసరం అని నేను మనవి చేస్తున్నాను.

నేను 1921లో అగ్రహారగోపవరం కృష్ణా గోదావరీ డెల్టాల మధ్య ప్రదేశంలో పుట్టాను. నేను రాజమహేంద్రవరంలో 5,6 తరగతులు చదువుకున్నాను. తర్వాత ఏలూరు వచ్చాను. అప్పుడు పశ్చిమ చోదావరిలో కళాశాల లేదు. బెజవాడలో కళాశాల ఉంది. అక్కడే చేరాను. నేను చేరిన కొన్ని రోజులకి మాకు తెలుగు లెక్చరర్‌గా విశ్వనాథ సత్యనారాయణగారు చేరారు. నాకు ఇంగ్లీషులోనూ మార్కులు వచ్చేవి. లెక్కల్లో మార్కులు వచ్చేవి. వారి ప్రభావం నామీద ఎంతపడిపోయిందంటే ప్రపంచంలోకెల్లా తెలుగే గొప్పది, అంచేత దేశభాషలందు తెలుగు లెస్స, తెలుగుకు వెళ్లిపోదాం అని చెప్పి నన్ను తెలుగుకు మళ్లింపజేసినటువంటిది. అప్పుడు అవధానం అంటే చాలా గౌరవం ఉండేది. ఏలూరులో నేను చేసిన మొట్టమొదటి అవధానానికి అధ్యక్షత వహించినవారు వి.వి. గిరిగారు.

ఇటు గోదావరి కృష్ణవేణి యటు మాహేలాపురి వైభవో
త్కట సంగీతములాలపించు కవితా కర్పూరనీరాజనం
బిట చాళుక్యసభాంతరాళముల యందే వెల్గె తొల్దొల్తది
క్తటముల్ కమ్మని తేట తెన్గు నుడివాకల్ నిండిపొంగారగా

- అని ఆ అవధానంలో చెప్పాను. గొప్ప విషయమేమిటంటే ఒక పిల్లవాణ్ణి అవధానానికి ఎవరు పిలుస్తారు. అక్కడ స్వాతంత్ర్య సమర యోధుడు, మహానుభావుడు అనుకొనేటటువంటి గరికపాటి మల్లావధాని గారని ఆయన మా శిష్యుడు చేస్తాడు అని అన్నారు. న్యాయంగా ఆ రోజు అవధానమంతా ఆయనే చేశాడు పక్కన నన్ను ఏదోపెట్టి. అయితే మొట్టమొదట నేను చదువుకున్నటువంటిది తెలుగుకాదు సంస్కృతం 'కృష్ణా నారాయణ... " ఇట్లాగ మొట్టమొదట ఇక్కడనుంచి అక్కడిదాకా అడ్డం చదివించేసి కూచోబెట్టి తెలికచెర్ల గోపాలచార్లుగారని ఆయన చెబుతుంటే మా నాన్న గారొచ్చి నీకేం కావాలి అని అడిగాడు. అడిగితే నేనడిగిందే మిటంటే నన్ను ఇంగ్లీషు చదివించాలి, క్రాఫింగు పెట్టమని. ఏదో కాలప్రవాహం

గోపాలచార్య గురుపాదుల చేరినాడ
చిన్న తనములో తాపేర్మిని సంస్కృత విద్యా
పారీణునిగచేసె దయతో నన్ను లోకోత్తర
ధిషణకు ఏకైకోదాహరణమైన కౌముదిచదువన్

కొంతవరకు తీసికొని వచ్చిం తర్వాత గరికపాటి మల్లావధానిగారు

సలలిత మనస్విమల్లావధాని
దేశభక్తుడైన దేశికుండు
అమృతహృదుడునేర్పె అష్టావధానము
ఆ గురుత్వమునకు అంజలింతు

నేను నా జీవితంలో మూడే అవధానాలు చేశాను. చివరి అవధానం ఎక్కడంటే అమలాపురం. లక్ష్మీకాంతంగారు దానికి అధ్యక్షులు. 1886 ఆగస్టు పధ్నాలుగు వారం ఏమిటని అడిగితే అందరూ చెప్పగలరు. దీనికి సుప్రసిద్ధమయి నటువంటి ఒక ఫార్ములా ఉంది. ఒకాయన అడిగాడు. నాలుగడిగాడు, ఒకసారి చెప్పాను, మళ్లీ నాలుగడిగాడు. సామాన్యంగా అవధానంలో విశేషమేమిటంటే నాలుగు చెప్పిం తర్వాత ఆయన ఇహ పక్కకి వెళ్లండి అంటాడు. అట్లాగే చివరి దాకా దాన్ని ఒక పదం చెప్తే అది పనికిరాదు అని నిషేధిస్తారే నిషేధాక్షరి, ఆ నిషేధాక్షరికూడా ఏదో రెండు పాదాలయింతర్వాత వదిలేస్తారు, మరి ఈయన వదిలిపెట్టులా. ఈ వదలిపెట్టుక పోయేటప్పటికి అందులో నేను కొన్నిచోట్ల - వాళ్లడిగిందేమిటంటే ఒక సమస్య.

'తొండముతోడి సింహము వధూమణిపైబడె తాళి కట్టగన్'

దాన్ని నేను పూరించాను.

పెండిలి పందిరి న్వెలసె వేడుక బొమ్మలు వింతగా కనుల్
పండువు చేయ లేచెను విలాసము మీర వరుండు దీర్ఘ బా
హుండు హుటాహుటిన్ శుభముహూర్తము సందడి సంభ్రమంబుతో
తొండముతోడి సింహము వధూ మణిపై బడె తాళి గట్టగన్

ఇట్లా చాలా చెప్పాను.

ఆంధ్రభాషకున్న దష్టావధానము
లేదు వేరుచోట వెదకి చూడ
తెలుగు తళుకు బెళుకు స్థిర తటిల్లత వోలె
విశ్వమెల్ల తాను వెల్లి విరిసె.

అవని పుట్టవచ్చు అష్టావధానియై
చావరాదు అట్ల జగతియందు
కావ్యసృష్టి చేసి కవి చిరంజీవియై
బ్రతుకదగును వెలుగుబాట వేసి

అక్కడ ఒకరు నాకు ఇచ్చిన దత్త పది ఏమిటంటే మార్పు, మార్పు, మార్పు, మార్పు అనేటప్పటికి లక్ష్మీకాంతంగారన్నారు నాలుగుతోటి ఆగుతున్నావానాయనా? అనేటప్పటికి నేనేమో అయిదోది కూడా తీసుకుంటు న్నానన్నా. అంటే లోపల ఉద్దేశం వేరు. మీ ఇష్టం వచ్చిన వృత్తం చెప్పమన్నాడాయన. నేను చెప్పింది.

ఏది శాశ్వతమ్ము ఏది ప్రాచీనమ్ము
సృష్టిలో స్వభావసిద్ధమేది
నిత్యసత్యమేది నిత్యనూతనమేది
మార్పు, మార్పు, మార్పు, మార్పు, మార్పు.

అక్కడినుంచి నేను విశ్వకళా పరిషత్తుకు వెళ్లాను. విశ్వ కళాపరిషత్తుకు ఉపాధ్యక్షుడెవరంటే కట్టమంచి రామలింగారెడ్డిగారు. ఆయన కవిత్వ తత్వం విచారమని రాశాడు. గొప్ప పుస్తకం. మాకక్కడ దువ్వూరి వెంకటరమణ శాస్త్రి గారని ఉండేవారు. ఆయనకు కళా పూర్ణోదయం కంఠస్తం. అటు నుంచి, ఇటు నుంచి ఏం చెప్పకున్నా చెప్పేవాడు. అసలు పింగళిసూరన కవిత్వం గురించి చెప్పాలంటే నేను చెప్పాలనే వారు. ఆయన అటువంటి వాడే. అక్కడ ప్రిన్సిపాలు విస్సా అప్పారావు గారు. ఆయనకి వియ్యంకుడుండే వాడు. వేటూరి ప్రభాకర శాస్త్రిగారు. ఆ వేటూరి ప్రభాకరశాస్త్రి గారు వచ్చారు. ఈయన్ని అధ్యక్షుడుగా పెట్టారు. ఏదో మాట్లాడుతుంటే వేటూరి ప్రభాకర శాస్త్రిగారేం చేశారంటే అయ్యా నేనీ పుస్తకంరాశాను. ఈ పుస్తకం మీరు చూడండి. అంతసేపు నేను ఉపన్యాసం చెబుతాను అన్నాడు. ఆయన చెప్పేటప్పటి ఈయన చూస్తున్నాడు. ఉపన్యాసం అయి ఆయన 'పంతులుగారూ తప్పులకోసం వెదుకుతున్నారా? అన్నాడు. ఆయనకదే పని కదా 'కాదండీ శాస్త్రిగారూ! ఒప్పులకోసమే వెదుకుతున్నా నన్నారు.

నేను గాంధీగారి ఆశ్రమంలో ఉన్నాను. అక్కడ ఉండడానికి కారణమేమేంటే మా మేనమామ గారు. అక్కడికి పోకపోతే అన్నం పెట్టరు. నేను గాంధీగారి ఆశ్రమంలో ఉన్నప్పుడు ఆయన 1946, జనవరి 20న ఉత్తరం రాశాడాయన. "My dear Acharya I want to see you, I am coming to Madras on such and such date".

గాంధీగారు రాసిన ఉత్తరం జేబులో పెట్టుకున్నాను, ఏలూరు వచ్చాను. అయ్యా ఇట్లా గాంధీగారు వెళుతుంటారు, ఒక్క అరనిముషం రైలు ఆపండి అన్నాను. నేనీ ఉత్తం చూపించాను. వెంటనే నాకు ప్రదక్షణాలు చేయడమే. ఏంలేదు గాంధీగారి ఉత్తరం వచ్చింది. ఇక వేరే కారణం లేదు. ఆయనేమన్నాడంటే మాయింట్లో అన్నం తినండి. ట్రెయినొస్తే నేనేం చేస్తానంటే రెక్కవాల్చను, గబుక్కున ఆగిపోతుంది, ఆగి ఆగకుండానే నేనేమో రెక్కవేసేస్తాను, మీరు వెళతారా అన్నాడు, సరే అన్నాను. గబుక్కున రైలు ఆగిపోయింది, నేనెక్కేశాను. ఏలూరు నుండి బెజవాడదాకా అంతా జనమే. ఒంగోలు వచ్చేటప్పటికి పదకొండు అయింది. 'ఆయన నిద్రపోనక్కర్లేదా, ఆయన మాత్రం మానవ మాత్రుడు కాదా. ఇట్లా అయితే ఎట్లా కుదురుతుంది?' బోలో మహాత్మా గాంధీకీ జై, భారతమాతాకీజై అని ఆకాశమంతా అదురుతూ ఉంటే కార్యదర్శిగారు వచ్చి ఆ మాట అంటే అంతామౌనం. మద్రాసు వెళ్లింతర్వాత పెద్ద సభ. మొట్టమొదట ప్రార్థన. ఎం.ఎస్. సుబ్బలక్ష్మిగారు వందేమాతరం అద్భుతంగా గానం చేశారు. వెంటనే Welcome address to Mahatma on behalf of the people by Nanduri Rama Krishnamacharya నాకు వళ్లు తెలియలా. అంతకు ముందు చాలా మంది ఆయన గురించి రాద్దామని వెళితే ఆయనది ఆశ్రిత పక్షపాతం "Acharya ! I have come to your place. Dont you extend welcome to me" అని అడిగారాయన. అయితే ఆయన ఆశ్రిత పక్షపాతం వల్ల అని అనుకోకుండా నేనో గొప్పకవినని చెప్పి నాకొక అహంకారం ప్రబలిందనుకోండి. అక్కడరాసిన పద్యమేమిటంటే

'సత్యమహింస ఉచ్ఛ్వాస నిశ్వాసముల్
జల్పి జీవించెడి సత్యమూర్తి
విశ్వకళ్యాణగవేషణ పథమందు
పయనించు ఒంటరి బాటసారి'

అని ఏవో పద్యాలు రాశాను. అందులో ఒక పద్యమేమిటంటే

పరమ గంభీరమంచు నీ వాక్యములకు
భాష్యకారులు గ్రంథాలు వ్రాసినారు కాని
ముగ్ధమోహనము నీ మౌనమునకు
భాష్య మొనరింపగలిగిన వారు లేరు'

అనేటప్పటికి వెంటనే బాపూజీ మైకు పుచ్చుకొని "the young poet just stands self condemned. He has just now commented on my silence" అన్నారు. తర్వాత అక్టోబరు 2 వచ్చింది. గాంధీగారి జన్మదినం నాకు గుర్తులేదు. పడుకొని నిద్రపోతున్నాను. ఎవరో ఒకాయనవచ్చి 'విశ్వకల్యాణ గవేషణాపథమందు పయనించు ఒంటరి బాటసారి' అని మాటలు వినిపించేటప్పటికి నేను లేచి చూశాను. ఆయన పేరు పస్తుల సాగం. నేనెక్కడన్నా, కనిపిస్తే వచ్చి కాళ్లమీద పడి నమస్కారం పెట్టేవాడు. ఆయన పస్తులుంటం వల్ల ఆయనకా పేరు వచ్చింది. అతను ఫస్టు గ్రాడ్యుయేట్. సెంట్రల్ లేజిస్లేచర్‌లో అతన్ని నామినేట్ చేశారు. తర్వాత ఆయనకు వచ్చే పదవేమైనా ఉంటే ఏ గవర్నరో. పాపం ఆయన దానికి రాజీనామా ఇచ్చి ఒక అడ్డపంచె ఖద్దరు వేసుకొని తిరగడం మొదలెట్టాడు. చాలామంది కేమి టంటే ప్రకాశంగారు హృదయాళువు అనీ పట్టాభిగారు మేధావి అనీ ఒక మాటుంది. నేను కాదనడం లేదు. కాని పట్టాభిగారు జైలు కెళ్లి వచ్చిన వారికల్లా ఏదో విధంగా సాయంచేసేవాడు. ఆయన బాగుపడేవాడు పక్కవాణ్ణి బాగు చేసేవాడు. అంటే ప్రకాశం గారు తాను పాడై, పక్క నున్న వాణ్ణి పాడు చేశాడని కాదు నా ఉద్దేశం. భీమవరంలో కోపరేటివ్ అర్బన్ టౌన్ బాంకు అని చెప్పి ఆయనకు దాంట్లో ఉద్యోగమిచ్చాడు. స్వయమేవ మంత్రీ, స్వయమేవరాజా అన్నట్లుగా ఆయనే ప్యూను ఆయనే గుమాస్తా అన్నీ ఆయనే, అటువంటి వాడు, నాకు నమస్కారం పెడుతుంటే ప్రజలందరూ కూడా నన్ను కూడా పిచ్చివాడనుకుంటారేమోనని అప్పుడప్పుడూ బాధపడ్డాను కూడా. ఒక రోజు పాలగుమ్మ పద్మరాజుగారు మా యింటికొచ్చారు. ఆయన నేనే కలసి 'మహేంద్ర' అని ఒక పత్రిక నడిపాం, ఇద్దరం ఎడిటర్లమే. ఆయనవచ్చి లేపి, 'ఏవండి ఆచార్యులవారు మీ మిత్రులయినటువంటి పస్తుల సాగరంగారు మరూశయ్య

మిదున్నారు, ఆయన్ని పొడిచేశారు, ఆస్పత్రిలో ఉన్నాడు' అని చెప్పారు. నేను వెళ్లి చూచాను. మాట్లాడుతున్నాడాయన. డాక్టర్ 'ఆ, ఓ పది నిమిషాలలో పోతాడండీ' అని చెప్పాడు. పోలీసులొచ్చారు' ఎవరు మిమ్మలి పొడిచారు చెప్పండి? 'నేను గాంధీ గారి శిష్యుణ్ణి, నన్ను పొడిచినటువంటి వాడి పేరు నేను చెబుతానా? చెప్పను. వాడంటే నాకు కోపం లేదు, హృదయపూర్వకంగా వాణ్ణి క్షమించను' అని చెప్పి చచ్చిపోయాడు. నేను గాంధీగారి దగ్గర్నుటువంటివాణ్ణి. ఆయన ఒక కుటీరంలోంచి మరో కుటీరంలోకి వెళ్లేవాడు. నా దగ్గరికి మా వూరి నుంచి వచ్చేవాళ్లు, గాంధీగారి దర్శనం ఇప్పించమని మాకే దిక్కులేదు, వచ్చినటువంటి వారికి మేమేం ఇప్పిస్తాం చెప్పండి. కాని మాకు గాంధీగారి బలహీనతులు తెలుసు. పొద్దున్నే నడవడానికి వెళ్లిపోయేవాడు. ఆయనకు పిల్లలంటే మహా ప్రేమ, మామూలు ప్రేమకాదు. ఒక రెండేళ్ల అమ్మాయినో, అబ్బాయినో ఎత్తుకుని చూడు ఆ చెట్టు దగ్గర నిలబడు, గాంధీగారే వచ్చి నిన్ను పలకరిస్తాడు అని చేప్పే వాళ్లం. వాళ్లు నిలుచునే వాళ్లు, గాంధీగారు వచ్చి ప్రిమిడి ముక్కుతో ఉన్నా సరే ఆ పిల్లనెత్తుకొని మాట్లాడేవారు.

నేను గాంధీగారి పోస్టు చూసేవాణ్ణి. ఓ సారి హెచ్.జి.వెల్స్ ఉత్తరం రాశాడు. నేనది పైన పెట్టి చాలా జాగ్రత్తగా జెట్టా. ఆయన అడుగున పెట్టాడు. మర్నాడు మళ్లాపెట్టా ఆయన దాన్ని 'మళ్లాచూడు' అని ఒక ట్రే ఉంటుంది, దాంట్లో పడేశాడు. ఆయన శ్రీఘకోపి. 'నిండుమనంబు నవ్యనవనీత సమానము పల్కు దారణాఖండల శస్త్ర తుల్యము' అనేటటువంటి దానికి ఉదాహరణ చెప్పమంటే ఆయన్నే చెప్పాలి. మధ్య నన్ను తిడితే నేనేం చేయగలను. నేనువెూ ఎదురు తిరిగి ఏమిటయ్యానువ్వారికే తిడుతున్నావు You are the Political Hamlet of India, can you speak a sentence withou using hip" అని అడిగా. ఒక్క మాట చెబుతున్నా వినండి, నాకీ నాడున్నటువంటి పదవీ వ్యామోహం కాని, ధనవ్యామోహం కాని నాడున్నట్లయితే ఏ అంబాసిడర్‌నో అయి ఉండేవాణ్ణి. కానిలేదది, జవహర్లాల్ నెహ్రూనే తిట్టడం. కృపలానీని పట్టుకొనేమో స్వపక్షపరపక్ష నిర్ధూమధాముడివి నువ్వు, నీకు మాట్లాడడం చేత కాదని తిడితే కొట్టబొయ్యాడు కృపలానీజీ. నెహ్రూ మళ్లా పెట్టమన్నాడు. మళ్లా అడుగునపెట్టాడు, నేను వెళ్లి బాపూజీ ఏమిటని అడిగితే Who is H.G Wells అని అడిగాడు, ఆయనకు తెలిసి

అడిగాడో. తెలియకే అడిగాడో నాకు అర్థం కాలేదు. కాదండీ ఇల్లా తిట్టాడు జవహర్లాల్ నెహ్రూ అని చెప్తే జవహర్లాల్‌నెహ్రూని రమ్మన్నాడు. గాంధీగారు కొడుకుని కూడా సరిగ్గా పలకరించేవాడు కాదు. దేవదాస్ గాంధీకి నాకు చాలా స్నేహం. నెహ్రూ వచ్చి ఆయనింత గొప్పవాడు, అంత గొప్పవాడు అని చెప్పాడు. పుత్రప్రేమ కంటే ఎక్కువగా అదేమిటోగాని జవహర్లాల్ నెహ్రూను చూసేటప్పటికి ఆయన ముఖమంతా వికసించి ప్రఫుల్ల వదనారవిందుడై 'రా' అనే వాడు జవహర్లాల్ నెహ్రూని. అది మాక్కొంచెం కష్టంగా ఉండేది. ఆయన పదినిముషాల టైం ఇచ్చాడు. పదినిముషాలు కాగానేఎట్లా తెలిసేదో! మాకు ఆశ్చర్యం వేసింది ఆయనే ఒక వర్కింగ్ గడియారమా అని. పదినిముషాలు కాగానే గడియాం తీసేవాడు టైం అయిపోయిందని. అంటే జవహర్లాల్ నెహ్రూ అయినా సరే ఎవరయినా సరే. సమాధానం ఇవ్వవలసినవాడా అని నన్ను పిల్చి డిక్టేషన్ ఇచ్చారు. అయిదే లైన్లు. My dear H.G. Wells, permit me to say you are in the wrong, I know no rights, I know duties only. If you perform your duties, rights will automatically follow just as the day follows the night - M.K. Gandhi. అది ఎక్కడా రికార్డులో లేకుండానే జవహర్లాల్ నెహ్రూకి ఇచ్చేశాడు. ఈ గాంధియన్ ఎరా అనేటటువంటి పుస్తకం రాసినప్పుడు ఆటెండూల్కర్ గారు మేం అంతా రికార్డు చేశాం. మేం రికార్డు చేయంది. ఏమైనా మీకు తెలిసింది ఉందా అని. అప్పుడిది చెప్పాను. ఆయన ఒప్పుకున్నాడు ఇది మేం రికార్డు చేయలేదండీ అని. నేను రాసిన చిన్న పుస్తకంలో ఒక శీర్షిక Prison.

యూనివర్సిటీలో ఉన్నప్పుడు సి.ఆర్. రెడ్డిగారు నేను రాసిన తారాతోరణానికి పీఠిక రాశాడు. ఒక స్టూడెంటు గదికి వైస్ ఛాన్సలర్ వచ్చేవాడు. అది ఎంత గొప్ప విషయమో చూడండి. తెలుగు వారోత్సవాలకి వచ్చాడాయన. వచ్చి ఏమయ్యా కాకతీయద్వారము, శాతవాహన ధ్వారము, ఇక్ష్వాకు ధ్వారము ఇన్ని ద్వారాలు పెట్టారు రెడ్డి ద్వారమని పెట్టారా?" మర్చిపోయాం అన్నాడు. అంతకంటే ఏం లేదు. పైగా ఆయననన్నాడు. రెడ్లు చేసినటువంటి పనులు ఎవరు చేశారు? "అనుమానం అక్కర్లా. కనిపిస్తే మంచి చెడు అని చూడకుండా కవి అంటేనూ బ్రాహ్మడంటేనూ దానధర్మాలు చేసేశారు. మామూలుగా కాదు 'మా

తమ్ముండు ఘనుండు మల్ల రథినీనాథుండు మిమ్మా తతశ్రీతోడన్ సముపేతు జేసి...' ప్రపంచంలో నన్నయ గొప్ప వాడంటారు. తిక్కన గొప్పవాడంటారు, కాని చారిత్రకంగా ఎఱ్ఱనగారు అంతకంటే గొప్పవారు. ఆయన చాల మహావిప్లవాలు, వేలు విప్లవాలు జరిగిన రోజుల్లో ఉన్నాడు. "ఆయన 1923లో చెప్పాడు. ఆయన వయస్సు 23 ఏళ్లు అయి ఉంటాయి. చూడండిలిటువంటిదాంట్లో తీసుకి వచ్చాదో" అని చెప్తే నిజమేనండీ అని మేమందరం అంగీకరించాం. నేనన్నాను. "ఇది గతించిన ప్రభుత్వాలకి పెట్టామండీ, ఇంకా రెడ్డి ప్రభుత్వం సాగుతూనే ఉంది, మీది అయిపోయింతర్వాత తప్పకుండా పెడతాం రెడ్డిద్వార"మని. "You mischievons fellow ఏంటోయ్ ఇట్లా మాట్లాడావ్" ఆయన నవ్వాడు. అక్కడాయనకు నేను స్వాగతం చెప్పాలికదండీ.

> అందము చందముల్ తెలిసినట్టి కనులవంచు నిల్చి నీ
> ముందర కుల్కుచున్ మధురమోహన శిల్ప కళా విదగ్ధతల్
> చిందుచు కావ్యకన్య కలనిత్తురు నీ తొలిపల్కులే రసా
> నందపు గీటురాళ్లు అధునాతన వాఙ్మయ శిల్పసీమలో

- అని పద్యం చెబితే "సరే పోనీలేరా నా దగ్గరకు వచ్చినవాళ్లూ ఇచ్చినది కావ్యకన్యకలే కదా" అన్నాడు. ఏమండోయ్ మీరు కావ్య కన్యకలు అని చెప్పి మీరు అది రూపకసమాసమంటున్నారు. కాదు - అది ద్వంద్వ సమాసం - కావ్యములు, కన్యకలు కూడా అన్నాను. ఆయనకు కోపం వచ్చిందనుకున్నా. కానీ చాల మందితో చెప్పారు. చూడ్డండి మీరు ఈ ఆచార్లు ఎట్లా అన్నాడో నన్ను - అని పదిసార్లు చెప్పించుకునే వాడు. అది ఆయనకు ఇష్టమన్నమాట. అది నాకు తెలియదు. ఆయన దగ్గరకు వెళ్లి కూర్చుంటే ఆయన నాకవిత్వానికి బ్రహ్మాండమయినటువంటి ప్రభావం వహించాడు.

'శీర్ల మేఖల' పానకంలా ఉందోయ్ అన్నాడు. తీరా వెళితే ఏమిటోయ్ అంతా పులిమేశావ్ అంతా సంస్కృతం. ఛ ఛ అదేం కవిత్వం అన్నాడు. సభలో చాలా బాగారాశావోయ్ అన్నాడు. అసలు కర్ణుడు అంటే రెండు వందల పద్యాలు రాయాలి, దుర్యోధనుడు అంటే రెండు వందల పద్యాలు రాయాలి. అనవసరమయి పోయింది, హాయిగా రాసేశాడు అని చెప్పి సభలో చెప్పాడు. కర్ణుడు భానుమతి

చదరంగం ఆడుతూ ఉంటే దుర్యోధనుడు వచ్చాడు. భర్త వచ్చాడని భానుమతి లేచింది. ఓడిపోతున్నానని లేచి వెళ్లిపోతున్నదేమోనని కర్ణుడు ఆమె కొంగు పట్టుకున్నాడు. '... నీ చేత కాంచనమేఖలై...' ఎదురుగుండా వచ్చి నిలబడింది దుర్యోధనుడు.

కట్టెదుటన నున్న కౌరవాధీశ్వరు
ప్రాణమిత్రునిమోముఅరయలేక
సంధించి విడిచిన కురుపట్టమహిషి
అవస్థ యూహింపలేక
అందందుపడిపోయి చెదరిన
మణులేర చేయిరాక
ఏమి ఎఱుంగక యింతలు సలిపిన
తను గూర్చి తనకె అర్థమ్ముకాక
కనకతల్పము జారిన కర్ణు హృదయ
మందు విద్యుల్లతా రోచి అశనిపాత
మగ్ని పర్వతజృంభణ మబ్ధిఘోష
ధరణి కంపమునేకమై తాండంచె

ఇదిగో ఇక్కడ బాగుంది. కడమదంతా బాగోలేదన్నాడు. అంటే నాకు చాలా కోపం వచ్చి ఏమిటండీ ఏం చేయాలి అంటే 'అలతి అలతి మాటల' "నన్నెఱుగుదు, ఎదిరి నెఱుగుదు అర్థసిద్ధి నెఱి ఎఱుగుదు వాక్యముల పద్ధతి ఎఱుగుతు" ఇట్లా చెప్పాలి, ఊరికే పులుముతావేంటి? 'కడవెనుకింక నీ కవిత కాంచనమేఖలై ఝుళంఝుళన్మణిమయ శింజినీఝుళత్' ఇట్లా కాలకీ వేలికీ ముడివేసి పులుముతావేమిటోయ్ అంటే నేనేం చేయగలను? అదేమిటండీ అట్లా అంటారు దానికి మూలం నన్నయ - అనేటప్పటికి 'మీ గోదావరి వాళ్లకి తెలుగెప్పుడొచ్చు' అన్నాడు. 'ప్రాచీనులందరినీ సంస్కృతం పాడుచేసింది. నవీనులందర్నీ ఇంగ్లీషు పాడుచేసింది. మీ గోదావరి వాళ్ళకు తెలుగు రాదు' అన్నాడు. అంటే నాకు చాలా బాధ వేసింది. నన్నయ

చారు సువర్ణహాసి నవచంపక భూషయు సింధువారము
క్రారమణీయయున్ వకుళదా వతంసయునై అపూర్వశృం
గారవిలాస లీల యెసగన్ తనముందటనున్న మాద్రి అం
భోరుహనేత్రజూచి కురుపుంగవుడంగజరాగమత్తుడై

- అని చెప్పి అంతా సంస్కృతం పులిమాడన్నాడు. అనేటప్పటికి నాకు చాలా కోపం వచ్చి "ఏమండీ మీ తిక్కన అంటే" నాకు తిక్కన అంటే చాలా అభిమానం, అయినా కోపం వచ్చి మాటమీద "మా వూరు ఏమనుకుంటున్నారండీ ఆరువందల అడుగులు డ్రిల్లు చేస్తే గులకరాయి దొరకదు. ఏమనుకుంటున్నారు మీరు అనేటప్పటికి ఆయనేమన్నాడు. "That is why there is agriculture in your sircars and there is culture in our land" అన్నాడు. అనేటప్పటికి ఏంచేసేది ? ఓడిపోయి ఆయనీ మాటనేప్పటికి నా క్కోపం వచ్చి "మీ తిక్కనగారు మటుకు సంస్కృతం వాడలేదా, పులమలేదా" అన్నాను. చూడండి కీచకుణ్ణి తిడుతూ ఆ ద్రౌపది ఏమంది -

'దుర్వారోద్యమ బాహువిక్రమరసాస్తోక ప్రతాపస్ఫుర
ద్గర్వాంధప్రతివీర ... కీచకా'

- అంటే "చదువు మళ్లీ చదువు" అన్నాడు. మళ్లీ వేగంగా చదివాను. చదివితే "ఆహా ద్రైపదీ! నీ ఊపిరితిత్తులు ఎంతబలమైనవి" కోపం వచ్చిన మాట నిజమే కాని ఆయన మనసులో బాగా బాగు నాటుకు పోయింది. మరి ఆయన చచ్చిపోయి ఏ లోకంలోఉన్నాడో తెలియదు. తరువాత నేను రాసిన పద్యాల్లో -

'నీ లిక నిల్చియుండెదవు నిత్యవసంత' హసమ్మకీ చిరం జీవినివై...'

అని రాశాను. భీమవరంలో ఉన్నప్పుడు రోజూ మా యింట్లో కవితా పఠనం జరిగేది. మా యింటికి కవితా ప్రభాస అని పేరు.

ఇది కవితాప్రభాస వసుధైక కుటుంబి కవీంద్ర సాహితీ
సదనము కావ్యశిల్పమయ శబ్దతపోవటశాల ఆర్ద్రసా
హృద సుకుమారభావుకుల కెల్లరకు రసరాజధానితె
ల్గుదనపు సోయగమ్ములు వెలుంగుత యింక జగద్ధితంబుగా

అజ్ఞానానికీ, గర్వానికీ ఇక అంతేమిటి చెప్పండి. నేను ఆ విధంగా పద్యాలు రాస్తే శుభ్రంగా వచ్చి చదివేవారా పద్యం. ఇంకోటేమిటంటే..

స్వాగతముమీకు అతిథివ స్వాగతమ్ము
సహృదయ సుకవులకును సుస్వాగతమ్ము
నిజము సాప్త పదీనమ్ము స్నేహమరయ
ప్రణయ విజితులందరుశత్రువులైన రండి

అని ఆ విధంగా పిలిస్తే అందరూ వచ్చేవారు. నాకు కొంతమంది పుస్తకాలు అంకితమిచ్చారు, కేశవపంతుల వీరభద్రాచారి, ఉషశ్రీ మొదలగువారు. వీరందరూ కూడా మా కవితా ప్రభాసలో తొడిగిన మొగ్గలు. అయితే తర్వాత నా జీవితాన్ని నేను మూడు దశలుగా విభజిస్తాను. మొదటి దశ 1940 నుండి 51 దాకా భీమవరంలో. అనంతపురంలో 1951 నుండి. అందాకా లెక్చరర్‌గా ఉన్నాను. తర్వాత ప్రిన్సిపాలయ్యాననుకోండి. మొదటి దశ ఏమిటంటే తీరిక లేని కోరిక. ఇది చేద్దాం, అది చేద్దాం అని చెప్పి. రెండో దశ - కోరికే లేని తీరిక, అనంతపురంలో. తర్వాత ప్రిన్సిపాల్ అయింతర్వాత అటుకోరికా లేదు, తీరికా లేదు కాలప్రవాహంలో వెళ్లిపోయాననుకోండి. అప్పుడు రాసిన రచనల్ని గుర్తు చేసుకున్నాను. సంస్కృత సమాసాలంటే నాకు చాల ఇష్టం. సంస్కృతం అంటే చాలా గొప్పదని.

సరసకవితయన్న సంగీతకళయన్న
వ్యంగ్యమన్నలలిత హాస్యమన్న
అవని విముఖులున్న అదియ వానికి శిక్ష
వేరు శిక్ష యింక వేయనేల

మింటి చుక్కలలర మిరుమిట్లతో వెలిగి
చివర తుస్సుమనును చిచ్చుబుడ్డి
ఆంధ్రులెల్లనట్టి యారంభ శూరులే
రమ్యహాసలోల రామకృష్ణ

విషయ సంకలనము విజ్ఞానమా - కాదు
ఇటుక ఆముపేరు ఇల్లువేరు

అస్థి పంజరమ్ము అసలు దేహము కాదు
ప్రత్తి వేరు నేతబట్టవేరు

ఈ పద్యాన్ని నాగభైరవకోటేశ్వరరావుగారు శిలా ఫలకం మీద చెక్కించి పెట్టుకున్నారు.

నేను అధికారభాషా సంఘం అధ్యక్షుడుగా ఉన్నపుడు ఏదో మాట్లాడుతూ ఉంటే ఐ.ఏ.ఎస్. ఆఫీసర్లంతా 'ఏమండీ ఇంత ఘాటుగా మాట్లాడుతున్నారు' అనంటే, నేను గనక ప్రెసిడెంట్ ఆఫ్ ఇండియా అయితే మాట్లాడను, ఆంధ్రప్రదేశ్ గవర్నర్‌నయితే మాట్లాడను, కాని ఏదో ఈ పాత్ర వహించాను కదా.

ఇష్టమయిన పాత్ర ఇహనాటకమునందు
ఎవరు వేయగలరు ఎన్నడయిన
కుదురుకొన్న ఎడల కుక్కపాత్రను వేయ
మొరగవలయు మరియు కరవవలయు - అన్నాను.

ఇక మూడవదశ. బతుకు అనే మాట ఉందనుకోండి

అర్థమేమి బ్రతుకుకా భాస జగతిలో
తెరకు వెనుకనెవరా దరువుపాడి
తప్పుతాళమునకు తైతక్కలాడించు
తోలుబొమ్మలాట తుట్టతుదకు

ఆక్రందనములక ధ్యాహార సంతృప్తి
వేడినిట్టూర్పుకా మ్రేడితంబు
వికటనాటకధారణకు ప్రతిచ్ఛందమ్ము
అభినయమునక అభిధాంతరమ్ము

కలవరించు అపశ్రుతులక నుప్రాసము
జాడ్య జర్జర జుగుప్సలకు వీప్స
ఆశాపిశాచనృత్యములకు అనుభాష
భ్రమకు వేదాంత పర్యాయ పదము

బ్రతుకు వెలుగునీడ పడుగుపేకలమేడ
నవరస రుచిరమగ్రు నాట్యకేళి

మెదడు మెలిచిపెట్టు చదరంగ రంగేళి
పూవు తేనె కాదు. తావికాదు.

గుండె గుడిసెలోన పోతన్న భక్తుడై
మేడలందు లేని మేటి తృప్తి
మేడ గుడిసెలోని మేధావి తిక్కన్న
మనసులోన కలిసి మసలినాడు
గొప్పవారలెవరు చెప్పుడిర్వురిలోన
ఒప్పు గొప్పదనము ఉభయులందు
గొప్పదనముతోచు కోటిరూపములెత్తి
మేడనైన మురికివాడనైన

ఓ రోజు ఖద్దరు మూట గట్టుకొని కార్లో పెట్టుకొని కాలవ వస్తే ఆ కాలవ దగ్గర ఆపేసి, ఆ కాలవలో ఎంతనీరుంటుందో తెలీదు, ఒకొక్కప్పుడు తడిసిపోయినటువంటి ఆ డ్రాయరు కూడా ఆరేసుకొని ఆ ఖద్దరు అమ్మేవాళ్లం. అప్పుడు చాలా హృదయపూర్వకంగా నమ్మిందేమిటంటే వైష్ణవ జన్మ ఎత్తాను కాని నిలువుబొట్టు పెట్టుకుంటేనే స్వర్గానికి వెడతాను. అడ్డబొట్టు పెట్టుకుంటే నరకానికి వెడతాను అనుకోలా. అయితే ఆనాడు నమ్మిందేమిటంటే ఖద్దరు కడితేనే వాడు దేశభక్తుడు లేకపోతే వాడు కాదు. తరువాత నేను నేర్చుకున్న దేమిటంటే ఖద్దరు కట్టేవాళ్లలో కూడా కొందరు నరకానికి పోవచ్చు, ఖద్దరు కట్టనటువంటి వాళ్లు కూడా కొందరు స్వర్గానికి వెళతారు అని నమ్ముతాను. నేను బ్రిటీషు సామ్రాజ్యం మీద రవి అస్తమించని బ్రిటీషు సామ్రాజ్యం మీద తిరగబడి అపుడు కనుచూపు మేరలో స్వరాజ్యం లేదండీ, ఎందుకు నువ్వు జైలు కెళ్లావంటే రవి అస్తమించని సామ్రాజ్యంమీద మా తిరుగుబాటు చూపించాం చాలు. తరువాత నాకేమనిపిస్తున్న దంటే బ్రిటీషువాళ్లు మన దేశన్నేలారు రెండువందల సంవత్సరాలు. ఎంతో కష్టపడ్డాం. దాంట్లో అనుమానమేమీ లేదు. కొంత లాభం కూడా ఉంది. మనం ఎంతో అదృష్టం చేసుకున్నాం. కాబట్టి బ్రిటీషువాళ్లు మనల్ని పరిపాలించారు. ఇప్పుడు ఒక ఆర్నెల్లయినా వాళ్లు పరిపాలిస్తే ఎంత బాగుండేదో. వాళ్ల క్రమశిక్షణ కూడా. నేను ఒకానొకప్పుడు దేశభక్తుడ్ని. ఇంకో మాట చెప్తాను. తాగేవాళ్లని చూస్తే నాకు

పరమ అసహ్యం వేసేది. కాని ఇప్పుడు చూస్తే తాగే వాళ్లలో కూడా మహాను భావులున్నారు, మంచివాళ్లున్నారు, తాగేవాళ్లుకూడా స్వర్గానికి వెళ్లవచ్చు.

ఆడదానికంటె అధికారమునకంటె
ఎదకు అంటనట్టి చదువుకంటె
మద్యపానమందు మత్తేమి కలదయా
రమ్యహాసలోలరామకృష్ణ

- అని రాశాను. అందుకని మార్పు ఈ పరిణతి అనేది నాలో వచ్చేటప్పటికి ఇది వరకేమో పెద్ద పెద్ద సమాసాలు అనేవాణ్ణి. ఇపుడు నూత్నయుగోదయం అనాలంటే కొత్త పొద్దుపొడుపు అని అంటాను. ఈ విధంగానేమో నాలో చాలా మార్పులు వచ్చాయి. మా శిష్యులందరూ మా గురువుగారు చచ్చిపోయారండీ అంటున్నారు. కాని నేను చచ్చిపోలేదనీ, నేనివాళ నిజంగా కోరుకొనేదేమిటంటే భారతదేశం కాదు, ఇండిపెండెన్స్కాదు. సకల మానవ శాసన పరిషత్తు Parliament of men and the federation of Nations. ఈ అవశ్యభవితవ్యం వస్తుంది. దాని కోసమే ప్రయత్నం చేయాలి కాని, నేను భారతీయుణ్ణి అనుకోలేదు. నేను వసుధైక పౌరుణ్ణి. యిప్పటికీ నాలో ఇదివరకుండేటటువంటి మార్పులు ఈ పవిత్ర భారతదేశంలో ఈ పవిత్రగంగానదిని అనుకుంటున్నాను. ఇప్పుడు థేమ్స్ అంత పవిత్రమైనదే, యాంగ్ట్సీ అంత పవిత్రమైందే, నైలు అంత పవిత్రమైందే. ఏమిటి - బుద్ధిహీనులు ఇలా అనుకుంటుంటే ఏం చేయగలం.

దేవుడిప్పుడెచట జీవించిలేడయా
చాలనాళ్లక్రితమె చచ్చిపోయె
ఆలయాలు కట్టిరస్థికలను చేర్చి
బుద్ధిహీనులయిన పూర్వ జనులు

అంటే నేను నిరీశ్వరవాదినికాదు. ఆస్తికుణ్ణి. అయితే ఏ మతమూ గీతమూ లేనటువంటి మనిషిని నేను. ఇంకా అస్తికుణ్ణిగా ఉన్నందుకు ఎంతో సంతోషిస్తున్నాను.

బాలాంత్రపు రజనీకాంతరావు

(15-6-1995)

నమోవిశ్వస్యగురవే, గురవేజన్మనస్తథా
కవితాయా గురూవందే, వేంకటాపార్వతీశ్వరౌ॥

ఏకాంతసేవలో నిజ
లోకేశాయత్త భక్తి లోలత్వంబున్
నాకందిచ్చిన నవకవి
తా కులపతియుగళ కావ్యధార వరింతున్॥

నా తొలికవితా గురువు లైన శ్రీ వేంకటపార్వతీశ్వరకవుల భావసంకీర్తనము అనే గునుగు సీసాల శతకంలోని ఒక పద్యంలోని భావం నా పై పరపిన ప్రభావంతో నేనొక ప్రార్థనా గీతం రచించాను.

"నీయిచ్ఛలేకున్న నీగోరిచేయు కార్యంబు లన్నియువినాశంబులగును నీ యనుగ్రహమున్న నిర్ని మిత్తంబుగా కోరని వెల్లచేకూరుచుండు!"

నే చేయునదీ నే చేయనిదీ సాధించునదీ ఫలియించనిదీ
నీ యిచ్ఛ లేక జరుగదటా, నా స్వేచ్ఛ మొదలు తుది యెచట!
నిను చూచుటకే రప్పించితివీ, నీ దరిసెనమే యిప్పించితివీ,
ఈ నోట పాటపాడించితివీ, ఇది యెవరి రచన యని అడిగితివీ ॥

నీ భావనమే నా జీవనమై, నీ ప్రణయమ్మే నాకవనమ్మై
నా అహపుటంచు చెరిపి, చెదవో, నాఇహము పరము గావించెదవో॥

నాదామృతమే పరసాధనగా, నీ దివ్యవాక్కే ఉద్బోధనగా
రారజని కాంతులొలయించెదవో, విశ్వజనహితము వెలయించెదవో॥

"గణానాంత్వా గణపతిం హవామహే" అనే వేదమంత్రం నాకు స్వప్నంలో తనంతట తాను ఉద్బుద్ధమయింది. కవీ, గాయకుడూ అయిన రజని జన గణపతికి

హెూమం యే విధంగా చేస్తాడో ఒక గేయంలో - హంసధ్వని రాగంలో నిబద్ధం చేశాను.

గాత్ర సనాతన మంటపమ్ములో
చిత్రీకృత సర్వరంగవల్లిక
నాభికేంద్ర ప్రజ్వలత్ కుండమున
హృదయ పాత్రలో కంఠదర్వితో । హెూమమునీకే గణాధిపా।
ఏకం ద్వే త్రీణి చత్వారి యని భావరాగ లయ భాషాయుతమౌ
అస్మత్కృత గేయాజ్యధారతో, రసనాగ్రప్రస్ఫురత్ జ్వాలలో॥
అహంకార హరిత పత్రదళములు
అవమానాశ్రుకవిత తోయమ్ములు
మొగ్గలైమిగులు కోర్కెల పూవులు
నెగ్గెడు పందెమ్ముల సత్ఫలములు॥
స్వప్న దర్శిత విరాడ్ఘనమూర్తీ
విశ్వేశ్వర భువన భవనమూర్తీ
గౌరీజననీ నయనానందా
దూరీకృత సకల వ్యసన కందా॥

వేంకటపార్వతీశ్వరుల మొదటి స్వతంత్రనవల - వసుమతీ వసంతం. ఇది చారిత్రికము (1911) రెండవది ప్రమదావనం. ఇదీ చారిత్రికమే. మూడవది మాతృమందిరం - ఇది సాంఘికం- నేను జన్మించిన 1920 వ సం॥రంలో నాపుట్టుకకి ఆరు నెల్ల తరువాత మాతృమందిరం వెలువడింది. ఎందుకో నాకు తెలీదు; తెలుగు నవలా పరిణామ విమర్శకులు మాతృమందిరానికి ఇయ్యవలసిన ప్రథమ గణ్యతను ఇయ్యేరు. ఆంధ్ర భాషాచార్యులలో మాతృమందిరం గణ్యతను గుర్తించిన వారు ఆచార్య శ్రీమతి నాయని కృష్ణకుమారి ఒక్కరే. ఇందులో మాతృమందిరము అనే శీర్షికను ప్రారంభఖండాలలో ఒక ఖండ కావ్యం ఉంది. దాని రచన తేదీ 10 ఏప్రిల్ 1920 అని - 1924 లో పద్య సంకలనంగా ప్రచురితమైన కావ్యకుసుమావళిలో ఉంది.

"తల్లి నిన్ను దలంచి ధర్మంబు దలచి, కష్టంబు సుఖములో గడపివచ్చితిమి,
చౌర్య వృత్తి చరింప జాలగాలేక, ఆకలి తృప్తిలో అడచి వచ్చితిమి,
పరుషభాషణములు పలుకగా లేక, క్రోధంబు శాంతిలో గూర్చి వచ్చితిమి,
దయతప్పి రక్త పాతము చేయలేక, వైరంబు మైత్రిలో వదలి వచ్చితిమి,
ఆశాప్రలోభాప్తినల్లాడకలేక, మమతను సమతలో మడపి వచ్చితిమి,
జయసుధామయసూక్తి, జయదివ్య శక్తి,
జయసర్వజనయిత్రి జయజగద్ధాత్రి,

గాంధీ మహాత్ముని శంఖారావానికి కొంచెం ఇంచుమించు ముందు మా గురువులైన జంటకవులు శాంతి సమర, సమతాభావాలను బోధించారు. అంతేకాదు దొంగరంగడు అనే రాబిన్ హుడ్‌వంటి ధర్మదొంగ సామాన్యజనంలో చేసే ప్రబోధం ఏమిటి ?

"ఒకని ముట్టుట దోష మొండొకని చెంత - నొలసియుండుట దోష మొండొకనితోడ
మాటలాడుటే దోషమిదేటిమాట - హరిహరీ ఏక గర్భజులైన మనకు !
"కలిమిగలవారు లేని వారలకు మగలు, లేని వారలు కలవారి లెంకలనుచు
తలచివర్తించు చున్నంతదనుక మనకు, పాపని ష్కృతిలేదయ్య భ్రాతలార!
"కలిమి లేముల భేదముల్ కొలది గొప్ప భేదములు జాతి భేద వివాదములును
తలపవలదయ్య సర్వసౌదర్య స్రౌభ్రాత్ర దృష్టి, అక్షులంగూర్పు ఢయ్య మాయన్నలార!

"ఏక ఫలభోగకాంక్షచే నెట్లు పక్షు, లేక వృక్షాశ్రయంబుననెసగునట్లె
యేక ఫలకాంక్షచే మనమేకదేశ, మాత గొలువంగ వలెనయ్య భ్రాతలార!

ఈ దొంగ రంగని సామ్యవాదోపదేశాలు - 1920 జూలైలోనే మాతృ మందిరంలో వచ్చాయి. నవలా చరిత్ర విమర్శకులయిన ఆచార్యులు ఆ ప్రథమ తాంబూలాన్ని ఉన్నవ వారి మాలపల్లి నవలలోని ధర్మదొంగ పాత్ర తక్కెళ్ళ జగ్గడికి అందజేసి, మాతృమందిరాన్ని తలపనైనా తలవక పోవడం నాకు చింత కలిగిస్తుంది.

నా రేడియో మాధ్యమజీవితంలో రెండు నవలలూ సీరియల్సుగా ప్రసారం అయినప్పుడు నేనే నేపథ్య సంగీత నిర్వహణ చేశాను.

ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఎమ్.ఏ. చదువుతుండగా అప్పటిమా కులపతి - డా॥ సి.ఆర్. రెడ్డి గారి కోరికపైన తెలుగు తల్లి పైనిపాట వ్రాసి విద్యార్థులచే బృందగానం పాడించినప్పుడు -నామొదటి దేశభక్తి గేయగానంలో మాకులపతి కూడా గొంతుకలిపి నందుకు గర్విస్తూ ంటాను. ఆ తర్వాత, పాలువాయి భానుమతి గారు నేను కలిసి హెచ్. యమ్. వి లో రికార్డు చేశాం. 1938 లోనే 'పోయిన స్వర్గం' అనే శీర్షికను సప్తద్వీపాలూ ఏలిన మన షట్చక్రవర్తులేలిన ఆనాటి ఘనత కోల్పోయిన భారతజాతిని ప్రబోధించే గేయం కృష్ణాపత్రికలో అచ్చయింది.

1920 జనవరిలో నేను జన్మించిననాటికి 'తల్లి వేరు'గా వారసత్వాన నాకు సంగీతాంశను అందించిన మా పితామహుడు బాలాంత్రపు వేంకటనరసింహంగారు నాపుట్టుకకి ఒకటి రెండు ఏళ్ళు ముందుగానే సన్యసించి అపరనారాయణతీర్థులై సిద్ధిపొందారు. ఆయన దగ్గర తరంగాలూ, సుబ్రహ్మణ్య కవి అధ్యాత్మరామాయణ కీర్తనలూ నేర్చుకొన్న వారిద్వారా ఛాయామాత్రంగానే నేను వినగలిగాను. అటు వంటి వారిలో మా చిన్నమ్మ ఒకామె.

మా చిన్నమ్మ వంకాయలపాటి రాజమ్మగారు తరంగాలూ, అధ్యాత్మ కీర్తనలూ, వందల కొద్దీ స్త్రీలపాటలూ మంగళ హారతులూ పాడేది. నా రెండు మూడేళ్ళ వయస్సులోనే మా నాన్న గారు కాకినాడలో ఉండేప్పుడే ఆవిడ నన్ను పిఠాపురం తీసుకొచ్చి పెంచింది. మంచి హస్తకళా కౌశలంగల పనిమంతురాలు. పెళ్లి కూతుళ్ళ జడలూ, భాగోతంలోని సత్యభామజడా, పెళ్ళిపల్లకీ అలంకారాలూ చేసేది. పిఠాపురంలో పేరుకెక్కిన భామాకలాపం నర్తకీమణి - పెండ్యాల సత్యభామను నేను చిన్నతనంలో మాచిన్నమ్మ గారింట్లోనే చూశాను. పిఠాపురంలోని కుక్కుటేశ్వర స్వామి, కుంతీ మాధవుడూ, కొత్తపేటలో కుమారస్వామి - ఈ స్వాముల ఉత్సవాలలో ఆమె భామ వేషాన్ని వేసి, తెల్ల వార్లూ భాగవత ప్రదర్శన చేసి, తెల్లవారేక, వేషం విప్పకుండానే, హంగుదార్లతో సహా ఊర్లోని పెద్దల ఇళ్ళకి వచ్చి, ఆయా పెద్దల కచ్చేరీ సావడిలో ఒక్కటి రెండు దరువులు అభినయం పట్టి,

బహుమతులు పుచ్చుకొని వెళ్ళేది. 1948 ప్రాంతంలో ఈ భామ మద్రాసు వచ్చినప్పుడు నేను రేడియోలో నిలదొక్కుకుని ఉన్నప్పుడు, మద్రాసు రెడియో కేంద్రంలో ఆవిడ గారి కలాపం పాటను డిస్కుపై రికార్డు చేయించాను. నా ఆంధ్ర వాగ్గేయకారచరిత్రలో సిద్ధేంద్రుడి గురించిన ప్రకరణంలో ఈవిడ ప్రశంస తెచ్చాను.

నాలోని సంగీతగవాక్షాలు తెరుచుకున్నాయి అన్న సంగతిని తెలుసుకున్న మా మేనమామ దుగ్గిరాల పళ్లంరాజు, మా పెద్ద తల్లి కొడుకు హనుమంతరావు తెలుగు పద్యాలను రాగాలలో పాదగడం నేర్పి, ఒక్కొక్క రాగానికి ఒక్కొక్క పద్యాన్ని వినిపించి అనిపించేవారు.

మానాన్న గారు పిఠాపురం కొత్తపేటలో కొనుక్కున్న మాయింట్లో ముందు వాకిళ్ళలో ఆంధ్రప్రచారిణి కార్యాలయమూ బైండింగ్ శాఖా ఉండేవి. కోట వారి వీధిని విమర్శాదర్శక నడకుదుటి వీరరాజుగారి విద్వజ్జనమనో రంజనీ ముద్రాక్షర శాలలో ఆంధ్ర ప్రచారిణీ నవలలూ జంటకవుల కవితలూ అచ్చవుతూ ఫారాలు మా యింటికి వచ్చేవి. కోట వారి వీధిలో నడకుదుటి వీరరాజుగారింటికి గాని మాయింటికి గాని ఎందరో కవి పండిత ప్రకాండులు వచ్చి, మకాం చేసి, సాహిత్యచర్చలు చేస్తూండేవారు. టేకుమళ్ల రాజగోపాలరావుగారు, డాక్టర్ చిలుకూరి నారాయణరావు గారు, కాళ్లకూరి గోపాలరావుగారు - వారి మేనమామ విమర్శాదర్శక నడకుదుటి వీరరాజు పంతులు గారు - వీరందరికీ నడుమ వేంకటపార్వతీశ్వర కవులు సరేసరి.

పిఠాపురం హైస్కూలులో మా తెలుగు గురువర్యులు ఉపాధ్యాయుల వేంకటేశ్వరశాస్త్రి అనే చిత్రాడశాస్త్రులుగారూ, చీమలకొండ అద్వైత పరబ్రహ్మశాస్త్రి గారు, మహాభారత చరిత్ర విమర్శకర్త పెండ్యాల వెంకటసుబ్రహ్మణ్యశాస్త్రి గారూ నా చేత తరచు తెలుగు పద్యాలను వేరువేరు రాగాలలో పాడించి మెచ్చుకునేవారు.

నాచిన్నతనంలో - పుస్తకపఠనమూ, పత్రికాపఠనమూ అంటే చాలా అపేక్షగా ఉండేది. భారతీ, కృష్ణాపత్రికా, ఆంధ్రపత్రిక (దినపత్రికా) వీటిలోని సారస్వతానుబంధాలూ, తమాషాలూ, హాస్య ప్రసంగాలూ నాటికలూ చదవడానికి

మా అన్నదమ్ములం ఒకరితో ఒకరం పోటీపడేవారం. సూర్యారాయ విద్యానంద పుస్తక భాండాగారంలోని నాటకాలూ, డిటెక్టివ్ నవలలూ, సాంఘిక నవలలూ శ్రద్ధగా చదివేవాణ్ణి.

మానాన్న గారి తమ్ముడు బాలాంత్రపు సూర్యనారాయణ రావుగారూ, ఆయన రెండవ భార్యా, 1922 లో మా అమ్మగారు పోయిన ప్పటి నుంచీ మానాన్న గారితోనే ఉమ్మడికుటుంబంలో ఉండిపోయారు. ఆయన మా సూరిబాబు కలకత్తాలో 1912 ప్రాంతాన ఆముందు వెనక సంవత్సరాలలోను పొలిటికల్ ఎకానమీతోను, ఫిలాసఫీతోను డబుల్ ఎమ్.ఏ. చేసి, ఇంట్లో ఉండిపోయారు - ఏ ఉద్యోగంలోను చేరకుండాను. కలకత్తానుంచి - బెంగాలీ సాహిత్యంలో బంకించంద్రుడివీ, రవీంద్రనాధఠాకూర్వీ, శరచ్చంద్రుడివీ, పాంచకడేదేవ్వీ నవలలూ, బంగాలీ లిపిలో అచ్చయిన బ్రహ్మ , వాయు, అగ్ని మొదలైన (సంస్కృత) పురాణాలూ, బృహత్పరాశరి వంటి జ్యోతిష గ్రంథాలూ - ఆంధ్ర ప్రచారిణికీ, మానాన్న గారికీ పంపించడానికి సహాయపడినారు. మోడరన్ రివ్యూ అనే ఇంగ్లీషు మాసపత్రికా, ప్రబాసి అనే బెంగాలీ మాస పత్రికా, ఒకటి రెండేళ్ళ సంచికలు మా మేడమీద లైబ్రేరీలో ఉండేవి.

బెంగాలీ నిఘంటువు ద్వారా అక్షరాలు నేర్చేసుకుని తెలుగు అనువాద గ్రంథం సహాయంతో - బెంగాలీ మూల గ్రంధాల్ని ముందు శీర్షికలనీ తరవాత కవితలనీ, సంస్కృత పురాణలనీ బంగలిపిలోని సంస్కృత జ్యోతిష గ్రంథాలను చదువుకోడం నా 12,14 ఏళ్ల నడుమ ప్రారంభించాను.

మామేనత్త కొడుకు బుద్ధవరపు రాగరాజామాత్యుడు నాకు పదవ యేట - యమాతారాజభానసలగా' సూత్రం నేర్పాడు. ఆ తర్వాత అనంతుడి ఛందమూ అప్పకవీయమూ, కవిజనాశ్రయమూనూ.

పిఠాపురం సంస్థానంలో ప్రసిద్ధి కెక్కిన ఆస్థాన వైణికులు తుమురాడ సంగమేశ్వర శాస్త్రిగారు నా 11వ యేటనే మృతి చెందారు. వారి శిష్యులలో ఒకరయిన మండా కృష్ణమూర్తి గారి వద్ద నేను ఒకటి రెండు ఏళ్ళు సంగీతం నేర్చుకున్నాను - వర్ణాల దాకా. నాకు సుస్తీ చెయ్యడం చేత ఆ సంగీతాభ్యాసం సాగలేదు.

అయిదవ ఫారం రాగానే - స్కూల్ ఫైనల్ సంవత్సరం నా చేత గుంటూరులో చేయించడానికనీ, అక్కడ మా పెద్ద నాన్న గారైన బాలాంత్రపు వేంకటసుబ్బారావు గారికి సన్నిహితుడూ, గురుభాయీ (ఏకగురుశిష్యుడు) వింజమూరి వరదరాజయ్యంగారి సంగీత గురువూ అయిన పిరాట్ల శంకరశాస్త్రి గారి వద్ద నా చేత శుశ్రూష చేయించడానికీ నన్ను వేసంగులలోనే గుంటూరు పంపారు 1934లో. అక్కడ నాకు మానసికంగా ఒప్పుదలకుదరక, నాడు అక్కడిటౌన్ హైస్కూలు చదువు వదిలి, పిఠాపురమే వచ్చేసి, పిఠాపురం హైస్కూలు లోనే (ఎస్.ఎస్.ఎల్.సి) 1935 వేసవుల్లో పూర్తి చేశాను. ఇక్కడ సంగీతపు పోటీలలో ప్రథమ బహుమతీ, సక్కుబాయి, విప్రనారాయణ నాటకాలలో శివయోగీ, విప్రనారాయణ పాత్రలూ, రామదాసు నాటకంలో కబీరు పాత్రా (హిందీపాటలు పాడడం) నాకెంతో ఆత్మవిశ్వాసం కలిగించాయి. ఆ నాటకాలలో హార్మనీ వాయిస్తూ బద్దికలిచ్చే గురువు చలపాక సత్యనారాయణ కాకినాడ యంగ్మెన్స్ హాపీక్లబ్ నటుడు.

1935-37 సంవత్సరాల నడుమ కాకినాడ - పిఠాపురం రాజావారి కళాశాలలో ఇంటర్ మీడియట్ చదువు. పెద్దాడరామస్వామిగారు ప్రిన్సిపాల్. కోపల్లె శివకామేశ్వర రావుగారూ, ఈ యుణ్ణి వీరరాఘవాచార్యులుగారూ, ఉపాధ్యాయుల సత్యనారాయణశాస్త్రి గారు తెలుగు సంస్కృతాచార్యులు. దేవుల పల్లి కృష్ణశాస్త్రిగారు ట్యూటరూ సాంస్కృతిక కార్యక్రమ నిర్వాహకుడూనూ. విద్యార్థులను చేరదీసి, బృందగానాలను నాటకాలను నిర్వహించే వారు. నా స్వతంత్ర గేయాలు రావడం ఆరంభించాయి. ఆయన మేనల్లుడు ప్రభాకరం - వింజమూరి నరసింహారావుగారి కుమారుడు - నాకు పరమమిత్రుడూ ఒకయేడాది సీనియరు. మా అన్నయ్యా నళినీ, అనార్కలీ పాత్రకి ప్రసిద్ధి పొందిన బాలబంధు బి.వి. నరసింహారావూ బి.ఏ. జూనియర్.

మొదటి సంవత్సరం కళాశాల కర్ణాటక సంగీతపు పోటీలో కర్నల్ శంకరశాస్త్రి సతీమణి శాంతా శంకర్ పేర పతకం - మొదటి బహుమతి నాకూ, రెండవ బహుమతి బి.వి. నరసింహారావుకీ వచ్చింది. ఈమనిశంకర శాస్త్రి (వీణ) అనసూయా సీతాదేవులూ అప్పుడు హైస్కూల్ తరగతులలో బహుమతులు తీసుకున్నారు.

సాయంత్రం గేమ్స్‌టైంలో - సంగీతం క్లాసుల్లో శిష్టు సర్వశాస్త్రి గారు వర్ణాలు చెప్పేవారు. నేను ఆ తరగతులకి వెళ్లడం నాస్వరజ్ఞానం పునాది లోతుకావడానికి తోడుపడింది.

1937 వేసవిలో - పై చదువుకని - శాంతినికేతన్ బోల్పూరుకి ఒక దరఖాస్తూ వాల్తేరు ఆంధ్రవిశ్వవిద్యాలయానికి ఒక దరఖాస్తూ పెట్టాను. ముందుగా చేతికి అందిన వాల్తేర్ సీటే స్వీకరించాను (స్వగ్రామానికి) కాకినాడ పిఠాపురాలకి దగ్గిరని.

1937-40 ఆంధ్ర విశ్వవిద్యాలయంలో బి.ఏ. ఆనర్స్ తెలుగు - సంస్కృతము లలో పింగళి లక్ష్మీకాంతంగారు శాఖాధ్యక్షులు! గంటి సోమయాజులుగారు, మల్లాది సూర్యనారాయణశాస్త్రిగారు వజ్ఝల చిన సీతారామశాస్త్రులుగారు, అబ్బూరి రామకృష్ణారావుగారు - గుర్తి వేంకటరావుగారు వీరంతా తెలుగు సంస్కృతాలలోని వివిధ విషయాలూ, దక్షిణభారత చరిత్రా చెప్పేవారు. కాకర్ల రామనరసింహంగారు, కార్యమపూడిరాజమన్నారుగార్లు నాతో సహపాఠులు. తెలుగు విద్యార్థి సంఘానికి అధ్యక్షుడిని నేను, రాజమన్నారు కార్యదర్శి. మావిద్యార్థి సంఘం - సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణలోఅపూర్వ విప్లవాలు సాధించింది. విశ్వవిద్యాలయం దేవిడీమానా విధించింది - అని జనం అంతా అనుకునే - వ్యావహారికభాషా గురువైన గిడుగురామమూర్తి గారినీ, సాహితీ సమితి సభాపతియైన తల్లావజ్ఝల శివశంకరశాస్త్రి గారినీ, కవి సామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ గారినీ సాంస్కృతిక సభలకు ఆహ్వానించడమూ సభలను ఎవరిమనస్సూనొప్పించకుండా జరిపించడమూను. 1939లో ఆవిధంగా మాహాస్టల్ అతిథియైన శివశంకరశాస్త్రులు గారికీ నాకూ అచ్చెరువూ ఆనందమూ కలిగించిన సమాచారము మేమిద్దరమూ అదే ఒకే కాలంలో వంగకవి సంస్కర్తా అయిన చండీదాసు జీవితకథ ఆధారంగా నేను నా చండీదాసూ, ఆయన తన సహజయాన పంథీ - రెండూ గేయానాటక ప్రక్రియలో రచించడం ఆరంభించామని తెలిసికొని ఆనందించిడం.

1940 లో మాబ్యాచ్ ముగ్గురమూ - ఫస్ట్‌క్లాస్‌లో కృతార్థులవడమూ - అందరికీ ఆ తరగతిరావడం అదేమొదటిసారి.

వాల్తేరు - ఆంధ్రవిశ్వవిద్యాలయంలో

1938- 40 లమధ్య - చండీదాసు - వంగకవి జీవితగాథతో నాగేయ నాటక రచన ప్రారంభం అయింది. 1940 - ఏప్రిల్‌లో నా విద్యాభ్యాసం పూర్తయి, నాకొక పరిణతవాక్కును ప్రసాదించింది - గురువుల ఆశీస్సులద్వారా. గేయ రచనా, నాటి కారచనా వివిధరీతుల సాగుతూండగా 1940 మే నెలలో నా మేనత్తకూతురుతో వివాహంఅయి, కాకినాడలో - కేవలం పార్వతీశ్వర కవిగారి సంపాదకత్వంలో సాగుతూండిన ఆంధ్రప్రచారిణీ గ్రంథ నిలయంలో ఉపసంపాదకత నిర్వహించాను., 1940 డిసెంబరుదాకా. ప్రచారిణీ ప్రచురణలయిన గోరాలు మాతృ మందిరం నవల తీసుకుని వాటిని కళాశాలా తరగతులకు విశ్వవిద్యాలయాలలో పాఠ్యపుస్తకాలుగా పెట్టించేపనిపై మద్రాసులోని పాఠ్యపుస్తక నిర్ణాయక సభ్యులను అర్థించడానికి నేను డిసెంబరు 1940 లోచెన్నపట్నం వెళ్లాను.

వంగకవి చండీదాసు - మధురభక్తి సిద్ధాంతంలో ఆదిగురువైన - భారతదేశంలో అందరికీ ఆరాధ్యుడయిన సంస్కృత గేయకవియైన జయదేవుడి తర్వాత ద్వితీయపూజ్యపీఠాన్ని అధిష్ఠించినవాడు. ఆతని రజకి ప్రణయగాథ ఇతి వృత్తం కావడము అతడు ఆరజకినీ రూపంలో జగన్మాత విశాలక్షిని దర్శించి అర్చించటం ఇవన్నీ నా గేయాలకూ, నాగేయనాటకరచనకూ ఒక విశిష్టతను ప్రసాదించాయి. ఆనాటి దిగ్గంతులైన గేయ కవుల ప్రభావానికి నన్ను అతీతుడిగా నిలబెట్టాయి - నా వ్యక్తిత్వాన్ని నిలబెట్టాయని భావిస్తుంటాను. ఈ నాటకంలోని గేయాలకు బంగాలీ దేశి సంగీత శైలిలోని కీర్తన పద్ధతినాకు ఆలంబం అయింది.

1. పంకజాంగనకు అకలంక తేజోఘనుని
   అంక పీఠము కోరుటడియాసయేయేమొ
   ఈ పేద పూవలపులేపగిది చేరునో
   ఆశాశలను దాటి ఆ ప్రభాకరమూర్తి॥

2. దాసీగానా ప్రాణబంధు, నన్ను, ఉదాసింతువే ప్రేమసింధూ।
   ఆశలే సురిగి తూలేనో ఆకాశమే విరిగి కూలేనో॥
   చంద్రుడే ఇరులలో దాగె, జగముతంద్రలోకనుమూసి తోగె
   బృందావనికి నీవు రావో మధురమందానిలములింకలేవో॥

3. చందురుని చెంగలువ వలచేని, చాతకము జలధరుని తలచేని,
చలి తుఫానుల కలువ మడి సేని, చాతకము దాహార్తి సుడిసేని
చందురుడు చెంగలువ జూచేన, జలధరుడు చాతకము గాచేనా
ఏటికో, యీక్షణిక ప్రణయాలు, సాటిలేనిది రాధప్రణయమ్మో
సాటిలేనిది కృష్ణ ప్రేమమ్మో, ఎవరువిన్నారెవరుకన్నారు.

ఈ చండీదాసు నాటకానికి సాహిత్యరచన, స్వరకల్పనా అంతా నాదే అయినప్పటికీ, అప్పటికి సంగీత దర్శకుడుగా నిలదొక్కుకున్న శ్రీ సాలూరి రాజేశ్వరరావుని - ఆల్ ఇండియా రేడియో వారు కేవల నేపథ్యసంగీత వాద్య దర్శకుడుగా కాంట్రాక్టు ఇచ్చారు. అది మరోధర్మానికీ, స్నేహధర్మానికీ ఎంతో సహాయపడింది.

చండీదాసు ప్రసారం అయాక మరికొన్ని కార్యక్రమాలు కేజుఅల్ కాంట్రాక్టుపై చేయించారు. కొందరు మిత్ర ప్రాయులు 'వీడికి' దొంగ సంగీతమే తెలుసు కాని, మన సంప్రదాయ సంగీతం రాదు - తెలీదు అని తెర వెనుక విమర్శలు చేశారు. వారికి జవాబుగా - నా రెండవ సంగీత నాటిక గ్రీష్మర్తువు - ఫక్తు కర్ణాటక సంగీతంలో సాంప్రదాయికంగానూ, కర్ణాటక సంగీతరాగాలను రసోత్పత్తికి వినియోగించడం ప్రయోక్త శక్తిపై ఆధారపడి ఉంటుంది కాని, రసవ్యంజన శక్తి - కర్ణాటక సంగీతానికి లేదు అన్న అపప్రథపోగొట్టేలాగ నిర్వహించాను.

డా॥ కె.వి.ఆర్. నరసింహంగారు తన ఆంధ్ర సాహిత్య సవిమర్శాత్మక చరిత్రలో - ఈ నాటకంలో రవీంద్రనాథఠాకూర్ మార్మికతను సార్థకంగా ప్రయుక్తం అయినందుకు రచయితను అభినందించారు.

మందారి రాగం

నడిమింట చండర విమండునెండకాచె
వడగాలులు సుడితిరిగి హెూరుమని వీచె
సడలి తరుపర్ణములు జరజరమని రాలె
వడలి సుమఫలాలు సొగసుచెడి పడితూలె ।
కడలంటు బ్రతుకులను జీవరాశి రోసె
బడలిమంచె పయితోటమాలి కనుమూసె॥

మధ్యమావతి

తోట మాలి జోలి నీ కెందుకు !

తోటలో తేనెతేటలోతీయపాటలో మునిగితేలక

వనములో సఖీజనముతో సుధాసవములోమునిగితే తేలకా

తోటి మాలి జోలినీకెందుకు!

తోటమాలినిద్రింపనూ లేదు

తోటమాలి యేలుకోనూలేదు

నీదు ఊర్పులో నాదు ఊర్పులోనీ పాటలనాపాటమాటల

పెరుగులో విరుగులో తరుగులోన పరుగు వారు కనబడనితేజమౌ

తోటమాలి జోలి నీకెందుకు!

దివ్యజ్యోతి బుద్ధ జీవిత కథాత్మకం అయిన నాటకంలో :

గౌతమబుద్ధుని ప్రస్థానం -

శహనరాగం :

ఈయిరులు చీల్చుకొని యేవెలుగుపిలిచేనో

ఏగుమోయి పథికుడా, యిలువీడి సాగు మోయీపథికుడా

ఏకొసకు సాగేవొ, ఆదెసనెపోవౌను

ఆశాప్రశాంతకిరణాలూ, వాగేను, అమృతవాణీ పురాణాలూ

నిర్వాణం :

పూర్ణిమాత్రయం : వైశాఖపూర్ణిమా వర్ధిత జ్యోతి, నిర్వాణపథమందు నిస్తుల జ్యోతి
(శివరంజని) విశ్వమ్ము నంతటిని వెలిగించు జ్యోతి, ఈశ్వరత్వమ్మంది భాస్వంతమాయె

సురిగెతన ఆత్మావభాసం, వెలిగెను సదాత్మ ప్రకాశం

కాలావకాశాలవేలలు కరిగిపోయిన చిదానందం

కాంతి శబ్దావ సానమ్ములు కదిలిపోయిన బృహదనంతం

ప్రణయపారావారమను భవసారమౌకరుణార్ద్రచేతం

సారహీనవృథావ్యథాంబుధి పరిశ్రాంత విరామగీతం
వెలిగెను సదాత్మ ప్రకాశం - నిత్యమైనది సత్యమైనది
నిస్తులాత్మ జ్యోతిఒకటే!

భారత స్వాతంత్ర్య ప్రాప్తి దినోత్సవం : 15 ఆగస్టు 1947

1947 ఆగస్టు 15 వ తేదీ అర్ధరాత్రి 12 గంటలకి మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చింది. అంతకు ముందు నేను బ్రిటిషు పరిపాలన కాలంలో చేరి ఐదేళ్ళు దాటింది. బ్రిటిషు పరిపాలన కాలంలో కొందరు స్వాతంత్ర్యయోధుల చేత ప్రసంగాలు (రేడియో) కార్యనిర్వాహకుడుగా ప్రసారం చెయ్యవలసిన సందర్భాలలో Censor Editor's Switch నిర్వాహకులమైన మా చేతిలో ఉండేది. వక్తకు తెలియకుండా వారి ప్రసంగంలో (బ్రిటిషు ప్రభుత్వ) వ్యతిరేక భావాలను మేం కట్ చేసేవారం. స్వాతంత్ర్యయోద్ధ దుర్గాబాయి గారి ప్రసంగంలో 'జైహింద్' అనే మాట తీసివెయ్యడానికి ఆవిడ నిరాకరించి - ఉద్రేకంతో ఆ మాట పలికిన శబ్దప్రసారానికి నేనే Editor's Switch ప్రయోగించాను.

దేశానికి స్వాతంత్ర్యం వచ్చిందని ప్రతి భారతపౌరునికీ కలిగిన సగర్వ సంతోషానికి తోడు ఆ పదిహేనవతేదీని - గేయ కర్తనైన నాకు మరొక సంఘటన మరింత గర్వకారణమైంది.

ఆరాత్రి 12 గంటలకి ఢిల్లీ రేడియోకేంద్రం నుంచి స్వతంత్రభారత కేంద్ర ప్రభుత్వ ప్రమాణ స్వీకారమూ, ప్రథమ ప్రధానమంత్రిగా జాతినుద్దేశించి జవాహర్‌లాల్ నెహ్రూ ముఖ్య ప్రసంగం పూర్తికాగానే - మద్రాసు వంటి ప్రాంతీయ కేంద్రాలు ఢిల్లీప్రసారం నుంచి వేరుపడి, ఏకేంద్రానికి ఆ కేంద్రం ప్రాంతీయ భాషలలో గేయాలను ప్రసారం చేశాయి.

దక్షిణాది రాష్ట్రమయిన మద్రాసు కంతకూ మద్రాసొక్కటే ప్రధాన రేడియో కేంద్రం. వేరుపడిన వెంటనే మద్రాసు కేంద్రంనుంచి, సుబ్రహ్మణ్య భారతి తమిళ గేయము, తెలుగులో రజని గేయమూ ప్రసారం అయాయి. ఆడువోమే, అనే తమిళగేయాన్ని డి. కె. పట్టమ్మాళ్, 'ఉదయమ్మాయెను స్వేచ్ఛా భారతం' అనే రజని గేయాన్ని టంగూటూరి సూర్యకుమారీ గానం చేశారు.

"ఉదయమ్మాయెను స్వేచ్ఛాభారతముదయ మ్మాయెనొహొ
తూరుపుఖండపు వారల తపములు కోరిక లీడేరెనొహొ
దెసలల్లిన భారత స్వేచ్ఛా సూర్యుని ప్రాభాతోజ్జ్వల కాంతి
ప్రసరించుత తూరుపు వాకిలితెరచుక ప్రేమ పూరిత ప్రశాంతి ॥
దేశ దేశముల దీన జనావళి దాస్య బంధనవిముక్తి
ద్వేషరోషములు తెగలు పగలు నశియింప జగమెల్ల శాంతి॥
భారత దేశ స్వేచ్ఛా సూర్యునాచ్ఛాదించు రాహుచ్ఛాయ
అంతర్ధానమాయె, అంతర్ధాన మాయె
మ్రోయింపు జయభేరీ, వాయింపుము నగారా
తేలింపుము నభోవీధిని త్రివర్ణాంచిత పతాకా!"

1953 లో అక్టోబర్ 1 న - ఆంధ్రరాష్ట్రం ఏర్పడినప్పుడు 'స్వరంబెత్తి పాడరా సోదరా ఆంధ్రోదయవేళా' అనే నాగేయమూ 'పసిడి మెరుంగుల తళతళలు' అనే నా తెలుగు తల్లి గేయమూ శ్రీమతి భానుమతీ రామకృష్ణ మద్రాసు నుంచి ప్రసారం చెయ్యగా విజయ వాడ రిలే చేసింది. ఆతర్వాత శ్రీమతి భానుమతీ నేనూ తెలుగు తల్లి పాట గ్రామోఫోన్ కంపెనీకి రికార్డు చేశాము.

నారచనలలో వామపక్ష భావ స్పర్శలూ, అరుణరాగపుపై పూతలూ!

"అంతులేని బ్రహ్మాండ భాండాని కడుగున పైనా ఒక కప్పు
అనుపల్లవి సాగడానికి కొక fag, hot hot Coffee అరకప్పు!
అది ప్రాచీనులతప్పో, అయిన్‌స్టీన్ వప్పో వెల్స్ గాసిప్పో డిప్పో!
బ్రహ్మాండ భాండగర్భం నవమాసాల్ పేగు పేగునా కల్చర్!
అది వికసిత మానవ మస్తిష్కానికి అమోఘమౌ ఒక టింక్చర్!
అది మానవశుష్క కళేబరం పాలిటి ఒక్క మహా పెనువల్చర్
ఒక్కొక్కడికీ ఎవడికి వాడికి ఎవడిది వాడిది-కల్చర్, కంచం మంచం!"

"కల్చర్ అండ్ అనార్కీ" (సంస్కృతీ - అరాచకమూ) అనే శీర్షికను 'పూషా' Pooh Shaw అనే అహంభావాత్మకమైన కలంపేరుతోనేను 1939-40 లో ఆధునిక ధోరణిలో వ్రాసిన కవితలోని మొదటి స్టాంజా - అది ! పూషా పేరుతోనే ఈ

శీర్షిక కవితలు ప్రతిభ పత్రికలో అచ్చయ్యాయి. తర్వాత గోరా శాస్త్రి - తెలుగు స్వతంత్రలోప్రకటించారు.

'శాంతిపథం' అనే నాటకంలో - రంగ స్థలంపైన సగం వెలుతురూ సగం చీకటీ - వాటినడుమ తిరుగుతూ ఉండే భూగోళం - ఆగోళపు భూమధ్య రేఖనంటి అమర్చిన చాందినీపైని గాయనీగాయకులు పాడేపాట -

1. "గిరగిరతిరిగే భూగోళం - ఇరులు వెలుతురూ సమపాళం!
ఏది ఆదియో ఏది అంతమో - ఎరుకకందదొయీ ప్రకృతి !
సగము వెలుతురై సగము చీకటై జగతి సాగునే తన ప్రగతి!
యంత్రగరిమ విశ్వమేల గోరుటో
మంత్రమహిమ నాత్మల గోరుటో
ఎటకు సాగునో యీ జగతి!
ఎన్ని తారకలొ ఎందరు సూర్యులొ! ఎన్ని విశ్వములొ ఎంతటి అవధో
ఎంత చీకటో ఎంత వెలుతురో - ఇంతకు మనిషి కేదిగమ్యమో!"

2. వెలుగు పాయో చీకటిపాయో, తెలియకే పైబడు విధి చేయో
యుగయుగమ్ములు కిందై మీదై జగతి నలపై అలమేమాయో॥
- ఇటువంటి భావాలతో ఇతివృత్తాలు చేసే కవికి నిత్యము నెత్తిమీదే అంటే అకాశంపైనే కళ్లు పెట్టుకొని, తనచుట్టూ భూమి మీదా, ప్రజల జీవితాలపై నీ దృష్టి పారని పలాయన వాది అని కొందరు విమర్శకులనుకో వచ్చు. ఒక ఉగాది సమ్మేళనంలో చదివిన కవిత ఆ విమర్శకు ప్రత్యుత్తరం కాగలదు.

కావడి కుండలలోపలి కలిమీ లేమీతూచి
లేమి పీడ లేకుండగ కలిమి పంచగలమా ?
తన ఘనతను తగ్గించిన మన ధనికత పెరుగునా
ప్రతి చేతికి పని దొరకున? ప్రతి నోటికి ఫలమందున?
ప్రతి గుండెకు కళలెందున ? ప్రతి చెవి కవిత మోగునా ?
ఆశల పుష్పరజంలో ప్రతి కణమూ ఫలం కాదు
మనుజ సోదరుని స్వార్థమె మనిషి కృషికి భంగకారి !

ప్రసిద్ధ నాటక రచయిత ఎన్.ఆర్. నంది తాను రచించిన 'మరో మొహెంజోదారో' అనే రంగస్థల సాంఘిక నాటకానికి సుమారు 30 ఏండ్ల క్రితం, నా చేత నాందీ గీతం రాయించారు.

"సమాజమే ఒక సౌధమ్మో, ప్రతి మానవుండొక స్థంభమ్మో
సమాన భారమ్ము మోయకుండ, విషమ భావమ్ములు సమసి పోవగా
మరుగువడిందొక మహీధరం, మహనీయ విజయధరాధరం
పురాతన మనుజ పురోగమనమున మరపురానిది మొహెంజోదారో"

నాయక్షగాన రచనాంకురాలు - నృత్యగేయాల నాటికలూ.

మథురానగరీగాథ - 1942 లో రచించిన గేయ నాటకం - దానికి ఆధారం ప్రసిద్ధ సంగీత విద్వాంసులు చిత్తూరు సుబ్రహ్మణ్యంగారు స్వయంగా రచించి ఆనందభైరవి రాగంలో రికార్డు చేసిన లఘు పదరచన - (జావళి అనడం ఇష్టం లేదు నాకు)

నానాటకంలోని ఘట్టం : చల్లోయమ్మ చల్ల! కమ్మదనమ్మేకావాలంటే కొల్లోయమ్మ కొల్ల ! పుల్లదనమ్మే పొగిడేవారికి పళ్ళు జివ్వుమను పుల్లని చల్ల చల్లోయమ్మ చల్ల! పెరుగోయమ్మ పెరుగు

ఇలా చల్ల అమ్మ బోతున్న గొల్లభామకు ఎదురయి - కృష్ణయ్య ఇలా అంటాడు.

కృష్ణ (జంఝూటి) : మలయానిలమిదే మెల్లగవీచె
మధువన మిదె - భామా -
భామ : మథురానగరిలో చల్లనమ్మబోదు
దారివిడుము కృష్ణా
కృష్ణ : నీ పై మోహము ఓపలేనె సఖి
నీపతరువు కడ నిలువవె భామా!
భామ : మాపటివేళకు తప్పక వచ్చెద
పట్టకు కొంగు గట్టిగాను కృష్ణా!

ఈనాటకాన్ని కీ.శే. వెంపటి పెదసత్యంగారు ఆంధ్రమహిళాసభ బాలికాబృందం చేత ఒకసారీ, కూచిపూడి నటీనట బృందం చేత ఒకసారి కోరియో గ్రఫీతో 1942 - 43లో ప్రదర్శింపజేశారు.

1956 -60ల 'మధ్య రచించి, విజయవాడ నుంచి ప్రసారం చేసిన - 'స్వైరిణి అన్నారు నన్ను' - అనే గేయ నాటిక -

గాన వారిధి రాగం (అభిసారిక రాధిక)

కదలిపోవునదీ ఎవ్వరో - నేదారిచీకటి సైదోడు లేకయె॥
వెదురుపొదల మెదలుగాలి యీలలె
వేణునాదమని అదరిపడి పిరికి ॥ కదలి పోవు ॥
ఈడ ఆడ, నీడలోని యాడిన
వాడె రాధికా వరుడని పరువిడి ॥ కదలిపోవు ॥

(ఎగతాళి చేసే గోపికలు) - ఆభోగిరాగం

మనకేలా యీకనుగంత, ఎరుగమటే యీ వలవంత
పరపురుషు పరాత్పరుడంటూ తరలిపోవు యీ జగమంత॥
తానేమో జీవాత్మయట తనమగడనిత్య దేహమట
తనప్రియుడులోక ప్రియుడంట, తన యభిసరణ పురాణమట

నేను మదరాసు కేంద్రంలో పనిచేస్తూండినపుడు 1942 -56ల నడమ అక్కడి మా సీనియర్ - కార్యనిర్వాహకుడు - టి. శంకరన్ - మేలటూరు (తంజావూరు) బాలు భాగవతార్‌ను రప్పించి, మేలటూరు వేంకటరామశాస్త్రి గారి, భాగవత మేళ నాటకాల సాహిత్యంలోని తెలుగు నా చేత దిద్దుబాట్లు చేయించి, ఉషాపరిణయము, హరిశ్చంద్ర, ప్రహ్లాద మొదలైన యక్షగానాలు ప్రసారం చేయించారు - నేను అప్పుడు గ్రామస్థుల కార్యక్రమాల నిర్వాహకుడుగా ఉండగా - వేదాంతం రాఘవయ్య, సత్యనారాయణ శర్మగార్లు వెంపటి పెద సత్యం చిన సత్యంగార్లు, లక్ష్మీనారాయణ శాస్త్రి వేదాంతం వారు, ఆయన కుమారుడు జగన్నాధశర్మ పసుమర్తి కృష్ణమూర్తిగార్లు కూచిపూడి వారి నాటకాలన్నీ నా

ఆధ్వర్యంలో ప్రసారింప చేశారు. కూడా పాల్గొన్న నాకూ, మల్లికు, ప్రయాగలకు సూత్రధారుడు చింతా కృష్ణమూర్తి గారి చిటకాలు కొంతవరకు పట్టుబడ్డాయి.

1960-61లో (టాగూర్) రవీంద్ర సంగీతానువాదయజ్ఞం (హైదరాబాదు)

1. జదితోర్ రాక్షునే కేవునా ఆక్షేత బే ఏక్ లాచోలోరే
ఏక్ లాచొలో ఏక్‌లాచొలో ఏక్‌లాచొలో ఏక్ లాచొలోరే॥
జదికేవుథకొథనాకొయ్, ఓరేఓ, రేఓ అభాగా
జదిషబాయి థాకే ముఖ్ ఫిరాయే షొబాయి కొరే ఖాయ్
అరే పరాక్‌ఖురే -ఓతుయిముఫుటేలోర్ మొర్‌కొథా
ఏక్‌లా బొలోరే -

నా అనువాదం - ఎవరూ కేక వినీ రాకపోయినా సరే ఒకడవె పదవోయ్
నీ ఒక్కడవే ఒక్కడవే, ఒక్కడవే ఒకడవె పదవోయ్
ఓరీ అభాగ్యుడా, ఊరంతా భయంచేత
గోడవైపు తిరిగి మాటలాడకుండ నిలుచున్నా
మనసువిప్పి లోలోపలి మర్మమేదో నీకు నీవె
ఒకడనె అనవోయ్ నీ ఒక్కడవే - ఒక్కడవే ఒకడవే పదవోయ్

2. చిత్తజేథా భయశూన్య, ఉచ్చజేథా శిర
గ్యాన్‌జేతా ఉమ్మక్త - గృహేర్‌ప్రాచీర్ అపోన్ ప్రాంగొణాతొలే
దిబోసా షార్బొరీ మృత్తికారే ఖుద్ర ఖండ కరిణ -
చిత్త మెచట భయశూన్యమో, శీర్ష మెచట ఉన్ముక్తమో
జ్ఞాన మెచట ఉత్తుంగమె గృహ ప్రాంగణ తీయమెట
దివా రాత్రమృత్తికా రేణువుల క్షుద్ర ఖండములు కాదో
వాక్కులెచట హృదయోద్గతోచ్ఛ్వ సనమొరసి వెలవడునొ
కర్మధార యెట అజస్రసహస్ర విధా చరితార్థమ్మొ
అనిగారిత స్రోత్రమ్మై దేశదేశముల గెసదెనపరబోవో
అట్టి స్వర్గతవి భారతభూస్థలి నిజహస్తమ్మున నిర్దయాహతిని
జాగరితను గావింపవోపిత్రా సర్వ కర్మసుఖదుఃఖవిద్రావా ॥

తుచ్ఛాచారపు టెందుమావులను
విచారస్రోతః పథమెట ఇంకిపోదో
పౌరుషమ్ము శతథావ్యథకాదో
అట్టి స్వర్గమందు భరతజాతి
జారిపడని నీ చేతితో పితా
తట్టి లేపి చేయుము జాగరిత!!

3. హేమోరె చిత్తా పుణొతీర్థే జాగోరే ధీరే
ఏయి భారొతేర్ మొహామానబేర్ షాగోర్ తీరే ॥జాగోరేధీం॥
హిధాయ్ దాడాయే దుబాహు బాడాయే
నామిణనారొ దేబో తారే ఉదారొ భొన్దొ పొరమానొనొద్ద బొన్దొణకొరితారే
ధానన్ గరీభీరొ ఏయిజే భూద్దొరొ నొదీపూపాజారా ధ్రువొప్రాన్తురొ
హేధాయ్‌నిత్తొ హేరొదొ బిత్రో ధొరిత్రీరే ఏయభారొతేర్

ఓనా చిత్తమ పుణ్య తీర్థమున మెల్లగ మేలుకో
భారత మహామానవ సాగరతరము నేలుకో ॥మెల్లగమేలుకో॥
ఇందే నడచిన నీరదేవతలకుఇరుకేల్ జోడింతు
ఉదార చ్ఛందమున పరమానందమున వందన మొనరింతు
తపోన్నతము మంచుకొండ ఎత్తెవదే నదుల దండ
ఇందే నిత్యమీపవిత్రధరిత్రియందు
భారతమహామానవ సాగర తీరము నందు॥

మేఘసందేశం - తెలుగులో - 1956 లోని విజయవాడలో ప్రసారితమయింది. శ్రీ బాలమురళి, గోపాలరత్నం గార్లు ప్రధాన పాత్రదారులు 1977 లో బెంగుళూరులో సంస్కృతంలో ప్రసారిత ఆకాశవాణి పురస్కారం అప్పుడు శ్రీబాలమురళి, శ్రీమతి యం.ఎస్ శైలా ప్రధాన పాత్రధారులు.

బృందగానం - అరుదెంచె మింటిపై ఆషాఢ మేఘము
(తెలుగు) ఆవేయితలలతో శేషాహి రీవితో

ఆరామగిరులలో ఆతపోవనులలో
ప్రియకాంతను బాసి, ఏడాది ప్రవాసి
ఆగాగుమనియెను ఆషాడ మేఘమున్॥

సంస్కృతం - ఆగతో దర్శనీయః - ఆషాడ మేఘః
ప్రణసహస్రాంచితేన శేషామి వైభవన
తత్రామగిరేరుపరి, తత్త పోవనేషు
ప్రియకాంతయా వినా వర్షప్రవాసినా
విశ్రామక్షణమితి - తూర్ణమభ్యర్థితో ।

యక్షుడు - హేజలధర, తిష్ఠ సోదర!
సరిత్ హృదయ సంతాపే విరహ
వ్యథాశ్వసనేఘచ
దాహకాతతె పేక్రమేప్యుడ్డయన్
గగనం త్వం గచ్ఛసి ॥హేజలధర॥
ప్రణయభంగేచ స్వప్నేచ
వ్యసనే కృశదేహాన్
దంద హ్యామానమానసాక ప్రణమిన
స్తవ సహొాదరాన్గణయ ॥హేజలధర॥

యక్షప్రేయసి గీతం - (శ్రాపావ సానం) ఏ దూర సీమకొ ఏవిపిన భూమినో
ఈవిరహమెన్నాళ్లో ఎటుసైచునో విభుడు

సంస్కృతం - మస్యాం దూరసీమ్నివా, యస్యాంవిపిన జగతివా
కియచ్చిరం విరహొాయం కథం సహ్యాతే విభునా॥
ఇహైతావదహమేకా తప్తా చకృశాభవామి
పరేవాసీ తత్ర ప్రాణపతిః కథం సౌఖ్యమేతి
కిమర్థమథ విహరతి స్వైరం దక్షిణా నిలసిః
ఇతో మనోరథ శుక స్య గరుత్యుశక్తి ర్విశతి
శాపస్యావసానస్య సామీచీన్యం కిమిదం
ప్రసవైః సహకిమలమతో అహర్గణన తత్పరతా॥

యక్ష ప్రేయసి - శారికేరసికే స్మరసి పత్యుః కచ్చిదపి
త్వంహి తస్య ప్రియేతిచ తస్య ప్రేమ వచనాని॥
వీణా సారణోద్యుక్తయా తముద్దిశ్యగాయన్త్యా
మూర్ఛనాహి విస్మర్యతే - అశ్రుసిక్తతనా్వ్యంమయా॥

రాగపరిశోధన: తరంగిణి రాగంలో ముత్తుస్వామి దీక్షితులవారు చాలా వేదాంత పరమైన 'మాయేత్వం సంహి -కాక వాహి అని కూర్చిన ఫక్తు కర్ణాటక శాస్త్రీయరాగంలో - తరంగిణీత్వమూ దేశితనమూ దొరికాయి. జపాను రేడియో అంతర్జాతీయ బహుమతి పొందిన 'కొండనుంచి కడలి దాక' అని గోదావరిపై నేను విజయవాడలోప్రసారం చేసిన రూపకంలో కథోద్ఘాటన పరిచ్ఛే దానికి Introductory announcement కి తరంగిణి రాగంలో కూర్చిన వాద్యబృంద సంగీతం వాడాను. కర్సియాంగ్ అనే హిమాచల ప్రాంత నగరానికి నేను బదిలీ అయినపుడూ అసలైన తరంగిణీ సంగీతం విని - అక్కడ తరంగిణీ రాగంలోకూర్చిన భావగీతాన్ని వినిపిస్తాను.

ఓకొండ మీది సెలయేరా ఓకొండ మీది సెలయేరా
బండరాతి చరియపక్క చకచక
పారులాడు మెరపు తీగవో
ఉండియుండి పరవళ్ళు ఉరకలిడు
వెండివాగులోవిసపునాగువో ॥కొండమీదిసెలయేరా॥
ధారాపాతవేగాన వెలువడే
దాగియున్న క్రియా శక్తిదో
యుగయుగాల శృంఖలాలవిదల్చి
ఎగయు దాస్యబంధముక్తివో॥ కొండమిది సెలయేరా॥

కర్సియాంగ్ః సుభాష్ ఘీసింగ్ నేతృత్వంలో ఇటీవల పార్వతీయ ప్రాంతపాలనావ్యవస్థనూ సాధించిన గూర్ఖా లిబరేషన్ ఫ్రంట్ ఉద్యమ కార్య స్థానం డార్జిలింగ్ జిల్లాలోని కర్సియాంగ్.

ఆకర్సియాంగ్‌లోని ఆకాశవాణి కేంద్రానికి ఎసిస్టంట్‌స్టేషన్ డైరెక్టర్‌గా హైదరాబాదు నుండి - 1966 మే నెలలో ప్రమోషన్‌తో బదిలీ చేశారు. పశ్చిమ బెంగాల్ ఉత్తరసరిహద్దుల్లో హిమాలయసానువులపై ఉంది కర్సియాంగ్ అక్కడి

విలక్షణ సుందరమైన అనుభూతులతో పొందుపరచిన పాటొకటి -
రండి కర్సియాంగ్ ఇటె వెళ్లాలి డార్జిలింగు

ఈ కొండ దారమున గుచ్చిన రెండు పూస లొకే రంగు!
ఏదిమీటినా వినబడు నొకే హిమాలయపు పాట
లామా గుడిగంట మారు మ్రోగు కొండలోయ బాట!
పొగ జిమ్ము బొమ్మ రైలు పైని కొండ బండిదారి
కుడి యెడమ మలుపులూ సుడులూ గడిచి మిన్నులూరి
ఇరుపక్కల ముంచెత్తే పొగమంచు తెరల నడుమ
పొంగారు జీవితంపు కొండ పల్లెలు రంగారి పొడమ॥

Come to Kurseong, on your way to Darjeeling. Because both are colourful beads on same mountainous string ! stroke inthe bead, you will listen to same Himalayan song echoing through the hill and dale, the Lama's temple gong!

యక్షగానములు: క్షీరసాగర మథనం - రచన - రజని, కృష్ణశాస్త్రి
సంగీతం రజని -

1. క్షీ। సా।మ॥లో అసురుల దరువు (అఠాణ రాగం)
మాకేల ఆతోక అహిఫణావళులుగైకోక,
అది, సరోజసంభవ సురాధినాధులు
బిరాన పొండిటురాక - ఔర॥ మాకేల॥
బలమందా కులమందా పటుతపస్సంపదలయందా
బలి ప్రముఖులందలంతు రెవ్వరు చలమ్మేల అంటు పోక ॥ఔర॥

2. లక్ష్మీదేవి పాల్కడలిలో జన్మించు ఘట్టం - (శహాణ రాగం)
పొడమే, రమా, కలుముల సీమా శత
పత్రదళమ్ముల నడుమా॥
వెడలా జగతి కడకడలా జడులు
కాంచన చంచల లలమా ॥పొడమే రమా॥

ఆచార్య బి. రామరాజు

(27.7.1995)

ఆంధ్రసారస్వతపరిషత్తువారు పరిణతవాణి ప్రసంగం చేయటానికి ఈ సారి నన్ను ఆహ్వానించినందుకు కృతజ్ఞుడను. సాహిత్యాది వివిధరంగాలలో 70 ఏండ్లు వయసు చెల్లినవారి జీవితవిశేషాలు అనుభవాలు ఆసక్తిదాయకంగా ఉంటాయనే ఉద్దేశంతో పరిషత్తువారు ఈ పరిణతవాణి ప్రసంగాలు ఏర్పాటు చేస్తున్నారు. కొందరి జీవితవిశేషాలు, కొందరి ఉపలబ్ధులు(అఛీవ్‌మెంట్స్), కొందరి అనుభవాలు నిజంగానే ఆసక్తిదాయకంగా ఉంటవి. ఆసక్తిదాయకంగా లేనివాటిని ఆసక్తికరంగా చెప్పే ప్రజ్ఞ ఉన్నా కొంతవరకు ఇంపుగానే ఉంటవి-వస్త్రభూషాదులతో వచ్చే అందంవలె. పరిషత్తువారి నిబంధన ప్రకారం నా వయస్సు పరిణతమైనదే కాని 'వాణి' ఆశించినంత పరిణతం కాదు. రసం యన్నిష్ఠం? వస్తునిష్ఠమా? సహృదయ నిష్ఠమా? సహృదయనిష్ఠమనే భావంతో ఈ ప్రసంగం చేయటానికి ఒప్పుకున్నాను.

తెలుగులో "తానొకటి తలచిన దైవమొకటి తలచును" అనీ ఇంగ్లీషులో "మాన్ ప్రపోజెస్ (బట్) గాడ్ డిస్‌పోజెస్" అనీ సామెతలున్నవి. ఆ సామెతలు నాకోసమే పుట్టినవి. నాజీవితంలో చాలా వరకు నేననుకున్నవి, ఆశించినవి జరుగలేదు. దైవమనుకున్నవే జరిగినవి. అందువలన దైవం ప్రసాదించినవాటిలోనే ఆసక్తి పెంచుకొని కృషి చేసినాను. "దైవం దిష్టం భాగధేయం భాగ్యం స్త్రీ నియతిర్విధిః" అని అమరకోశం. దిష్టమే ఇష్టంగా మలచుకొని సంతృప్తి పడ్డాను, సంతోషించినాను. పరిణతులైనవారు "సత్యం బ్రూయాత్ ప్రియం బ్రూయాత్ న బ్రూయాత్ సత్యమప్రియం" అనే హితవచనం పాటించవలె. ఇందులోని

పూర్వార్ధం చేతనైనంత వరకు పాటించగలను, ఉత్తరార్ధం పాటించలేకపోతే శ్రోతలు పాఠకులు క్షమించవలె.

ముందు సంగ్రహంగా నా జీవితవిశేషాలు చెప్పి తరువాత వివరంగా చెప్పుతాను. వివరంగా చెప్పినపుడు కొన్ని ఆసక్తి దాయకములైన విషయాలుండవచ్చు. అటుతరువాత కొన్ని ఆసక్తికరంగా ఉండే అనుభవాలు చెప్పుతాను.

నేను వరంగల్ తాలూకా దేవునూరులో పుట్టి, మడికొండలో పెరిగి, మూడవతరగతినుండి ఇంటర్ మీడియట్ దాకా హనుమకొండలో ఉర్దూ మీడియంలో చదివినాను. బి. ఎ. ఇంగ్లీషుమీడియం నిజాంకళాశాలలో చదివి, ఉస్మానియా విశ్వవిద్యాలయంలో 1951 సంవత్సరం తెలుగు ఎం.ఏ పూర్తి చేసినాను. 1956 సంవత్సరం పిహెచ్.డి. ఉపాధి సంపాదించుకున్నాను. 1951 సంవత్సరం పార్ట్ టైమ్ లెక్చరర్‌గా పనిచేసినాను. 1952 నుండి ఫుల్ టైమ్ లెక్చరర్‌గా, 1957 నుండి రీడర్‌గా, 1968 నుండి ప్రొఫెసర్‌గా ఉద్యోగంచేసి 1983 డిసెంబరు చివరన రిటైరైనాను. 1967 నుండి 1974 దాక వరంగల్ స్నాతకోత్తర కేంద్రంలో 1973 నుండి 1983 దాకా ఉస్మానియా విశ్వవిద్యాలయంలోను తెలుగు శాఖాధిపతిగాను 1978 - 1982 సంవత్సరాల మధ్యన ఆర్ట్స్ ఫ్యాకల్టీ డీన్ గాను ఉన్నాను. 1988 దాక యు.జి.సి ఎమిరిటస్ ప్రొఫెసర్ గా ఉన్నాను. మార్చి 1995 నుండి ఐదేండ్ల పర్యంతం భారత ప్రభుత్వంవారి నేషనల్ రీసర్చ్ ప్రొఫెసర్ గా నియుక్తుడనైనాను. ఇది నా చదువు ఉద్యోగాలకు సంబంధించిన సంగ్రహ సమాచారం.

బాల్యం నుండే ఆర్యసమాజం, ఆంధ్రమహాసభ, స్టేట్ కాంగ్రెస్ ఉద్యమాల్లో సక్రియంగా పాల్గొన్నాను. ఊరేగింపుల్లో పాల్గొని (1947) లాఠీ దెబ్బలు తిన్నాను. కాంగ్రెస్ సత్యాగ్రహంలో (1947) పాల్గొని హైదరాబాదు సెంట్రల్ జేల్లోను, విశ్వ హిందూ పరిషత్తు సత్యాగ్రహంలో (1990) పాల్గొని లఖ్నో జేల్లోను ఉన్నాను. 1952 నుండి రాజకీయాలకు దూరంగా ఉన్నాను. నిజాంకళాశాల, ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు విద్యార్థిసంఘాలకు, తెలంగాణా విద్యార్థిసంఘానికి

కార్యదర్శిగాను, ఉపాధ్యక్షుడుగాను 10 ఏండ్లు సేవ చేసినాను. ఆంధ్రవిజ్ఞాన సర్వస్వం, సంగ్రహాంధ్రవిజ్ఞానకోశసమితి కార్యవర్గసభ్యుడుగా ఉండినాను. 1946 నుండి ఈనాటిదాక ఆంధ్ర సారస్వతపరిషత్తుకు సన్నిహితుడను. ఆంధ్ర జాతీయ సాహిత్యపరిషత్తుకు(1974), ఆంధ్రప్రదేశ్ ఓరియంటల్ కాన్ఫరెన్సుకు స్థాపకాధ్యక్షుడను. పూనా కేంద్రంగా పనిచేస్తున్న ఆల్ ఇండియా ఓరియంటల్ కాన్ఫరెన్స్‌కు 1961 నుండి, భండార్కర్ ఓరియంటల్ రీసర్చ్ ఇన్స్టిట్యూట్‌కు 1965 నుండి ఆజీవన సభ్యుడను. 1971 - 72 అఖిల భారత విద్యార్థి పరిషత్తు ఆంధ్రశాఖకు అధ్యక్షుడుగా, 1983 - 1989 విశ్వహిందూ పరిషత్తు స్టేట్ ప్రెసిడెంటుగా, 1988 - 1998 విశ్వహిందూ పరిషత్తు కేంద్ర ఉపాధ్యక్షుడుగా సేవచేసినాను. అహింసా సిద్ధాంతాన్ని ఆర్. ఎస్. ఎస్. వారి దేశభక్తిని అభిమానిస్తాను.

చిన్నప్పటినుండి దేశభక్తి భావాలు ప్రోది చేసుకున్నాను కనుక రాజకీయాల్లోకి పోదామనుకున్నాను. మా పెద్దలు నన్ను విలాయత్‌కు పంపించి ఐ.సీ.ఎస్. చేయించవలెననుకున్నారు. దైవం తెలుగు పంతులును చేసింది, దైవేచ్ఛనే నాయిష్టంగా మలచుకొని తెలుగు సాహిత్యరంగంలో స్థిరపడ్డాను. తొలిదినాలలో గేయాలు పద్యాలు నవలలు వ్రాసినాను. ప్రతిభావ్యుత్పత్త్యభ్యాసాల్లో మొదటి రెండు నాలో తక్కువ కనుక సృజనాత్మక సాహిత్యరంగంలో రాణింపు రాదని, మంచి గుర్తింపుకోసం లోకానికి క్రొత్తవిషయాలు చెప్పవలెననే ఉద్దేశంతో పరిశోధన రంగంలోనికి దిగినాను. క్రొత్త పుంతలు త్రొక్కి బాగా కృషి చేసి గుర్తింపు పొందవచ్చునని జానపద విజ్ఞాన రంగంలో పరిశోధన ప్రారంభించి కృతకృత్యుడనైనాను. జానపదగేయాలతో పాటు నూర్లకొలది తాళపత్రగ్రంథాలు, పదులకొలది శిలాశాసనాలు సేకరించినాను. నాతరం యూనివర్సిటీ తెలుగు అధ్యాపకుల్లో తాళపత్రగ్రంథాల్లో శాసనాల్లో అభిరుచిగలవాళ్ళు అరుదు కనుక ఆ కృషికూడ సత్ఫలితాలిచ్చి నాకు మంచి గుర్తింపు సంపాదించింది. ఈ విధంగా విశ్వవిద్యాలయస్థాయిలో జానపదవిజ్ఞానంలో దాక్షిణాత్య సాహిత్యభాషల్లో పరిశోధన చేసిన వారిలో నేనే ప్రథముడనైనాను.

మానవల్లి, వేటూరి, నిడుదవోలు వంటి పెద్దల పరిశోధనలు ఆదర్శంగా పెట్టుకొని సాహిత్య చరిత్రలకెక్కని ప్రాచీన మధ్యకాలీన తెలుగు సంస్కృత కృతులు

దాదాపు నూరు మొదటిసారి పరిచయం చేసినవాణ్ణి అయినాను. ఇంతవరకు వెలుగు చూడని తెలుగు సంస్కృతం కృతులు ఒక డజను పరిష్కరించి ప్రకటించినాను. ఈరంగంలో నా సాటివారిలో నా తోడివారిలో ఎవరూ చేయని పని చేసినందుకు పెద్దల మెప్పు పొందినాను. జానపదసాహిత్యంకోసం తాళపత్రగ్రంథాలకోసం పల్లెటూళ్ళు తిరిగినపుడే ఇంతకుపూర్వం చారిత్రకుల దృష్టి సోకని క్రొత్త శిలాశాసనాలు నాలుగైదు కనుగొన్నాను. ఐతే ఆరంగంలోని పెద్దల బొమముడులు గమనించి ఆ రంగంనుండి వైదొలగినాను. జానపదవిజ్ఞానం తెలుగు పొలిమేరలవరకే సీమితం కాదు. అది అంతర్‌రాష్ట్రీయం, అంతర్జాతీయం కనుక ఇంగ్లీషులో నాలుగైదు గ్రంథాలు 25 పరిశోధన పత్రాలు ప్రకటించి తెలుగుదేశం బయటకూడ గుర్తింపు పొందినాను. ఐనా మన పెద్దలకు జానపదంపై ఉన్న చిన్న చూపు గమనించి సంస్కృతంలో ఎం.ఏ (1960) చేసి పి.హెచ్.డి కోసం 'కాంట్రిబ్యూషన్ ఆఫ్ ఆంధ్ర టు సంస్కృత్ లిటరేచర్' అనే సిద్ధాంతగ్రంథం వ్రాసి కారణాంతరాల వలన నిరాశపాలై సబ్‌మిట్ చేయకుండా ఊరకున్నాను. ఈ కృషి అంతా గుర్తింపుకోసం, పొట్టకూటికోసం, పదవులకోసం చేసినదే.

భగవాన్ శ్రీ సత్యసాయి బాబావారి భక్తుడనైన తరువాత (1976) మరొక క్రొత్త మార్గం త్రొక్కి బాబాగారి పద్యాలు పాటలు ప్రసంగాలు దాదాపు 6 కృతులు, తెలుగులో ఇంగ్లీషులో పదులకొలది వ్యాసాలు ప్రకటించినాను. పరుల గుర్తింపుకోసం దేబరించటం మాని ప్రస్తుతం నన్ను నేను గుర్తించుకునే ప్రయత్నం చేస్తున్నాను. ఈలోకపు మనుగడ కోసం విశ్వశాంతికోసం భగవంతుడు తమకు నిర్దేశించిన కర్తవ్యం నిస్స్వార్థంగా చేసి కర్పూరమట్లు కరిగిపోయిన ఆంధ్రయోగుల చరిత్రలు వ్రాయటానికి పూనుకున్నాను. ఇప్పటికి ఆ రంగంలో మూడు గ్రంథాలు ప్రకటించినాను. ఇవి నా జన్మధన్యం చేసే కృతులు; వచ్చే మంచి జన్మకు పాథేయాలని భావిస్తున్నాను. ఇదీ సంగ్రహంగా నా చరిత్ర. దీనిని విపులీకరిస్తే కొంత సమాచారదాయకంగా (ఇన్‌ఫర్‌మేటివ్) కొంత ఆసక్తిదాయకంగా (ఇంటరెస్టింగ్) ఉండవచ్చును. చివరన ఒండురెండు అనుభవాలు పేర్కొంటాను.

అలనాటి నిజాం రాజ్యం వరంగల్ సూబాకేంద్రం హనుమకొండకు 2 1/2 కోసుల దూరాన మడికొండ, అక్కడికి రెండుకోసుల దూరాన ధర్మసాగరం, అక్కడికి రెండుకోసుల దూరాన దేవునూరు గ్రామాలున్నవి. మడికొండ,

ధర్మసాగరం కాకతీయుల కాలపు గుళ్ళు శాసనాలున్న పెద్దగ్రామాలు. దేవుని గుడి లేకున్నా ప్రాగైతిహాసికమానవుల సమాధులున్న (కెయిరనులు, దాల్మెనులు, సిస్ట్‌లు) చిన్నగ్రామం దేవునూరు నా జన్మస్థానం. మడికొండలో మాపెదనాయన చిన్నాయనలు, ధర్మసాగరంలో మా పాలివాండ్లు, దేవునూరులో మా అమ్మనాయనలుండేవారు. కాపురాలు వేరు గ్రామాలైనా మాది సమష్టికుటుంబం. మాకు దేవునూరులో 20 నాగండ్ల వ్యవసాయం, మడికొండలో 5 నాగండ్ల వ్యవసాయం కాక లింగంపల్లి, కడిపికొండ, మడిపల్లి, మహాలింగంపల్లి గ్రామాల్లోను వ్యవసాయభూములుండినవి. మాపెదనాయన రాఘవరాజు పెద్దమ్మ లలితమ్మలకు సంతానం లేదు. మా అమ్మ లక్ష్మీదేవమ్మ నాయన నారాయణరాజు, చిన్నమ్మ లక్ష్మీనరసమ్మ, చిన్నాయన కొండమరాజు. తమ్ములనూ, తమ్ముల సంతానాన్ని పుత్రనిర్విశేషంగా క్రమశిక్షణలో పెంచి విద్యాబుద్ధులు నేర్పించిన మా పెదనాయన రాఘవరాజుగారు వరంగల్ తాలూకా అంతటా ధనికులకూ దరిద్రులకూ తలలోని నాలుక; గొప్పవ్యవహారదక్షుడు. మా చిన్నాయన కొండమరాజుగారు వకీలు (కొండా వెంకటరంగారెడ్డి గారి క్లాస్‌మేట్). మానాయన నారాయణరాజుగారు ఉదయాస్తమానం చెమటోడ్చి భూమితల్లికి పులకరింతలు కూర్చే కృషీవలుడు; రాత్రులు భాగవతగోష్ఠి ప్రియుడు. నాకు ఒక అన్న ఒక అక్క నలుగురు చెల్లెండ్లు ఇద్దరు తమ్ములు. నేను పుట్టినది శా.శ 1847 క్రోధన సంవత్సర చైత్ర బహుళ సప్తమి ఉత్తరాషాఢ రెండోపాదం తెల్లవారితే బేస్తవారం అనగా 16-4-1925 ఉదయం 4గంటల ప్రాంతం. కాని ఉద్యోగజీవితంలో నన్ను వెంటాడి వేధించినది 1333 ఫసలీ బహ్మన్ నెల 15వ దినం అనగా 9-12-1923. అందువలన అరవైయేండ్లకు 1985 సంవత్సరం రిటైర్ కావలసినవాణ్ణి 1983 సంవత్సరాంతాన రిటైరైనాను. అది దైవేచ్ఛ. ఆ విషయం తరువాత మనవి చేస్తాను. నాకు ఐదుగురు బిడ్డలు, ఒక కొడుకు. అందరూ బాగున్నారు. నా బాధ్యతలన్నీ తీరినవి.

మా మేనమామ శింగరాజు నరసింహరాజు ధూళిమిట్టవాసి, ఆయన మేనమామ ప్రతికంఠం రామచంద్రరాజు వెల్దండవాసి, ఆయన మేనమామ చెన్నమాధవుని వెంకటరామరాజు బచ్చన్న పేటవాసి - ఉభయభాషా పండితకవులు, కృతికర్తలు. ఇందులో మొదటి యిద్దరు హస్తవాసి గల వైద్యులు, దేవునూరులోను చుట్టు

గ్రామాల్లోను వైద్యం చేయటానికి ఏడాదికి ఎనిమిది నెలలు వంతుల వారీగా మాయింట్లోనే ఉండేవాళ్ళు. అందువలన సరస సంగీతసాహిత్యపట్టభద్రులైన రామచంద్రరాజుగారే నాకు అక్షరాభ్యాసం చేయించినారు. దేవునూరు వీథిబడిలో రత్నగిరివాసి చాత్తాద వైష్ణవులు నారాయణ స్వామి గారి వద్ద గుణితం, కరడాలు, ఎక్కాలు, బొట్లెరుసు, గిద్దెలెరుసు, మాడెత్తులెరుసు, నరసింహభాస్కరాది శతకాలు, జిలుగుమ్రాత జాబులు, చవితిపండుగు వినాయకపద్యాలు, దసరాపండుగు గడల పద్యాలు నేర్చుకున్నాను. ఇంటివద్ద గజేంద్రమోక్షం, రుక్మిణీకల్యాణం ఆంధ్రనామ సంగ్రహం, 'సభాకల్పతరుం వందే' నీతిశాస్త్రశ్లోకాలు నేర్చినాను. మా నాయనమ్మ బుచ్చమ్మగారు, మానాయనగారి మేనత్త నాగమ్మగారు, ద్రావిడ పాశురాలు స్త్రీలపాటలు - రామాయణ భారత భాగవత సంబంధి పాటలు - పరశురామ పంతుల వారి సీతపాట పాడగా విన్నాను. నాగమ్మగారు తేలుమంత్రం, పశువులకు వచ్చే చెడువాపు, పాముమంత్రాలు నేర్పింది. వీటిగూర్చిన అనుభవాలు చెప్పటానికి ఈ సందర్భంలో వీలు పడదు. దేవునూరు వీథిబడి చదువు పూర్తికాగానే నన్ను మడికొండకు పంపించినారు. మా పెదనాయనగారి పర్యవేక్షణలో ప్రభుత్వప్రాథమిక పాఠశాలలో నా చదువు సాగినది.

దేవునూరెంత చిన్నగ్రామమో మడికొండ అంతపెద్ద గ్రామం. సంపన్నులు, సాధారణులు, పేదవారు, అన్ని వృత్తులవాళ్ళు, కవులు, పండితులు, పౌరాణికులు వేదవేదాంగ కోవిదులు, శతావధానులు, నటవిటీవిటగాయకులున్న గ్రామం అది. మడికొండలో తొటిరెడ్డి గోపాలరెడ్డి పెద్ద భూస్వామి సంస్కృతంలో మాట్లాడేవారు. మ.మ. శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రి గారికి రూ 1116 /- బాల సరస్వతి బిరుదం ఇచ్చి సన్మానం చేసింది గోపాల రెడ్డిగారే. ఆయన ఆస్థాన పండితులు పౌరాణికులు వానమామల బక్కయ్యశాస్త్రి గారు. బక్కయ్యశాస్త్రిగారి పెద్దకొడుకు వెంకటాచార్యులు షడ్దర్శనీపారగులు, తరువాతికాలాన కరీంనగరం జిల్లా గట్ల నరసింగాపురం గుండవరం జగన్నాథరావు ఆస్థాన పండితులు. రెండవ కొడుకు లక్ష్మణాచార్యులు చాందా జిల్లా ఆహిరీ సంస్థాన పండితులు, గొప్ప సంస్కృత కవులు. మూడవ, నాల్గవ కొడుకులు వానమామల జగన్నాథాచార్యులు,

వరదాచార్యులు గొప్ప తెలుగుకవులు, సంగీతవిద్వాంసులు, హరికథకులు. వీరవల్లి నరసింహాచార్యులు శతావధానులు. అనుముల పెద్దయ్య, పండరినాథశాస్త్రి, విశ్వనాథశాస్త్రి సోదరులు త్రేతాగ్నుల వంటి కాశీపండితులు. కాళోజీ రంగారావు గారు (కాళోజీ రామేశ్వర రావు, నారాయణరావు గార్ల తండ్రి) వేదకాలపు ఋషి వంటి సద్గురువు. పల్లా పాపయ్య సంగీతవిద్వాంసులు. ఆయన నాల్గవకొడుకు పల్లా దుర్గయ్య ఉస్మానియా విశ్వవిద్యాలయం మొదటి తెలుగు ఎం.ఏ. (1942). అనుముల విశ్వనాథ శాస్త్రి కొడుకు అనుముల కృష్ణమూర్తి నాకంటే రెండేండ్లు పెద్దవాడు తరువాతి కాలాన చక్కని కవి. విశ్వనాథశాస్త్రి గారు తమ కొడుక్కు అమరం - అగ్నిసూక్తం నేర్పుతుంటే విని నేను నేర్చుకున్నాను. మా పొరుగిల్లు తంబళి పాపయ్య (బోడకాకరకాయ బొట్టు - తమ్మళ్ళ పాపయ్య జుట్టు - పిల్లల పాటలకెక్కిన ప్రసిద్ధుడు) కొడుకు ముత్తిలింగం వీతరాగి, గాయకుడు. వాళ్ళింట్లో హార్మోనియం, తబ్లా, ఢక్కి,మద్దెల,వీణ, వేణు వాద్యాలుండేవి. వానమామల సోదరులు, మరికొందరు అక్కడ సంగీతసాధన చేసేవారు. భజనలు హరికథలు జరిగేవి. వానమామల సోదరులు, పల్లాదుర్గయ్య, మోతుకూరి మధుసూదన రావు, ఆవాల వెంకట రెడ్డి నాటకాల రిహార్సల్స్ చేస్తుంటే నేను ప్రాంప్టింగ్ చేసేవాణ్ణి. బాపట్ల నుండి తెలంగాణానికి వచ్చిన వల్లూరి బసవరాజుగారు (తరువాత కాలాన గొప్ప కాంగ్రెస్ నాయకులు-మంత్రి మాణిక్యం) మడికొండ సంపన్నుల పిల్లలకు ఇంగ్లీషు ట్యూషన్స్ చెప్పేవారు. మా బావ తిరుపతిరాజు మా అన్న శ్రీనివాసరాజు ఆయన వద్ద ఇంగ్లీషు నేర్చుకున్నారు. నేను పుట్టకముందే మడికొండలో (1924) ప్రతాపరుద్ర ఆంధ్ర గ్రంథాలయం నెలకొన్నది. ఇటు వంటి వాతావరణంలో మడికొండలో మూడవతరగతి దాక చదువుకున్నాను.

మా మేనబావల చదువులకోసం మా నాయనమ్మ హనుమకొండలో ఉండటంచేత నేను హనుమకొండ మఛ్లీ బజారు స్కూల్లో మరల మూడవ తరగతిలో చేరినాను. ఏవో సెలవులకు దేవునూరికి పోతే నాకు సొమ్మరోగం వచ్చింది. ఆ యేడు చదువు పోయింది. మరుసటి సంవత్సరం హనుమకొండ లష్కర్ బజార్ మష్కీ మిడిల్ స్కూల్లో (గడ్డిబంగ్లా నార్మల్‌స్కూలుకు అనుబంధం) మరల మూడవతరగతిలోనే చేరినాను. ఈవిధంగా మూడవతరగతి మూడేండ్లు చదివినాను. ఈసారి మానాయన గారు నావెంట మా పెద్దపాలేరు ఎల్లిగొల్ల

ఐలయ్యను తోడుగా పంపినారు. అతని బంధువు కొమురయ్యాసార్ ఆ మిడిల్‌స్కూల్లో టీచరు. కొమురయ్యాసారే నన్ను నిలువునా చూచి నా అడ్మిషన్ ఫారం నింపినారు. నా పుట్టిన తేది 15 బహ్మాన్ 1333 ఫసలీ అనగా 9-12-1923 వ్రాసినారు. నాకు మానాయనమ్మ తమ్ముడు మహా పండితుడు రాయపర్తివాసి ప్రతికంఠం కృష్ణంరాజుగారు, మరొకబంధువు ఓంకారం రామచంద్రరాజుగారు, కృష్ణాజిల్లా మంటాడవాసి జొన్నవిత్తుల వెంకట సుబ్బయ్య పాకయాజి (శ్రీ విద్యానందనాథ) శర్మగారు-ఈముగ్గురు వ్రాసిన మూడు జాతకాలున్నా కొమురయ్యాసార్ వ్రాసినదే అఫిషియల్ డేట్ ఆఫ్ బర్త్ ఐనది. దీనిని మార్చటానికి రెండుసార్లు ప్రయత్నించి విఫలుణ్ణయినాను. అది దైవేచ్ఛ - విధి బలీయం.

తొలిదినాలలో నేను హనుమకొండలో రాజపుత్రుల వాడలో బొందిలి చిన్నమ్మ ఇంట్లో ఉండేవాణ్ణి. మాయింటికి కుడివైపు మడిగెల్లో ఇ.వి.రామిరెడ్డి (తరువాత ఐ.ఏ.ఎస్.) ఆయన సోదరులు, ఎడమవైపు నాలుగిండ్ల ఆవల (ఈనాడు గాంధీభవన్ కార్యదర్శి) బి. లక్ష్మీకాంతరావు సోదరులు, ఆయన బావ పి.వి. నరసింహారావు (తరువాత భారత ప్రధానమంత్రి) ఉండేవారు. లక్ష్మీకాంతరావు చిన్న తమ్ముడు (నేలకొండ పల్లికి దత్తుపోయిన) కంకిపాటి జగన్మోహనరావు నా క్లాస్‌మేట్. మా యింటి కెదురుగా కొన్ని గజాల దూరంలో రోడ్డుకావల తెలంగాణంలో రెండవ గ్రంథాలయం (1904స్థాపితం) రాజరాజనరేంద్ర ఆంధ్రభాషానిలయం. హైదరా బాదులో శ్రీకృష్ణదేవరాయాంధ్రభాషానిలయం ఎట్టిదో హనుమకొండలో రాజరాజ నరేంద్రాంధ్రభాషానిలయం అట్టిది. అక్కడ శేషాద్రిరమణకవులు, గార్ల పాటి రాఘవ రెడ్డి, ఒద్దిరాజు శేషగిరిరావు, ముసిపట్ల పట్టాభిరామరావు, గొట్టిముక్కుల రాధాకృష్ణ రావు, కంభంపాటి అప్పన్న శాస్త్రి, డి.రాజా సార్, కాళోజీ సోదరులు ఇంకా ఎందరో కవులు పండితులు ప్రతిదినం కూడేవారు. ఆంధ్రప్రాంతంనుండి వచ్చే కవిపండితుల ప్రసంగాలు, అవధానాలు అక్కడే జరిగేవి. నేను ప్రతిదినం ఆ గ్రంథాలయానికి పోయి పత్రికలు కథలు నవలలు నాటకాలు చదివేవాణ్ణి . ఆనాటి దేశభక్తులైన ఆర్య సమాజం, ఆంధ్రమహాసభ, స్టేట్ కాంగ్రెస్ కార్యకర్తలు, ప్రముఖులు అక్కడ కనబడేవారు. 7 వతరగతిలో ఉండగా దినమొక నవల చొప్పున చదివి వేసవిసెలవుల్లో ఒక అపరాధపరిశోధక నవలవ్రాసినాను. ప్రతి ఉదయం పద్మాక్షి గుండానికో,

బాలసముద్రానికో, సిద్దేశ్వరతటాకానికో స్నానానికి పోయేవాణ్ణి. మిడిల్‌స్కూలు చదువులైన తరువాత కాలేజియేట్ హైస్కూల్లోను ఇంటర్ మీడియట్ కాలేజిలోను ఐదేండ్లు చదివినాను. మిడిల్‌స్కూల్లో భానుమూర్తిగారు హైస్కూల్లో ఇంటర్‌లో బారు శ్రీనివాసరావుగారు తెలుగు పాఠాలు చెప్పినారు. ఇంటర్‌లో సంస్కృతం పాఠాలు చెప్పినవారు సుప్రసిద్ధ వీరశైవ పండితులు ముదిగొండ వీరేశలింగశాస్త్రి గారు. హైస్కూలు వరకు తెలుగు, ఉర్దూ సబ్జక్ట్సులో నేనే సర్వప్రథముణ్ణి. తక్కిన సబ్జక్ట్సులో సెకండ్ క్లాస్ మార్కులు తెచ్చుకునేవాణ్ణి. ఇంటర్‌లో ఉర్దూ ఆప్షనల్ తీసుకుంటే స్టేట్ స్కాలర్‌షిప్ ఇప్పిస్తామన్నారు మా ఉర్దూ టీచర్. కాని నేను ఇంటర్‌లో ఎకనామిక్స్, తెలుగు, సంస్కృతాలు తీసుకున్నాను.

నా హైస్కూలు ఇంటర్ చదువులప్పుడు నాటి యువరాజకీయ కార్యకర్తలు కాళోజీ నారాయణ రావు, మధుసూదనరావు, హయగ్రీవాచారి, ఎం.ఎస్. రాజలింగం అడవాల సత్యనారాయణగారల సభలు సమావేశాల్లో పాల్గొన్నాను. వినాయకచవితి దసరా పండుగులప్పుడు జరిగే విద్యార్థుల వ్యాసరచన, వక్తృత్వ, తోకపద్య పఠనం పోటీల్లో పాల్గొన్నాను. 10వ క్లాసులో ఉండగా వసుచరిత్రకు వచనం వ్రాసినాను. ఆయేడు నిర్వహించిన ఆంధ్రవారోత్సవాల కమిటీకి నేనే కార్యదర్శిని. ఆ ఉత్సవాలకు నిజాం తమ్ముడు బసాలత్‌జంగ్ బహద్దర్, విద్యామంత్రి అరవముదు అయ్యంగార్, తెలుగుశాఖాధిపతి రాయప్రోలు సుబ్బారావుగార్లు హైదరాబాదునుండి వచ్చినారు. ఆసందర్భంలో జరిగిన కవిసమ్మేళనంలో 'ఆంధ్రుడా ఓ ఆంధ్రుడా' శీర్షికతో ఒక గేయం చదివినాను. పెద్దలు మెచ్చి నా వీపు తట్టినారు. ఇంటర్మీడియట్ చదువుతున్న పుడు లష్కర్‌బజారు మర్కజీ స్కూల్ సందులో మార్వాడీల ఇంట్లో ఉండేవాణ్ణి. ప్రక్కయింట్లో ఒద్దిరాజు సీతారామచంద్రరావు, రాఘవరంగారావు సోదరులుండేవారు. వారు బహుభాషల్లో పండితులు, కవులు. స్వగ్రామం ఇనుగుర్తి - పల్లెటూరునుండి (1918) విజ్ఞాన ప్రచారిణీగ్రంథమాల, తెనుగు పత్రిక (1922) వెలయించిన సారస్వతవ్రతులు. నా "తెలుగు సాహిత్యోద్ధారకులు" గ్రంథంలో వారి గురించి వ్రాసినాను. నేను 10వ క్లాసు చదువుతున్నపుడు మా మడికొండలో 12వ ఆంధ్రమహాసభలు జరిగినవి. ఇంటర్ చదువుతుండగా మహాత్మాగాంధీగారు వరంగల్లుకు వచ్చినారు. ఈ రెండు మహాసభల్లో నేను వాలంటీర్‌గా పనిచేసినాను. నేను 10వ క్లాసులో ఉన్నప్పుడే మా అన్న శ్రీనివాసరాజుగారు చనిపోయినారు.

ఆయన చిన్నపుడే ఇంటినుండి పారిపోయి ఏలూరులో మానాయన గారి స్నేహితుడు మోతే గంగరాజు గారింట్లో ఉంటూ గాంధీస్కూల్లో చదివి, సబర్మతీ ఆశ్రమంలో గాంధీ మహాత్ముని సేవించి జయ ప్రకాశనారాయణ గారికి అనుచరుడైనాడు. ఆయన మూలంగా మా ఇంట్లో రాజకీయ సామాజికచైతన్యం కలిగింది. బహుశః ఆ సంవత్సరమే మానాయనమ్మ తమ్ముడు రాయపర్తి కృష్ణం రాజుగారు చనిపోయినారు. ఆయన వద్ద వందలకొలది తాళపత్రగ్రంథాలుండేవి. ఆయన ప్రాచీన శాసనలిపులు చదివేవారు. మానాయన గారికి తాటికమ్మలపై ఘంటంతో లేఖలు వ్రాసి పంపేవారు. 1932 సంవత్సరం వరంగల్లులో కాకతీయోత్సవాలు జరిగినపుడు దూపాటి వెంకటరమణాచార్యులవారు కృష్ణంరాజు గారింటినుండి కొన్ని తాళ పత్రగ్రంథాలు తెచ్చి ప్రదర్శించినారు. అందులో ఒకటి శ్రీనాథుని శాలివాహన సప్తశతి. ఉత్సవాల తరువాత ఆగ్రంథం మరల వారికి తిరిగి ఇవ్వలేదు. అందువలన వారి మైత్రి చెడినది. సరసము విరసమైనది.

ఆదినాలలో సూబాకు ఒక ఇంటర్మీడియట్ కాలేజి ఉండేది. చివరి పరీక్షాకేంద్రం హైదరాబాదు సిటీకాలేజి. ఇంటర్ పరీక్షలు వ్రాయటానికి నేను 1946 వేసవిలో హైదరాబాదుకు వచ్చినాను. ఇంగ్లీషు, ఎకనామిక్స్ పరీక్షలు వ్రాసిన తరువాత జ్వరపడ్డాను.ఆజ్వరం టైఫాయిడ్‌గా మారింది, పరీక్ష పోయింది. ఉస్మానియా ఆసుపత్రిలో మూడు నెలలున్నాను. తరువాత నా బస జాంబాగ్ సుందరభవనంలోనికి మారింది. అది వందేమాతరం వీరభద్రరావు, రామచంద్రరావు సోదరుల కార్యస్థానం. దేశభక్తులైన ఆసోదరులు నిర్వహించే కార్యకలాపాల్లో పాల్గొంటూ 'లా' చదివినాను. ఆ దినాల్లో మెట్రిక్ ప్యాసైనవారు ఒక యేడాది లా చదివి వకీలు వృత్తి చేపట్టేవారు. రాయ బర్కత్‌రాయ్, నాగులవంచ కోదండ రామరావు (ఎన్. కె. రావు) గారలవద్ద లా పాఠాలు చదివినాను. నాటి మేధావుల్లో ఎన్. కె. రావుగా రగ్రగణ్యులు, ఆజంజంగ్ బహద్దరు గారికి సన్నిహితులు. వారు మోజంజాహి మార్కెట్ వద్ద వనపర్తి క్వార్టర్స్‌లో ఉండేవారు. అక్కడే కప్పగంతుల లక్ష్మణ శాస్త్రి, సురవరం ప్రతాపరెడ్డి, మందుముల రామచంద్రరావు గార్లుండేవారు. ఎన్. కె. రావు గారు బ్రహ్మచారి. వారికి శుశ్రూష చేయటానికి పోతూ వస్తూ సురవరంవారిని, కప్పగంతులవారిని దర్శించేవాణ్ణి . 1947 సంవత్సరం ఇంటర్ పరీక్ష మరల వ్రాసి ఉత్తీర్ణుడనైనాను. లా పరీక్ష వ్రాయలేదు.

అప్పటి తెల్లబట్టలవాళ్ళ అహమహమిక ఆడంబరాలు వింతగా ఉండేవి. మడికొండలో రెండు మూడు రెడ్ల కుటుంబాలవారు లా చదివి వకీళ్ళైనారు. అది చూచి మా చిన్నాయన కొండమరాజు గారు లా చదివి వకీలైనారు. మడికొండ హనుమకొండలకు సమీప గ్రామం వడ్డేపల్లి పింగిలి రెడ్డి భూస్వాముల ఆవాసం. ఆకుటుంబంలో ఒకాయన ఐ.సి.యస్. చేయటానికి విలాయత్‌కు పోయినాడు. నన్ను విలాయత్‌కు పంపే ఉద్దేశంతో మాపెదనాయన మానాయన ఇంగ్లీషు మీడియం నిజాం కళాశాలలో చేరుమన్నారు. ఇంటర్ దాకా ఉర్దూ మీడియం లో చదివినవాణ్ణి ఒక్కసారి ఇంగ్లీషుమీడియం లోనికి దూకినాను. ఎకనామిక్స్, పొలిటికల్ సైన్స్, తెలుగు-మూడు ఆప్షనల్స్ తీసుకొని 1947 - 1949 సంవత్సరాలు బి.ఏ చదివినాను. మొదటి కొన్ని నెలలు నిజాం కాలేజి హాస్టల్‌లో ఉన్నాను.

అది నిజాం రాష్ట్రంలో చీకటి యుగం. నిజాం నిరంకుశపాలన రజాకార్ల విజృంభణ. వాళ్ళ మోచేతినీళ్లు త్రాగే జాగీర్దార్లు, జమీందారుల దౌర్జన్యాల మూలంగా హిందూప్రజానీకం అష్టకష్టాలు పడ్డారు. హత్యలు, దోపిడీలు, గృహదహనాలు మానభంగాలు విచ్చలవిడిగా జరిగినవి. ప్రభుత్వోద్యోగులు 90 శాతం ముస్లిములే. ముస్లింపేదలు కూడ నవాబులట్లు గర్వించేవారు. విద్యార్థుల అహంకారానికి హద్దుల్లేవు. ఒక పండుగునాడు హిందూవిద్యార్థులు వండించుకున్న పాయసం గిన్నె రాత్రి భోజనసమయానికి ముస్లింవిద్యార్థులు ఎత్తుక పోయి తిని గిన్నె ఆవల పారవేసినారు. నేను నా సహాధ్యాయి నిజామాబాద నారాయణ (తరువాత పెద్ద గుత్తేదారు) ఆర్గురు ముస్లిం విద్యార్థులను చితుకబాదినాము. మరునాడే నన్ను నిజాంకళాశాల హాస్టల్‌నుండి తొలగించినారు. కొన్నిదినాలు నా చిన్నప్పటి మిత్రుడు సి.యస్. రామలింగం ఇంట్లో (తుల్జా భవాని మందిరావరణం) ఉండినాను. అటు తరువాత సహాధ్యాయులు ఖమ్మం సర్వదేవభట్ల నరసింహమూర్తి మాదిరాజు రామకృష్ణరావు లుండే మోతీగల్లీ చిదానందమఠం (బడీ చావిడీ వెనుక) లో చేరి స్వయం పాకం ప్రారంభించినాము. నాటి ఆర్య సమాజం, స్టేట్ కాంగ్రెస్, ఆంధ్రమహాసభ, హిందూమహాసభ నాయకులు నిజాం నిరంకుశత్వాన్ని ఎదిరించే వారితో సాన్నిహిత్యం పెంచుకున్నాను. మాదిరాజు రామకృష్ణరావు సహాధ్యాయి కానడే (తరువాత బొంబాయి హైకోర్టు జస్టిస్, ఔరంగబాద్ విశ్వవిద్యాలయం

వి.సి), ఉస్మానియా విద్యార్థి నాయకుడు, శ్రీరామానంద తీర్థ, జయప్రకాశ్ నారాయణ గార్లకు సన్నిహితుడు. కానడే, పురుషోత్తం పురాణిక్, అడవి రావు, వెంకట్రావు నాయుడులతో కలిసి ఒక రాత్రి బీబీనగర్ దాకా పరుగెత్తిపోయి పెద్దలు చెప్పిన పని చేసి వచ్చినాము. న బ్రూయాత్ సత్యమప్రియం - ఆనాటి దేశ భక్తులకు విరుద్ధంగా నిజాం ప్రభుత్వాన్ని సమర్థించే కలకత్తావాలా స్థాపించిన మీజాన్ తెలుగు పత్రికలో ఆధునిక ఆంధ్ర సాహిత్యచరిత్రలో గొప్పవారు అనిపించుకొనే మహామహులు సర్కారాంధ్రంనుంచి వచ్చి కొలువులు చేసినవారు, ఇక్కడి హిందువులకు తీరని అపకారం చేసినారు - న బ్రూయాత్ సత్యమప్రియం.

కాంగ్రెస్ నాయకులు గౌలీగూడ రామమందిరం వద్ద చేసిన సత్యాగ్రహంలో (10-8-1947) దాదాపు 25 మంది విద్యార్థులం పాల్గొన్నాము. మాతో 25 మంది పౌరులున్నారు. గౌలీగూడ పోలీసుస్టేషన్‌లో ఒక రాత్రంతా ఉన్నాము. రెండే ఇరుకు గదులు. ఊపిరాడక కొందరు పెద్దవాళ్ళు స్పృహ కోల్పోయినారు. ఆదినాల్లో నేను సాయుధుడుగా ఉండేవాణ్ణి. కాలేజికి పోయినా ఇతరులకు కనపడకుండా పిడి బాకు బొడ్లో ధరించేవాణ్ణి. సత్యాగ్రహానికి అట్లాగే వచ్చినాను. కానడేకు చెప్పితే మూత్రశాలకు పోయి బాకు పార వేసి రమ్మన్నాడు లేక పోతే క్రిమినల్ కేసౌతుందన్నాడు. అది చాలా విలువైన ఏనుగుదంతం పిడిబాకు. వివాహసమయంలో మా అత్త వారు ఇచ్చిన బాకది. మూత్రశాల వెనుక గౌలీగూడ గురుద్వారా ఉంటుంది. దేశభక్తులైన సిక్కులకైనా దక్కుతుందని ఆబాకును గురుద్వారాలోనికి విసరి వేసినాను. తెల్లవారి మమ్ములందరినీ కోర్టుకు తీసుకపోయినారు - జడ్జిగారు 3 నెలల కారాగారశిక్ష విధించినారు. చంచల్‌గూడ సెంట్రల్ జేల్లో దొడ్డుబియ్యం బువ్వ, ఉడికీ ఉడకని శనగలు, వెల్లిపాయల పులుసుకూర అల్యూమినియం బొచ్చెల్లో తిన్నాము. తోడి ఖైదీలకు ఇంటర్‌లో చదువుకున్న భగవద్గీత సాంఖ్యయోగం బోధించినాను. కానడే సోషలిజం పాఠాలు చెప్పినాడు. అదృష్టవశాత్తు మావిద్యార్థులను వారం దినాల్లో విడిచిపెట్టినారు.

నగరంలోని కళాశాలల విద్యార్థులమంతా నిజాం పరిపాలనకు, రజాకార్ల దురంతాలకు వ్యతిరేకంగా ఊరేగింపు 2-9-1947 నాడు తీసినాము. కానడేతో

పాటు నేను ఊరేగింపు అగ్రభాగాన ఉన్నాను. బషీర్‌బాగ్ చౌరస్తా వద్ద పోలీసులు అమానుషంగా లాఠీచార్జి చేసినారు. లాఠీ దెబ్బలకు తట్టుకోలేక నిజాంకాలేజి ప్రహరీ గోడ దూకి కాలేజిలో దూరినాము. బయట ఇంత అల్లకల్లోలంగా ఉన్నా నిజాంకళాశాల అధ్యాపకులు, విద్యార్థులు నిమ్మకు నీరెత్తినట్లున్నారు. నిజాంకళాశాల విద్యార్థులు నూటికి 90 శాతం నవాబులు, జాగీర్దార్ల పిల్లలు; మా వంటివారు 10 శాతం మాత్రమే. నేను ఇంటర్‌మీడియట్ తరగతి గదిలో బ్లాక్‌బోర్డ్ వెనుక దాగినాను. పోలీసులు కాలేజిలో ప్రవేశించి విద్యార్థులను కొడుతున్నారు. ఇంటర్ విద్యార్థులకు ఎకనామిక్స్ పాఠం చెప్పుతున్న ఒక హిందూ ప్రొఫెసర్ నన్ను చేయి పట్టి ఈడ్చి బయటికి త్రోసినాడు. న బ్రూయాత్ సత్యమప్రియం. కాలేజి మెట్ల వద్ద పోలీస్ సి.ఐ. నన్ను రక్తసిక్తమయ్యేట్లు కొట్టినాడు. నేను క్రింద పడ్డాను. పోలీస్ ఇన్స్పెక్టర్ తన బూటు కాలు నా నెత్తిపై పెట్టినాడు. ఇంతలో మా టీచర్ లీలామణినాయుడు (సరోజినీ నాయుడు పెద్దకూతురు) వచ్చి ఇన్స్పెక్టర్‌ను చెంపదెబ్బ కొట్టి నన్ను లేవనెత్తినది. మా ఇంగ్లీషు ప్రొఫెసర్ ఫజల్‌హఖ్ వచ్చి తమ గదికి తీసుకపోయి రక్తం తుడిచి మంచినీళ్ళు త్రాగించినారు. నేను పది దినాలదాక గాయాలతో బాధ పడుతూ కాలేజికి పోలేదు. దురదృష్టవశాత్తు 17-12-1947 నాడు మానాయన గారు దివంగతులైనారు. మా అన్నగారు 1944 సంవత్సరమే చనిపోయినారు. అందువలన నెలకొకసారి యింటికి పోయి వ్యవసాయపు పనులు చూచి వచ్చేవాణ్ణి. నాకు ఇద్దరు తమ్ములు ఒకడు హైస్కూలు విద్యార్థి, మరొకడు మిడిల్‌స్కూల్ విద్యార్థి, ఇద్దరు చెల్లెండ్లు - ఈనల్గురు పెండ్లి కావలసినవాళ్ళు. విలాయత్‌కు పోయి ఐ.సి.యస్. చేసే కల కరిగిపోయి చిదానందమఠంలో ఐ.సి.యస్.(ఇండియన్ కుకింగ్ సర్వీస్) చేస్తూ బి.ఏ చదివినాను. 'తానొకటి తలచిన దైవమొకటి తలచును' అనే సామెత నాయెడ సార్థకం ఐనది.

నిజాంకళాశాలలో నాకు ఎకనామిక్స్ చెప్పిన వారు సర్వశ్రీ ఖాలిద్ బిన్ సయీద్, రామనర్సు, ఆర్. వి. రావు గార్లు. పొలిటికల్ సైన్స్ చెప్పినవారు సర్వశ్రీ పి.వి. రాజగోపాల్, సిరుగూరి హనుమంతరావు, తెలుగు చెప్పిన వారు సర్వశ్రీ సరిపల్లి విశ్వనాథశాస్త్రి, గరికిపాటి లక్ష్మీకాంతయ్యగార్లు, ఇంగ్లీషు చెప్పిన వారు సబాస్టియన్, ఫజల్‌హఖ్ గార్లు, ఎథిక్స్ చెప్పినవారు శ్రీమతి లీలామణి నాయుడు.

వీరందరిలో ఈనాడు ఒక్క పి.వి. రాజగోపాల్ గారే సజీవులుగా ఉన్నారు. నేను నిజాంకళాశాల తెలుగు విద్యార్థి సంఘానికి కార్యదర్శిగా ఉండి 'విద్యార్థి' అనే చేతివ్రాత మాసపత్రిక నడిపినాను. 'విద్యార్థి' అచ్చు పత్రిక తెలుగు విద్యార్థి సంఘం పక్షాన ఏడాదికొక సంచిక మాత్రమే వచ్చేది. ఆపత్రికల్లో నా పద్యాలు, పాటలు, వ్యాసాలున్నవి. సంఘం ఉత్సవాలపుడు గురజాడవారి కన్యాశుల్కం, డి.వి. నరసరాజుగారి అంతర్వాణి, వాపస్ హాస్యనాటికల్లో కొన్నిపాత్రలు పోషించినాను. 1947 ఆగస్టు 15 నాడు భారతదేశం స్వతంత్రమైనా హైదరాబాదు ప్రజానీకానికి నిజాం నిరంకుశత్వంనుండి విముక్తి 1948 సెప్టెంబరులో పోలీస్ ఆక్షన్ మూలంగా లభించింది. పోలీస్ ఆక్షన్ జరిపిన మేజర్ జనరల్ జె.ఎన్. చౌధరిగారిని విద్యార్థుల పక్షాన నేనే ఆహ్వానించి నిజాం కళాశాలలో మొదటి సమావేశం ఏర్పాటు చేసినాను. ఆనాటి నిజాం కళాశాల ప్రిన్సిపాల్ పి.సి. ఘోష్ వేదిక పైకి రావటానికి ప్రయత్నిస్తే నేనే కుర్చీ లాగివేసినాను. ఆయన నా కడుపులో తలపెట్టి పశ్చాత్తాపం ప్రకటిస్తే కూర్చుండనిచ్చినాను. ఆ సభలో వందేమాతరం గీతం పాడటం, స్వాగతవాక్యాలు పలకటం నా వంతే. పోలీస్ ఆక్షన్‌కు పూర్వం నన్ను కొరకొరగా చూసిన విద్యార్థులు (హిందువులు, ముస్లిములు) ఈ సమావేశం తరువాత నాతో కరచాలనం చేయటం ఆరంభించినారు. కొందరు గాంధీటోపీలు ధరించి మతసామరస్యం, దేశభక్తి చాటనారంభించినారు. నాటి ముస్లింలు ఇట్లా ప్రవర్తిస్తే ఈనాటి అన్ని పార్టీల హిందువులు గుడ్డటోపీలు ధరించి ఇఫ్తార్ విందులిస్తూ కుహనామతసామరస్యం చాటుతున్నారు. న బ్రూయాత్ సత్యమప్రియం.

కామినీ కాంచనాలు, ఇనుపకచ్చడాల్ కట్టిన మునిముచ్చులను గూడ అధోగతి పాలు చేయగలవు. నగరంలో ఆయుధాలున్న వారందరూ సరెండర్ చేయవలసిందని జె.ఎన్. చౌధరిగారు ప్రకటించినారు. మూసారాం బాగ్ మేన్ రోడ్డు కావల ఆస్మాన్ గడ్ గుట్టపై ఒక నవాబుండేవాడు. ఆతని కొడుకు నా క్లాస్‌మేట్ గాంధీ టోపీధారి. ఆ నవాబు మేజర్ జనరల్ చౌధరీ గారిని విందు కాహ్వానించినాడు. నా క్లాస్‌మేట్ నన్ను రమ్మన్నాడు. ఆ విందులో దాదాపు 50 మంది నవాబులు 50మంది వారి స్త్రీలు పాల్గొన్నారు. వంద వెండి కంచాలు రెండువందల బంగారు గిన్నెల్లో మేవాలు ఇతరఖాద్యాలు వడ్డించినారు. నేను

ఉన్నతకుటుంబాల ముస్లింస్త్రీల సౌందర్యం ఆనాడే మొదటి సారి చూచినాను. నిజాం రాజ్యమంతటా జరిగిన పోలీస్ ఆక్షన్ అక్కడ వెలవెల బోయింది. ఇటీవల నిజాంకళాశాల శతవార్షికోత్సవాల సందర్భంగా ప్రకటించిన ప్రత్యేక సంచికకు ఆనాటి నా అనుభవాలు వ్రాయుమన్నారు. నేను వ్రాసినాను. అందులోని చాలా విషయాలు తొలగించి నా వ్యాసం ప్రకటించినారు. న బ్రూయాత్ సత్యమప్రియం.

నిజాం రాష్ట్రంలోని 16 జిల్లాల్లో 8 జిల్లాలు తెలుగు వారుండే తెలంగాణం. ఐదుజిల్లాల మహారాష్ట్రులు, మూడు జిల్లాల కన్నడిగలు సామాజిక, విద్యా, వైజ్ఞానిక రాజకీయరంగాల్లో తెలుగువారికంటే ముందుండేవారు. తెలుగువారి అభిమానం దెబ్బతిని 1921లో ఆంధ్రజనసంఘం (తరువాతికాలాన ఆంధ్రమహాసభ) ప్రారంభమై నట్లే తెలుగు విద్యార్థుల అభిమానం దెబ్బతిని 1948 లో తెలంగాణా విద్యార్థి సంఘం ప్రారంభమైనది. ఆ విద్యార్థి సంఘానికి నేను అధ్యక్షుడను, మాదిరాజు రామకృష్ణ రావు కార్యదర్శి. దాని ప్రారంభోత్సవం సుప్రసిద్ధ సాహిత్య పరిశోధకులు, తెలుగు సాహిత్యంలో ఆంధ్రదేశంలో మొదటి పి.హెచ్‌డి. డా॥ చిలుకూరి నారాయణ రావుగారిచేత శ్రీకృష్ణదేవరాయాంధ్రభాషానిలయంలో జరిగింది. తెలంగాణా విద్యార్థిసంఘం పక్షాన తెలుగు సాహిత్య సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసి తెలుగు విద్యార్థులను ఆకర్షించి వారిలో రాజకీయ సామాజిక చైతన్యం కలిగించటమే మా ఆశయం. పోలీసు చర్య తరువాత నేను స్టేట్ కాంగ్రెస్‌కు సంబంధించిన సిటీకాంగ్రెస్ కమిటీలో కార్య కర్తగా పనిచేసినాను. ఆనాటి సిటీ కాంగ్రెస్ ప్రెసిడెంటు ఎల్లం సత్యనారాయణ గారికి సన్నిహితంగా ఉండిన రామమూర్తి నాయుడు, బాబురావు వర్మలలో నేను ఒకణ్ణి. కృష్ణదేవరాయాంధ్రభాషా నిలయం, సాధన సమితి, ఆంధ్ర సారస్వత పరిషత్తు, హనుమాన్ వ్యాయామశాల, వందేమాతరం సోదరుల సుందరభవనం కార్యాలయం నాకు దర్శనీయస్థలాలు. నేను చిదానందమఠంలో ఖమ్మం విద్యార్థులతో కలసి ఉండేవాణ్ణి. అక్కడ సర్వదేవభట్ల నరసింహమూర్తి, మాదిరాజు రామకృష్ణ రావు, మాదిరాజు లక్ష్మీనరసింహారావు (ఈనాడు ఎం.ఎల్. నరసింహారావు) నేను మరికొందరు వండుకొని తింటూ చదువుకునే వాళ్ళం. నేను బి.ఏ. ఫైనల్లో ఉండగా మాదిరాజు లక్ష్మీనరసింహారావు చాదర్ఘాట్ కాలేజి ఇంటర్ మొదటి సంవత్సరంలో

చదువుతుండేవాడు. ఆయనే తన సహాధ్యాయి సి. నారాయణ రెడ్డిని, మఠానికి తీసుకవచ్చి నాకు పరిచయం చేసినాడు. అటు తరువాత సి. నారాయణరెడ్డితో నా పరిచయం గాఢస్నేహంగా మారింది. తరువాతకాలాన తెలంగాణా రచయితల సంఘంలో ఇరువురం దాశరథి, కాళోజీ నారాయణ రావు గార్లకు బాసటగా ఉన్నాము. ఆయనతో కలిసి వేదికలపై ఆశువుగా ఆయనొకపాదం చెప్పితే నేనొకపాదం చెప్తుతూ జంట కవితలు చెప్పినాను. మమ్ములను రామనారాయణకవు లనేవారు.

నేను ఎం.ఏ. ప్రథమ చదువుతుండగా 19, 20, 21 ఏప్రిల్ 1950 సంవత్సరం ఆదిలాబాదు జిల్లా మంచిర్యాలలో ఆంధ్రసారస్వత పరిషత్తు ఆరవ మహాసభలు జరిగినవి. ఆసభల్లో నేనొక వ్యాసం చదివినాను. అది విన్న పెద్దలు మెచ్చినారు. పగలు విరామసమయంలో నేను, దాశరథి ఒక తడకలగదిలో సాయంకాలం జరిగే కవిసమ్మేళనంలో చదువబోయే పద్యాలు ఒకరికొకరు వినుపించుకుంటున్నాము. ఇంతలో సురవరం ప్రతాపరెడ్డిగారు మేమున్నచోటికి వచ్చి పల్కరించి నావ్యాసాన్ని మరల చదివించుకొని విన్నారు. ఎం.ఏ. తరువాత పరిశోధన చేయుమన్నారు. మంచి భవిష్యత్తుంటుందని దీవించి పోయినారు. ఇంతకుపూర్వం రెడ్డిగారిని చాలాసార్లు చూచినాను కాని ఇట్లా ప్రత్యక్షంగా వారితో మాట్లాడటం ఇదే మొదటి సారి. ఆయన నా జీవితాన్ని ఒక క్రొత్తమలుపు తిప్పిన అపరోక్ష గురువు. నన్ను రాజకీయాలనుండి, ఇతర ఉద్యోగాలనుండి తప్పించి తెలుగు పరిశోధనరంగంలోనికి నెట్టినవారు రెడ్డిగారే. నేను తలచినది కానీయక దైవం రెడ్డిగారిని ఉపకరణంగా చేసుకొని మరొకటి చేయించినది.

ఇంగ్లాండుకు పోయి ఐ.సి.యస్. చేసే భాగ్యం ఎట్లాగూ లేదు కనుక నా సహాధ్యాయులు కొందరు ఐ.ఏ.ఎస్, ఐ.పి.ఎస్. పరీక్షలకు వ్రాస్తుంటే నేనూ వ్రాద్దామనుకున్నాను. తీరా సమయానికి నా ఏజ్ బార్రైనట్లు గుర్తించినాను. నేను పుట్టినది **16-4-1925** నాడైనా లష్కర్‌బజార్ మిడిల్‌స్కూల్లో కొమురయ్యసార్ నా అడ్మిషన్ ఫారం నింపుతూ వేసిన **9-12-1923** తేది మూలంగా నాకు **25** ఏండ్లు దాటిపోయినవి. హనుమకొండ సెషన్స్‌కోర్టులో అప్పీలు వేసి మార్పించుకోవచ్చునని మిత్రులంటే నేను వెంటనే హనుమకొండకు పోయి నా హెచ్.ఎస్.సి. సర్టిఫికేటు,

జాతకాలు శ్రీ కాళోజీ రామేశ్వరరావుగారికి చూపించినాను. ఆనాడు శనివారం. తెల్లవారి ఆదివారం. సోమవారం నాడు అప్పీలు వేద్దామనుకున్నాము. నేను హన్మకొండలో ఉండక, స్వగ్రామం మడికొండకో దేవునూరికో పోక, అత్తవారింటికి పర్కాల తాలుకా జూకల్లుకు పోయినాను. వేసవి ఉక్కపోతకు డాబాపైన పడుకున్నాను. భారతి మాసపత్రిక అందులో హెచ్.ఎస్.సి. సర్టిఫికేటు తలగడవద్ద పెట్టుకొని నిద్రపోయినాను. గాలికి పత్రికలోని కాగితాలు రెపరెపలాడుతుంటే ఇంటి కావలికుక్కకు ఏమనిపించిందో కాని భారతి పత్రిక నా హెచ్. ఎస్.సి. సర్టిఫికెటు తెల్లవారేవరకు డాబాపైన డాబా క్రింద ముక్కలు ముక్కలుగా చించి పడవేసిన దృశ్యం కనిపించింది. ఇదొక అపశకునంగా భావించి కోర్టులో అప్పీలు వేయకుండా తిరిగి వచ్చినాను. అప్పటి నా మిత్రులు నాసహాధ్యాయులు రామన్, మహేంద్ర రెడ్డి, ఉమాపతిరావు ప్రభృతులు ఐ.ఏ.ఎస్, ఐ.పి.ఎస్. పరీక్షల్లో ఉత్తీర్ణులై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో ఒకరు ఛీఫ్ సెక్రటరిగా ఒకరు డి.జి.పి. గా మరొకరు కార్యదర్శిగా రిటైరైనారు. నేను తెలుగు టీచర్‌గా రిటైరైనాను. తానొకటి తలచిన దైవమొకటి తలచును అనేదానికి ఇంతకంటే వేరేమి నిదర్శనం కావలె ? ఉస్మానియా విశ్వవిద్యాలయంలో నాతోపాటు ప్రొఫెసర్లు గా ఉన్న ఒకరిద్దరు హైకోర్టుకు అప్పీలు చేసి గెలిచి వయస్సు మార్పించుకొన్న విషయం తెలిసి నేను కూడ 1981 లో అప్పీలు చేసినాను. నాకున్న మూడు జాతకాలు నా తరువాత చెల్లె తమ్ముల స్కూలు సర్టిఫికేట్లు మాఅక్క జాతకం సాక్ష్యాధారాలిచ్చినాను. ఒక పేరుమోసిన లాయరు మిత్రునికి అడిగినంత ఫీసు ఇచ్చినాను. ఈలోగా ఒకసారి పుట్టపర్తికి పోయినపుడు భగవాన్ బాబాకు ఈ విషయం మనవి చేస్తే వారు "ఎందుకీ దండుగు పను"లన్నారు. పెద్ద లాయరుగారు తమ జూనియర్లను పంపించటంచేతనో ఏమో నేను ఓడిపోయి 1985లో రిటైర్ కావలసిన వాణ్ణి 1983 సంవత్సరమే రిటైరైనాను. విధి బలీయం కదా! "తానొకటి తలచిన దైవమొకటి తలచును" నిజమైనది.

ఐ. ఏ. ఎస్. పరీక్ష వ్రాయటానికి వయఃపరిమితి చెల్లిపోయినా హెచ్.సి.ఎస్. అనగా హైదరాబాదు సివిల్ సర్వీస్ పరీక్ష వ్రాయటానికి తగిన వయస్సుండటంచేత 1951 సంవత్సరం ఆపరీక్ష వ్రాసి ఉత్తీర్ణుడనైనాను. డిస్ట్రిక్ట్ పంచాయతి ఆఫీసర్‌గా నియుక్తి జరిగింది. సెక్రటేరియట్ లో 15 దినాలు ట్రేనింగ్ పంచాయతీరాజ్ సెక్రటరీ

ఖ్వాజా నజ్జఫ్ అలీఖాన్ గారి వద్ద పూర్తి చేసినాను. సురవరం ప్రతాపరెడ్డిగారు గోలకొండ పత్రికనుండి వైదొలగి ప్రజావాణి పత్రిక నడుపుతున్న దినాలవి. వారి పత్రికలో న్యూస్‌రీడర్ గా నేను పని చేస్తున్నాను కనుక వారికీ విషయం మనవి చేస్తే "ఆ ఉద్యోగానికి పోవద్దు. యూనివర్సిటీలో తెలుగు అధ్యాపకుడుగా చేరు" మన్నారు. రెడ్డిగారి మాట శిరసావహించి అప్పటి వి.సి. డా॥ సూరి భగవంతంగారి నడిగి పంచాయత్ ఆఫీసరు పదవికి రాజీనామా చేసినాను. తానొకటి తలచిన దైవమొకటి తలచును అనే సామెత నాయెడ సార్థకమైనది.

1949-1951 సంవత్సరాలలో ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఆర్ట్స్ కళాశాలలో తెలుగు ఎం.ఏ. చదివినాను. నాతోపాటు ఇల్లిందల సరస్వతీదేవిగారి కూతురు ఇల్లిందల సుజాత కూడా ఎం.ఏ. చదివినది. ఉస్మానియా తెలుగు శాఖ చరిత్రలో అప్పటికి మా యిరువురున్నదే పెద్ద బాచ్. పల్లా దుర్గయ్యగారు ఉస్మానియాలో మొదటి తెలుగు ఎం.ఏ. (1942) 1951 సంవత్సరం దాకా ఏడాదికొకరు కూడా ఎం.ఏ. చదివినట్లు లేదు. నేను పదవ ఎం.ఏ. 1951. అప్పటికి ఎం.ఏ. చేసిన వారిలో నేనే ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణుడైనవాడిని. మాకు తెలుగు ఎం.ఏ. పాఠాలు చెప్పిన గురువులు ఖండవల్లి లక్ష్మీరంజనం, వెల్లటూరు వెంకటరాఘవ శర్మ, ఒక నెలదినాలు కె. గోపాలకృష్ణరావుగార్లు.

ఆంధ్రవిద్యార్థి సంఘానికి నేనే అధ్యక్షుణ్ణి. 1950 సంవత్సరం వార్షికోత్సవానికి బూర్గుల రామకృష్ణరావుగారిని ముఖ్య అతిథిగా ఆహ్వానించినాను. ఆర్ట్స్ కళాశాల ఎంట్రెన్స్ హాలు చాలా అందంగా ఉంటుంది. ఇతర యూనియన్ల వారికి ముఖ్యమైన సమావేశాలకు అక్కడ అనుమతించినందున నేను వార్షికోత్సవ సభ అక్కడ పెట్టు కుంటానంటే ప్రిన్సిపాల్ దొరస్వామి అనుమతించలేదు. హాల్ నెంబరు 57లో పెట్టుకున్నాము. ఆ సమావేశంలో నేను నా స్వాగతోపన్యాసంలో "ఈ భవనం ప్రతినాల్గు రాళ్ళలో రెండు రాళ్ళు నావి అంటే తెలంగాణా తెలుగువారివి. ఒకటి మహారాష్ట్రులది మరొకటి కన్నడిగలది. ఒకరాయి కూడ లేనివారికి సమావేశానికి అనుమతించి రెండురాళ్ళున్నవానికి అనుమతించలే" దన్నాను. ఆ వార్త ఎవరో మోసుకపోయి ఆనాటి వి.సి. అలీయావర్ జంగుకు చేరవేసినారు. ఆయన ఆదేశం మేరకు ప్రిన్సిపాల్ దొరస్వామి నన్ను పిలిపించి

లిఖితపూర్వకంగా క్షమార్పణ వేడు కొమ్మన్నారు. నేను నిరాకరించినాను. అప్పటి గణిత శాఖాధ్యక్షులు ఉరుపుటూరి వెంకటాచార్యులు, ఫిజిక్స్ శాఖాధ్యక్షులు రావాడ సత్యనారాయణ, కెమిస్ట్రీ శాఖాధ్యక్షులు నండూరి వెంకటసుబ్బారావుగార్లు నాకు అభయం ప్రసాదించి నన్ను సమర్థించినారు. మా గురువులు లక్ష్మీరంజనంగారు నా మాటలకు సంతోషించినా అపాలజీ చెప్పుమన్నారు. నేను చెప్పలేదు. నేను ఎం.ఏ. ఫైనల్ లో ఉండగా సి. నారాయణ రెడ్డి బి.ఏ. లో చేరినాడు. జంటనగరాలలో నేనే మొదటిసారి పెద్ద యెత్తున ఆంధ్రవారోత్సవాలు ప్రారంభించినాను. ఆ సభలకు మామిడి పూడి వెంకటరంగయ్య, సురవరం ప్రతాపరెడ్డి, విశ్వనాథ సత్యనారాయణ, గడియారం వెంకట శేషశాస్త్రి, పుట్టపర్తి నారాయణాచార్యులు, దేవులపల్లి వెంకటకృష్ణశాస్త్రి. కాటూరి వెంకటేశ్వరరావు, శ్రీశ్రీ, దాశరథి, జొన్నలగడ్డ సత్యనారాయణ వంటి హేమాహేమీలు వచ్చినారు. అప్పుడప్పుడే గళం విప్పుతుండిన సి. నారాయణరెడ్డి కామెంటరీ ఆ ఉత్సవాల్లో విద్యార్థులకు, భాషాభిమానులైన పెద్దలకు ఆహ్లాదకరంగా ఉండేది.

1951 సంవత్సరం నేను పార్ట్‌టైం లెక్చరర్‌గా సైఫాబాదు కళాశాల, సికింద్రాబాదు కళాశాలలో పని చేసినాను. 1952 సంవత్సరం నుండి ఫుల్‌టైం లెక్చరర్ గా చేరినాను. ఆ యేడే హైదరాబాదు రాజ్యంలో మొదటి సారి సార్వత్రిక ఎన్నికలు వచ్చినవి. అప్పటికి నేనింకా ఫుల్‌టైం లెక్చరర్‌ను కాలేదు. తెలంగాణా విద్యార్థి సంఘానికి అధ్యక్షుడుగా ఉన్నందున నాకంటె సీనియర్ విద్యార్థినాయకుడు ఇన్నిపేట మనోహర్ రావు హఠాత్తుగా చనిపోయినందున బూర్గుల రామకృష్ణరావుగారు నాకు శాసనసభకు కాంగ్రెసు టికెట్ ఇప్పించినారు. సురవరం ప్రతాపరెడ్డి గారికి కూడ కాంగ్రెసు టికెట్ ఇచ్చినారు. సురవరం ప్రతాప రెడ్డిగారికి నేను రాజకీయాల్లోకి పోవటం ఏ మాత్రం ఇష్టం లేదు. అందువలన ఆయన నాకు ఒక అరగంట హితబోధ చేసి తెలుగు సాహిత్య రంగానికి నన్ను ముడి వేసినారు. నేను రామకృష్ణరావుగారికి ఈ విషయం మనవి చేసి రాజకీయరంగంనుండి శాశ్వతంగా తొలగిపోయినాను. దైవనిర్ణయమే నాకు శిరోధార్యమైనది.

హైదరాబాదు నగరంలో ఓం ప్రథమంగా ప్రభుత్వం సంగీత కళాశాల ప్రారంభించినది. మొదటి ప్రిన్సిపాల్ సుప్రసిద్ధ సంగీత విద్వాంసులు వింజమూరి

వరదరాజ అయ్యంగార్. హిందుస్తానీ, కర్ణాటక గాత్ర వాద్య సంగీతాల బోధన ప్రారంభమైనది. అది సాయం కళాశాల కనుక నేను కర్ణాటక గాత్రసంగీతం నేర్చుకోవటానికి, నాకు మూడవ తరగతి నుండి సహాధ్యాయి సి.ఎస్. రామలింగం సితార్‌వాద్యం నేర్చుకోవటానికి చేరినాము. నోరినాగ భూషణం, ఉప్పలపాటి అంకయ్యగార్లు నా సంగీత గురువులు. 12-8-1952 నాడు సరళీస్వరాలతో ప్రారంభించి 2-3-1953 నాటికి శంకరాభరణం ఆదితాళం "సామీ నిన్నే కోరి చాల మరులు కొన్నదిరా" అనే తానవర్ణం దాకా నేర్చుకున్నాను. పరీక్షల సమయానికి తీవ్రంగా జబ్బుపడ్డాను. మా రామలింగం సితార్ వాద్యంలో నిపుణుడై తరువాత రవిశంకర్ శిష్యుడై ఆ విద్యలో పిహెచ్.డి. చేసినాడు. నా సంగీతం అంతటితో ఆగిపోయింది. "తానొకటి తలచిన దైవమొకటి తలచును" సామెత అడుగడుగునా నన్ను నిలువరించింది.

నేను తెలుగుశాఖలో పార్ట్‌టైం లెక్చరర్‌గా చేరిన 1951వ సంవత్సరమే దివాకర్ల వేంకటావధానిగారు ఫుల్‌టైమ్ లెక్చరర్‌గా చేరినారు. 1952 సంవత్సరం నేను ఫుల్‌టైం లెక్చరర్‌ను ఐనాను. ఆయేడే మొదటిసారి తెలుగులో పరిశోధన చేయటానికి ఉస్మానియా విశ్వవిద్యాలయం వీలు కలిగించింది. నేను సురవరం ప్రతాపరెడ్డిగారిని లక్ష్మీరంజనంగారిని సంప్రదించి తెలుగు జానపద గేయసాహిత్యంపై పరిశోధన చేయటానికి దరఖాస్తు పెట్టుకున్నాను. ఆ దినాల్లో పిహెచ్.డి. అడ్మిషన్ కమిటీ స్వరూపం వేరుగా ఉండేది. తెలుగేతర శాఖాధ్యక్షులు కూడ అందులో ఉండటం చేత, వాళ్ళు జానపద సాహిత్యం కూడ ఒక సాహిత్యమేనా అంటూ నిరాకరించటం చేత, తెలుగు యక్షగానాల గూర్చి పరిశోధనకు అనుమతించటంచేత ఆ విషయమై ఆరు నెలలు కృషి చేసినాను. ఆరు నెలల తరువాత ఏదో సమావేశానికి ఆంధ్ర యూనివర్సిటీ తెలుగు శాఖాధిపతి జి.జె. సోమయాజిగారు వస్తే వారికి నా కృషి చెప్పినాను. ఆయన నా సినాప్సిస్ తీసుకున్నారు. అటు తరువాత "ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఎస్.వి. జోగారావు కూడ యక్షగానాలగూర్చి కృషి చేస్తున్నాడు. నీ సినాప్సిస్ ఆయనకు చూపిస్తాను" అన్నారు. నేను సరేనన్నాను. లక్ష్మీరంజనంగారికి ఈ విషయం తెలిసి నన్ను కోప్పడ్డారు. జోగారావు సినాప్సిస్ నీకిచ్చినారా? నీ సినాప్సిస్ ఆయనకెందు

కిచ్చినావు? అన్నారు. మరుసటి సంవత్సరం అనగా 1953 సంవత్సరం మరల తెలుగు జానపద గేయ సాహిత్యం గూర్చే పరిశోధన చేస్తానని దరఖాస్తు పెట్టుకున్నాను. అభ్యంతరం తెలిపిన మారేమండ రామారావుగారికి సురవరం ప్రతాపరెడ్డి లక్ష్మీరంజనంగార్ల చేత చెప్పించి జానపదంలో పరిశోధన చేయటానికి పూనుకున్నాను.

నాకు పిహెచ్.డి. పరిశోధన భూతం ఆవేశించిన తరువాత నెలకు రెండు సార్లు దేవునూరికి పోయి వ్యవసాయం పనులు చూడటం మాని రెండు మూడు నెలలకు ఒకసారి ఇంటికి పోయి వ్యవసాయం పనులు చూచేవాణ్ణి. దాని మూలంగా కలం వ్యవసాయం బాగా సాగినా హలం వ్యవసాయం చెడిపోయింది. ప్రతి ఆదివారం, ఇంకా సెలవుల్లో తెలంగాణా జిల్లాలన్నీ తిరిగి వందలు వేలు చిన్నవి పెద్దవి గేయాలు సేకరించినాను. విశాఖపట్నం, రాజమహేంద్రవరం, ఏలూరు, బెజవాడ, మద్రాసు చాకలపేట పుస్తకాల కొట్లు, షాపులు తిరిగి లభించిన ముద్రితగేయాల పుస్తకాలు సంపాదించుకున్నాను. 26-1-1955 నాడు థీసిస్ వ్రాత ప్రారంభించి చాలా భాగం వ్రాసి 1955 వేసవి సెలవుల్లో మద్రాసులో నెల దినాలున్నాను. నాకు అఫీషియల్ సూపర్‌వైజర్ ఖండవల్లి లక్ష్మీరంజనంగారైతే, అన్‌అఫీషియల్ సూపర్‌వైజర్ డా॥ శ్రీపాదగోపాల కృష్ణమూర్తి మద్రాసు ప్రెసిడెన్సీ కళాశాలలో ఫిజిక్స్ ప్రొఫెసర్. మద్రాసులో శ్రీపాద, మల్లంపల్లి వారల తోడ్పాటుతో ప్రాచ్య పుస్తక భాండాగారంలో అముద్రితగాథా గేయాలు, పల్నాటివీరుల చరిత్రలు, కాటమరాజు కథలు వంటివి చదివి నోట్సు వ్రాసుకొని వచ్చి థీసిస్ టైపు చేయించి 29-7-1955 నాడు సబ్‌మిట్ చేసినాను. నాతోపాటే 29-7-1955 నాడే సబ్‌మిట్ చేసిన ఒక పెద్దాయన కొడుకు 1955 కాన్వొకేషన్‌లో డిగ్రీ తీసుకున్నాడు. నా థీసిస్ ఫలితాలు గజగర్భమై 20.8.1956 నాడు ప్రకటించటం చేత 1956 కాన్వొకేషన్‌లో పిహెచ్.డి. డిగ్రీ తీసుకున్నాను. నా తరువాత ఏడాదికి మా శాఖలో థీసిస్ సబ్‌మిట్ చేసినాయన పరీక్షాఫలితాలు 4 నెలలకే ప్రకటించినారు. పాలకుల పక్షపాత వైఖరి - న బ్రూయాత్ సత్యమప్రియం. ఐనా ఉస్మానియా తెలుగు శాఖలో నాదే మొదటి పి.హెచ్.డి. దాక్షిణాత్య భాషల్లో జానపదం గూర్చి వ్రాసిన మొదటి పిహెచ్.డి. కూడ నాదే.

1957 సంవత్సరం తెలుగు శాఖలో రీడర్ పదవులకు అవకాశం వచ్చింది. ఆపదవికి అర్హతలు 1. ఐదేండ్ల సర్వీస్ ప్లస్ పిహెచ్.డి. డిగ్రీ ఉండవలె. 2. పన్నెండేండ్ల సర్వీస్ ఐనా ఉండవలె. నాకు మొదటి సూత్రం వర్తిసుంది. పల్లా దుర్గయ్యగారికి రెండవ సూత్రం వర్తిస్తుంది. దివాకర్ల వెంకటావధానిగారికి ఈ రెండూ వర్తించవు. వాళ్ళిద్దరికీ పిహెచ్.డి. డిగ్రీలు లేవు. తెలుగు శాఖలో మూడు రీడర్ పదవులెందుకన్నారు అధికారులు. సీనియర్ అని దుర్గయ్యగారికి పండితుడని అవధానిగారికి రీడర్ పదవులు ఇవ్వ నిశ్చయించినారు. చిన్నవాడని నన్ను ఉపేక్షించినారు. నా కడుపు మండింది. నేను సిండికేట్ మెంబర్ డా॥ యస్. శ్రీదేవికి, (ప్రిన్సిపాల్ విమెన్స్ కాలేజి) చెప్పుకున్నాను. మిత్రులు పి.వి. నరసింహారావు గారిచేత మరొక సిండికేట్ మెంబర్ వామన్ నాయక్ గారికి చెప్పించినాను. నన్ను ఉపేక్షించటానికి మూలకారకుడైన ప్రిన్సిపాల్ దొరస్వామికి ఆనాటి కాంగ్రెసు నాయకులు, మంత్రులు డా. మేల్కోటే, వి.బి. రాజుగార్ల చేత చెప్పించినాను. నాముందరే వి.బి. రాజుగారు టెలిఫోన్‌లో మాట్లాడి దొరస్వామిని గట్టిగా మందలించినారు. తత్ఫలితంగా మా ముగ్గురికీ ఒకేసారి 1957 సంవత్సరం రీడర్ పదవులిచ్చినారు.

దుర్గయ్యగారు, అవధానిగారు ఇద్దరూ నాకంటే పెద్దవాళ్ళు. నాకు మాన్యులు. వాళ్ళతో పోటీ పడాలెనంటే నా అర్హతలు పెంచుకోవలె. పరిశోధన రంగంలో వారి కంటె ముందుండవలె. అందుకోసం నేను నిరంతరం పరిశ్రమిస్తూ జానపదరంగంలోనే కాక ప్రాచీన సంస్కృతాంధ్రసాహిత్యరంగాలలో అనేక పరిశోధనాత్మక వ్యాసాలు ప్రచురించినాను. జానపదమంటె మన పండితులకు చిన్నచూపు, అధికారులకు చిన్నచూపు. అందువలన 1955 నుండి 1968 దాకా పెన్నాడ అగ్రహారీకులు, విశ్వనాథ సత్యనారాయణ గారి 'మాస్వామి' కృతిభర్తలు మహాపండితులు శ్రీమదాచార్య రఘునాథ చక్రవర్తిగారిని మా ఇంట్లోనే ఉంచుకొని వారి వద్ద సంస్కృతం నేర్చుకున్నాను. మా అమ్మాయి రుక్మిణికి కూడా వారే సంస్కృతం నేర్పేవారు. వారి షష్ట్యబ్దపూర్త్యుత్సవాలు చేసి వారి కృతులు ప్రకటించినాను. 1960 సంవత్సరం సంస్కృతం ఎం.ఏ. చేసినాను, ఐతే నాకు అందులో థర్డ్ క్లాస్ వచ్చినది. కారణం ఎక్స్టర్నల్ ఎగ్జామినర్స్ కంటె ఇంటర్నల్ ఎగ్జామినర్ రెండు పేపర్లలో 15, 18 మార్కులు తక్కువ వేయటం. ఈ విషయం

మార్కులు తక్కువ వేసిన పండితుడే 1978 సంవత్సరం నాతో చెప్పి పశ్చాత్తాపం ప్రకటించినాడు. ఇంగ్లీష్ డిపార్ట్‌మెంట్‌లో రీడర్‌గా మొహమ్మద్ బిన్ ఉమర్ అనే ఆయన ఉండేవారు. ఆయన ఇంగ్లీష్ డిపార్ట్‌మెంట్‌లో పైకిరావటం కష్టమని ఉర్దూలో ఎం.ఏ., పిహెచ్.డి చేసి ఉర్దూ శాఖకు మారి ప్రొఫెసరైనాడు. "రామరాజు ఇప్పటికే తెలుగులో రీడరు కనుక సంస్కృతంలో ఎం.ఏ. పిహెచ్.డి. చేసి సంస్కృతం డిపార్ట్‌మెంట్‌కు మారి ప్రొఫెసరౌతాడు. మీ నోట్లో దుమ్ము పడుతుం"దని ఒకాయన చెప్పితే ఆ సంస్కృతాధ్యాపకుడు అట్లా చేసినాడట. బెంగుళూరులో భగవాన్ బాబా సన్నిధిలో రామాయణగోష్ఠి జరిగినప్పుడు (ఆ గోష్ఠికి నేనే కన్వీనరును కనుక) ఆ సంస్కృత పండితుడు నాతో చెప్పి పశ్చాత్తాపం ప్రకటించినాడు. ఆయనచేత అట్లెందుకు చేయించినారో! న బ్రూయాత్ సత్యమప్రియం. ఐనా నేను సంస్కృతంలో పిహెచ్.డి. చేయటానికి ఆనాటి సంస్కృత శాఖాధ్యక్షులు డా. ఆర్యేంద్రశర్మగారు అంగీకరించినారు. 'కాంట్రిబ్యూషన్ ఆఫ్ ఆంధ్ర టు సంస్కృత్ లిటరేచర్' (సంస్కృత సాహిత్యానికి ఆంధ్రుల వరివస్య) అనే విషయం గూర్చి వారి పర్యవేక్షణలోనే పరిశోధన చేయటానికి 1962 సంవత్సరం రిజిస్టర్ చేసుకున్నాను.

జానపద గేయసాహిత్యం గూర్చి శ్రమించినట్లే ఆంధ్రుల సంస్కృత సాహిత్య సేవ గురించి శ్రమించినాను. తెలంగాణమంతటా తిరిగి జానపద గేయాలు సేకరించినపుడే వందలకొలది తాళపత్ర గ్రంథాలు సేకరించినాను. సంస్కృత సాహిత్యచరిత్రలకెక్కని ఆంధ్రుల సంస్కృతకృతులనేకం లభించినవి. వాటినన్నిటిని గూర్చి నా సంస్కృతం థీసిస్‌లో వ్రాసినాను. మద్రాసు, తంజావూరు, కాకినాడ, విశాఖపట్నంలో ఉన్న తాళపత్ర గ్రంథాల్లోని ఆంధ్రుల అముద్రిత సంస్కృత కృతుల పరిచయం కూడ చేసినాను. ఇంతలో మా గురువులు ఆచార్య ఖండవల్లి లక్ష్మీరంజనంగారు రిటైరైనారు. ఆపదవికి మేం ముగ్గురం పోటీపడ్డాము. అప్పటికి నా వద్ద నల్గురు పిహెచ్.డి.లు చేసినారు. వాళ్ళిద్దరి వద్ద ఎవరూ చేయలేదు. నేను ఇంగ్లీషులో, తెలుగులో 50 రీసెర్చ్ పేపర్స్ ప్రచురించినాను. పిహెచ్.డి. థీసిస్ లు తప్ప వారికి రీసెర్చి పేపర్స్ లేవు. నేను లింగ్విస్టిక్స్‌లో పోస్ట్‌గ్రాడ్యుయేట్ డిప్లొమా చేసినాను. సంస్కృతం ఎం.ఏ. చేసినాను. ఐనా వయసులో చిన్నవాణ్ణి అనే సాకుతో

నాకాచార్యపదవి ఈయలేదు. అందరికంటే సీనియర్ దుర్గయ్యగారికీ ఆ పదవి ఈయలేదు. కారణం అది దైవేచ్ఛ. దేవేచ్ఛయే అధికారుల ఇచ్ఛ.

అప్పటి వి.సి. డి.యస్. రెడ్డిగారు గొప్ప పరిపాలనాదక్షుడు. ఆయన అప్పటికి రెండు టర్ములు వి.సి. గా ఉన్నాడు. మూడవ టర్మ్‌కోసం ప్రయత్నం చేస్తున్నాడు. వి.సి. నియామకానికి సిఫార్సు చేసే కమిటీకి (కేంద్ర మంత్రి) బెజవాడ గోపాలరెడ్డి గారు అధ్యక్షులు. ఆయన డి.ఎస్. రెడ్డిగారిని తెలుగు ప్రొఫెసర్ల సెలక్షన్ కమిటీకి తనను అధ్యక్షుడుగా వేయుమన్నాడట. తాము మూడవసారి వి.సి. కావలెనంటే బెజవాడ గోపాలరెడ్డిగారి ఇష్టం నెరవేర్చవలె. గోపాలరెడ్డి గారికి, దేవులపల్లి రామానుజరావుగారికి అవధానిగారు ఆశ్రితుడు. నేను స్నేహితుడనే గాని ఎవరికీ ఆశ్రితుణ్ణి కాదు. అప్పటికే అవధానిగారిపైన పరీక్షలకు సంబంధించిన ఏవో అభియోగాలుండి హైకోర్టు జడ్జిచేత విచారణ జరిపించి పరీక్షలనుండి డిబార్ చేసినారు. ఇంటర్వ్యూలకు వారం దినాల ముందు డి.ఎస్. రెడ్డిగారు నన్ను పిలిపించుకొని బెజవాడ గోపాలరెడ్డి గారు అవధాని విషయమై పట్టుదలగా ఉన్నారనీ కనుక ప్రస్తుతం నాకు సహాయం చేయలేమనీ అన్నారు. ఆంధ్రసారస్వత పరిషత్తు కార్యాలయంలో రామానుజరావు, బెజవాడ గోపాలరెడ్డి, నార్ల వెంకటేశ్వరరావుగార్లు సమావేశమై యుండగా నేను వెళ్ళితే గోపాలరెడ్డిగారు "రామరాజూ! నీవు చిన్నవాడవు. నీవు ఎప్పుడైనా ప్రొఫెసర్ వౌతావు. అవధాని ఇప్పుడు కాకపోతే ఆయన జీవితంలో ఇక అవకాశమే లేదు. ఐ లైక్ యూ ఆల్సో, బట్ పూర్ అవధాని మస్ట్ గెట్ ప్రొఫెసర్ షిప్ దిస్ టైం" అన్నారు. రామానుజరావుగారు (సిండికేట్ మెంబర్) గోపాలరెడ్డిగారినే బలపరచినారు. నార్లవారు మాత్రం నాకు అన్యాయం జరుగుతున్నదన్నారు. **30-3-1964** నాడు ఇంటర్వ్యూలు జరిగినవి. అవధానిగారిని ప్రొఫెసరుగా ఎంపిక చేసినారు. సాధారణంగా ఒకరినే ఎంపిక చేస్తారు ఏ పదవికైనా. సానుభూతితో నాకు రెండవ స్థానం ఇచ్చినారు. డి.ఎస్. రెడ్డిగారి దూరాలోచన నన్ను రెండవవానిగా నిల్పింది. తానొకటి తలచిన దైవమొకటి తలచును అనే సామెత నాయెడల పదేపదే నిజమౌతున్నది. అప్పటికి మూడువంతులు వ్రాసిన నా సంస్కృతం పిహెచ్.డి. థీసిస్ మూలకు పడవేసినాను విసుగుతో. అది యీ నాటికీ అట్లే మూలన పడి మూల్గుతున్నది.

తరువాత కొన్ని దినాలకు మూడవసారి వి.సి. ఐన డి.ఎస్. రెడ్డిగారు నన్ను పిలిపించుకొని "ఇంగ్లీషు డిపార్ట్‌మెంట్‌లో రెండవ ప్రొఫెసర్ షిప్ క్రియేట్ చేస్తున్నాము. తెలుగులో కూడ క్రియేట్ చేసి నీకిస్తా" మన్నారు. మీ దయ అంటూ కృతజ్ఞతలు తెలిపి బయటికి వచ్చినాను. తరువాతి సిండికేటు సమావేశాల్లో ఈ ప్రస్తావన వచ్చిందట. రాజకీయంగా బలవంతులైనవాళ్ళు డి.ఎస్. రెడ్డిగారిపై తమకిష్టమున్న వేరే వ్యక్తికి తెలుగు ఆచార్య పదవి ఇవ్వవలెనని వత్తిడి తెచ్చినారట. ఆయన ఇరకాటంలో పడ్డాడు. న బ్రూయాత్ సత్యమప్రియం. నన్ను పిలిపించి "రామరాజా! నీ కోసం నేను రెండవ ప్రొఫెసర్ షిప్ ఇంగ్లీషులోవలె క్రియేట్ చేస్తాననుకుంటిని. కాని అది నీకు వచ్చేటట్లు లేదు. నీవు వరంగల్ పి.జి. సెంటర్‌కు పోతావా ? అక్కడికి నీళ్లెవరూ పోరు. నీకే వచ్చే సంవత్సరం ప్రొఫెసర్‌షిప్ ఇస్తాను' 'అన్నారు. నేను ఆదిలాబాదు అడవులకైనా పోతాను కాని ఈ అవమానాలు భరించలేనన్నాను. డి.ఎస్. రెడ్డిగారి ఆదేశం ప్రకారం నేను **13-9-1967** నాడు వరంగల్ స్నాతకోత్తర కేంద్రంలో చేరినాను. డి.ఎస్. రెడ్డిగారు తెలుగులో రెండవ ప్రొఫెసర్ షిప్ ఫైల్ తొక్కి పెట్టినారు. ఏడాదిలోగానే వరంగల్లు స్నాతకోత్తర కేంద్రానికి ఇతర శాఖలతో పాటు తెలుగు శాఖకు ఆచార్య పదవులకు ఎంపికలు జరిగినవి. **11-6-1968** నాడు నేను తెలుగు ప్రొఫెసర్‌గా ఎంపికైనాను. దైవము అనుకొన్నది జరిగింది. తల వంచి స్వీకరించినాను.

1967 నుండి **1974** దాకా వరంగల్ స్నాతకోత్తర కేంద్రంలో తెలుగు శాఖాధిపతిగా జనవరి **1972** నుండి మార్చి **1974** దాకా స్నాతకోత్తర కేంద్రంలో ప్రిన్సిపాల్‌గా పనిచేసినాను. అప్పటి నా కృషి, నా అనుభవాలు చెప్పటానికి ఇది అదను కాదు. నేను పుట్టి పెరిగి ఇంటర్ దాకా చదువుకున్న నా జన్మస్థానానికి సేవ చేయించటానికి భగవంతుడు నన్ను వరంగల్‌కు పంపించి అక్కడే ప్రొఫెసర్ పదవి ఇప్పించినాడనీ ఈ విధంగా జన్మభూమి ఋణం తీర్చుకునే అవకాశం కల్పించినాడనీ తృప్తి పడ్డాను. **1973** మార్చిలో దివాకర్ల వెంకటావధానిగారు రిటైర్ అయినారు. నన్ను ఉస్మానియా తెలుగు శాఖకు అధిపతిగా మార్చండని దరఖాస్తు పెట్టుకున్నాను. అప్పటి వి.పి. నూకల నరోత్తమ రెడ్డిగారు ఉస్మానియా తెలుగు శాఖాధిపత్యం నాకు ఇస్తూ వరంగల్ స్నాతకోత్తర కేంద్ర పరిపాలన బాధ్యత కూడ నాకే అప్పగించి ఫిఫ్త్ ప్లాన్ ప్రపోజల్స్ ఫైనలైజ్ చేసి ఏడాది తరువాత రమ్మన్నారు.

అందాక నెలకు రెండు సార్లు హైదరాబాద్‌కు వచ్చి తెలుగు శాఖ పనులు చూసుకొని పొమ్మన్నారు. వారి ఆజ్ఞ మేరకు నేను 1974 మార్చి చివరిదాకా వరంగల్ పి.జి. సెంటర్ ప్రిన్సిపాల్‌గా ఉండి 1974 ఏప్రిల్‌లో హైదరాబాదుకు వచ్చి ఉస్మానియా తెలుగుశాఖాధిపత్యం వహించినాను. ఈ విధంగా 1973 నుండి 1983 వరకు పదేండ్లు తెలుగు శాఖాధిపతిగా ఉండి 1983 డిసెంబర్ చివర రిటైర్ అయినాను.

1978 - 1982 మధ్యకాలం ఆర్ట్స్ ఫ్యాకల్టీ డీన్‌గా ఉండినాను. 1980-1981 యు.జి.సి. నేషనల్ లెక్చరర్‌గా కాశ్మీరం నుండి కన్యాకుమారి దాకా ఐదు ప్రముఖ విశ్వవిద్యాలయాలలో తెలుగు జానపద సాహిత్యం గురించి ప్రసంగాలు చేసినాను. రిటైర్ అయిన తరువాత ముందుగా ఉస్మానియా అటుతరువాత యు.జి.సి. ఎమిరిటస్ ప్రొఫెసర్‌గా ఉండి 'ఫోక్‌లోర్ సర్వే ఆఫ్ తెలంగాణ' అనే ప్రాజెక్టు నిర్వహించి ఓరుగల్లు మండలం జానపద విజ్ఞానం సర్వేక్షణం చేయించినాను. నేను సర్వీసులో ఉన్నప్పుడే వరంగల్ స్నాతకోత్తర కేంద్రం తెలుగు శాఖకు 'విమర్శని' పేరుతోను, ఉస్మానియా తెలుగు శాఖకు 'వివేచన' పేరుతోను రీసెర్చ్ జర్నల్స్ ప్రకటించే ఏర్పాటు అందుకు కావలసిన ఆర్థిక వనరులు యూనివర్సిటీ బడ్జెట్‌లోనే పొందుపరిచేటట్లు చేసినాను. జానపద విజ్ఞానంలో దాక్షిణాత్య విశ్వవిద్యాలయాలలో మొదటిసారి సమ్మర్‌కోర్సు నిర్వహించినాను. ఏడవ అఖిలభారత జానపదవిజ్ఞానసదస్సు తెలుగుశాఖ పక్షాన నిర్వహించినాను. ఉస్మానియా విశ్వవిద్యాలయం వజ్రోత్సవాల సందర్భంగా (1978) "బోధన భాషగా తెలుగు" అనే సదస్సు నిర్వహించినాను. ఈ సందర్భంగా ప్రకటించిన ప్రత్యేక సంచికలో నాకంటె పూర్వాచార్యులు చేసిన కృషితోపాటు నేను చేపట్టిన కార్యక్రమాల వివరాలున్నవి.

ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఆర్ట్స్ కళాశాల అన్నింటికంటె అందమైన భవనము. అది నిర్మించిన తెలుగు ఉప్పరులు ఆర్యసమాజీయులు. కళాశాల ప్రారంభంలో ఉన్న డోమ్‌కు చెక్కిన లతాశిల్పాల్లో వాళ్ళు ఎవరికి తెలియకుండా రెండు చోట్ల నాగరిలో ఓం శిల్పం చెక్కినారు. ఆ శిల్పం దాగి ఉన్నట్లు దాన్ని నిర్మింపించిన వారికెవరికీ తెలియదు. తెలిస్తే వాళ్ళ తలలు తీయించేవారు. వజ్రోత్సవ సంచికలో వాటి ఫోటోలు ముద్రించినాను. వజ్రోత్సవాలనాటికి బ్రతికి ఉన్న ఒక శిల్పిని రావించి తెలుగు శాఖ పక్షాన సన్మానం చేయించినాను.

గురుదేవులు ఖండవల్లి లక్ష్మీరంజనంగారు ప్రారంభించి పూర్తి చేసిన ఆంధ్రమహాభారతం సంశోధిత ప్రతి ముద్రణం ప్రాజెక్టుకు 1966-1967 సంవత్సరాల మధ్యకాలం నేను డైరెక్టరుగా పనిచేసినందున గురువుగారి ఆజ్ఞ మేరకు ఆంధ్రమహాభారతానికి సులభవ్యాఖ్య వ్రాయించటానికై ఒక ప్రాజెక్టు చేపట్టి మాదిరి వ్యాఖ్య కూడ ప్రకటించినాను. వివిధ విశ్వవిద్యాలయాల తెలుగు ఆచార్యులను ఆహ్వానించి తెలుగు అధ్యయన బోధన ప్రమాణాలు పెంచటానికై కట్టుదిట్టమైన పాఠ్య ప్రణాళిక సిద్ధం చేసినాను. నాకోసం సృష్టించి నాకు రాకుండా పోతున్నదే అనే సానుభూతితో తెలుగు శాఖలో రెండవ ఆచార్య పదవికి సంబంధించిన ఫైలు డి.ఎస్. రెడ్డిగారు మూలన పడవేసినదానిని మరల వెలికి తీయించి తెలుగు శాఖలో రెండవ ప్రొఫెసర్ షిప్ సాధించినాను. ఫాకల్టీ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రామ్ క్రింద టీచర్ ఫెలోషిప్స్ తెలుగు శాఖకు సాధించినాను. ఇంకా తెలుగులో స్టడీ సర్కిల్ 1974 - 1975, వేసవి శిక్షణ శిబిరం 1979 పునశ్చరణ తరగతులు మొదటిసారి నిర్వహించినాను. ఇదంతా నా సర్వీసుకు సంబంధించిన చరిత్ర. నా సాటివాళ్ళు, నా జూనియర్లు, నేను ప్రొఫెసర్లుగా సెలక్ట్ చేసినవాళ్ళు కాకతీయ, ఉస్మానియాలకు వి.సి.లు అయినారు. నేను కాలేకపోయినాను. కులం బలమనీ, రాజకీయబలమనీ ఏవో కారణాలు చెప్పవచ్చును గాని అసలు దైవబలం లేదు కనుక నేను కాలేకపోయినానని చెప్పటమే సత్యసమ్మతంగా ఉంటుంది. వి.సి. వంటి పదవులు నాకు రాలేదు గాని విద్యావిషయకమైన నేషనల్ రీసెర్చ్ ప్రొఫెసర్ షిప్-గొప్ప గుర్తింపు భగవంతుడు నాకు ప్రసాదించినాడు. అది చాలు.

ఇక విశ్వవిద్యాలయం బయట నేను చేసిన కృషి కొంచెం చెప్పుతాను. ఆంధ్రసారస్వత పరిషత్తు పెద్దలతో సరిపడక దాశరథి బయటకి వచ్చినాడు. ఆతని మూలంగా కాళోజీ, నేను, సి. నారాయణ రెడ్డి కూడా పరిషత్తుకు దూరమై 1954 సంవత్సరం తెలంగాణా రచయితల సంఘం స్థాపించినాము. ఆంధ్రప్రదేశం ఏర్పడిన తరువాత తెలంగాణా రచయితల సంఘంను ఆంధ్ర రచయితల సంఘంగా మార్చినాము. ఈ రెండింటికి నేనే మొదటి కార్యదర్శిని. తెలంగాణం అన్ని జిల్లాల్లో శాఖలు ఏర్పడినవి. సాహిత్యగోష్ఠులు, కవి సమ్మేళనాలు, పుస్తక ప్రచురణలు, వార్షికోత్సవాలు, కవి పండితసన్మానాలు నిర్వహించినాము. 1956 సంవత్సరం నుండి శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషానిలయానికి కార్యదర్శిగా,

ఉపాధ్యక్షుడుగా ఒక దశాబ్దం ఉండి అనేక సాహిత్య సాంఘిక సాంస్కృతిక సభలు నిర్వహించినాను. నాయని సుబ్బారావు, మునిమాణిక్యం నరసింహారావు, దూపాటి వెంకట రమణాచార్యులు, సరిపల్లి విశ్వనాథశాస్త్రి, ఆదిరాజు వీరభద్రరావు, బూర్గులరామకృష్ణారావు (1954), ఖండవల్లి లక్ష్మీరంజనం (1968) వంటి సాహితీమూర్తుల షష్ట్యబ్దిపూర్త్యుత్సవాల కమిటీలకు కార్యదర్శిగా ఉండి సేవ చేసే భాగ్యం నాకు లభించినది. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ, ఆంధ్రప్రదేశ్ సంగీతనాటక అకాడమీ, తెలుగు అకాడమీల్లోను ఉడుతాభక్తి సేవ చేసినాను. శ్రీకృష్ణదేవరాయాంధ్రభాషా నిలయం ప్రక్క యిల్లు డా॥పిశుపాటి వెంకట రమణయ్యగారిది. కృష్ణా పత్రికాధిపతులు ముట్నూరి కృష్ణారావుగారి సాహితీ దర్బారు వంటిది డాక్టర్ రమణయ్యగారి సాహితీ దర్బారు. అక్కడ ప్రతిదినం నగరంలోని పండితులు కవులు, బయటనుండి నగరానికి వచ్చే పండితులు కవులు సమావేశమయ్యేవారు. అక్కడ తెలంగాణా కవిమిత్రుల పరిచయం చేసే ప్రస్తావన ఒకనాడు వచ్చింది. ఆ బాధ్యత నాకు అప్పగించినారు. 1954 మార్చి 13 నుండి కృష్ణా పత్రికలో 'తెలంగాణా కవిమిత్రులు' శీర్షికతో దాశరథి, నారాయణ రెడ్డి, కాళోజీ నారాయణరావు, పొట్లపల్లి రామారావు, వానమామల వరదాచార్యులు, పల్లాదుర్గయ్య, వానమామల జగన్నాథాచార్యులు, భాగి నారాయణ మూర్తి, ఒద్దిరాజు శేషగిరిరావు, వెల్దుర్తి మాణిక్యరావు, గార్లపాటి రాఘవరెడ్డి మొదలైన వారి పరిచయవ్యాసాలు ప్రకటించినాను. బెంగుళూరు ఐ.బి.హెచ్. వారికి ఆంధ్రసాంస్కృతిక వైభవంపేరుతో 500 పుస్తకాలకు బ్లూప్రింట్ తయారుచేసి 16 పుస్తకాలు వ్రాయించి 8 పుస్తకాలు ప్రకటించినాను.

ఇక నేను తెలుగు సాహిత్యరంగంలో చేసిన పరిశోధన గురించి సంగ్రహంగా మనవి చేస్తాను. హైస్కూలు విద్యార్థిగా ఉండినప్పటినుండే భారతి తదితర పత్రికల్లో మానవల్లి, వేటూరి, నిడుదవోలు, ఈయుణ్ణి, మల్లంపల్లి వంటి పరిశోధకుల వ్యాసాలు, వారు సంపాదించిన గ్రంథాల పీఠికలు చదవటంచేత వారి వలె ఇంతవరకు సాహిత్యలోకానికి తెలియని క్రొత్త విషయాలు చెప్పవలెననే నిశ్చయంతో పరిశోధన రంగంలో అడుగుపెట్టినాను. జానపదవిజ్ఞానంలో విశ్వవిద్యాలయ స్థాయి పరిశోధనలో తెలుగులోనే కాదు దక్షిణభారతదేశ

భాషలన్నిటిలో నా తెలుగు జానపదగేయ సాహిత్యము మొదటి సిద్ధాంత గ్రంథమైనది. ఆరంగంలో అనేక జానపదగేయ సంకలనాలు ప్రకటించినాను. తెలుగులోను ఇంగ్లీషులోను జాతీయ అంతర్జాతీయ సదస్సుల్లో పదులకొలది పరిశోధనాత్మకపత్రాలు చదివినాను. ఇంగ్లీషులో ఫోక్ టేల్స్ ఆఫ్ ఏ.పి., ఫోక్‌లోర్ ఆఫ్ ఏ.పి. సౌత్ ఇండియన్ ఫోక్ సాంగ్స్, గ్లింప్సెస్ ఇంటూ తెలుగు ఫోక్‌లోర్ గ్రంథాలు ప్రకటించినాను.

నేను తెలంగాణమంతటా తిరిగి వందల తెలుగు సంస్కృతం తాళపత్ర గ్రంథాలు, పదులకొలది శిలాశాసనాలు సేకరించినాను కనుక అముద్రితంగా పడి ఉన్న తెలుగు సంస్కృతకృతులు దాదాపు నూరు మొదటిసారి సాహిత్య ప్రపంచానికి ఎరుకపరచినాను. నా 'మరుగు పడిన మాణిక్యాలు' 'చరిత్రకెక్కని చరితార్థులు' ఇతర ప్రత్యేక సంచికల్లో ప్రకటించిన వ్యాసాలు ఈకోవకు చెందినవే. సంస్కృతంలో కాళహస్తి కవి రచించిన వసుచరిత్రం, మధురవాణి రచించిన రామాయణ సారతిలకం, అభినవ కాళిదాసు వెల్లాల ఉమామహేశ్వరుల శృంగార శేఖర భాణం, శ్రీకృష్ణదేవరాయల జాంబవతీపరిణయ నాటకం మొదటిసారిగా పరిష్కరించి ప్రకటించినాను. ఇంకా కాకతి ప్రతాపరుద్ర చక్రవర్తి ఉషారాగోదయం, బెల్లంకొండ రామారావుగారి రుక్మిణీ కల్యాణం, తిరుమల బుక్కపట్టణం అణ్ణయాచార్యుల రసోదారభాణం, భారద్వాజ రామాచార్యుల భద్రగిరి చంపూ, ఓరుగంటి లక్ష్మణ యజ్వ సీతారామ విహారం (ఉ.వి. సంస్కృత అకాడమీ పక్షాన ఆర్యేంద్రశర్మ గారి పేరుతో ప్రకటితం) పరశురామపంతుల అనంతరామయ్య సీతావిజయ చంపూ వంటి సంస్కృత కృతులు పరిష్కరించినాను. తెలుగులో బొడ్డుచెర్ల చినతిమ్మకవి ప్రసన్నరాఘవనాట్య ప్రబంధం, చింతలపల్లి ఛాయాపతి రాఘవాభ్యుదయం, సాయప వెంకటాద్రినాయకుని సకలజీవ సంజీవనం, పాల్కురికి సోమనాథుని పండితారాధ్యోదాహరణం మొదటిసారి నేనే పరిష్కరించి ప్రకటించినాను. శ్రీనాథుని శివరాత్రి మాహాత్మ్యం సంపూర్ణగ్రంథం సంపాదించి పరిష్కరించి ప్రకటించినాను. మడికి సింగన పద్మపురాణం, పాలవేకరి కదరీపతిరాజు శుకసప్తతి సంశోధితముద్రణలు విపులమైన పీఠికలతో ప్రకటించినాను. ఈ రెండు గ్రంథాల్లోని నూర్ల కొలది తప్పుడు పాఠాలు సవరించి చూపినాను. ఇంటర్ దాకా చదివిన

ఉర్దూ సార్థకమయ్యేవిధంగా ఉర్దూ-తెలుగు నిఘంటువు కూర్చినాను. ఇంగ్లీషునుండి హిందీనుండి నాలుగు గ్రంథాలు తెలుగు లోనికి అనువదించినాను. 38 మంది పరిశోధకులు నా పర్యవేక్షణలో ఎం.ఫిల్ మరియు పిహెచ్.డి. డిగ్రీలు సంపాదించుకున్నారు. ఇదంతా పొట్టకూటి ఉద్యోగాల కోసం, గుర్తింపుకోసం, పై పదవుల కోసం చేసిన కృషి. నేను భగవాన్ శ్రీ సత్యసాయి బాబా భక్తుడనైన తరువాత బాబావారి సాహిత్యం ఆరు గ్రంథాలు ఎడిట్ చేసి ప్రకటించినాను. ప్రస్తుతం తమ జన్మచేత, తమ ఉనికిచేత తమ తపస్సు చేత తమ నిస్వార్థసేవచేత ఆంధ్రదేశాన్ని పునీతం చేసిన ఆంధ్రయోగుల చరిత్రలు సంగ్రహంగా ప్రకటిస్తున్నాను. ఈచివరి కృతులే నా జన్మకు ధన్యతను కూర్చగలవనీ వచ్చే మంచి జన్మకు పాథేయాలు కాగలవనీ విశ్వసిస్తున్నాను.

ఇక నా జీవితంలోని కొన్ని మధురానుభవాలు కొన్ని చేదు అనుభవాలు మనవి చేస్తాను. బాల్యంలో మా యిండ్లలో జాతాశౌచం మృతాశౌచం అంటుముట్టు పాటించటంతోపాటు మా పెదనాయన చిన్నాయన హనుమకొండకుగాని మరెక్కడికైనాగాని పోయివస్తే ఇంటి వసారాలో ఆడపిల్లల బొమ్మరిల్లు వద్ద గోడకుండే చిలుక్కొయ్యలకు బయటికి పోయి వచ్చిన గుడ్డలు తగిలించి దసలిపంచె కట్టుకొని ఇంట్లోకి పోయి స్నానం చేసి గుడ్డలు మార్చుకునేవారు. చిన్న పిల్లలకు దసలిపంచె లుండేవికాదు. బడికి పోయివచ్చిన తరువాత ఆ గుడ్డలు చిలుక్కొయ్యకు తగిలించి బరిబాత ఇంట్లోకి పరుగెత్తి కాళ్ళు చేతులు కడుక్కొని గుడ్డలు మార్చుకునే వాళ్ళం. ఆనాడిది శిష్టాచారం. ఈనాటివారికి విడ్డూరంగా తోస్తుంది. చెప్పులు బూట్లు ఎన్నడూ మాయింటి అరుగెక్కలేదు. వాకిట్లోనే పడి యుండేవి. ఈనాడు స్వేచ్ఛా విహారం చేస్తున్నవి.

నేను ఇంటర్మీడియట్ దాకా హనుమకొండలో చదివినా రెండు మూడు సంవత్సరాలు ప్రతి దినం మడికొండనుండి హనుమకొండకు నడిచిపోయి వచ్చేవాణ్ణి. నాలుగవ తరగతిలోనో ఐదవ తరగతిలోనో చదువుతుండగా అట్లాగే నడిచి పోయి చదువుకున్నాను. ఆ దినాల్లో బడిలో మొదటి గంట కొట్టేవరకు అన్ని తరగతుల విద్యార్థులు మధ్య ఆవరణంలో బారులు తీరి నిలుచుండి నిజామ్అలీ పాదుషాకు దీర్ఘాయురారోగ్యాలు సమస్తైశ్వర్యాలు ప్రసాదించవలసిందని

ఉర్దూలో ప్రార్థనాగీతం పాడి తరగతి గదుల్లో ప్రవేశించటం తప్పనిసరి. ప్రార్థన కాగానే హెడ్మాస్టరు బెత్తం పట్టుకొని గేటువద్ద నిల్చుండి ఆలస్యంగా వచ్చేవారికి ఒకటో రెండో వడ్డించి పంపేవారు. నేనెన్నడూ ఆలస్యంగా పోలేదు, దెబ్బలు తినలేదు. ఒక వానకాలం మడికొండ కాజీపేట మధ్యన స్తంభాల బావివద్ద వర్షం కురిసి నా గుడ్డలు తడిసిపోయినవి (ఖాకీ నెక్కరు ఖాకీ హాఫ్ షర్ట్) నేను మరల యింటికి పరుగెత్తిపోయి గుడ్డలు మార్చుకొని హనుమకొండ చేరేవరకు ఆలస్యమైనది. హెడ్మాస్టరు వెంకటాచారిగారు ఆలస్యంగా వచ్చిన ఇతర విద్యార్థులతోపాటు నాకు రెండు గట్టిగా వడ్డించినారు. ఏడ్చుకుంటూ క్లాసుకు పోయినాను. ఇంటర్వల్‌లో చప్రాసిని పంపి ఆచార్యులవారు నన్ను పిలిపించుకొని "ఎన్నడూ ఆలస్యంగా రానివాడివి ఈనాడెందుకు ఆలస్యంగా వచ్చినా"వంటే అసలు విషయం చెప్పినాను. "అయ్యో పాపం! నీవు బుద్ధిమంతుడవు" అంటూ కందిపోయిన నా చేయి నిమిరి నా నెత్తిపై చేయుంచి దీవించి కంట తడిపెట్టుకున్నారు. ఆనాటి ఉపాధ్యాయుల వాత్సల్యం తలచుకుంటే ఈ నాటికీ ఒళ్ళు జలదరిస్తుంది.

ఆ రోజుల్లో మిడిల్ పరీక్షలకు ముందు ఎంట్రెన్స్ పరీక్షలుండేవి. ఇంగ్లీషు పరీక్షలకు ఒకనాడు ముందు రాత్రి తీవ్రమైన జ్వరం వచ్చింది. నేను నా అస్వస్థతను తెలుపుతూ మా ఇంగ్లీషు టీచర్ మరియు హెడ్మాస్టర్ దేశిరాజు రామకోటీశ్వరరావు గారికి ఇంగ్లీషులో జాబు వ్రాసి పంపించినాను. ఆయన నా జాబుకు మార్కులు వేసి నేను ఉత్తీర్ణుడనైనట్లు ప్రకటించినారు. అదీ వారి వాత్సల్యధర్మనిష్ఠ. ఆయన క్వాలిఫికేషన్స్ ఇంటర్ మాత్రమే. నేను ఉస్మానియా విశ్వవిద్యాలయంలో తెలుగు రీడరైన తరువాత ఆయన బి.ఎ. పరీక్ష వ్రాయటానికి వచ్చినారు. నేను ఇన్విజిలేటర్ను. పరీక్షల హాల్లో ఆయన కనపడితే పాదాభివందనం చేసినాను. తోడి ఇన్విజిలేటర్లు పరీక్షార్థులు వింతగా చూచినారు. ఆయన చెమ్మగిలిన కనులతో నన్ను కౌగిలించుకున్నారు. నాతోపాటు వారి వద్ద చదువుకున్న ఫిజిక్స్ డిపార్ట్‌మెంటు కె. వెంకట్రామయ్యకు వార్త పంపినాను, పరీక్షల తరువాత వారిని తోడ్కొని వస్తానని. (ఈ వెంకట్రామయ్య తరువాత కాలాన కాకతీయ యూనివర్సిటీ మొదటి వి.సి. ఐనాడు). పరీక్షానంతరం రామకోటీశ్వర రావుగారిని ఫిజిక్స్ డిపార్టుమెంట్‌కు తోడ్కొని పోయినాను. అక్కడ ప్రొఫెసర్ రావాడ సత్యనారాయణగారు వారికి

పాదాభివందనం చేస్తే నేను వెంకటరామయ్య విన్తు పోయినాము. రామకోటీశ్వరరావు గారు రావాడ సత్యనారాయణ గారికి బాల్యంలో ఖమ్మంలో టీచర్‌గా ఉండినారట. రామకోటీశ్వర రావుగారు రిటైరై స్వగ్రామం మన్నవకు వెళ్ళిపోయినారు. వారి షష్టిపూర్తికి రావాడ సత్యనారాయణ, వెంకటరామయ్య, నేను, మరొక టీచర్ రంగారావు రూ **1116/-** పంపితే ఆయన ఎంతో ఆనందించి జాబులు వ్రాసినారు. నేను జిల్లెళ్ళమూడి అమ్మ దర్శనానికి రెండు మూడు సార్లు పోయినాను. అట్లా పోతూ మన్నవలో వారిని దర్శించి కొంత డబ్బిచ్చేవాణ్ణి ఆయన సంతోషం మిన్నులు ముట్టేది.

నేను X వతరగతి చదువుతుండగా హన్మకొండ కొత్తూరులో ఉప్పరుల వాడలో ఉండేవాణ్ణి. కొత్తూరు మార్కెటువద్ద మా హిస్టరీ టీచర్ అబ్దుల్ అజీజ్‌గారుండేవారు. వారి పెద్ద కొడుకు ఫజలుర్రహమాన్ నా సహాధ్యాయి చదువులో మొద్దు. అందువలన నన్ను రాత్రులు తమయింటనే చదువుకొని పడుకొనుమనేవారు అబ్దుల్ అజీజుగారు. రెండవకొడుకు ఖలీలుర్రహమాన్ నా వద్దకు హైద్రాబాదుకు వస్తే ఏదో సహాయం చేసినాను రెండు మూడుసార్లు. ఆయిరువురూ చదువుల్లో ఎదిగి రాలేదు. అబ్దుల్ అజీజుగారు వృద్ధాప్యంలో ఆర్థికంగా ఇబ్బందులు పడ్డారు. వారి అమ్మాయి జహాన్‌ఆరా ఎట్లాగో బి.ఎస్.సి. చేసింది. నేను పి.జి.సెంటర్ ప్రిన్సిపాల్‌గా ఉంటూ వారి యింటికి రెండు మూడుసార్లు పోయి వారి ఇబ్బందులు చూచి ఆ అమ్మాయిని ల్యాబ్ అసిస్టెంట్‌గా నియమించినాను. భార్యాభర్తలు మా యింటికి వచ్చి "రామరాజూ! ఈనాటినుండి మేము రెండు పూటలు తింటా"మన్నారు. నా కనులు చెమ్మగిల్లినవి. వారి కనులు చెమ్మగిల్లినవి. ఆ దంపతులెంత పుణ్యాత్ములో కాని కొన్నాళ్ళ తరువాత ఇద్దరూ ఒక గంట తేడాతో తనువులు చాలించినారు.

జానపద గేయాలు సేకరించిన నాటి నా అనుభవాలు కూడ ఆసక్తిదాయంగా ఉంటివి. తెలంగాణమంతటా తిరిగి నేను **1953-1955** సంవత్సరాలమధ్య జానపద గేయాలు తాళపత్రగ్రంథాలు శిలాశాసనాలు సేకరించినాను. ఆ రోజుల్లో పల్లెటూళ్ళకు బస్సులు లేవు. జిల్లా తాలుకా

కేంద్రాలనుండి కొన్ని చోట్లకు నడచి కొన్ని చోట్లకు సైకిల్‌పైన కొన్ని చోట్లకు ఎడ్లబండిపైన పోయి గేయాలు సేకరించినాను. స్త్రీలకు రవిక కణుములు పురుషులకు బీడీలు చుట్టలు కల్లుకు పైసలు ఇచ్చి గేయాలు పాడించి వ్రాసుకున్నాను. నల్లగొండ జిల్లా నకిరెకల్లు గ్రామంలో కోలాటం పాటలు పాడేవారున్నారని విని అక్కడకు పోతే అక్కడి యువకులు సహకరించలేదు. నాకు తెలిసిన పోలీస్ ఆఫీసర్ చేత బలవంతాన పట్టి తెప్పించినాను. రాత్రి 11 గంటలనుండి ఒంటిగంట దాకా కోలాటాలు వేసినారు. ఇద్దరు యువకులు ఎదురు తిరిగితే పోలీసు సి.ఐ. వాళ్ళను కొట్టినాడు. తెల్లవారి వారిండ్లకు పోయి క్షమార్పణ చెప్పి డబ్బులిచ్చి వచ్చినాను. అట్లా బలవంతాన పాడించటం నా తప్పే అని బాధ పడ్డాను. గాయక భిక్షుకులు డబ్బులు పాతగుడ్డలిస్తే సంతోషంగా గేయగాథలు పాడేవాళ్ళుగాని ఫోటోలు తీయనిచ్చేవారు కాదు. ఫోటోలు తీస్తే వాళ్ళ కంఠమాధుర్యం పోతుందని ఆ అమాయికుల భావన. వారికి నచ్చచెప్పి డబ్బులిచ్చి గాయకభిక్షుకుల ఫొటోలు తీయించినాను. తాళపత్రాలకోసం ఒక వేసవిలో కరీంనగరం జిల్లా ఎల్లారెడ్డిపేటకు నడచిపోయినాను. ఎండ తీవ్రతకు తట్టుకోలేక సొమ్మసిల్లి ఊరిబయట కొట్టంవద్ద మూర్ఛపోయినాను. కొట్టం యజమాని బలిజాయన నాకు మంచినీళ్ళు పాలు ఇచ్చినాడు. రెండు రూపాయలిస్తే బండి కట్టినాడు. ఆ బండిలో నారాయణపురం పోయి మురళీధరశర్మగారి వద్ద బస్తెడు తాళపత్రగ్రంథాలు సేకరించినాను. తిరుగు ప్రయాణంలో ఆ బలిజదంపతులే (వీరమ్మ - శివరాజం) నీళ్ళచారు అన్నం పెట్టి బస్సెక్కించినారు.

అప్పటి ఆర్షశాఖ డైరెక్టర్ గొప్ప చారిత్రక పరిశోధకులు. వారివద్ద శాసనలిపులు చదివే తొలిపాఠాలు నేర్చుకున్నాను. తాళపత్రాలకోసం పోతూ ముస్తాబాదులో 29-10-1954 బస్సెక్కి మానేరువద్ద దిగి ఆ ప్రాజెక్ట్ చూచి కాలినడకన గంభీరావు పేటకు పోతుంటే గంభీరావుపేట చెరువు కట్టకు ఏటవాలులో ఒక శిలాశాసనం కనబడింది. కొడవండ్లు, గొడ్డండ్లు నూరటం చేత శాసనం కొంత భాగం అరిగిపోయింది. వరాహలాంఛనం ఉండటం చేత కాకతీయులకాలపు శాసనమను కున్నాను. గంభీరావు పేటలో వై. రామేశ్వర శర్మ కటకం వెంకటేశ్వర్లు గారింట్లో 100 తాళపత్ర గ్రంథాలు తీసుకొని ఇద్దరు మనుష్యులను తోడ్కొని

చెరువుకట్ట శాసనాన్ని తవ్వించి భూమిలోపల కనపడకుండా పూడ్చి పెట్టించి హైదరాబాదు చేరిన తరువాత ఆర్షశాఖ డైరెక్టరుగారికి చెప్పినాను. నేను శాసనలిపులు నేర్చి శాసనాలు తీసి ప్రకటించటం ఇష్టం లేకనో ఏమో గాని ఆయనగారు నాకు పాఠాలు చెప్పటం మానినారు. న బ్రూయాత్ సత్యమప్రియం. ఈ విషయం ఆదిరాజు వీరభద్రరావు గారికి చెప్పితే వారు నాకు శాసనలిపులు బోధించటమే కాక శాసనాలు తీసే విధానం నేర్పి తమ వద్ద ఉన్న ఇనుపబ్రష్షు మసి లెదర్ పాడ్ ఇచ్చినారు. వాటి సహాయంతో రెండు మూడు శాసనాలు తీసినాను. కరీంనగరంజిల్లా గంగాధర గ్రామం జమిందారు కొడుకు నా విద్యార్థి తమ గ్రామం గుట్టపై శాసనమున్నదని చెప్పితే పోయి చూచినాను. అది చాలా గొప్ప శాసనం. ఈ విషయం ఒక సుప్రసిద్ధచరిత్ర పరిశోధకునికి చెప్పితే వచ్చే ఆదివారం కలిసి పోదాం శాసనం తీసుకవద్దాం అన్నాడు. నాతో అట్లా చెప్పి మరునాడే మంది మార్బలంతో పోయి శాసనం తీసుకవచ్చి మైసూరులో జరిగిన హిస్టరీ కాంగ్రెస్‌లో ఆశాసనం గూర్చి పేపరు చదివి బ్రహ్మరథం పట్టించుకున్నాడు, నా పేరైనా ఎత్తలేదు. న బ్రూయాత్ సత్యమప్రియం. నేను వరంగల్ పి.జి. సెంటర్ ప్రిన్సిపాల్‌గా ఉండగా చిన్నప్పుడు ఈతకొట్టిన బాల సముద్రం వైపు వాహ్యాళికి పోయినాను. నరసముద్రంకోసం ఆ జలసముద్రం పాడు చేస్తున్నారు. చెఱువుకట్ట గండిలో గణపతి దేవచక్రవర్తి మంత్రి శాసనం సగం విరిగిన ముక్క లభిస్తే దానిని పి.జి. సెంటర్ తెలుగు శాఖ ముందు ప్రతిష్ఠించి జిల్లా కలెక్టరుకు ఆర్షశాఖ డైరెక్టరుకు తెలియపరచినాను. ఎం. ఏ. తెలుగు విద్యార్థులకు ఆ శాసనం ఆధారంగా శాసనలిపి చదివే విధానం శాసనం తీసే విధానం ప్రాక్టికల్ గా నేర్పినాను. ఆంధ్రలిపి పరిణామం తెలిపే లిపి బొమ్మలు ఛార్ట్స్ ఫోటోలు తీయించి ముందుగా ఎం.ఏ., తెలుగు క్లాసు రూంలోను అటు తరువాత ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు శాఖలోను పెట్టించినాను. నాతరువాత తెలుగు విద్యార్థులకు శాసనాలతోపాటు శాసనలిపి కూడ బోధించవలెననే కోరికతో ఆ వటాలు పెట్టించినాను. ఇప్పుడా పటాలు లేవు శాసనలిపి పాఠాలు లేవు.

తెలుగు జాతికి గర్వకారణం తొలి మహామహోపాధ్యాయుడు కోలాచలం మల్లినాథసూరి. ఆయన జన్మగ్రామం కొలిచెలమ మెదక్ జిల్లా. అక్కడి కొలిచెలిమ

వారింట్లో తాళపత్రగ్రంథాలున్నాయని తెలిసి తహసీల్దార్ మిత్రుడు సి.హెచ్. కొండయ్య (తరువాతికాలాన ఐ.ఏ.ఎస్. కలెక్టర్) తోడుగా పోయి అమూల్యమైన తాళపత్రగ్రంథాలు తెచ్చుకున్నాను. పూజాగృహంలో పెట్టుకున్న మల్లినాథసూరి ఘంటాలు చూచి కనులకద్దుకొని వాటిని నాకివ్వండని డబ్బు ఇస్తే ఆయన ఇవ్వలేదు. అవి తరతరాలనుండి పూజాద్రవ్యాలుగా ఉన్నాయని చెప్పినాడు. తమకున్న రెండెకరాల పొలం అక్కడి భూస్వామి దున్నుతూ నామమాత్రపు కౌలు ఇస్తున్నాడనీ ఆభూమి తమ జీవనాధారమనీ కంట తడిపెట్టినాడు. మిత్రుడు కొండయ్య ఉపాయశాలి తహసీల్దార్ ఆభూస్వామిని ఒప్పించి భూమి పురోహితుని కిప్పించినాడు. ఆపురోహితుడు మల్లినాథ సూరి రెండు ఘంటాలు నాకిచ్చినాడు. నేను ఆల్ ఇండియా ఓరియంటల్ కాన్ఫరెన్సులకు (కాశ్మీర శ్రీనగరం, కాశీ, అలీఘర్, ధార్వాడ) తీసుకపోయి పండితులకు చూపించినాను. పద్మవిభూషణ ఆర్.ఎన్. దాండేకర్ మాయింటికి వచ్చి వాటిని చూచిపోయినారు. మల్లినాథ సూరి గూర్చి పి.హెచ్.డి థీసిస్ వ్రాసినవారెవరో వాటి ఫోటోలు తమ థీసిస్‌లో ప్రకటించినారు. నా తరువాత వాటి నెవరు కాపాడుతారు? అటువంటి అమూల్య సంపదను కాపాడుకునే సంస్థ మనకేది? బరోడా ప్రాచ్య సంస్థవారికో పూనా ప్రాచ్యసంస్థవారికో ఇస్తే కాపాడుతారేమో! న బ్రూయాత్ సత్యమప్రియం - 1945 సంవత్సరం 'ఆంధ్రుడా ! ఓ ఆంధ్రుడా!' అనే గేయంతో ప్రారంభమైన నా సాహిత్య వ్యాసంగం ఆంధ్రయోగుల చరిత్రలు ఐదు సంపుటాలు, ఆంధ్రుల సంస్కృత సాహిత్య వరివస్య, "నేను నాసాయి" రచనలతో ముగిస్తే బాగుంటుందనుకుంటాను. ఇది నా చివరి కోరిక. ఈ కోరిక తీరితే ఏ కోరిక కోరని స్థితి కల్పించవలెనని భగవంతుని ప్రార్థిస్తున్నాను. భగవదిష్టమే నాయిష్టం - నమస్సులు.

శ్రీ ఊట్ల కొండయ్య

(13-01-1996)

స్వామి! సత్యశాయీ! పుట్టపర్తియందు
నుందువందురు, మన్మనోమందిరమున,
కవనసింహా సనమున సాకతము చేసి
యేక తమ్మునముండుట నెరుగరోటు ?

మహాకవికాటూరి వేంకటేశ్వరరావుగారికి పుత్రసమానుడనైన శిష్యుణ్ణి కావడంచేతను, విజయనగర సంస్థానాస్థానకవి భోగరాజు నారాయణమూర్తిగారి వద్దను, కులపతి అడివి బాపిరాజు గారి వద్దను, సర్వజ్ఞుడైన దార్శనికుడు మట్నూరి కృష్ణారావు పంతులుగారి వద్దను చదువుకొన్న వాడనుకావడంచేతను, అవోయివో పది పద్య కావ్యాలు వెలవరించిన వాడను కాడంచేతను, ప్రపంచజానపద సాహిత్యం-బాల సాహిత్యం - చాలా తెనుగులోనికి తెచ్చిన వాడను కనుకనూ, చాలా ప్రతికలలో పనిచేసి వుండడం చేతనూ నావద్ద యేదో ముల్లె వుండి వుంటుందను కొని - నేటి తెలుకవులలో అగ్రగామి, విశ్వకవి, ఆంధ్ర సారస్వత పరిషదధ్యక్షులు నైన మాన్యమిత్రులు ఆచార్యనారాయణ రెడ్డిగారు నన్ను ఈప్రసంగానికి పిలిచారు. 78 యేండ్లు పైబడిన మాట నిజమే కాని స్వామి! అంతయోగ్యతనాకు లేదంటే నమ్మరు కారు. సాహిత్యకుడనైన నాకు వారి ఆజ్ఞ అనుల్లంఘ్యము కనుక, శ్రోతల క్షమమీద నమ్మకం పెట్టి యీ సాహసానికి ఒడిగట్టాను.

నేరుగకవిత్వానికి సంబంధిచినవినాకున్నా, జీవితానికి సంబంధించిన సంగతులు కొన్ని ముందుగ మనవి చేసికొంటాను. వీని వల్ల జీవితం రూపొందిన విధానం కొంత వరకు పకళింవుతుందను కొంటాను.

జ్ఞాపకం వున్న చిన్ననాటి మొదటి సంఘటన బర్మాయాత్ర. గత శతాబ్దం చివరి పాదంలో గుంటూరులో సెకండు ఫారం చదివిన చిన్నబ్బాయి అనే బాలుడు రంగం పారిపోయాడు.

రంగం అంటే రంగూను; అంటే బర్మా . ఇప్పుడది మైన్ మ్యార్ : రంగూన్ యాంగూనైంది ఉత్తరాంధ్ర జిల్లాల వారికది కొత్త కోరంకి. ఆ జిల్లాలనుండి చాలామంది బ్రతుకు తెరువు వెతుక్కుంటూ అటు వెళ్తూ వుండేవారు. మా గురువర్యులు అడవి బాపిరాజుగారు తరచు, సాహిత్యసభలలో అభినయసమేతంగా పాడుతూ వుండే పాట ఒకటి ఇందుకు సంబంధించిందే.

"వస్తావటే పిల్ల వస్తావటే

కొత్తాకోరంగిదాక వస్తావటే ?" అంటూ ఆరంభమవుతుంది ఆపాట

ఇదిగో ఇలాంటి కొత్త కోరంగికి వెళ్లిన చిన్నబ్బాయి జిల్లా ఫారెస్టు ఆఫీసరుగ రిటైరైనాడు. రంగూను లోని సంపన్నులైన బర్మావారి పిల్లను పెండ్లాడాడు. వారికిద్దరు కొడుకులు; వారి నివాసంమాండ లేలో.

చిన్నబ్బాయిగారు గుంటూరులోని తన తమ్ముని కుమారులకు ధన సహాయం చేసి చదివించారు. ఆ ఇద్దరిలో పెద్దవాడు రాఘవులు . ఆ అబ్బాయి. షార్ట్ హాండ్ - టైపు హయ్యరు పాసై బి.ఏ. తప్పాడు. అతనికి నా పిన్ని భ్రమరాంబనిచ్చారు. చిన్నబ్బాయి గారు ఆయనకు యమెధిన్ జిల్లాకోర్టులో ఉద్యోగ మిప్పించారు. పిన్ని అక్కడకు కాపురానికి వేళ్లేప్పుడు నేను తోడు వెళ్లాను. అక్కడ అద్దెకున్న ఇంటి వాళ్ల అమ్మాయితో ఆడుకొంటూవుంటే నాకు బర్మాభాష త్వరగా అబ్బింది. అటు పిమ్మట బాబాయిని మోమియాకు ట్రాన్స్‌ఫర్ చేశారు. తరువాత ఆయనకు జబ్బుచేస్తే చికిత్స కోసంమాండలే వెళ్ళాము. 10నెలలతరువాత తిరిగి వచ్చాను.

పేరాల నాజన్మస్థలం. ఇక్కడి జంటనగరాలవంటివే అక్కడి చీరాల-పేరాల జంట గ్రామాలు. నాలుగు మైళ్ళు దూరంలోవున్నా సముద్రం హోరువినిపిస్తూ వుంటుంది. అప్పుడప్పుడు - దానికి కోపం పొంగినప్పుడో, ఆనందం ఉప్పొంగినప్పుడో ! ఈ జంట గ్రామాలపై, 75 సంవత్సరాల క్రితం,

ప్రభుత్వం మునిసిపాలిటీని విధిస్తే, ఆంధ్రరత్న దుగ్గిరాల గోపాలకృష్ణయ్యగారి పిలుపందుకొని , ఈ రెండు గ్రామాల ప్రజలు ఇళ్లు వాకిళ్లు వదలి పెట్టి, పేరాల పొలిమేరలలో అయన నిర్మించిన రామనగర్ వెళ్లి, పాకలలో వుండి ఎన్నో కష్ట నష్టాలు అనుభవించారు. ఇలాంటి సత్యాగ్రహం దేశంలో మొదటిదిదే? గాంధీ మహాత్ముని సత్యాగ్రహోద్యమానికి తొలి మెట్టిది. "పాకలప్పుడు" అనేకాలమానం మాట, ఆ ప్రాంతపు తెలుగులో నాటి నుండి ప్రవేశించి కొనసాగుతున్నది.

బర్మానుండి తిరిగి వచ్చి పేరాల చేరేసరికి అది 1926వ సంవత్సరం? 70 ఏళ్ల నాటి మాట ! పూర్వం చదువుతూ వుండిన పేరాలలోని రాజగోపాలం వీధి బడిలో చేరి నాల్గవ తరగతి వరకు అక్కడే చదివాను. సాయంత్రం బడివిడిచే ముందు ఎక్కాలు సంత చెప్పించేవారు, దాని వల్ల బడిలో పిల్లలందరకు, తమకు తెలియకుండానే చిన్న ఎక్కాలుపదిన్నీ కంఠస్థమయ్యేవి. పెద్దెక్కాలు మూడు, నాలుగు తరగతులకు చెప్పేవారు. నాల్గవ తరగతిలో ఇంగ్లీషు విద్య అక్షరాభ్యాసంతో ఆరంభయ్యేది. వ్రాత అక్షరాలలో చిన్న అక్షరాలు పెద్ద అక్షరాలు, అచ్చక్షరాలలో చిన్నవీ పెద్దవీ నేర్పేవారు. పిమ్మట గుణింతం చెప్పేవారు. కాన్సొనెంట్స్ మీద ఓవెల్స్ పెట్టి చెప్పేవారు హల్లుల మీద అచ్చులు పెట్టి అన్నమాట. ఎలాగంటే బిఎ = బె, బిఇ = బి, బిఐ= బై, బిఓ = బో, బియు = బు ఇలాగ. ఇంగ్లీషు స్పెల్లింగు కుచెందిన సామాన్య జ్ఞానం ఈ విధంగా సులభంగా అబ్బేది. ఇంగ్లీషు పాఠ్యపుస్తకంలో చిన్న చిన్న ఇంగ్లీషుమాటలు, వానికి తెలుగు అర్థాలూ వుండడమే గాక, Twinkle Twinkle Little Star వంటిచిన్న చిన్న బాలగేయాలుండేవి. అక్షరాలు గుండ్రగ, చక్కగా వ్రాయించేవారు. ఇంగ్లీషు లోనూ తెలుగులోనూ అచ్చుకాపీ పుస్తకాలుండేవి. రోజుకొక పుట వంతున కాపీలు వ్రాయించేవారు. గాంధీ మహాత్ముడు స్వీయచరిత్రలో తమచేతివ్రాతను గూర్చి దిగులు పడ్డ సంగతి తమకు తెలిసిందే. ఇప్పటి కొందరు పెద్దల చేవ్రాతలు పూర్వపరిచయం వున్న వాళ్లకు తప్ప, అర్థం కానిషార్ట్ హాండ్ సమాన రూపంలో వుండడం కూడా తమకు తెలిసిందే. వీధి బడిలో పెద్ద బాలశిక్ష చదివించడంతో, పిల్లలలో కజ్ఞతకు పునాదిపడేది. అప్పటి చదువుతో ఇప్పటి చదువుపోల్చుకొని మనం చిన్న బోవడం నాకు సమ్మతంకాదు.

వీధి బడినుండి, చీరాల మునిసిపలు హైస్కూలులో ఐదవ తరగతిలో ప్రవేశించి ఆరవతరగతిలోనికి వచ్చే సరికి, ఆటలలో, సబ్ జూనియరుగనేను జిల్లా ఛాంపియన్‌ను, మెడలిస్టును నూరుగజాలపరుగులోను, హైజంప్‌లోనూ, లాంగ్ జంప్‌లోనూ జిల్లాలోని పాఠశాలలన్నింటిలోనూ, ప్రధముణ్ణి. ఇప్పటి ప్రకాశం జిల్లా కూడా అప్పుడు గుంటూరు జిల్లాలో కలసి వుండేది. చెడుగురలో పెద్ద వాళ్ళు కూడా నాకు వెరచే వాళ్ళు. నా జట్టు వైపు వచ్చి ఆడేవాళ్ళు కూడా నాకు వెరచే వాళ్ళు. నాజట్టు వైపు వచ్చి ఆడేవాడెంత వాడయినా, నాకంగుకాలిదెబ్బ తప్పించుకోలేకపోయేవాడు.

సర్వమిత్ర వ్యాయామ సంఘం అనేపేర, పేరాలలో, సాముగరిడీలు, వ్యాయామం, సర్కసు విద్యల సంస్థ ఒకటి వుండేది. అది చిన్నగ్రంధాలయం కలిగి వుండడమేకాక, సభ్యుల నైతిక వర్తనపై కూడా యాజమాన్యం కలిగి వుండేది. దానిలో చిన్న నాటి నుండి నేను సభ్యుణ్ణి. దండేలు, బస్కీలు, హారి జాంటిల్‌బార్, పార్లర్ బార్, కుస్తీలు, బాణా కర్రతిప్పడం, పట్టాకత్తి త్రిప్పడం వంటి సాము గరిడీలు, తీగపైనడవడం వంటి సర్కసు పనులు పెద్దలతోపాటు చేసేవాణ్ణి. కాళ్ల చేతులు కర్రతో కట్టి వేయడం వంటి రహస్య విద్యలు దీనిలో వున్నాయి. విశ్వాసపాత్రులైన శిష్యులకే ఇది నేర్పుతారు.

ఇక్కడ మతపరమైన సంగతి ఒకటి చెప్పవలసి వుంది. రత్నం పంతులుగారనే ఒక క్రైస్తవ సత్పురుషుడు ఈవ్యాయామ సంఘానికి తరుచు విచ్చేస్తూ, క్రైస్తవ మతపరంగా నీతినీ, సత్ప్రవర్తననూ గూర్చి ప్రబోధిస్తూ ప్రసంగిస్తూ వుండేవాడు. ఆయనతో నాకు సాన్నిహిత్యమేర్పడడం తో, ప్రతి ఆదివారం ఆయన తో పాటు ఉపవాసం చేస్తూ, ఊరివెలుపలి సరివితోటలకో, జీడిమామిడితోటలకో వెళ్ళి ప్రార్థనలు చేస్తూ వుండేవాణ్ణి. అలాబైబిలు తోనూక్రైస్తవమతంతోనూ సన్నిహితసంబంధమేర్పడింది. ప్రపంచ ఖ్యాతి పొందిన ఒరిస్సా క్రైస్తవ భక్తుడు సాధు పాట్నాయక్ గారు చీరాల సందర్శించడానికి వచ్చినప్పుడు, ఆయన కాతిధ్యమిచ్చిన గృహస్థు, నాచేత ఆయన సమక్షంలో ప్రార్థన చేయించాడు. సాధుజీ నన్నాశీర్వదించారు. పాట్నాయక్ గారిఆంగ్లో పన్యాసాలు గంగా ప్రవాహాలే.

ఆరోజుల్లోనే చిన్న పిల్లలంకొందరం "అశ్వత్థామ పరాభవం" అనే చిన్న నాటకం అభ్యాసం చేసి ప్రదర్శించాము. నాటకం బాగా రక్తికట్టి ప్రజదీల మన్ననలు పొందింది. ఇరుగు పొరుగు వారి చీరెలు, ధోవతులతో రంగ స్థలమూ. తెరలు కట్టడం చేత వాటి తాలూకా వాళ్ళు మా తో సహకరించక తప్పలేదు. మావేషాలకు కూడా వాళ్ళ దాపుడు చీరలు, ధోవతులిచ్చారు. ఆనాటకం రెండవసారి ప్రదర్శించినప్పుడు, బంగారు పనిచేసే బాషా అనేముస్లిం నాకు వెండి మెడల్ బహూకరించాడు. నేనీనాటకంలో ద్రౌపదివేషం వేశాను. ఇది అరవై ఆరెండ్ల నాటి మాట!

అలా ఆటకాయతనంతో థర్డ్ ఫారం చేరే సరికి అన్నీ పోయి కవిత్వం పట్టుకొన్నది. అప్పటికే మాకు క్లాసులో ఛందస్సు నేర్పి వున్నారనే మాట వేరే చెప్పనక్కరలేదుకదా? ఏకసంథాగ్రాహి అనేపేరుకూడా పుట్టింది. మాస్టర్లు ట్రాన్స్ఫరయితే వీడ్కోలు సభలో నా పద్యాలు తప్పకుండా వుండేవి. అప్పటిలో నాకు సీనియర్ విద్యార్థి, ఆ తరువాత గొప్ప విద్వత్కవిగ పేరు పొందిన ఇటీవల స్వర్గస్థులైన వంగవోలు ఆది శేషయ్యా గారితో కలిసి, స్కూలు మూసిన అనంతరం ప్రతిదినం సాయంత్రపు వేళలలో చీరాల పేరాల రోడ్డుపై పచారు చేస్తూ, ఏది కనిపిస్తే దాని మీద అశువుగకవిత్వమల్లు తూ వుండేవాళ్ళం. ఇలాకొంతకాలం కవితాసాధన నడిచింది.

ఆకాలంలో చీరాలలో తరుచు అవధానాలు జరుగుతుండేవి. అన్నింటి లోనూ నేను పృచ్ఛకుడిగా తప్పక పాల్గొంటూ వుండేవాణ్ణి. ఇక అవధానంలో "మానము పోయెడి నటంచు మగనింబిలిచెన్" అని నేను నిక్కరు కవిగ సమస్య ఇస్తే సభలో అందరు గొల్లున నవ్వారు. ఆరోజులలో నేనూ మా ఆది శేషయ్యా గారూ కలిసి, "క్రొక్కారు" అనే లిఖితమాస ప్రతిక నడిపాము. అదే కాలంలో అంటే **1931-32** మధ్య కాలంలో గూడవల్లి రామబ్రహ్మంగారు గొప్పగ నడుపుతూ వుండిన "సమదర్శిని " అనే పత్రికలోనూ, భారతి పత్రికకు దీటుగా, లోధ్ర కూసరిగారు నడుపుతూ వుండిన 'గృహలక్ష్మి' పత్రికలోనూ నాపద్యాలు, గేయాలు వెలువడ్డాయి. మరొక మాసపత్రికలో పద్యాలలో రచించిన ఈసపు నీతి కథ ఒకటి కూడా వెలువడింది.

అంతటితో కవితారచనపై మోజు తగ్గి సాహిత్యాధ్యయనం మీదికి దృష్టి మళ్లింది. మా హైస్కూలు లోనే సీనియర్ ఆంధ్రోపాధ్యాయుడైన నారపరాజు సీతారామయ్యగారి పంచ పట్టాను. 'కవిత పుట్టిల్లు ఇంకొల్లు కరణమిల్లు' అని చెప్పి కొన్న వాడు, ఉభయ భాషలపెన్నిధి అయిన వారి వద్ద, శబ్దాలు, అమరం, సుందరకాండ, లఘుకౌముది చెప్పుకొన్నాను.

1935 జులై నెలలో విజయ నగరం వెళ్లి మహారాజావారి సంస్కృత కళాశాలలో చేరాను. అక్కడ చదువుతూ వుండగా విజయనగర సంస్థానాస్థాన కవీ, బాలకవి అనే ప్రశస్తి పొందిన శ్రీ భోగరాజు నారాయణ మూర్తి గారితో సాన్నిహిత్యమేర్పడింది. ఆకాలంలో , కొమర్రాజు లక్ష్మణరావుగారి విజ్ఞాన చంద్రికా గ్రంథమండలి వారు ప్రకటించిన తొలి నవలల పోటీలో తన "విమలాదేవి " అనే నవలకు ప్రథమ బహుమతి పొందినవాడాయన. నౌరోజ్, అల్లాహోఅక్బర్, మొదలైన గొప్ప నాటకాలు నవలలు వ్రాశారు. రాజావారి హైస్కూలులో నామమాత్రంగా పని చేస్తూవుండే వారు. ఆరోజులలో రామాయణం రచిస్తూ వుండేవారు. ఒకచేత కలం, ఒక చేత సిగరెట్టు పట్టుకొని నాతోమాట్లాడుతూనే పద్యరచన చేస్తూ వుండేవారు. ఎప్పుడు గాని ఒక కొట్టి వేత చేసినట్లు ఎరుగను. అదియేమి మేధస్సో! వారి "కంకణము" అనే పద్యకావ్యం ఆకాలంంలో వెలువడిన పద్యకావ్యాలలో మేటి అని చెప్పవచ్చు. ఒక వాన నీటి బొట్టు సముద్రం లోని ఒక ముత్యపు చిప్పలో పడి, ముత్యంగా మారడం దీని ఇతివృత్తం.

ఆకాలపునవ్య సాహిత్య పరులైన భావ కవులతో ఆయనకు సయోధ్యలేక పోవడంతో ఆ కావ్యానికి తగినంత ప్రశస్తి రాలేదు. ఏనాటి కానాడు సంస్కృత కళాశాలకు ఎగనామం పెట్టి ఆయన వద్ద కూర్చుంటూ వుండేవారు. నాకాయనగారు ఆంధ్ర మహాభారతం లోని నన్నయ్య గారి ఆది, సభా పర్వాలు పాఠం చెప్పారు.

అక్కడ నుండి 1936 ఏప్రిలు నెలలో నిడుబ్రోలు విచ్చ ఆచార్య రంగా గారి " రైతాంగ విద్యాలయం" అనే రాజకీయ పాఠశాలలో చేరాను, 1933లో గాంధీజీ తన హరిజన యాత్ర సందర్భంలో ఈ పాఠశాలకు ప్రారంభోత్సవం జరిపారు. నేనప్పటికి 18వ సంవత్సరంలో ప్రవేశించాను. శ్రీ వి.వి. గిరిగారి వంటి దేశ నాయకు లెందరెందరో వచ్చి ఆయా విషయాలపై మాకు పాఠాలు చెబుతూ

వుండేవారు. సర్దార్ గౌతులచ్చన్న, శ్రీ పి. తిమ్మారెడ్డి శ్రీ కందుల ఓబుల రెడ్డి గారలు వంటి దేశ సేవకు లక్కడ నాకు సహాధ్యాయులు గ వున్నారు. ఆమండలం రోజులలో దేశదేశాల రాజకీయ విధానాలను గూర్చి భారత దేశ స్వాతంత్ర్యోద్యమాన్ని గూర్చి, ఆర్థిక పరిస్థితులను గూర్చి మాకు వివరంగా చెప్పారు. రంగాజీ, మన ఆర్థిక పరిస్థితులను గూర్చి చెప్పిన నోట్సు ఎం.ఎ. విద్యార్థులు నానుండి తీసుకుపోయి వ్రాసుకున్నారు.

ఆ రాజకీయ పాఠశాల ముగియగానే " కవితాభినివేశం కలవాడు" అంటూ భోగరాజు నారాయణమూర్తి మహాకవి గారిచ్చిన పరిచయలేఖతో బందరు ' (మచిలీపట్నం)లో ఆంధ్ర విద్యా పీఠం నిర్వహిస్తున్న ఆంధ్రజాతీయ కళాశాల అనే గురుకులంలో ప్రవేశించాను. అక్కడ అడివిబాపిరాజుగారు ప్రిన్సిపాలు, మహాకవి కాటూరి వేంకటేశ్వరరావు గారు సాహిత్యాచార్యులు; ఆంధ్రదేశంలో హిందీ భాషా ప్రచారంలో అద్యుడని చెప్పతగిన ఉన్నవ రాజ గోపాలకృష్ణయ్య గారు హిందీ అధ్యాపకులు; దేశభక్తుడూ అనేక గ్రంథకర్తయైన కవివర్యుడు మానికొండ సత్యనారాయణ శాస్త్రి గారు చరిత్ర, రాజకీయ శాస్త్రాధ్యాపకులు. సాహిత్యం, గ్రామ పునర్నిర్మాణము మా పాఠ్య ప్రణాళికలోని ముఖ్యాంశాలు. 1933లో గాంధీజీ హరిజన యాత్రా సందర్భంలో ఇక్కడ గ్రామ పునర్నిర్మాణ విద్యకు ప్రారంభోత్సవం చేశారు.

కాటూరి వారు భారతం మొదలు ఆనాటి భావకవిత్వం వరకు గల పురాణ, ప్రబంధ, కావ్య, నాటకాదుల్నీ, అప్పటి తెలుగులోవెలసిన మాలపల్లి వంటి గొప్ప నవలల్నీ మాకు పరిచయం చేసి, భావబలం, భాషాబలం చేకూర్చారు. సంస్కృత కావ్య నాటకాలు కూడా కొన్ని చదివి వినిపించారు. ఇక కులపతి అడివి బాపిరాజు గారి మాటకు వస్తే, ఆయన మాకు బోధించని విషయమంటూలేదు. భూగోళ, ఖగోళ శాస్త్రాలూ, స్వాతంత్ర్యోద్యమం, జ్యోతిషం హస్తసాముద్రికం, లలితకళలు- ఒకటేమిటి, ఆయన కు తెలిసిన సర్వమూ చెప్పారు. ఒకనాడు, వంకాయకూరెన్ని రకాలుగా వండవచ్చునోకూడా చెప్పారు. వంటపనిలో ఆయన ఎంతే నేర్పరి అంటే - ఆ సంవత్సరంలోనే గూంటూరులో జరగిన నవ్యసాహిత్యపరిషత్సభలను మల్లాది రామకృష్ణశాస్త్రిగారు కృష్ణా ప్రతికలో సమీక్షిస్తూ, " ఈసభలో చెప్పుకోదగిన రుచి కరమైన అంశం, బాపిరాజుగారు శిష్యవర్గంతో కలిసి పాకంచేసిన తోటకూర పప్పు

మాత్రమే" అన్నారు. అయితే, అంతటి మహోన్నతులైన గురువుల సాన్నిధ్యంలో వుండి మీరేమినేర్చారయ్యా అంటే ఎవరి మనస్సు పట్టినంత వాళ్లు తీసుకుపోయారు.

గురుకులం కనుక, అధ్యాపకులందరు కళాశాల ఆవరణలోని భవంతులలో వుండేవారు. విద్యార్థులు హాస్టలులో వుండేవారు. బాపిరాజు గారక్కడ తల్లివలె, కాటూరివారు తండ్రివలె మమ్ములను దయతో చూస్తూ వుండేవారు. రాత్రి భోజనాలైన పిమ్మట వెళ్ళి చూస్తే, బాపిరాజుగారు తమవాటా ఇంటి పంచలో, చాపవేసుకొని గోడకానుకొని కూర్చుండి గేయాలో, కథలో, నవలలో వ్రాస్తూ కనిపిస్తారు. ఆయింటి అవతలి వాటాలో పంచలో పడకకుర్చీలో కూర్చుండి, చుట్ట కాలుస్తూ, మధ్యమధ్య లేచి ముందు గదిలో టేబులు మీద పెట్టి వున్న కాగితాలపై ఏవో పద్యాలెక్కించి తిరిగి వచ్చి కూర్చునే కాటూరి వారు కన్పిస్తారు. బాపిరాజుగారి వద్ద నాకు అమ్మదగ్గరున్నంత చనువుండేది. వారి శశికళ ఆంధ్రకవితాలోకంలోని ఒక గొప్ప ఊహాసుందరి. తుఫాను నవల బాపిరాజుగారు చెబుతూవుంటే వ్రాసింది. నేను వారి కొన్ని స్వంత జాబులు కూడా నాకు చెప్పి వ్రాయించేవారు. ఎక్కడో చూస్తూ, పరిసరాల స్పృహలేని వానివలె బాపిరాజుగారు చెప్పి వ్రాయిస్తూ వుంటారు.

నిజజీవితంలో బాపిరాజుగారి మతిమరపు చెప్పతరంకాదు. ఒకనాటి ఉదయం, బామ్మగారు, అంటే వారి తల్లిగారు, బియ్యం కొనితెమ్మని వారిని బజారు పంపారు. బాపిరాజుగారు బజారుకు వెళ్ళి, అక్కడ కనిపించిన మల్లాది రామకృష్ణ శాస్త్రి, జరుక్ శాస్త్రి పింగళినాగేంద్రరావు గార్లతో కలసి, మంజప్ప హోటలులో కాఫీ సేవించి తనకు ప్రియమైన కూటికూర పొడరు డబ్బా, గోల్డ్‌ఫేక్ సిగరెట్టు పెట్టె కొనుక్కొని పాటలు పాడుకొంటూ మహోల్లాసంతో ఇల్లు చేరారు. వెసరు పొయ్యి మీద పెట్టి ఎదురుచూస్తున్న బామ్మగారు "బాపిరాజు! బియ్యం ఏవిరా" అంటే, "బియ్యమా? బియ్యమేమిటే అమ్మా!" అని ఆయన అంటూ వుంటే, ఆదృశ్యం చూస్తూ వుండిన కాటూరి వారు తమకుమార్తె చేత బియ్యం పంపారు. ఇలాటి సందర్భాలు నవ్వు పుట్టించేవే అయినా కాటూరివారు నవ్వలేదు సరికదా, వారి ముఖంలో విచారం ద్యోతకమైంది.

ఇక్కడ, అత్రిమూర్తుల మాట ఒకటి చెప్పాలి. మల్లాది రామకృష్ణశాస్త్రి గారు, పింగళి నాగేంద్రరావు గారు, చిట్టి గూడూరు ప్రాచ్యవిద్యాలయంలో

ఉభయభాషాప్రవీణుడై వచ్చిన జల సూత్రం రుక్మిణీ నాథ శాస్త్రిగారు రచనా వ్యాసంగంతప్ప మరేపని పాటలు లేని వాళ్ళు, స్వేచ్ఛగల బందరు రోడ్లమీద పచారులు చేస్తూ సాయంత్రమయ్యే సరికి కృష్ణా పత్రికాదర్బారుకు చేరతారు. మల్లాది వారు మూడు చుక్కల కథలు, నాగేంద్రరావు గారి నాటకాలు, సమీక్షలు, జరుక్ శాస్త్రి ప్యారడీలు బాగా పేరు పొందేయి.

వేంకటేశ్వరరావు గారికి నేను కన్నకొడుకును కాకపోయినా కన్నకొడుకులను మించిన కొడుకునైనాను. అదినాభాగ్యం, నాపుణ్యఫలం, సెలవులలో ఆయననన్ను తమ స్వగ్రామమైన కాటూరుకు వెంటబెట్టుకు వెళ్ళేవారు. ఎందుకు? నా సాహిత్యాభ్యాసానికి అంతరాయం రాకూడదని. తొలిసారి కాటూరు వెళ్లి నప్పటి ఉదంతం మనవిచేస్తాను. ఆకాలంలో పల్లెటూళ్ళలో కులభేదాల సంగతి తమకు చెప్పనక్కరలేదు కదా? ఆ తండ్రి నన్ను బహిర్భూమికి వెంటతీసుకువెళ్లారు. తమ పొలంచూపించారు. అవిభక్త కుటుంబపు వంద ఎకరాల మాగాణిలో వారిది యాభై ఎకరాలు. ఇంటికి వెంటబెట్టుకు వచ్చి, పండ్లుతోముకొవడానికీ, స్నానం చేయడానికి ఏర్పాట్లు చేయించి, అనంతరం 'జిస్కా' అనే ఇంగ్లీషు నవలనాచేతపెట్టి ఇంటి ముందు గదిలో కుర్చీలో నన్నుకూర్చుండబెట్టి వారు గ్రామంలో బంధు మిత్రులను చూడ్డానికి వెళ్లారు. "జిస్కా" పునర్జన్మలనవల. ఐదు జన్మలలో ప్రియుణ్ణి వెన్నాడుతూ వచ్చే ఒకప్రియురాలి అద్భుతకథ. ఏనాటినవలో అది! ఇటీవల దాని పునర్ముద్రణప్రతులు బుక్‌స్టాల్సులో కన్పించాయి.

కాటూరి వారి ప్రస్తావన వచ్చినప్పుడు "నాన్నగారు" అనడం నాకు అలవాటు. ఈకారణం చేతనే, వారిని బాబాయి గారు అని పిలిచే "త్రివేణి" సంపాదకులు శ్రీ భావరాజు నరసింహారావు గారు నన్ను తమ్ముడని సంబోధించారు.

నాటి భోజనవేళకు నాన్నగారు ఇంటికి తిరిగి వచ్చారు. వారు స్నానాది కాలు ముగించుకొనగానే, ముందుగది వెనకటి వసారాలో అమ్మగారు పీటవేసి, విస్తరి పెట్టి నాకువడ్డించి "మీరురండి" అంటూ వంటగదిలోనికి ఆహ్వానించారు. అమెకెరుకే నాపై నాన్నగారికి నేనంటే ఎంత వాత్సల్యమో. నాన్నగారేమన్నారంటే । "ఎందుకు? కొండయ్య ప్రక్కనేపెట్టునాకు "అన్నారు. (వారి పెద్దకుమారుని పేరు కొండలరావు). అతన్ని ఇంటిలోని వారందరూ కొండయ్య అంటారు. నన్ను

ఇంటిపేరు కలిపి కొండయ్య అనేవారు; కొండలరావును మాత్రం కొండయ్య అని మాత్రమే అనే వారు అప్పటికి నేను పూర్తిగా సన్యాసి అవతార మెత్తలేదుకాని, సాత్వికాహారి మాత్రం. "అంతకారంకూర అతడు తినలేడు. పప్పుపెట్టి నెయ్యి వెయ్యి తిన్న తర్వాత పెరుగుపొయ్యి "అంటూ, అమ్మగారికి సలహాలిస్తూ తాను భోజనం చేశారు. ఎప్పుడైనా ఆదృశ్యం జ్ఞాపకం వస్తే కళ్ళు చెమరుస్తాయి. నాన్నగారికి నా మీద ఎంత కరుణ అంటే ఉదయం పూట కళాశాల కాగానే, వారు భోజనం చేసి, విశ్రాంతి తీసికొని, నేనుండే గది తలుపుతట్టి, లోపలికి వచ్చి బల్ల మీద కూర్చుండి, భండార్కర్ వ్యాకరణ పాఠం చెప్పి వెళ్ళేవారు.

కాటూరి వారిసంపదను వారి ఔదార్యం సఫలం చేసింది. వారిని ముట్నూరి వారు 'గుప్తదాత' అని అంటూవుండేవారు. ఒక చేతితో ఇచ్చినది రెండవ చేతికి తెలియ నిచ్చేవారుకారు. పెండ్లిండ్లకు, పేరంటాలకు, కష్ట సుఖాలకు వారి సహాయం పొందని కవి పండితులాకాలంలో లేరంటే అతిశయోక్తికాదు. ఇలా అడగకుండానే తనకుమారుని పెండ్లికి సహాయం పొందిన మహాకవి ఒకరు ఆవృత్తాంతాన్ని ఒకకథగ చెప్పారు నాకు. కొందరు అప్పు పేరతీసికొనేవారు. వారు తిరిగి ఇస్తే తీసికొనేవారు. ఇవ్వకుంటే అడిగే వారుకాదు.

అప్పటికి నా అవతారం మారిపోయింది. తిరుక్షవరం చేసిన తల, మొలకు అంగవస్త్రం, మీద తుండు గుడ్డ, పండ్ల తిండితో తీవ్రహఠయోగాభ్యాసినైనాను. తెల్లవారుజామున నాలుగు గంటలు లగాయతు ఉదయం ఏడు గంటలవరకు ఆసనాలు వేసి, ధౌతి, వస్తి మొదలగు క్రియలు చేస్తూవుండే వాణ్ణి. ఒక్క శీర్షాసనమే 45నిమిషాలు సేపు వుంచే వాణ్ణి, వృక్షాసనం మునివేళ్ల మీద వేయగలిగే వాణ్ణి. బక్కగా వున్నా, చేయి పట్టుకుంటే ఏనుగంతబలశాలియైనా విడిపించుకోలేనంత స్థాయిశక్తి వచ్చింది. ఎవరైనా నన్ను గూర్చి ఒకమాట అనుకొంటే, ఆమాట వెంటనే స్ఫురించేది. బ్లాక్ బోర్డుమీద చాక్ పీస్‌తో రాసినట్టు మనస్సుకు తోచేది. అనంతరం ఆవ్యక్తి కనిపిస్తే అడిగి ఆమాట రుజువు చేసికొనేవాణ్ణి. నాకేదయినా కావాలనిపిస్తే వెనువెంటనే ఎవరో ఒకరు తమంతతాము తెచ్చి ఇచ్చేవారు.

ఒక ఉదాహరణః ఒకనాటి మధ్యాహ్నవేళ పూజ్యురాలైన నాతల్లిగారు నన్ను చూడగోరుతున్నట్లనిపించింది. సాయంత్రం, బందరు నుండి విజయవాడకు వెళ్ళే

రైలుంది. దాన్ని పట్టుకోవాలి. చేతపైసాలేదు. అయినా చేతి సంచి పట్టుకొని బయలుదేరాను. అందులో ఏముంది? మరొక అంగవస్త్రం, మరొక తుండుగుడ్డ, మరొక గోచి, భారతం ఆది సభాపర్వాలు వావిళ్ల ప్రతి వున్నాయి. ఆరోజులలో ఆ రెండు పర్వాలు మరొకసారి కాటూరి వారి దగ్గర చెప్పుకొంటుండేవాణ్ణి . అలా ఆసంచి ఒక చేతగొడుగు మరొక చేతిలో పట్టుకొని తలవంచుకు నడుస్తూ ఉంటే, కళాశాల ఆవరణం దాటకుండానే కాటూరి వారెదురు వచ్చ నాకు రెండు రూపాయలిచ్చారు. "ఎందుకిది? " అనిఅడిగాను. నాన్నగారు నివ్వెరపోయి "దానికేమిటి? మీరు అవధూతలు, మేము గృహస్థులం; ఇదిమా కర్తవ్యం" అన్నారు. ఈసారి నివ్వెర పోవడం నావంతైంది "నన్నుమీరు అనకండి " అంటూ వారిని తప్పుకొని చరచరానడిచి వెళ్ళాను. బందరునుండి చీరాలకు రైలు టిక్కెట్టు వెల సరిగ రెండు రూపాయలే ! రైలు స్టేషన్ చేరి టికెట్టుకొని రైలెక్కాను. చీకటి పడుతూవుండగా రైలు విజయవాడ స్టేషను చేరింది.

అక్కడ దిగి, మదరాసు ప్యాసింజరెక్కికిటికీవద్ద కూర్చుండి చూతును కదా, విజయవాడ కనకదుర్గమ్మ కొండ మీద ఒక నక్షత్రం వెలుగుతూ కనిపించింది. దగ్గరున్న ఏదో హోటలునుండి సన్నగా గ్రామ్‌ఫోను పాట వినిపిస్తుంది. ప్లాట్ ఫారం మీద రవాణాకు సిద్ధంగా గుట్టపడి వున్న చేమంతి పూల బుట్టలనుండి మెల్లమెల్లగ సువాసనలు బైటపడుతున్నాయి. "గుండె గొంతుకలోన కొట్లాడుతాది" అనికదా నండూరి సుబ్బారావుగారన్నారు? నాకు మాత్రం నోటిలో ప్రాణవాయువు అక్షరాకృతి పొందుతున్నట్లునిపించింది. నిజానికి మనలోని గాలేక దానోటి యంత్రంలో దంత్య, తాలవ్య, ఓష్ఠ్య దులైశబ్దాకృతులను పొందుతుంది?

ఎవరవో నీవెవరవో
ఎవరవో నీవెవరవో॥
కొండమీదే వుండి నవ్వే
చిన్ని చెక్కాచెప్పవానా ॥ కెవరవో॥
వాసనలతో విచ్చి పిలిచే
చిన్ని పూవా చెప్పవానా ॥కెవరవో॥
చీకటంతా చీల్చి పాడే
చిన్ని గొంతాచెప్పవానా ॥ కెవరవో॥

ఈ పాట అప్రయత్నంగా బయట పడింది. బాపిరాజు గారి ప్రభావం తెలియకుండానే ఎలా పనిచేసిందొ ఆపాట చెప్పకుండానే చెబుతుంది. దీనితో గేయరచనకు శ్రీకారం చుట్టినట్లయింది. కాటూరి నాయనగారు క్లాసులలో రవీంద్రుని గీతాంజలి, స్ట్రేబర్డ్స్ని, సాధన వంటి కవితలు, తాత్త్విక ప్రబంధాలు మాకు తరుచు చదివి వినిపిస్తూ వుండేవారు. వీటి ప్రభావంకూడా మనసు మీద బాగా పనిచేసింది. అదిమొదలు చాలా గేయాలు బైటపడ్డాయి. కూనిరాగం తీస్తూ పాడుకొంటూ వుండేవాణ్ణి. ఒక సహాధ్యాయి ద్వారా వేణువుపై కొంతకాలం సంగీత సాధన చేసి వుండడం చేత సంగీత జ్ఞానం కొంచెమలవడింది. 1932లో అంతర్వాణీయై పోయిన కవిత్వ ధోరణి ఇప్పుడీ విధంగా గేయ రూపాన వెలువడిందన్నమాట.

ఒకనాడేం జరిగిందంటే ఉబ్బసం వ్యాధి పీడితుడైన పోతరాజు సీతారామారావు అనే సహాధ్యాయి దగ్గిదగ్గి తూలిపడ బోతే, నేను ఒడిలో పడుకోబెట్టు కున్నాను. నానోటినుండి ॥ప్రాణమా! ప్రాణమా! చలియించు ప్రాణమా! జ్వలియించు ప్రాణమా! " అనే పాట బయలు దేరింది. ఆ పాట పాడుతూ వుంటే, అతడు కొంచెం సేపు ఒడిలో నిద్రపోయి, నవ్వుతూ లేచాడు. నేనప్పుడు గేయాలు బాగాపాడుతుండేవాణ్ణి. పాటలన్నీ దార్శనిక ప్రణయగేయాలే; సూఫీకవితకు దగ్గర గేయాలన్నిటికీ పల్లవి వుండేది. పల్లవి పెట్టడంలో నాకు నేర్పు ఉన్నదని బాపిరాజుగారంటూ వుండేవారు. ఆ పాటల సంగతి కాటూరివారు పసిగట్టి ఒకనాడు ముట్నూరి వారి కృష్ణాపత్రిక దార్బరులో, "కొండయ్యపాటలు వ్రాస్తాడు" అని వెల్లడించారు. ముట్నూరివారు తలపంకించారు చదువుమన్నట్లు, పాడాను. ఆ మరునాటి దర్బారులో ముట్నూరి వారు ఆపాటను గురించే మాట్లాడినట్టు తెలిసింది. రోజూ వెళ్ళే అలవాటేఉన్నా ఆరోజెందుకోనేనటువెళ్లలేదు "అవివ్రాసి వెంకట్రావు గారికివ్వు" అని కాటూరి వారాదేశించారు. మరుసటి వారపు కృష్ణాపత్రికతో మొదలు పెట్టి ఆపాటలు " చిరంజీవి పాటలు" అనే శీర్షికతో వెలువడనారంభించాయి. కమలాకర వేంకటరావుగారు కృష్ణాపత్రికలో అసిస్టెంటు ఎడిటరు; ప్రసిద్ధ చలన చిత్ర దర్శకుడైన శ్రీ కమలాకర కామేశ్వరరావుగారి అన్నగారు.

1940 ప్రాంతంలో "ప్రతిభ" సంచికలలో కూడా చిరంజీవి పాటలు కొన్ని వెలువడ్డాయి. ఆకాలంలో గుంటూరులోమిత్రులు "సాహిత్యరత్న" శ్రీరాచకొండ

నరసింహమూర్తిగారు శారదా నికేతనంలోనే అధ్యాపకులుగ పనిచేస్తుండేవారు. ఒకనాడు వారి యింటిలోనేనుండగ, కాగడా పత్రిక సంపాదకులు శ్రీ తాపీ ధర్మారావుగారు అటువచ్చి నన్నుచూచి, తెలిసికొని కొన్ని పాటలు పాడించి విన్నారు. వానిలోఒక పాట తీసుకుపోయి 'కాగడా' పత్రికలో ప్రచురించారు. అప్పుడా పత్రిక మద్రాసు నుండి వెలువడుతుండేది. దాని కటింగు తీసికొని శ్రీవేమూరి ఆంజనేయ శర్మగారొకనాడు నరిసింహమూర్తిగారి యింటికివచ్చారు. అప్పుడు నేనక్కడేవున్నాను. "నరసింహమూర్తిగారు! చూడండి ఈ పాట ఎంతగొప్పగా వుందో" అంటూ ఆయన అకటింగు నరసింహమూర్తిగారి చేతికందించారు. దాని రచయితను నేనేనని తెలిసికొని వారాశ్చర్యపోయారు.

ఆపాట : చీకటోయ్ ! చీకటోయ్!
లోకమంతా చీకటేనోయ్!
కనుమూత విప్పకోయ్
కాళరాత్రోయీ! ॥వగైరా॥

'చిరంజీవి పాటలు' 1945లోగ్రంథరూపాన వెలువడ్డాయి.

నేషనల్ కాలేజీలో తటస్థపడిన ఇరువురు ప్రముఖుల మాట ఇప్పుక్కడ స్మరింపక తప్పదు. ఒకరు ప్రభాకర్జి; నా సహాధ్యాయి; అనంతపురంవాడు; హరిజన క్రైస్తవుడు. నాప్రోత్సాహంతో సేవాగ్రాంవెళ్లి, గాంధీజీకి సన్నిహితుడై, వారి ముఖ్య శిష్యుడుగ, భారతదేశమంతటా గాంధేయుల చేత భాయీజీ అని పిలువబడిన వాడు. అతడు కాలేజీలో వుండగ బాపిరాజు గారికి నమ్మినబంటు. రెండవవాడు వెంపటి పెదసత్యం. బాపిరాజుగారి వలన నాట్యశాస్త్ర విశేషాలు తెలిసికోగోరివచ్చి, కొన్నిరోజులక్కడ వున్నాడు. నేనప్పటికే బాపిరాజుగారి ప్రోత్సాహంతో అభినయ దర్పణం. భారతశాస్త్రం అధ్యయంనం చేసివుండడం చేత సత్యానికి నోట్సు వ్రాసియిచ్చాను. అతడు అ తరువాత గొప్ప నాట్యాచార్యుడై, చలన చిత్రాలకు డాన్సు డైరెక్టరై ప్రసిద్ధి పొంది, చాలాకాలం తరువాత హైదరాబాదు వచ్చి నప్పుడు, నాయింటికి వచ్చి, "అన్నా! నీవిచ్చిన నోట్సు నావద్ద భద్రంగా వున్నాయి. "అన్నాడు. కృష్ణాపత్రికా స్వరూపులైన ముట్నూరి కృష్ణారావు పంతులుగారు తెప్పించుకొన్న "తాండవ లక్షణమ్" అనే ఆంగ్ల గ్రంథం నావద్ద వున్నది. దానిపై ము.కృ. అని

వారి సంతకం కూడా వున్నది. దానిని సత్యానికి బహూకరించి పంపించాను. ఆ గ్రంథాన్ని గూర్చి ఇక్కడ ఒకటి రెండు మాటలు చెప్పవలసి వున్నది. దానిని సంకలనం చేసి, ఆగ్రంథంలోనికి అనువదించి ప్రచురించినవారు ముగ్గురు మదరాసు ప్రభుత్వంలో చాలా పెద్ద ఉద్యోగాలు చేసి రిటైరైన వాళ్ళు. ఈ గ్రంథంలోని ప్రత్యేకత ఏమంటే - చిదంబరం నందలి నటరాజాలయంలోని 108 కరణాల, 32 అంగహారలశిల్పాల చిత్రాలు ముద్రించారు.

రోజూ సాయంత్రం కృష్ణాపత్రికా దర్బారుకు హాజరువుతూవుండేవాణ్ణి. బందరులోని కవిపండిత, దేశభక్త బృందమంతా అక్కడ చేరుతుండేది. వారేదో ఒక విషయం ఎత్తికొని మాట్లాడుతుండేవారు. సాహిత్యం మీద, లలిత కళల మీద, రాజకీయాల మీద వేదాంతం మీద చర్చలు జరుగుతుండేవి. మాట్లాడిమాట్లాడి ఏకంగా అందరు చర్చ ఆపి, అందరూ చిరునవ్వులతో మైనియో ఆలకిస్తున్న ముట్నూరి వారి వంక చూచేవారు. అప్పుడాయన అనర్గళంగా, కవన భూయిష్టంగా తీర్పు చేప్పేవారు. ఆయన విజ్ఞాన సర్వస్వం వంటివారు; ఆ విషయ పరిజ్ఞానం, ఆవైరుధ్యాల సమన్వయం, ఆతాత్విక దృష్టి, ఆమంజుల మధురభాషణం, ఆభాషణావేశం ఆకనులలోని, వెలుగు చూచి తెలిసికోవలసిందే కాని చెప్పి చూపలేము. అంతకు కొంత కాలం వెనుక బందరు టౌను హాలులో వారు రోజూ రెండుమూడు గంటల వంతున పరిణామవాదంపై 18 దినాలు ప్రసంగించినట్లు కాటూరి నాయనగారి వలన తెలుసుకొన్నాను.

తామారంభించిన ఉపనిషత్యారాలలో పాల్గొను మనిదయతో వారు నన్నాజ్ఞాపించినప్పుడు, ప్రతిదినం సాయంకాలంలో కృష్ణాపత్రిక కార్యాలయంమీది గదిలో వారి జ్ఞానతేజాన్ని ఒక సంవత్సరం కాలం ప్రత్యక్షంగా చూచే భాగ్యానికి నోచుకొన్నాను. వారు తెలుగులో ఉపన్యసిస్తూనే పట్టరాని జ్ఞానావేశంతో కన్నులు వెలుగుతూ వుండగ ఇంగ్లీషులోకి వెళ్ళిపోయేవారు. ఒకనాడు ఈ శోషనిషత్సారం చెబుతూ, కృతగ్‌స్మర, కృతగ్ంస్మర" అనేటప్పుడు, Remember what you have done, remember what you have done అంటూ పెద్దకేకలు పెడుతూవుంటే, వేదాలే అరుస్తున్నట్లు, హెచ్చరిస్తున్నట్లుతోచేది. వారు అరవిందుల యోగ సమన్వయతత్త్వం మాకు బోధించారు "యదాతథ్యదోర్వాన్ వ్యధాధత్

శాశ్వతీఽభ్యస్య మాభ్యరి" అనే ఉపనిషత్సూత్రం, ఎక్కడ ఏది ఎలా ఉండాలో ఎల్లప్పటికి అక్కడ అదిపరమేశ్వరుడు ఏర్పరచి వుంచాడనే అర్థం కలదికదాః ఈ సిద్ధాంతం ప్రకారం మతాలన్నింటికి ఎక్కడదేనికి స్థానమిస్తే విశ్వజనీనమత మేర్పడుతుందో యోగ సమన్వయం చెబుతుంది. అరవిందులు తత్త్వమేకాక సహజమహాకవి కూడా కావడం చేత ప్రత్యక్షరంకవితామయంగా, వేదాల స్థాయిలో రచింపగలిగారు. వారి డివైన్ లైప్, దీ, సింపిస్ ఆఫ్ యోగ వంటి గ్రంథాలు విశ్వసాహిత్యానికి మణిభూషణాలు. వారికవ్వింపు బాణియే ముట్నూరి వారికబ్బింది. ఆపాఠశాలలో నాతో పాటు మరి ఇద్దరు విద్యార్థులున్నారు. ఒకరు మహాకవి కాటూరి వేంకటేశ్వరరావుగారు, మరొకరు Synthesis of Yoga ను "యోగ సమన్వయము" అనేపేరుతో మనోహరంగా తెనిగించిన కమలాకర వెంకట్రావుగారు. ముట్నూరి వారిని గురించి ఎంతైనా చెప్పవచ్చును కాని సమయా భావం కొట్టవస్తుంది కదా ?

పూజ్యురాలైన తల్లిగారు నా ఆహారవేషాలు చూచి బాధపడు తుండడం గమనించి ఆరెండిటినీ మార్చుకొని, విశ్వనాధ సత్యనారాయణగారి "డిగ్రీలు లేని పాండిత్యంబు వన్నెకురాని పాడుకాలాన్ని వెంటబెట్టుకొని, కళాశాలనుండి గుంటూరు చేరాను అక్కడ శారదానికేతనం లో అప్పుడు విద్వత్కవి శ్రీ వావిలాల సోమయాజులుగారు ప్రిన్సిపాలుగా, ఉభయభాషా ప్రవీణుడు, సాహిత్యరత్న మిత్రుడు రాచకొండ నరసింహమూర్తి గారు ఉపాధ్యాయులుగ పనిచేస్తుండేవారు. వారి వలన శ్రీ ఉన్నవ లక్ష్మీనారాయణ పంతులు గారి పరిచయ మేర్పడింది. అక్కడ చిన్న పిల్లలిద్దరికి వారు నన్ను ట్యూటరుగా నియమించారు. శారదానికేతనం మహిళలకు చేసిన సేవలను గూర్చి, లక్ష్మీనారాయణ, లక్ష్మీబాయమ్మ దంపతుల గొప్పదనాన్ని గూర్చి మీ అందరకూ తెలిసిందే. అప్పటికి చాలాకాలం క్రితం వెలువడి ఆగిపోయిన దేశాభి మాని అనే వార పత్రికలు శ్రీపాముల పాటి వెంకట కృష్ణయ్య చౌదరిగారు పురుద్ధరిస్తూ, దానికొక సహాయ సంపాదకుడు కావలెనని శ్రీ ఉన్నవవారికి వ్రాశారు. వారు నన్ను పంపారు. అంతకు ముందు మదరాసు నుండి కొన్ని మాసాల పాటు వెలవడి ఆగిపోయిన హారతి అనే మాసపత్రికలో కొంతకాలం పనిచేసి వచ్చాను. ఆకాలంలో డిగ్రీలు లేని పాండిత్యం పత్రికల

వారికి మాత్రమే పనికి వచ్చేది. దేశాభిమానిలో పనిచేస్తూవుండగనే 1942 ఆగస్టు క్విట్టిండియా ఉద్యమం చేలరేగింది. కలెక్టరేటులో ఒకనాటి రాత్రి టెలిఫోను తీగలు తెంపడానికి యత్నించి, చాల ఎత్తునుండి క్రింద పడ్డాను. ఎడమకాలు తొంటి ఎముకమూలం చిట్లిపోయింది. స్వగ్రామం పేరాల చేరాను. పోలీసులకు భయపడి, ఇంటిలోనే వుంటూ, 'గచ్చాకు పుచ్చాకు' కట్టులుకట్టితే బాధ తీరిందే కాని కుంటితనం మిగిలింది. కవిత్వం మరల అంతర్వాహినే అయింది.

1947 స్వాతంత్ర్యదినోత్సవంనాడు ప్రజాబంధు శ్రీప్రగడ కోటయ్యగారు. 'చేనేత' అనే వారపత్రికను ప్రారంభించినా సహాయం కోరితే, నిడుబ్రోలు వెళ్లి దానికి వర్కింగ్ ఎడిటరుగ 1950 వరకు పనిచేశాను. ఆపత్రికలో పిచ్చాపాటి అనే కబుర్ల కాలమూ 'ఈ వారం కందాలు' అనే రాజకీయ పరిహాసం పద్యాలూ వారం వారం వ్రాసే వాణ్ణి. ఆకాలంలో ఆంధ్రప్రభలో సీనియర్ సబెడిటరుగ వున్న శ్రీనార్ల వేంకటేశ్వరరావు గారూ, ఆంధ్రదిన పత్రికలో పనిచేస్తూ వుండిన శ్రీపండితారాధ్యుల నాగేశ్వరరావుగారూ, ఇవి చూడడం కోసం మా పత్రిక ఆఫీసుకు వ్రాసి తెప్పించుకొన్నారు. మరికొన్ని పత్రికలు "ఈవారం కందాలు"ను తమ పత్రికలలో పునర్ముద్రించుకొనేవి. పండితారాధ్యుల వారు మాకు 1936లో రైతాంగ విద్యాలయం లో జర్నలిజం అధ్యాపకులుగ వున్నారు. నిడుబ్రోలులో వున్న మూడేండ్ల కాలంలో నాకు కలిగిన గొప్ప భాగ్యం "కవిబ్రహ్మశ్రీ ఏటుకూరి వేంకటనరసయ్యగారి పరిచయం. మేమించుమించు సోదరుల లాంటి వాళ్లమైనాము. ప్రతిదినం సాయంత్రం ఇరువురం ఊరి వెలుపలి తోటకు వెళ్లి సాహిత్యగోష్ఠి చేస్తుండేవాళ్లం. నిరంతర పద్యరచయిత ఆయన వారి వీరభారతం ఆంధ్ర సర్స్వతికి మణికిరీటం. ఆకాలంలో ఆయన నిడుబ్రోలు హైస్కూలులో తెలుపండితులుగ పనిచేస్తూ వుండేవారు.

అక్కడ నుండి గుంటూరు వెళ్లి శ్రీ కోటయ్యగారి సహాయంతోనూ, శ్రీశ్రీ, ఆకురాతి ఆంజనేయులు గారి సహకారంతోనూ, 'చేనేత' పత్రిక సంపాదకులుగ వున్న శ్రీ దామర్ల రమాకాంత రావు గారి తోడ్పాటుతోనూ 'భారత్' అనే వారపత్రిక నడపడానికి యత్నించాను. అది రెండు నెలలు నడిచి ఆగిపోయింది. అనంతరం విజయవాడ లోని కేంద్ర చేనేత సహకార సంఘంలో పబ్లిసిటీ ఎసిస్టెంటుగ చేరాను.

రెండేండ్ల అనంతరం ఆ ఉద్యోగం మానుకొని, దేశికవితామండలి వారికి రచయిత నైనాను. అప్పటి వరకు తెలుగులోనికి రాని ఆండర్సన్ కథలు, బ్రాహ్మ్యు కథలు, బర్మాకథలు, దక్కను జాన పదకథలు, అధ్యక్షుల కథలు, యుక్రేనియన్ కథలు, చైనా కథలు ఇంకా ఎన్నో ప్రపంచజాన పద, బాల సాహిత్యగ్రంథాలు తెలుగులోనికి తెచ్చాను. ఇంతలో ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవం 1956 నవంబరు 1వతేది దగ్గరకు వచ్చింది. నేత పత్రికకు సంపాదకుడుగ హైదరాబాదు రావలసిందని మాన్య మిత్రులు శ్రీ కొండా లక్ష్మణ్ బాపూజీ గారి నుండి పిలుపు వచ్చింది. ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవం నాటి ఉదయవేళ హైద్రాబాదు చేరాను.

అక్కడ రెండేళ్ళు పనిచేసి, హైదరాబాదు రేడియో స్టేషనులో గ్రామీణశాఖలో స్క్రిప్టురైటరుగా చేరాను. ప్రసిద్ధ నవలా కథా రచయిత త్రిపురనేని గోపీచంద్‌గారు ఆశాఖలో ప్రొడ్యూసరు. ఆయన గొప్పదనం మీరందరెరిగిందే. ఆయన గారు చండశాసనుడు, ప్రతిదినం సాయంత్రం ప్రసారమయ్యే గ్రామీణ కార్యక్రమాలకు ఏదో ఒకటి వ్రాయ వలసిందని పురమాయించేవారు. అలా, రైతుల మీద, వారి కష్ట సుఖాలమీద నా చేత ఎన్నో పాటలు వ్రాయించారు. బుర్రకథలు వ్రాయించారు. ఆయన భావన అంతులేనిది. చికాకు పడుతూనే వుంటారు. చిర్రుబుర్రు మంటూనే వుంటూరు. కాని, కలం పట్టుకొనే సరికి వెంటనే రచనా సమాధిలోకి వెళ్ళిపోతారు. అప్పుడు వ్రాసిన పాటలలో చాల పల్లె పాటల బాణీలో వ్రాసినవే.

'జరత్కారువు' వంటి నాటకాలూ, ప్రమద్వర వంటి నాటికలూ రేడియో కోసం ఎన్నో వ్రాశాను. 'జరత్కారువు'కు తొలిపలుకు వ్రాస్తూ "నారంగస్థల జీవితంలో వందల నాటకాలు చదివాను కాని, 'జరత్కారువు' చదివినప్పుడు కలిగిన ఆనందం పొందలేదు'' అని ప్రఖ్యాత నటుడు పద్మశ్రీ స్థానం నరసింహారావుగారన్నారు. హైదరాబాదు స్టేషను నుండేకాక, మదరాసుస్టేషనునుండి కూడా దానిని ప్రసారం చేశారు.

ఆకాలంలోనే, ప్రభాకర్జీ డైరీలోని గాంధీజీకి సంబంధించిన సంఘటనలను చిన్నకథల రూపంలో వ్రాయగా 'ఆంధ్రప్రభ' దినపత్రిక సుమారు రెండేండ్లు కాలం వానటిని వారంవారం 'గాంధీ పథం'అనే పేర ప్రచురించింది. ఇది పాఠకుల

అభిమానం చూరగొని అనంతరం గ్రంథరూపాన వెలువడింది. అదే పరంపరకు చెందిన , శాస్త్రిజీ - గాంధీజీ సంభాషణలు'' అనే గ్రంథమున్ను, స్వయం సహాయం 'గాంధీజి'అనే పిల్లల పుస్తకమున్నూ తరువాత వెలువడ్డాయి.

రేడియో స్టేషనులో రెండేండ్లు పనిచేసిన అనంతరం పంచాయితీరాజ్ డైరెక్టొరేటులో పబ్లిసిటి ఆఫీసరుగ చేరి, మరి రేండేండ్లు పని చేశాను. ఆ అరువాత హైదరాబాదు నుండి వెలువడుతున్న కృష్ణాపత్రికలో 1963లోచేరి, దాని సర్క్యులేషన్ 3,500 నుండి 8,500 వరకు వృద్ధి చేయగలిగాను. 1963లో ఇదే హాలులో కృష్ణాపత్రిక వజ్రోత్సవ సభ జరిగినప్పుడు, పెద్దలకు దూరాన వుండి ఒక మిత్రునితో మాట్లుడుతున్న నన్ను గమనించిన విశ్వనాథ సత్యనారాయణగారు రివ్వున బాణంవలె నావైపు వచ్చారు. ఏమంటారోనని జంకాను. ఆయన నాకళ్ళలోనికి చూచి, 'కృష్ణాపత్రిక' ప్రత్యక్షరరమ్యముగా నున్నది'' అంటూ వచ్చినంత వేగంతోనూ మరలివెల్లారు. జర్నలిస్టుగా నాకదిగొప్ప కితాబు.

సంవత్సరం పూర్తికాకుండగనే కృష్ణాపత్రిక ఋణం తీరి పోయింది. ఆంధ్రప్రదేశ్ కాంగ్రేస్ నడుపుతూ వుండిన ఆంధ్రజనత అనే దిన పత్రికలో సీనియర్ సబెడిటర్‌గ చేరి సంవత్సరం తిరగకుండగానే అక్కడ నుండి, సర్దార్ గౌతులచ్చన్నగారి 'బహుజన' వార పత్రికలో సంపాదకుడుగ చేరి ఒక సంవత్సరకాలం పని చేశాను. ఇలా 1940 నుండి 1970 వరకు రకరకాల ఉద్యోగాలు చేసి ఇరకటాలు రుచి చూచాను. కవిబ్రహ్మ ఏటూకూరి వేంకటనరసయ్యగారు ఈ ఇరకటాన్ని ఇరుకటం అని చమత్కరించే వారు. ప్రవేశ ద్వారం ఒకటి నిష్క్రమణద్వారం ఒకటీనన్నమాట!

దేవునికంటేనాకు మిన్నయైన నాతల్లి ఇక్కడ 1960లో స్వర్గస్థురాలైనప్పుడు, పాడు పడిన బావి , ఇల్లు కల ఒకటిన్నరెకరం పొలంకొని అందులో ఆమె తులసికోట కట్టించాను. ఆపొలంలో పదేళ్ల పాటు శ్రీనాథ వ్యవసాయం చేసి, దాన్ని విక్రయించి చిన్న ప్రెస్సుకొన్నాను. దాని ఆధారంతోనే గురుదేవులైన మహాకవి కాటూరి వేంకటేశ్వరరావు గారి పేర, కాటూరి కవితాపీఠంనే నెలకొల్పుకొని, ప్రసిద్ధి పద్యకవుల గ్రంథాలు వెలువరిచండమైనది.

అవసరనైవేద్యంగా - రేడియో స్టేషన్‌లో పని చేసిన కాలంలో వ్రాసిన గేయాలు తప్ప పట్టుమని పది కవితలు వ్రాసింది లేదు. కృష్ణాపత్రిక (హైదరాబాదు-1963) లో మాత్రం **1947** నాటి ఈ వారం కందాలు వ్రాసేవాణ్ణి. అంతర్వాహిని యైన నదీప్రవాహ గర్భంలో చెలమలు త్రవ్వుకొనినీరు తీసి కొనే విధంగా అప్పుడప్పుడు అవసరాన్ని బట్టి బలవంతాన పట్టి వ్రాయకపోలేదు.

మానసికశక్తిపై విశ్వాసంకల వాడనని మీరీపాటికి తెలిసి కొని వుంటారు. **1989** చిట్ట చివరి రోజులలో ఒకఅద్భుతం జరిగి నాటినుండి కవితా ఝురి నిర్విరామంగ పొంగి ప్రవహిస్తున్నది. ఏదో తెలియని ఒకచోటనుండి భగవాన్ సత్యశాయికి సంబంధించిన కరపత్ర మొకటి మధ్యాహ్నం పోష్టులో వచ్చింది వెంటనే, నాకు తెలియకుండగనే నోటిలో ఒక పద్యం ఆడింది.

ఇంచుమించుగ అరవై ఏండ్ల క్రితం యువ గేయకవిగ ఇంతోఅంతో పేరు తెచ్చుకొన్న నోట పద్యంపుట్టడం నాకే ఆశ్చర్యమనిపించింది.

ఆపద్యం ఇది :-

"శరణము సత్యశాయికి ప్రశాంతి పదస్థునకున్, ప్రసన్నతా
కరునకు, లోకపూజ్యున, కఖండ కృపాపరతంత్రవర్తికిన్
గురునకు, సృష్టిలోన తనకున్ ప్రతిబింబము చూచు వానికిన్
శరణము సర్వజీవ భయశంకల తీరిచిప్రోచుస్వామికిన్"

అలా విడువకుండ పద్యాలు పుట్టుకొస్తూనే వున్నాయి. రాత్రి **10**గంటల వరకు **19** పద్యాలు వ్రాసి భోజనం చేసి పడుకొన్నాను.

మొదటి ఖండకావ్యసంకలనమైన "వానవచ్చె - వరదవచ్చె"లో ఈ పద్యాలు వెలువడ్డాయి. ఆగ్రంథం చదివిన కరుణశ్రీ జంధ్యాల పాపయ్యశాస్త్రి గారు "అభినందన మందారమాల" అంటూ పద్యాలు వ్రాసి పంపారు. ఆచార్య నారాయణ రెడ్డిగారు నిరుపమానమైన హర్షం ప్రకటించారు. ఇంకా పెద్దలనేకులుపలువిధాల ఈ గ్రంథాన్ని ప్రశంసించారు

రెండవది 'చాకిరేవు' దీనికి తెలుగు విశ్వవిద్యాయంవారు ఉత్తమ పద్యకావ్య పురస్కారమీయడం మీకుతెలిసిందే. దీనికే యలమంచిలి లోని శిష్ట్లా 'చిన్ని' స్మారక పురస్కారం, కోరుట్లలోని భారతీసాహిత్య సమితి వారి వానమామై వరదాచార్య పురస్కారము 'కవిపితామహ' బిరుదము లభించాయి. ఈ కావ్యకర్తను, 'ఉంగళుపేరెన్నా। పింగళి సూరన్నా" అంటూ ఆచార్య తూమాటి దోణప్పగారు ప్రశంసించారు. మూడవది , 'ప్రకృతి - పురుషుడు'అనే కావ్యం. ఇది సాంఖ్యశాస్త్రానికి ఇతివృత్తం కల్పించిన కావ్యం. జస్టిస్ ఆవుల సాంబశివరావు గారు, శాస్త్రాన్ని కావ్యంగా మలచిన గౌరవం నాకాపాదించారు. ప్రకృతి- పురుషుల దాంపత్యమూ మానవుని రాలుగాయి తనమూ దీనిలోని కథావస్తువు। ఇది మహామతి ముట్నూరి కృష్ణరాయ దేశికోత్తములకంకితమీయబడినది. విద్వత్కవివరేణ్యుడైన డాక్టర్ సంజీవదేవ్ గారు ఈకవి ప్రయోగించే పదాలు (మాటలు)కూడా పదాల (పాటలు)వలె వినిపిస్తాయి" అన్నారు. నాల్గవది 'నావలెన్' అనే 201 చాటువులుగల కావ్యం. ఇన్ని చాటువులు ఒకే చోట మనతెలుగులో వున్నట్లు లేదు. ఈ పద్యాలను గూర్చి, "ఆయా పద్యాల్లోన్ని పాత్రలు చేసే పనులను బట్టి కొన్ని పద్యాలు చిన్న చలన చిత్రాలుగానూ, మరికొన్ని పద్యాలు స్థిర చిత్రాలు (పోటోగ్రాఫిక్) గాను కనిపిస్తాయి'' అని సాహిత్య వ్రతుడైన 'త్రివేణి' సంపాదకులు భావరాజునరసింహారావు గారన్నారు.

ఐదవది 'మృత్యుమాత' విద్వత్కవి ఆచార్య బిరుదురాజు రామరాజుగారు దీనిని 'అమృతోపాయనము' అన్నారు. కవియైన ఒక వృద్ధుడు లోకుల శీ భ్రష్టతను చూడలేక మృత్యువుతోమొరపెట్టుకొంటాడు. "అమ్మా! ఇకచాలు, నన్ను తీసుకొనిపొమ్మని" మృత్యువంటుంది కదా "నాయనా? నీవే కారణం చేత తీసుకుపొమ్మంటున్నావో, ఆకారణం చేత నేనీ విక్కడవుండక తప్పదు. తరుణం రాగానే, నేనే తీసుకుపోతాను" అంటూ మృత్యువు అతణ్ణి గృహోన్ముఖుణ్ణి, కార్యోన్ముఖుణ్ణి చేస్తుంది.

ఆరవది 'యుగయుగమ్ముల భారతీయుడనునేను" అనేకావ్యం. భారతీయ సంస్కృతిని ఉద్ఘాటించే 324 పద్యాలివి. యాభైయేండ్ల పూర్వం యదాలాపంగా

పుట్టి, కృష్ణాపత్రికలోవెలువడిన మూడు పద్యాల కొనసాగింపే ఆ కావ్యం.

'సూక్ష్మసువిశాల దార్శనికత, ఆంతరంగిక మథన తీవ్రత ఆ పద్యాల అద్దాల్లో పరిపూర్ణ బింబాకృతితో ప్రతిఫలించాయి.'' అన్నారు. ఆచార్య సి.నా.రె గారు.

7వది 'ప్రతిబింబాలు' అనేది. ఇది ఖండ కావ్యసంకలనమే. ప్రఖ్యాత పత్రికా సంపాదకులు శ్రీ పొత్తూరి వేంకటేశ్వరరావు గారీ గ్రంధాన్ని పరిశీలిస్తూ"మమతలు, అనురాగాలూ, ఆత్మీయతలు అక్షరాలై ఈ కవి సృష్టిలో పద్యరూపంధరించాయి'' అన్నారు. ఇక ఎనిమిదవది గృహిణి' ఆయా పరిస్థితులలో ఉత్తమ ఇల్లాలు ఎలా ప్రవర్తిస్తుందో తెలిపే మనోహరమైన 18 కల్పిత పద్యకథల కావ్యమిది. డాక్టర్ తిరుమల రామచంద్రగారు ఈ కావ్యాన్ని సామాన్య వనితల అసామన్య వీరకృత్యాలతో లోకాన్ని శాసిస్తున్నది. అని కూడా అన్నారు.

9వది " నిర్వేదము'' భారతదేశం ఎన్నివిధాలుగా పాడుబడి పోయిందో చెప్పు కొని యేడ్చే 300 పద్యాలివి. 9 కాండలలో దేశ రాజకీయ, సాంఘిక నైతిక సమస్యలనూ, ప్రజల కష్టసుఖాలను అనుతాపం తో ఆలోకించిన పద్యకావ్యమిది. శ్రీ కొండయ్యగారికవిత ఒక కొండ ఊట. ఎక్కడనుండో సన్నజాలుగా బొట్లు బొట్లుగా ప్రవహిస్తూ వచ్చేతీపిజాలు. అప్రయత్నంగా వచ్చింది కనకహాయిగా వుంటుంది. తీపిగా ఉంటుంది. అన్నారు. విద్వత్కవిశేఖరులు ఆచార్య తుమ్మపూడి కోటేశ్వరరావుగారీ కావ్యాన్ని సమీక్షిస్తూ.

పదియవది "స్కూలుకి పోతున్నానేను '' అనే 27 చతురబాలగేయ సంభాషణలు. వీనిని సమీక్షిస్తూ, "ఇవి మనోజ్ఞంగా పిల్లల మనోభావాలకు అనుగుణంగా, బాలల హృదయాలకు హత్తుకొనేట్లు ఇంపైన శైలికలిగి వున్నాయి." అన్నారు. తెలుగుయూనివర్శిటి వైస్ చాన్సలర్ ఆచార్య పేర్వారంజగన్నాధంగారు.

ఇప్పుడు రచనసాగుతునన్న బృహత్కావ్యం 'రామబాణము! 'స్రవంతి సాహిత్య మాసపత్రికలో నెలనెలా దాదాపు రేండేండ్లుగ వెలువడుతున్నది. ఇది మహాకవి దాశరధిగారికి , విశ్వకవి సినారె గారికీ సంయుక్తంగా అంకిత మీయబడినది. ఆ అంకితం పద్యాలలో దాశరధిని సంబోధిస్తున్న ఒకపద్యంఇలా

ఆ యిద్దరకు కావ్యాన్ని సమర్పించింది.

నీకును, నావు తమ్ముని గనెయ్యముజూపు సినారె కిత్తునా
యీ కవనమ్ము, మీ చెలిమికెత్తు పతాకము రామబాణమున్
చేకొనుడయ్య! సర్వమును చేడ్పడి పద్యమెయూత గర్రగా
పోకడసాగు నీముదుకమ్రోడుకుపూచిన పారిజాతమున్

79 ఏండ్ల ఈ వయస్సులో ఒకటో అరోపద్యం వ్రాయకుండ దినం కడవదు. ఊపిరి తో కలసి పేనుకు పోయినదాకవనతంతువు. వినయ వినమితుడనై కవిలోక శుభాశాసనములు ప్రార్థిస్తున్నాను. శుభం.

డా॥ బెజవాడ గోపాలరెడ్డిగారు

(5-8-1996)

"పరిణతవాణి" అని వయస్సు మళ్లిన వారిని, వారిజీవితం అనుభవాలను వివరించే ఈప్రణాళికను ఆంధ్ర సారస్వత పరిషత్ నిర్వహించు చున్నందులకు వారికి నా అభివందనాలు తెలుపుచున్నాను. ఆధ్యక్షులైన డాక్టర్ నారాయణ రెడ్డికి నా ప్రత్యేక వందనములు. శ్రీ దేవులపల్లి రామానుజరావు ఈ సంస్థను పోషిస్తు వచ్చారు. వారు కాలధర్మము నొందిన పిదప డాక్టర్ నారాయణ రెడ్డి దానిని నిర్వహిస్తున్నారు. సంతోషము. సారస్వత పతాకము మున్ముందు కూడా ఎగురుచు రెపరెపలాడుచుండ గలదని విశ్వాసము.

నాకు నేటితో 89 సంవత్సరములు నిండి 90వ జన్మ దిన పండుగను స్నేహితులు జరుపుచున్నారు. నేను సాధారణముగా జన్మదిన పండుగలు జరుపు కోను. ఈ జన్మదినాలు మన ప్రయత్నము లేకనే, మన సామర్థ్యము లేకనే వస్తూ ఉండును. చిన్నపిల్లలకు సరేగాని, వెంట్రుకలు నరసిన వారికి ఈ పండుగలు ఉపయోగకారి కావు. ఒక్కొక్క పర్యాయము విషాదస్మృతులే పురి విప్పుతుంటాయి. సంతోషాలకన్న దుఃఖాలే పదనుగా ఉంటాయి. ఎట్లైనా 90వ జన్మదినము ఒక ప్రత్యేకమైన విషయమే. 90 ఏండ్ల రేవును చేరుట సర్వసాధారణ విషయంకాదు.

తెలుగు నాట షష్ఠ్యబ్ది పూర్తి ప్రచారములో నున్నది. ఆదినములలో 60వరకు రావడమే పెద్ద విషయము. అటువంటి పరిస్థితులలో 90 రావడం ఒక విశేషమే అగుతుంది. నాకు తెలిసి ఆంధ్రదేశములో డాక్టర్ రాయప్రోలు సుబ్బారావు, కాశీ కృష్ణమాచార్యులుండినారు. ఇద్దరు గుంటూరు జిల్లావారే. ఇద్దరు మాతండ్రి పట్టాభిరామరెడ్డి గారిచే సన్మానింపబడినవారే. నాకు స్ఫురించని పెద్దలు

ఇంకాచాలామంది ఉండవచ్చును. భారతదేశములోనా అభిమాన నాయకత్రయము గాంధీజీ, రవీంద్రనాథ్, నెహ్రూలు. వారెవ్వరు 90వ జన్మదినానికి దగ్గరగా రాలేదు. వారి కన్న నేను ఎక్కువకాలము జీవించానని ఒక్కొక్క సారి పిచ్చి సంతోషము కలుగు తుంటుంది. హంసల ఎదుట వాయసము సంతోషించి నటుల. ఎవరికి వారు తమ సంతోషాలను జ్ఞప్తికి తెచ్చుకొనడం మంచిది కదా! లేకపోతే ఎప్పుడును జీవిత వ్యసనాలు ముందుకు వచ్చి తలలాడిస్తూ ఉంటవి.

గాంధీజీ 5 సత్యాగ్రహతరంగాలలో ఈదినానని ముఖ్యముగా నాకు సంతోషమగు తుంటుంది. 1921లో సర్కారుబడిని మానడం, 1930, 1932,1940, 1942 సత్యాగ్రహములలో పాల్గొని జైలుకు వెళ్ళడం నాతొలి ఆనందము. అందులో నాకర్తవ్యాన్ని నేను నిర్వర్తించినానని పరితృప్తి. బందరు ఆంధ్రజాతీయ కళాశాలలో కొంత తెలుగు, సంస్కృతమును నేర్చు కొనినాను. తరువాత విశ్వభారతికి వెళ్లి రవీంద్రుని దర్శించుకొని, బెంగాలీ నేర్చుకొని, కొంత రవీంద్ర సాహిత్యముతో, సంగీతముతో పరిచయమేర్పరుచుకొని, మూడేండ్లు సుఖముగా గడిపాను. అదినాకు రెండవ సంతోషమని చెప్పవచ్చు. అప్పుడు విశ్వభారతి ఆదర్శాలను సమీక్షించుకుంటు, అక్కడ ఉండిన టిబెటియన్, చైనా, పాశ్చాత్య దేశాల పండితులను చూస్తూ ఉండిన నాకు నాదేశం విషయము తెలిస్తే మంచిది కదా! ప్రక్కన నున్న ఉత్కళవారిని గురించి, మరాఠీ వారిని గురించి నాకేమి తెలియును? భారత భారతి ముందు జరిగిన తరువాత, విశ్వభారతి విషయమును చూచు కొందామని, మనదేశములోని పెద్ద భాషలు నేర్చు కొనవలెనని కొంత ఉత్సాహమును చూపించినాను. అపపటికేకొంత హింది, కొంత బెంగాలి తెలిసి ఉండింది. చాలామంది గుజరాతీ వారితో స్నేహితము చేసి గుజరాతీని కొంత అర్థమయ్యేటట్లు చేసికొనినాను. 1928లో కొద్ది వారాలు పూనేలో తిలక్ విద్యాపీఠ్‌లోనుండి మరాఠీ నేర్వడానికి ప్రయత్నించినాను. తరువాత జైలులోతమిళం, కన్నడం, మలయాళం కొంత నేర్వ యత్నించాను. ఒరిస్సాలో స్థిరపడిన ఒక బెంగాలీ, ICS పరీక్ష వ్రాసి శాంతినికేతన్ లో గడపడానికి వచ్చాడు. అతనివద్ద ఒరియా ప్రారంభించాను. అంతకు ముందు గౌహతి కాంగ్రెస్‌కు 1926 డిసెంబరులో మా అన్నతో గూడ కలిసి హాజరైనప్పుడు అస్సామి డిక్షనరీ, మరికొన్ని పుస్తకాలను

తెచ్చు కొన్నాను. ఆరీతిగ కాంగ్రెస్ వాడిగ, విశ్వభారతి విద్యార్థిగ భారతభారతీ ఉద్యమాన్ని ప్రారంభించినాను. యత్నించానని చెప్పగలనేగాని, తృప్తి కరమైన పాండిత్యాన్ని సంపాదించగలిగినానని నేను చెప్పటలేదు. భాషలతో పరిచయమేగాని, పాండిత్యములేదని నాకుతెలుసు. కడపటికి నిగ్గు తేలింది కొంత బెంగాలి, కొంత ఉర్దు. వంద గాలిబ్ ద్విపదలను ఉర్దూ నుంచి అనువదించాను. ఎవ్వరు సాహసించని ఇక్బాల్ కవితలను కొన్నిటిని అనువదించి ప్రచురించాను. రవీంద్రుని బెంగాలీ గ్రంథాలను కొన్ని, గాలిబ్ , ఇక్బాల్ కవితలను కొన్ని అనువదింప గలిగినానని నాకు మరొక ఆనందము.

నేను ముప్పది సంవత్సరాలు నిండకముందే మద్రాసులో మంత్రికావడం, నాకన్నపెద్దలైన జిల్లాబోర్డ్ ప్రెసిడెంట్లు, మునిసిపల్ చైర్మన్ లపై పెత్తనం వహించడం జరిగింది. 1939లోవచ్చిన ప్రపంచయుద్ధ పరిణామముగ కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వాలు రాజీనామాచేసి బయటికి వచ్చాయి. 1940, 1942 లలో మరల జైలుకు పోవడం జరిగింది. 1947 మార్చి లోమద్రాస్ ప్రభుత్వములో ఆర్థిక మంత్రినైనాను. ఎన్నికలు నిర్వహించేశాఖ, రవాణాశాఖ నాక్రిందనే ఉండింది. 1952 ఫిబ్రవరి వరకు ఆర్థిక మంత్రిగా వ్యవహరించాను. అంటే మద్రాసులో 86 మాసాలు మంత్రిగా ఉండడం జరిగింది.

1952 డిసెంబరులో పొట్టి శ్రీరాములు నిరశన వ్రతంతో మరణించారు. 1953 అక్టోబరుకు ఆంధ్రరాష్ట్రం వస్తుందని నెహ్రూ ప్రకటించడం జరిగింది. ప్రకాశం ముఖ్యమంత్రియైనారు. నేనప్పుడు యం.యల్.ఎ.నుకాదు. 1954లో మంత్రివర్గము పడిపోవడం, గవర్నరు పరిపాలన ఏర్పడినాయి. 1955 ఎన్నికలలో నేను రెండు నియోజక వర్గములలో గెలుపొందినాను. అప్పుడు కర్నూలులో నేను ముఖ్యమంత్రి నైనాను. హైదరాబాదులో ముఖ్యమంత్రిగా నుండిన రామకృష్ణరావుతో సంప్రదించి నంది కొండ ప్రాజెక్టును నాగార్జునసాగర్ గా మార్చి 1955 డిసెంబరు లో ప్రధాని నెహ్రూచేత శంకుస్థాపన చేయించాము. రామకృష్ణారావు తదితరులను ప్రోత్సహించి, తీవ్రముగా ఆంధ్రప్రదేశ్ అవతరణకు కృషి చేసి 1956 నంవంబరు 1 తేది సమైక్యతెలుగుజాతి రాష్ట్రాన్ని ఏర్పరచాము. నీలం సంజీవరెడ్డి ముఖ్యమంత్రియైనాడు.

నేను వారి ఆహ్వానముపై, వారి మంత్రి వర్గములో చేరి 16 మాసములు హైదరాబాద్‌లో మంత్రిగా ఉండినాను. అప్పుడే ముస్లిం సోదరులతో పరిచయము ఉర్దూమీద అభిమానము ఏర్పడినది. 1958 ఏప్రిల్ నెలలో కేంద్రమున ఆర్థిక శాఖా సహాయమంత్రిగా చేరుటకు ఢిల్లీ వెళ్లాను. నెహ్రూ ప్రధానమంత్రి. సివిల్ ఎక్స్‌పెండిచర్, రెవిన్యూశాఖల మంత్రిగా 3 సంవత్సరాలు, గృహనిర్మాణశాఖలో ఒక సంవత్సరము పని చేశాను. ఆ నాలుగుసంవత్సరములు రాజ్యసభమెంబరుగా ఉండినాను. 1962 ఫిబ్రవరి ఎన్నికలలో లోక్‌సభకు నిలిచాను. నాప్రచారప్రథమ దినమే జబ్బున పడినాను. మద్రాసు ఆసుపత్రిలో చేరాను. నేను ప్రచారములో లేకనే నా ఎన్నికజరిగింది. నాభార్యలక్ష్మీకాంతమ్మ సభలలో పాల్గొన్నది. నేను వ్రాసియిచ్చిన రెండు ఉపన్యాసములనే ఆమె సభలలో చదివెడిది. ఆ తరువాత ఏప్రిల్ నెలలో నన్ను కేబినెట్ మంత్రిని చేసి సమాచార ప్రసార శాఖలను అప్పగించారు. మళ్లీ కొన్నిఇబ్బందులలో నేను చిక్కుకున్నాను. హిందీ వారితో ఒక ఇబ్బంది. ఢిల్లీలోవాడుకలో నున్న హిందూస్తానీ మాటలు వాడవలెనా? లేక సంస్కృత పదాలను వాడవలెనా?-అనేది పేచి. ఇక రెండవది వాయిస్ ఆఫ్ ఆమెరికా వారు మనదేశములో ఒక రేడియో కేంద్రమును స్థాపించాలని, రోజుకు రెండు గంటలువారికి, ఎనిమిది గంటలు మనకు యిస్తామని చెప్పి ప్రతిపాదన చేసి సంప్రదింపులు జరిపారు. దానికి ప్రతి తడవ నేను నె్రూగారి ఆమోదాన్ని ఫైలుమీద పొందుతు వచ్చాను.

ఆఒప్పందం ప్రచురింప బడుచుండగనే కృష్ణమీనన్ వగైరాలు నెహ్రూ దగ్గరకు వెళ్లి ఆక్షేపణ తెలిపినారు. అప్పుడు నెహ్రూ నన్ను సమర్థించినా మనస్సులో అసంతృప్తి ఉండినదేమోనని నా అనుమానం. 1963 ఆగష్టులో నెహ్రూ కామరాజు ప్లానును ప్రకటించారు. దానిలో మొరార్జీదేశాయి, జగ్జీవన్‌రామ్, లాల్‌బహదూర్ శాస్త్రి, యస్.కె. పాటిల్‌తో గూడ నన్ను, శ్రీమాలిని చేర్చడం జరిగింది. నేను రాజీనామా చేసి సెప్టెంబరు 1 నుండి పార్లమెంటు సభ్యునిగా మాత్రమే ఉండినాను. దాంతో నామంత్రిత్వ పదవీకాలము ముగిసింది. 1937లో రాజాజీతో ప్రారంభించిన మంత్రిత్వం కర్నూలు హైదరాబాద్‌ల మీదుగ ఢిల్లీ చేరి 1963 ఆగస్టు చివరలో నెహ్రూతో సమాప్తమైనది. దాదాపు 15 సంవత్సరములు మంత్రిగా ఉండినాను.

1964 మేలో నెహ్రూ దివంగతులైనారు. తరువాత లాల్ బహదూర్ శాస్త్రి ప్రధాని కావడం నేను పార్లమెంటరీ పార్టీ ఉపనాయకునిగా ఎన్నుకొనబడడం జరిగింది. వారు 1966 జనవరిలో తాష్కెంట్‌లో మరణించడం, ఇందిరాగాంధీ ప్రధాని కావడం జరిగింది. ఆమెహయాంలో కూడా నేను పార్టీ డిప్యూటి నాయకుడిగా వ్యవహరించాను. గవర్నర్‌గా వెళ్లడానికి సుముఖమేనా అని 1966 నవంబరులో నన్ను ఇందిరగాంధీ అడిగింది. అప్పటికి నాకు 59 సంవత్సరాలే. నేను ఒక్క నిముషం ఆలోచించాను. నేను గవర్నరుగా 5 సంవత్సరాలు ఉండినా 64 సంవత్సరాలు నిండుతవి. పదవీ రాజకీయాలలో విరమణకు అది అనుకూలమగు వయస్సేనని తలచి నా అంగీకారం తెలిపాను. ఆ రీతిగా నేను 1967 మేనెలలో లక్నోలో పదవీ స్వీకారం చేశాను. ఆ పదవిలో 62 మాసాలు కొనసాగాను. నాహయాములో నలుగురు ముఖ్యమంత్రులు పదవీ స్వీకారం చేశారు. ఒక సంవత్సరము సలహాదారులు లేకనే ప్రెసిడెంట్ పరిపాలన సాగించాను. నేనే గవర్నరుగా, ముఖ్యమంత్రిగా ఉండినాను. అన్ని జిల్లాలను బాగా తిరిగాను. పుణ్యక్షేత్రాలన్ని దర్శించాను. హిమాలయాల ఔన్నత్యాన్ని కండ్లారా క్రోలి సంతోషించాను. బదరీ, కేదారనాథ్, గంగోత్రిలలో మునిగాను. 1972 జూలై 1 తేది పదవీవిరమణ చేసి నెల్లూరు చేరాను. అంతటితో నా ఉద్యోగపర్వం సమాప్తి.

మద్రాసు నుండి కొంతభాషతో సంబంధం పెట్టుకొనే ఉండినాను. 1947 లో స్థాపింపబడిన తెలుగు భాషా సమితికి నేను అధ్యక్షుడను. మోటూరు సత్యనారాయణ కార్యదర్శి. 1986లో తెలుగు విశ్వవిద్యాలయంలో అది విలీన మయ్యేంతవరకు మేమిద్దరము ఆపదవిలోనే కొనసాగాము. 1954లో కేంద్ర సాహిత్యఅకాడమి ఢిల్లీలో స్థాపింపబడినది. నెహ్రూ అధ్యక్షులు, రాధాకృష్ణ ఉపాధ్యక్షులు. ఆసభకు నేను హాజరైననాను. ఆంధ్రుల తరపున పింగళి లక్ష్మీకాంతం కార్య నిర్వాహక సభ్యుడిగా ఉండినారు. వారి వరమణ తరువాత నేను కార్య నిర్వాహకసభ్యుడిగా ఎన్నుకొనబడినాను. నా తరువాత దేవులపల్లి రామానుజరావు. వారి తరువాత నేను మరల అక్కడ ఎక్సిక్యూటివ్ మెంబర్ కావడం జరిగింది. మొత్తం మీద 15 సంవత్సరాలుకార్య వర్గ సమితి మెంబరుగా ఉండినాను. 1957 ఆగస్టులో రాష్ట్రపతి రాజేంద్రప్రసాద్ ఆంధ్రసాహిత్య అకాడమి ప్రారంభోత్సవం చేశారు. నన్ను అధ్యక్షుడిగా, విశ్వనాధ సత్యనారాయణను ఉపాధ్యక్షుడిగ, రామానుజరావును కార్యదర్శిగ ప్రభుత్వము నియమించింది. మూడు సంవత్సరముల తరువాత ఎన్నికలలో మేమే ఎన్నికైనాము. ఆ రీతిగా నేను 1982

వరకు, అంటే నా 75 సంవత్సరాల వరకు ఆ పదవిలో కొనసాగాను. అప్పుడే అనేక మంది పెద్దలతో పరిచయ భాగ్యము కలిగినది. ఊటుకూరి లక్ష్మీకాంతమ్మ, నాయని కృష్ణకుమారి ప్రోత్సాహముతో అఖిల భారత మహిళా గ్రంథకర్తల సమావేశమును హైదరాబాద్‌లో జరిపించాను. లీలావతీ మునీ అధ్యక్షురాలుగ, విజయలక్ష్మి పండిట్ ప్రారంభకులుగ ఆ సమావేశము జరిగినది. అన్ని ప్రాంతాలనుంచి మహిళా గ్రంథకర్తలు సభకు వచ్చి పాల్గొన్నారు.

లక్నో నుండి నేను తిరిగి వచ్చిన తరువాత నా సొంత రచనలను నా 70వ యేట 1977లో ప్రారంభించాను. ఛందస్సు తెలియని నేను కవితా వచనములు రచించుటకు ప్రారంభించాను. ముక్తకాలు, దీర్ఘకవితలు, రేఖా చిత్రాలు ఇప్పటికి వరకు వ్రాసి ప్రచురించాను. ఇప్పటికి, నా బెంగాలీ, ఉర్దు అనువాదాలు గాక, నా సొంతాలు 22 ప్రచురణ అయినవి. మంచో చెడో యింకా వ్రాస్తూనే ఉన్నాను.

89 వయస్సు దాటింది. 90లో పడినాను. చాలా మందితో సన్నిహిత సంబంధం నా సాహిత్య సంబంధాలద్వారా ఏర్పడింది. చాలమంది పుస్తకాలను నాకు అంకితమిచ్చారు. విశ్వనాథవారు నాపెండ్లికి "గోపాలోదాహరణ" పద్యాలు వ్రాసి ఉదాహరణ కవిత్వ ప్రక్రియలో తన పాటవాన్ని ప్రకటించారు.

మరి రెండు గ్రంథాలు నాకు అంకితమిచ్చారు. నేను అంకితాలిచ్చే వారు దివంగతులైయుండాలి అట్టివారికే నేను అంకితమిచ్చేది. ఆధోరణిలో విశ్వనాథ, దేవులపల్లి, రాయప్రోలు, దువ్వూరు రామిరెడ్డి, రామానుజరావు వచ్చారు. నేను అంకితం పుచ్చుకొనేది సజీవంగానే అంకితమిచ్చేది దివంగతులకే. ఈ రీతిగా ఆట్టే ఆందోళనలేకుండా, నిరాశలులేకుండా తృప్తిగానే జీవితాన్ని గడుపుతున్నాను. నా జీవితములో మూడు ప్రధానఘట్టాలు-స్వతంత్ర సమరములో శిక్షలు, రెండు పదవులు, మూడు సాహిత్యసేవలు, ఇక నా పరిణతవాణిని ముగిస్తూ డాక్టర్ నారాయణరెడ్డికి మరల వందనాలు తెలుపుతున్నాను.